

13

ఐదేళ్లలో 5 లక్షల ఉద్యోగాలు

తయారీ రంగంలో టాటా సంస్థలు సృష్టిస్తాయి

టాటా సన్స్ చైర్మన్ చంద్రశేఖరన్ వెల్లడి

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

బుధవారం | 16-10-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 181 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, ఆశ్వయుజమాసం, శుక్లపక్షం, తిథి: చతుర్దశి రా. 8.41 తదుపరి పౌర్ణమి; నక్షత్రం: ఉత్తరాభాద్ర రా. 7.18 తదుపరి రేవతి; వర్జ్యం: ఉ.6.36-8.00; దుర్ముహూర్తం: ఉ.11.37-12.23; అమృతఘడియలు: మ.3.04-4.28; రాహుకాలం: ఉ.12.00-1.30; సూర్యోదయం: 6.12; సూర్యాస్తమయం: 5.48 | హైదరాబాద్ సిటీ*

Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



ఇంట్లో కూర్చొనే పని చేస్తారా?

సరిహద్దుల్లో సమస్యలు వస్తే వెళ్లరా?

విజయవాడ వరదలు వంటి ఘటనల్లో బాధితులకు సేవ చేయరా?

నేడు ఎక్కడివారు అక్కడికి వెళ్లాల్సిందే

డీవోపీటీ ఉత్తర్వులపై స్టే ఇవ్వం

కేంద్రం కౌంటర్ దాఖలు చేయాలి: క్యాట్

క్యాడర్ అంశంలో ఐఏఎస్‌లకు ఎదురుదెబ్బ

క్యాట్ తీర్పుపై నేడు హైకోర్టులో లంచ్ మోషన్ పిటిషన్లు

హైదరాబాద్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): క్యాడర్ వివాదంలో ఉన్న ఏడుగురు ఐఏఎస్‌లకు కేంద్ర పరిపాలనా ట్రైబ్యునల్ (క్యాట్)లో భారీ ఎదురుదెబ్బ తగిలింది. ఉమ్మడి ఏపీ విభజన సందర్భంగా జరిగిన క్యాడర్ కేటాయింపులకు విరుద్ధంగా తెలంగాణ, ఏపీలో పనిచేస్తున్న ఏడుగురు ఐఏఎస్‌లు వాకాటి కరుణ, ఆమ్రపాలి కాట, వాణీప్రసాద్, రొనాల్డ్ రోస్ (తెలంగాణ); సి.హరికిరణ్, లోతేటి శివశంకర్, జి.సృజన(ఏపీ) తమకు కేటాయించిన రాష్ట్రాలకు వెళ్లిపోవాలని క్యాట్ స్పష్టం చేసింది. ఐఏఎస్ అధికారులు ఇళ్లలోనే కూర్చొని సేవ చేస్తామంటే కుదరదని వ్యాఖ్యానించింది. ఈ నెల 16న ఎక్కడి అధికారులు అక్కడికి వెళ్లిపోవాలంటూ కేంద్ర సిబ్బంది, శిక్షణ వ్యవహారాల శాఖ (డీవోపీటీ) ఇచ్చిన ఉత్తర్వులపై

మిగతా 3వ పేజీలో...

దామగుండం నేవీ రేడార్ కేంద్రం పనులను

దగ్గరుండి చేయిస్తాం

దేశ రక్షణ అందరి బాధ్యత

నేవీ రేడార్ కేంద్రంపై వివాదం సరికాదు

దేశంలోనే రెండోది.. తెలంగాణకు గర్వకారణం

రాష్ట్ర ప్రభుత్వం సంపూర్ణ మద్దతు ఇస్తుంది

ప్రజలకు ఎలాంటి నష్టం, హాని ఉండవు

గత ప్రభుత్వంలోనే భూ బదలాయిపు.. నిధులు

రేడార్ కేంద్రం శంకుస్థాపనలో సీఎం రేవంత్‌రెడ్డి



దామగుండంలో నేవీ రేడార్ స్టేషన్ శంకుస్థాపనలో సీఎం రేవంత్‌రెడ్డి, రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్, మంత్రి కొండా సురేఖ, స్పీకర్ గడ్డం ప్రసాద్, ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

రేడార్ స్టేషన్‌పై బీఆర్ఎస్

ద్వంద్వ వైఖరి

అధికారంలో ఉన్నప్పుడు ఒకలా.. ప్రతిపక్షంలో మరోలా.. సరికాదు

దేశ భద్రతపై బాధ్యతా రాహిత్యం: కిషన్‌రెడ్డి

15

కేసీఆర్ ఫాంహౌస్ వద్ద

ధర్నా చెయ్!

నాడు అనుమతులిచ్చి నేడు వ్యతిరేకిస్తారా?

కేటీఆర్‌పై బండి ధ్వజం

రంగారెడ్డి అర్బన్/పరిగి/వికారాబాద్/పూడూరు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): దేశ రక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. ఎన్నికలప్పుడు మాత్రమే పార్టీలు, రాజకీయాలు ఉండాలని, దేశ రక్షణ విషయంలో అందరూ కలిసి కట్టుగా సాగాలని పిలుపునిచ్చారు. మంగళవారం వికారాబాద్ జిల్లా పూడూరు మండలం దామగుండం అడవుల్లో వీఎల్ఎఫ్ నేవీ రేడార్ స్టేషన్ ఏర్పాటు శంకుస్థాపన కార్యక్రమానికి ఆయన గౌరవ అతిథిగా హాజరై మాట్లాడారు. దేశ రక్షణకు సంబంధించి కీలకమైన డిఫెన్స్, ఎన్ఎఫ్‌సీ తదితర విభాగాల యంత్ర పరికరాల తయారీలో హైదరాబాద్‌కు ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. రేడార్ కేంద్రం ఏర్పాటు ద్వారా ఈ విషయంలో తెలంగాణ రాష్ట్రం మరో కీలక అడుగు ముందుకు వేయబోతోందని తెలిపారు. దేశానికి మూడు వైపులా సముద్రాలు ఉన్నాయని, వాటిలో ప్రయాణించే షిప్‌లను మానిటరింగ్ చేయడానికి వీలుగా

మిగతా 15వ పేజీలో...

నేడు ఢిల్లీకి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి?

నౌకా దళానికి రామబాణం

దేశ రక్షణలో మరో ముందడుగు వీఎల్ఎఫ్ స్టేషన్

రియల్ టైం కమ్యూనికేషన్‌లో అత్యంత కీలకం

నౌకల మధ్య మెరుగైన సమన్వయానికి దోహదం

అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో నిర్మాణం

పర్యావరణానికి హాని కలిగించకుండా స్టేషన్

స్థానికులకు ఉద్యోగాలు.. పరిసరాల్లో ఆర్థికాభివృద్ధి

అవసరమైతే స్థానికులకు పునరావాస ఏర్పాట్లు

సీఎం రేవంత్‌రెడ్డి రాజకీయాలను పక్కనబెట్టి..

దేశ హితం ముఖ్యమని చాటారు: రాజ్‌నాథ్‌సింగ్

15



మీడియాతో సీఈసీ రాజీవ్‌కుమార్(మధ్యలో), జ్ఞానేశ్‌కుమార్, సంధు

నవంబరు 20న మహా ఎన్నికలు!

288 స్థానాలకు ఒకే దశలో పోలింగ్

ఝార్ఖండ్‌కు 2 దశల్లో.. నవంబరు 13, 20 తేదీల్లో..

దేశవ్యాప్తంగా 48 అసెంబ్లీ, 2 లోక్‌సభ నియోజకవర్గాలకూ ఉప ఎన్నికలు

23న లెక్కింపు.. ఎన్నికల షెడ్యూల్ ప్రకటించిన ఈసీ

న్యూఢిల్లీ, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): మహారాష్ట్ర, ఝార్ఖండ్ ఎన్నికల భేరీ మోగింది. హరియాణా ఎన్నికల పర్వం ముగిసి, వారం కూడా గడవకముందే కేంద్ర ఎన్నికల సంఘం మహారాష్ట్ర, ఝార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటించింది. మహారాష్ట్రలో నవంబరు 20న ఒకే విడతలో ఎన్నికలు నిర్వహించనున్నట్లు ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ (సీఈసీ) రాజీవ్‌కుమార్ వెల్లడించారు. ఝార్ఖండ్‌లో రెండు దశల్లో (నవంబరు 13, 20 తేదీల్లో) ఎన్నికలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ రెండు రాష్ట్రాల ఎన్నికల ఫలితాలను నవంబరు 23న ప్రకటిస్తారు. కాంగ్రెస్ నేత రాహుల్ రాజీనామా చేయడం వల్ల ఖాళీ అయిన

మిగతా 2వ పేజీలో...

ఎగ్జిట్ పోల్స్‌కు శాస్త్రీయత లేదు

- వాటి కారణంగా భారీ అంచనాలతో ప్రజల్లో గందరగోళం
- మీడియా, భాగస్వామ్య పక్షాలకు ఆత్మపరిశీలన అవసరం
- ఈవీఎంల ట్యాంపరింగ్ అసాధ్యం: సీఈసీ రాజీవ్‌కుమార్
- వయనాడ్ బరిలో ప్రియాంక గాంధీ: కాంగ్రెస్ 2

విద్యా విషయాల్లో నిపుణుల అభిప్రాయాలే



కీలకం

వాటిని కోర్టులు విచక్షణాధికారం ద్వారా పునఃస్థాపించలేవు

నిపుణుల కమిటీ ఒకటికి రెండుసార్లు పరిశీలించాకే తుది కీ

అభ్యర్థులు నేరుగా జవాబిచ్చేలా ప్రశ్నలను కోరుకోకూడదు

గ్రూప్-1 ప్రిలిమ్స్ రద్దు చేయాలన్న పిటిషన్లు కొట్టేసిన హైకోర్టు

మెయిన్స్‌కు తొలగిన అడ్డంకులు.. 21 నుంచి పరీక్షల నిర్వహణ

హైదరాబాద్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో గ్రూప్-1 పరీక్షల నిర్వహణకు అడ్డంకి తొలగింది. జూన్ 9న జరిగిన గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్షను రద్దు చేయాలంటూ దాఖలైన పలు పిటిషన్లను హైకోర్టు మంగళవారం కొట్టివేసింది. దీంతో మెయిన్స్‌కు అడ్డంకులు తొలగినట్లయింది. ఈ నెల 21 నుంచి పరీక్షలను టీజీపీఎస్సీ యథావిధిగా నిర్వహించనుంది. కాగా, విచారణ సందర్భంగా.. విద్యా సంబంధిత విషయాల్లో నిపుణుల అభిప్రాయాలే కీలకంగా ఉంటాయని, వాటిని కోర్టులు తమ విచక్షణాధికారం ద్వారా పునఃస్థాపించలేవని స్పష్టం చేసింది. జోక్యం చేసుకోవడానికి అవకాశం ఉండదని తేల్చి చెప్పింది. సప్లిమెంటరీ నోటిఫికేషన్ ఇచ్చి పరీక్ష నిర్వహించడం చెల్లదని.. ప్రిలిమ్స్‌లోని ఏడు ప్రశ్నలకు తుది 'కీ'లో సరైన జవాబులు ఇవ్వలేదని, వాటికి మార్కులు కలిపి మళ్లీ జాబితా ఇవ్వాలని, పలు ప్రశ్నలను తొలగించి మళ్లీ ఫలితాలు ప్రకటించేలా

మిగతా 16వ పేజీలో...

కోర్టు ఉత్తర్వులతో సీట్లు పొందిన

విద్యార్థులకు ఇబ్బంది కలిగించం

16

సుప్రీంకోర్టుకు తెలిపిన రాష్ట్ర సర్కారు

వైద్య విద్య కోర్సుల్లో 'స్థానికత'పై కొనసాగిన విచారణ

సర్కారు కొలువులో

చేరరేమి?

674 ఏఈఈ పోస్టుల్లో 310 మంది మాత్రమే చేరిక 14

కొత్త టీచర్ల చేరిక నేడే

పూర్తయిన కౌన్సెలింగ్ 3

సీఎం సంతకం చేసినా

బదిలీల్లేవ్!

ఇద్దరు ఉన్నతాధికారుల మధ్య విభేదాలు..

ఆగిన సచివాలయ ఉద్యోగుల ట్రాన్స్‌ఫర్లు 16

గత నెల 30నే ఆమోదం



సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌లోని మైనార్టీ గురుకులం గేటుకు తాళం

గురుకులాలకు తాళాలు

అద్దె బకాయిల కోసం పలు జిల్లాల్లో భవన యజమానుల నిరసన

గందరగోళంలో టీచర్లు, విద్యార్థులు

865 గురుకులాలకు బకాయిలు

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

రాష్ట్ర ప్రభుత్వం కొన్ని నెలలుగా అద్దె బకాయిలు చెల్లించకపోవడంపై మంగళవారం భవన యజమానులు రాష్ట్రంలోని పలు జిల్లాల్లో మహాత్మ జ్యోతిబాపూలే, గిరిజన ఆశ్రమ పాఠశాలలు, ప్రభుత్వ వసతి గృహాలకు తాళాలు వేసి నిరసన వ్యక్తం చేశారు. దీంతో దసరా సెలవులకు వెళ్లి తిరిగి గురుకులాల వద్దకు వచ్చిన విద్యార్థులు, ఉపాధ్యాయులు, వార్డెన్‌లు అసలేం జరిగిందో

మిగతా 14వ పేజీలో...

తాళం వేస్తే కేసులు 14

ఎవరి మాటల్లోనో కవ్వింపు చర్యలొద్దు

బకాయిలన్నీ విడుదల చేస్తాం: పొన్నం

వెయ్యి ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాల్లో

స్పెషలిస్టు ఓపీ సేవలు

ఇందుకోసం సమీపంలోని జిల్లా ఆస్పత్రులు, సీహెచ్‌సీల నుంచి స్పెషలిస్టు వైద్యులు

వారంలో ఐదు రోజుల పాటు సేవలు

హైదరాబాద్ మినహాయించి అన్ని జిల్లాల్లో..

పర్యవేక్షణ బాధ్యతలు డీఎంహెచ్‌వోలకు

వైద్య ఆరోగ్యశాఖ కీలక నిర్ణయం

జిల్లాల్లో ప్రభుత్వ సంతాన సాఫల్య కేంద్రాలు

దశలవారీగా ఏర్పాటు

గాంధీలో పూర్తిస్థాయిలో అందుబాటులోకి

సంతానలేమి దంపతులకు వరం



హైదరాబాద్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా వెయ్యి 'ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్'లలో 'స్పెషలిస్టు ఓపీ' సేవలందించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. వారంలో ఐదు రోజుల(సోమవారం నుంచి శుక్రవారం వరకు ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 4గంటల దాకా) పాటు ఈ సేవలను అందుబాటులోకి తీసుకురాబోతున్నారు. హైదరాబాద్ మినహాయించి మిగిలిన జిల్లాల్లో ఉన్న అన్ని బస్తీ దవాఖానలతో పాటు కొన్ని యూపీహెచ్‌సీల్లో ఈ సేవలను అందించనున్నారు. ఈ మేరకు మంగళవారం వైద్య, ఆరోగ్యశాఖ కీలక నిర్ణయం తీసుకుంది. అంతకుముందు అన్ని జిల్లాల డీఎంహెచ్‌వోలతో వైద్య ఆరోగ్యశాఖ ముఖ్య అధికారులు సమీక్ష

మిగతా 14వ పేజీలో...

నీటిపారుదల ప్రాజెక్టులకు ఏఐఐబీ రుణం

మంత్రి ఉత్తమ్‌తో భేటీలో బ్యాంకు ప్రతినిధుల సుముఖత

అధిక వడ్డీకి స్వల్పకాలిక రుణాలు తెచ్చిన గత ప్రభుత్వం

వాటి చెల్లింపునకే ఏటా రూ. 15 వేల కోట్లు 15

భారం నుంచి ఉపశమనంపైనా రేవంత్ సర్కారు దృష్టి

కృష్ణా నీటిని కేటాయించండి

జస్టిస్ బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్‌కు..

5 కీలక ప్రాజెక్టుల డీపీఆర్‌లు అందజేత

238 టీఎంసీలు కేటాయించాలని తెలంగాణ విజ్ఞప్తి 3

చెన్నైని ముంచెత్తిన వాన

స్తంభించిన జనజీవనం.. వరద నీటిలో 300 ప్రాంతాలు 2

నిలిచిన ప్రజారవాణా.. మూతబడిన పాఠశాలలు

బంగాళాఖాతంలో తీవ్ర అల్పపీడనం.. ఏపీలో 6 జిల్లాల్లో రెడ్ అలెర్ట్

తెలంగాణలో 4 రోజుల పాటు వర్షాలు.. ఎల్లో అలెర్ట్ జారీ 3



చెన్నైలోని పట్టాలంలో వరద నీటిలో మునిగిన ఓ ఆలయం

2 'హంటర్ కిల్లర్స్'

వచ్చేస్తున్నాయ్!

అమెరికా నుంచి 31 ప్రిడేటర్ డ్రోన్లు

రూ.33 వేల కోట్ల ఒప్పందం ఖరారు

ఏడు విమానాలకు బాంబు బెదిరింపు

ఢిల్లీ-షికాగో సర్వీసు కెనడాకు మళ్లింపు

భారత్‌పై కెనడా ఆంక్షలు?

విధించే అవకాశాలను తోసిపుచ్చలేం: కెనడా మంత్రి మెలానీ జోలీ

బిష్ణోయ్ గ్యాంగ్‌తో భారత్ కోవర్టు ఆపరేషన్లు.. ఖలిస్థానీలే టార్గెట్ 2

కెనడా పోలీస్ విభాగం ఆరోపణలు.. తోసిపుచ్చిన భారత వర్గాలు

కెనడా పౌరులపై దాడులకు దౌత్యవేత్తల్ని, నేరస్థుల్ని వాడడం ఘోరం: ట్రూడో





'హంటర్ కిల్లర్స్' వచ్చేస్తున్నాయ్!

» అమెరికా నుంచి 31 ప్రిడేటర్ డ్రోన్ల కొనుగోలుకు డీల్

» చైనా సరిహద్దుల్లో మోహరించనున్న భారత్

న్యూఢిల్లీ, అక్టోబరు 15: చైనా, పాకిస్థాన్‌ల వెంబడి సరిహద్దులు, హిందూ మహాసముద్ర ప్రాంతాల్లో సైనిక శక్తిని పెంచుకునే దిశగా భారత్ మరో ముందడుగు వేసింది. దీనికోసం ఆకాశంలో నిరంతరం నిఘాపెట్టే 'హంటర్ కిల్లర్' డ్రోన్లను రంగంలోకి దించనుంది. ఈ మేరకు అత్యాధునిక ఎంక్యూ-9బీ సాయుధ ప్రిడేటర్ డ్రోన్ల కొనుగోలు చేసేందుకు అమెరికాతో కీలక ఒప్పందం చేసుకుంది. అమెరికన్ డిఫెన్స్ మేజర్ జనరల్ అటామిక్స్ నుంచి దాదాపు 33,615 కోట్ల వ్యయంతో 31 ప్రిడేటర్ డ్రోన్ల కొనుగోలుకు ఈ ఒప్పందం కుదిరింది. ఢిల్లీలో భారత రక్షణశాఖ ఉన్నతాధికారులు మంగళవారం ఈ డీల్‌పై సంతకాలు చేశారు. అమెరికా నుంచి ఎంక్యూ-9బీ సాయుధ డ్రోన్ల కొనుగోలుకు ప్రధాని మోదీ నేతృత్వంలోని భద్రతా వ్యవహారాల కేబినెట్ (సీసీఎస్) గతవారం ఆమోదం తెలిపింది. దీంతో అమెరికాలో అధ్యక్ష ఎన్నికలకు కొన్ని వారాల ముందే ఈ డీల్ ఖరారైంది. ఈ 31 డ్రోన్లలో భారత నౌకాదళానికి 15, వాయుసేనకు 8, సైన్యానికి 8 చొప్పున కేటాయిస్తారు. ఎంక్యూ-9బీ 'హంటర్ కిల్లర్' డ్రోన్ అనేది ఎంక్యూ-9 'రీపర్' డ్రోన్‌కు అడ్వాన్స్‌డ్ వెర్షన్. 2022 జూలైలో అఫ్ఘానిస్థాన్ రాజధాని కాబూల్ నడిబొడ్డున అల్-ఖైదా నాయకుడు అల్-జవహరిని మట్టుబెట్టిన హెల్‌ఫైర్ క్షిపణిని ప్రయోగించింది ఎంక్యూ-9 డ్రోన్ నుంచే. దాన్ని అప్‌గ్రేడ్ చేసి ఎంక్యూ-9బీ డ్రోన్లను తీసుకొచ్చారు. ఇవి ఎక్కువ ఎత్తులోనూ ఏకబిగిన 35 గంటలకుపైగా గాల్లో ఎగరగలవు. నాలుగు హెల్‌ఫైర్ క్షిపణులు, 450 కిలోల వరకు బాంబులను మోసుకెళ్లగలవు.

ఎనిమిది ఔషధాల ధరల పెంపు

న్యూఢిల్లీ, అక్టోబరు 15: ఎనిమిది రకాల ఔషధాల ధరలను పెంచుతూ 'జాతీయ ఔషధ ధరల సాధికార సంస్థ' (ఎన్‌పీపీఏ) నిర్ణయం తీసుకుంది. వీటిలో సాల్బుటమోల్ (ఆస్తమా చికిత్సలో ఉపయోగించే ఔషధం), స్ట్రెప్టోమైసిన్ (యాంటీబయాటిక్, టీబీ), లిథియం (బై పోలార్ డిజార్డర్), పైలోకార్పిన్ కంటి చుక్కలు (గ్లకోమా), అట్రోపిన్ ఇంజెక్షన్ (యాంటీబయాటిక్), డిజిఫెరాక్సామైన్ (థలసీమియా), సెఫడ్రోక్సిల్ (యాంటీబయాటిక్) ఉన్నాయి. ప్రస్తుత ధరలతో పోల్చితే పెరిగిన ధరలు 50 శాతం వరకూ అధికంగా ఉండటం గమనార్హం. సోమవారం నుంచే పెరిగిన ధరలు అమల్లోకి వచ్చాయి. ముడిపదార్థాల వ్యయం పెరిగినందువల్ల ఔషధాల ధరలు పెంచాలని ఫార్మా కంపెనీలు కోరాయని, ధరలు పెంచకపోతే కొన్ని ఔషధాల ఉత్పత్తిని నిలిపివేస్తామని తెలిపాయని ఎన్‌పీపీఏ వెల్లడించింది. ఈ నేపథ్యంలోనే.. అసాధారణ పరిస్థితులు, ప్రజాప్రయోజనార్థం దృష్ట్యా 8 రకాల ఔషధాల గరిష్ఠ ధరల పరిమితిని (సీలింగ్‌ను) పెంచుతూ నిర్ణయం తీసుకున్నట్లు ఎన్‌పీపీఏ తెలిపింది. 'అసోసియేషన్ ఆఫ్ డాక్టర్స్ ఫర్ ఎథికల్ హెల్త్‌కేర్' వంటి సంస్థలు ఎన్‌పీపీఏ నిర్ణయాన్ని తప్పుబడుతున్నాయి. సదరు ఔషధాలను పేదప్రజలు ఎక్కువగా ఉపయోగిస్తుంటారని, వాటి ధరలు పెంచి పేదలపై భారం మోపారని ఎథికల్ హెల్త్‌కేర్ సభ్యుడు, పంజాబ్ మెడికల్ కౌన్సిల్ మాజీ అధ్యక్షుడు గురీందర్ విమర్శించారు.

ఉచిత పథకాలపై వైఖరేమిటి?

» కేంద్రం, ఈసీలకు సుప్రీం నోటీసులు

న్యూఢిల్లీ, అక్టోబరు 15: ఎన్నికల సందర్భంగా రాజకీయ పార్టీలు ప్రకటించే ఉచిత పథకాలపై వైఖరేమిటో చెప్పాలని కేంద్ర ప్రభుత్వం, ఎన్నికల సంఘానికి సుప్రీంకోర్టు నోటీసులు పంపించింది. ఉచిత పథకాలను నియంత్రించాలని కోరుతూ దాఖలైన మరో వ్యాజ్యాన్ని స్వీకరించిన ధర్మాసనం ఈ నోటీసులు ఇచ్చింది. బెంగళూరుకు చెందిన శశాంక్ జె శ్రీధర ఈ పిటిషన్ వేశారు. ఉచిత పథకాల కారణంగా ప్రభుత్వ ఖజానాపై భారం పడుతోందని, అందువల్ల ఇలాంటి హామీలను నియంత్రించేలా ఎన్నికల కమిషన్‌ను ఆదేశించాలని కోరారు. ఎన్నికల హామీల అమలును పర్యవేక్షించడానికి ఎలాంటి వ్యవస్థ లేని విషయాన్ని కోర్టు దృష్టికి తెచ్చారు. దీనిని పరిశీలించిన ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై.చంద్రచూడ్ ఆధ్వర్యంలోని త్రిసభ్య ధర్మాసనం..సమాధానం చెప్పాలని కేంద్ర ప్రభుత్వం, ఎన్నికల సంఘానికి నోటీసులు పంపించింది. ఇదే విషయమై ఇప్పటికే దాఖలైన వ్యాజ్యాలతో దీనిని జత చేసింది. ఉచిత పథకాలపై పూర్తిగా నిషేధం విధించాలని కోరుతూ ఇదివరకే బీజేపీ నాయకుడు అశ్విన్ కుమార్ ఉపాధ్యాయ ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు.

40% వైకల్యం ఉందని సీటు నిరాకరించకూడదు

» ఎంబీబీఎస్‌లో అడ్మిషన్లపై సుప్రీం సవివర ఉత్తర్వులు

న్యూఢిల్లీ, అక్టోబరు 15: నిపుణుల కమిటీ నివేదిక ఇస్తే తప్ప పరిమితులకు మించి అంగవైకల్యం ఉందన్న కారణంతో ఎవరికీ ఎంబీబీఎస్ సీటును నిరాకరించకూడదని మంగళవారం సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. 40% అంతకన్నా ఎక్కువ అంగవైకల్యం ఉన్నవారు ఎంబీబీఎస్ చదవడాన్ని అనర్హులంటూ గ్రాడ్యుయేట్ మెడికల్ ఎడ్యుకేషన్ రెగ్యులేషన్-1997 లోని నిబంధనను సవాలు చేస్తూ దాఖలైన వ్యాజ్యంపై ఈ వివరణ ఇచ్చింది. ఈ నిబంధనను సవాలు చేస్తూ ఓంకార్ అనే విద్యార్థి దాఖలు చేసిన వ్యాజ్యంపై సెప్టెంబరు 18న జస్టిస్ బి.ఆర్.గవాయ్, జస్టిస్ అరవింద్ కుమార్, జస్టిస్ కె.వి.విశ్వనాథన్‌ల ధర్మాసనం తీర్పు చెబుతూ 40 శాతం అంగవైకల్యం ఉందన్న ఒకే ఒక కారణంతో సీటు నిరాకరించకూడదని తెలిపింది. ఆ విద్యార్థికి సీటు ఇవ్వాలని ఆదేశించింది. వైద్య విద్య కొనసాగించడానికి అశక్తుడంటూ నిపుణుల కమిటీ నిర్ధారిస్తే తప్ప సీటును నిరాకరించకూడదని తెలిపింది. అభ్యర్థి సామర్థ్యాలపై అంగవైకల్య మదింపు మండలి పరీక్షలు జరపాల్సి ఉంటుందని, అంగవైకల్యం కారణంగా వైద్య విద్యను చదవగలరా, లేదా అన్నదానిపై పరీక్షలు జరపాలని తెలిపింది.

ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ లేకున్నా అయ్యప్ప దర్శనం

తిరువనంతపురం, అక్టోబరు 15: శబరిమల అయ్యప్ప దర్శనం విషయంలో కేరళ ప్రభుత్వం భక్తులకు ఉపశమనం కలిగించే వార్త చెప్పింది. ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ లేకుండా వచ్చే భక్తులు కూడా ఎలాంటి ఆటంకాలు లేకుండా అయ్యప్ప దర్శనం చేసుకోవచ్చని కేరళ ప్రభుత్వం మంగళవారం స్పష్టం చేసింది. రానున్న యాత్రా సీజన్ నుంచి ఆన్‌లైన్ బుకింగ్ ద్వారానే దర్శనం కల్పించాలని ఇటీవల తీసుకున్న నిర్ణయంపై తీవ్ర వ్యతిరేకత రావడంతో ప్రభుత్వం వెనక్కి తగ్గింది. ఈ మేరకు సీఎం విజయన్ అసెంబ్లీలో ప్రకటన చేశారు. ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ లేకుండా వచ్చే భక్తులకు కూడా సజావుగా దర్శనం జరిగేలా ఏర్పాట్లు చేస్తామన్నారు. గత యాత్రా సీజన్‌లోనూ ఈ సదుపాయం కల్పించామన్నారు. అయితే గత ఏడాది మాదిరిగా వర్చువల్ బుకింగ్‌తో పాటు స్పాట్ బుకింగ్ వ్యవస్థను కొనసాగిస్తారా? లేదా? అనే దానిపై సీఎం విజయన్ స్పష్టత ఇవ్వలేదు.

చిమ్మ చీకట్లో.. 16 కిలోమీటర్లు నడిచి!

» కదులుతున్న రైల్లోంచి పడిపోయిన బాలికను కాపాడిన రైల్వే పోలీసులు.. యూపీలో ఘటన

లఖ్‌నవూ, అక్టోబరు 15: కదులుతున్న రైలులో నుంచి జారిపడిన 8 ఏళ్ల చిన్నారిని రైల్వే పోలీసులు వేగంగా స్పందించి కాపాడారు. చిమ్మ చీకట్లో పట్టాల వెంబడి 16 కిలోమీటర్లు నడుచుకుంటూ వెళ్లి, గాలించి బాలిక ప్రాణాలను రక్షించారు. ఉత్తరప్రదేశ్‌లో ఆదివారం ఈ ఘటన జరిగింది. మధ్యప్రదేశ్ నుంచి యూపీలోని మథుర వెళ్లేందుకు ఓ కుటుంబం రైలెక్కింది. వీరు బోగీలోని ఎమర్జెన్సీ కిటికీ దగ్గర సీట్లలో కూర్చున్నారు. గాలి కోసం ఈ కిటికీని తెరిచారు. అయితే, రాత్రి సమయంలో బాలిక ఉన్నట్లుండి కిటికీ నుంచి జారి పడిపోయింది. బాలిక తండ్రి వెంటనే లలిత్‌పూర్ రైల్వే స్టేషన్‌లో రైల్వే పోలీసులను ఆశ్రయించారు. అప్రమత్తమైన జీఆర్పీ పోలీసులు, ఆర్పీఎఫ్‌తో కలిసి నాలుగు బృందాలుగా విడిపోయి చీకట్లోనే పట్టాల వెంబడి నడుస్తూ టార్చ్, సెల్‌ఫోన్ లైట్లతో గాలింపు చేపట్టారు. పట్టాల పక్కన చెట్ల పొదల్లో స్పృహ కోల్పోయి ఉన్న బాలికను గుర్తించారు. ఆ ప్రాంతానికి రోడ్డుమార్గం లేకపోవడంతో అటుగా వెళ్తున్న గూడ్స్ రైలును ఆపి వెంటనే లలిత్‌పూర్‌కు తరలించారు. అక్కడ ఆస్పత్రిలో పాపకు చికిత్స అందిస్తున్నారు.

నవంబరు 20న 'మహా' ఎన్నికలు!

(మొదటి పేజీ తరువాయి)



వయనాడ్ (కేరళ)తో పాటు నాందేడ్ (మహారాష్ట్ర) లోక్‌సభ స్థానాలు, 48 అసెంబ్లీ నియోజకవర్గాలకు నవంబరు 13, 20న ఉప ఎన్నికలు నిర్వహించనున్నట్లు సీఈసీ మంగళవారం విలేకరుల సమావేశంలో వెల్లడించారు. నవంబరు 23న ఓట్ల లెక్కింపు జరగనుందన్నారు. మహారాష్ట్ర అసెంబ్లీ గడువు నవంబరు 26న, ఝార్ఖండ్ అసెంబ్లీ గడువు 2025 జనవరి 5న ముగుస్తున్నప్పటికీ రెండు రాష్ట్రాలకు ఒకేసారి ఎన్నికలు నిర్వహించాలని ఈసీ నిర్ణయించింది. మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలకు నామినేషన్లు దాఖలు చేసేందుకు ఈ నెల 29 వరకు గడువు ఇచ్చారు. నామినేషన్ల ఉపసంహరణకు నవంబరు 4 వరకు గడువు ఇచ్చారు. ఝార్ఖండ్‌లో నవంబరు 13న జరిగే స్థానాలకు నామినేషన్లు దాఖలు చేసేందుకు చివరి తేదీ అక్టోబరు 25 కాగా ఉపసంహరణకు అక్టోబరు 30 చివరి తేదీ. నవంబరు 20న జరిగే స్థానాలకు నామినేషన్ల దాఖలుకు చివరి తేదీ అక్టోబరు 29 కాగా.. ఉపసంహరణకు నవంబరు 1 చివరి తేదీ. 288 అసెంబ్లీ స్థానాలున్న మహారాష్ట్రలో 9.63 కోట్ల మంది ఓటర్లు, 81 అసెంబ్లీ స్థానాలున్న ఝార్ఖండ్‌లో 2.6 కోట్ల మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారని సీఈసీ రాజీవ్ కుమార్ చెప్పారు. కాగా, వచ్చే ఏడాది ఫిబ్రవరి 15లోపు జరగాల్సిన ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలను కూడా ఇప్పుడే జరిపించాలని ఆమ్ ఆద్మీ పార్టీ నేత అరవింద్ కేజ్రీవాల్ కోరినప్పటికీ ఈసీ పట్టించుకోలేదు. నిజానికి హరియాణా ఎన్నికలను కూడా మహారాష్ట్రతో పాటే నిర్వహించాల్సి ఉన్నప్పటికీ జమ్మూకశ్మీర్‌తో కలిపి నిర్వహించింది. జమ్మూకశ్మీర్‌లో భద్రతా సమస్యల వల్ల మహారాష్ట్రను హరియాణా నుంచి వేరు చేశామని సీఈసీ తెలిపారు.

మహారాష్ట్రలో హోరాహోరీ

మహారాష్ట్రలో ఉద్ధవ్ ఠాక్రే నేతృత్వంలోని శివసేన, శరద్ పవార్ ఎన్సీపీ, కాంగ్రెస్‌తో కూడిన మహా వికాస్ అఘాడీకి; బీజేపీ, ఏక్‌నాథ్ శిందే నేతృత్వంలోని శివసేన, అజిత్ పవార్ ఎన్సీపీతో కూడిన మహాయుతి కూటమికి మధ్య హోరాహోరీ పోరు జరగనుంది. 2019లో జరిగిన మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ 105 సీట్లు, శివసేన 56 సీట్లు గెలుచుకోగా.. ఎన్సీపీ 54, కాంగ్రెస్ 44 సీట్లు గెలుచుకున్నాయి. రాజకీయ పరిణామాలు మారి.. శివసేన కాంగ్రెస్, ఎన్సీపీలతో కలిసి (మహాయుతి) ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. అనంతరం శివసేన నుంచి ఏక్‌నాథ్ శిందే, ఎన్సీపీ నుంచి అజిత్ పవార్‌లు తమ వర్గం ఎమ్మెల్యేలతో బయటికొచ్చి.. బీజేపీ మద్దతుతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారు. అయితే ఇటీవల జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ 48 సీట్లలో కేవలం 9 సీట్లే గెలుచుకోగా, మహా వికాస్ అఘాడీ 30 సీట్లు గెలుచుకుంది. తాజాగా శిందే సర్కారులోనూ విభేదాలు బయటపడుతున్నాయి. ఈ క్రమంలో మహా వికాస్ అఘాడీ, మహాయుతి కూటముల మధ్య హోరాహోరీ పోరు జరగనుంది. ఇక 2019లో ఝార్ఖండ్‌లో జేఎంఎం 30 సీట్లు, కాంగ్రెస్ 16 సీట్లు గెలుచుకోగా, బీజేపీ 25 సీట్లు సాధించింది. ఈ ఎన్నికల్లో కూడా జేఎంఎం-కాంగ్రెస్ కూటమి; బీజేపీ మధ్య గట్టి పోటీ నెలకొననుంది. కాగా, మహారాష్ట్రలో ఎన్నికలకు అతి తక్కువ సమయం ఇచ్చారని ప్రతిపక్ష పార్టీలు ఆరోపించాయి. కేవలం 35 రోజులే సమయం ఇచ్చారని విమర్శించారు. అదేసమయంలో ప్రభుత్వం భారీగా పథకాలు ప్రకటించుకునేందుకు ఈసీ అవకాశం కల్పించిందని కాంగ్రెస్ నేత విజయ్ ఆరోపించారు. అలాగే 288 స్థానాలున్న మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలను ఒకే దశలో ఎలా నిర్వహిస్తారని నిలదీశారు. ప్రతిపక్షాలను ఇబ్బంది పెట్టాలన్న ఆలోచనతోనే ఇలా చేశారని ధ్వజమెత్తారు. ఎన్ని కుట్రలు పన్నినా తమ కూటమిదే విజయమని ధీమా వ్యక్తం చేశారు.

ఎగ్జిట్ పోల్స్‌కు శాస్త్రీయత లేదు

» వాటి కారణంగా ప్రజల్లో గందరగోళం: రాజీవ్ కుమార్

న్యూఢిల్లీ, అక్టోబరు 15: ఎగ్జిట్ పోల్స్‌కు ఎలాంటి శాస్త్రీయత లేదని, వాటితో తమకు సంబంధం ఉండదని కేంద్ర ఎన్నికల కమిషనర్ రాజీవ్ కుమార్ అన్నారు. ఎంతమందితో ఎక్కడ సర్వే చేస్తున్నారు? ఫలితాలు అనుగుణంగా రాకుంటే బాధ్యత ఎంతవరకు? అనే విషయంలో మీడియా, సంబంధిత భాగస్వామ్య పక్షాలకు ఆత్మ పరిశీలన అవసరమని పేర్కొన్నారు. ఎగ్జిట్ పోల్స్ కారణంగా భారీ అంచనాలు ఏర్పడుతోందని, ఫలితాల్లో తేడా ఉండడంతో పార్టీలు, ప్రజలు, అభ్యర్థుల్లోనూ నిరాశకు దారితీస్తోందని.. మహారాష్ట్ర, జార్ఖండ్ ఎన్నికల షెడ్యూల్ విడుదల సందర్భంగా రాజీవ్ కుమార్ మాట్లాడారు. ఓటింగ్ యంత్రాలు కాలిక్యులేటర్ మాదిరిగానే ఉంటాయన్నారు. మూడంచెల భద్రత మధ్య ఈవీఎంలను ఆరు నెలల ముందే పరిశీలించి ఎన్నికల్లో వాడతామని చెప్పారు. ఫలితాలు నచ్చకుంటేనే ఆరోపణలు చేస్తున్నారని.. ట్యాంపరింగ్ అసాధ్యమని తేల్చి చెప్పారు. ఈవీఎంలపై 20 ఫిర్యాదులు వచ్చాయని, పూర్తిస్థాయిలో వివరణ ఇస్తామని తెలిపారు.

ఈవీఎంలు 'పేజర్ల' లాంటివి కావు!

ఈవీఎంలు.. హిజ్బుల్లా ఉగ్రవాదులను హతమార్చేందుకు ఇజ్రాయెల్ హ్యాక్ చేసిన పేజర్ల వంటివి కావని సీఈసీ రాజీవ్‌కుమార్ అన్నారు. ఇజ్రాయెల్‌తో ప్రధాని మోదీకి సత్సంబంధాలున్నాయని, హిజ్బుల్లా పేజర్లను ఇజ్రాయెల్ హ్యాక్ చేసి పేల్చేసినట్లుగా మహారాష్ట్రలో ఈవీఎంలను బీజేపీ హ్యాక్ చేయకుండా ఉంటుందా? అంటూ కాంగ్రెస్ నేత రషీద్ అల్వీ ఆరోపించడంపై "ఈవీఎంలు పేలుళ్లకు ఉపయోగించిన పేజర్లలా హ్యాకింగ్‌కు గురికావు. పేజర్ల వంటి వాటితో ఈవీఎంలకు సంబంధం ఉండదు" అన్నారు.

వయనాడ్ నుంచి ప్రియాంక పోటీ



న్యూఢిల్లీ, అక్టోబరు 15: వయనాడ్ లోక్‌సభ సీటుకు ప్రియాంకాగాంధీ పోటీ చేస్తారని కాంగ్రెస్ పార్టీ అధికారికంగా ప్రకటించింది. మహారాష్ట్ర, ఝార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికల తేదీలను మంగళవారం ప్రకటించిన ఎన్నికల కమిషన్, వయనాడ్ లోక్‌సభ సీటుతో పాటు 47 అసెంబ్లీ స్థానాలకు నవంబరు 13న ఉప ఎన్నికలు నిర్వహించనున్నట్లు వెల్లడించింది. ఆ వెంటనే వయనాడ్ సీటుకు ప్రియాంక అభ్యర్థిత్వంపై కాంగ్రెస్ ప్రకటన చేసింది. రాహుల్‌గాంధీ వయనాడ్(కేరళ) సీటును వదులుకొని రాయ్‌బరేలీ(యూపీ) లోక్‌సభ స్థానానికే ప్రాతినిధ్యం వహిస్తారని పార్టీ గతంలోనే తెలిపింది. కాగా, వయనాడ్‌లో గనక ఆమె గెలిస్తే... ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు(సోనియా, రాహుల్, ప్రియాంక) మొట్టమొదటిసారిగా పార్లమెంటు సభ్యులుగా ఉంటారు.

కర్ణాటకలో 3 శాసనసభ స్థానాలకు ఉప ఎన్నికలు

బెంగళూరు, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): కర్ణాటకలో మూడు శాసనసభ స్థానాలకు ఉప ఎన్నికల షెడ్యూల్‌ను కేంద్ర ఎన్నికల కమిషన్ ప్రకటించింది. శాసనసభ సభ్యులుగా కొనసాగుతూ, ఎంపీలుగా ఎన్నికైనవారు రాజీనామా చేసిన మూడు స్థానాలకు ఉప ఎన్నికలు జరగనున్నాయి. రామనగర జిల్లా చన్నపట్టణ ఎమ్మెల్యే కుమారస్వామి మండ్య నుంచి ఎంపీగా ఎన్నికై కేంద్ర భారీ పరిశ్రమల మంత్రిగా వ్యవహరిస్తున్నారు. హావేరి జిల్లా శిగ్గావి ఎమ్మెల్యే, మాజీ సీఎం బసవరాజ్ బొమ్మై హావేరి ఎంపీగా ఎన్నికయ్యారు. బళ్లారి జిల్లా సండూరు ఎమ్మెల్యే తుకారాం బళ్లారి ఎంపీగా ఎన్నికయ్యారు. ఈ మూడు అసెంబ్లీ స్థానాల ఉప ఎన్నికలకు ఈ నెల 18న నోటిఫికేషన్ వెలువడనుంది. అదే రోజు నుంచి 25వ తేదీ వరకూ నామినేషన్లు స్వీకరిస్తారు. ఉపసంహరణలకు 31వరకు గడువు ఉంటుంది. నవంబరు 13న పోలింగ్ నిర్వహిస్తారు. నవంబరు 23న ఫలితాలు ప్రకటిస్తారు.

లోకం తీరు



ఇరాన్ అణు, చమురు వ్యవస్థలపై దాడి చెయ్యం

» అమెరికాకు ఇజ్రాయెల్ హామీ

జెరూసలెం, అక్టోబరు 15: ఇరాన్‌పై ప్రతీకార చర్య తథ్యమని అమెరికా అధ్యక్షుడు జో బైడెన్‌కు ఇజ్రాయెల్ అధ్యక్షుడు బెంజమిన్ నెతన్యాహు స్పష్టం చేశారు. అదే సమయంలో ఇరాన్ అణుస్థావరాలు, చమురు క్షేత్రాల వంటి సైనికేతర వ్యవస్థల మీద మాత్రం దాడులు చెయ్యబోమని మాట ఇచ్చారు. రానున్న అమెరికా అధ్యక్ష ఎన్నికలను, ఇజ్రాయెల్‌కు బాలిస్టిక్ క్షిపణి రక్షణ వ్యవస్థను సమకూర్చాలన్న అమెరికా నిర్ణయాన్ని దృష్టిలో ఉంచుకొని, నెతన్యాహు తన వైఖరిని కొంత సడలించుకున్నారు. ఇద్దరు అధికారులను ఉటంకిస్తూ 'వాషింగ్టన్ పోస్ట్' ఈ విషయాన్ని వెల్లడించింది. ఇరాన్ చమురు, అణు వ్యవస్థలపై దాడులు చేయాలని ఇజ్రాయెల్ తొలుత భావించింది, అందుకు ప్రతిచర్యగా ఇరాన్ కనుక ఇజ్రాయెల్‌లోని జనవాసాలపై దాడులకు దిగితే యుద్ధతీవ్రత, విస్తృతి పెరిగి అపార కష్టనష్టాలు తథ్యమని భావించిన బైడెన్ ప్రభుత్వం నెతన్యాహు వ్యూహాన్ని వ్యతిరేకించింది. ఇరాన్ చమురు క్షేత్రాలపై ఇజ్రాయెల్ దాడులు చేస్తే ప్రపంచ వ్యాప్తంగా ఇంధన ధరలు భగ్గుమంటాయి. అణు స్థావరాలపై దాడుల వల్ల యుద్ధం హద్దులు దాటి అమెరికా నేరుగా జోక్యం చేసుకోవల్సిరావచ్చు. అదే జరిగితే అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో పరిస్థితి డెమొక్రాటిక్ పార్టీ అభ్యర్థి కమలా హారిస్‌కు ప్రతికూలంగానూ, రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్‌కు అనుకూలంగానూ మారవచ్చు. ఈ ఆలోచన కారణంగానే నెతన్యాహు దూకుడుకు బైడెన్ కొంతవరకు పగ్గం వేయగలిగారు. గాజాలో మానవతా సహాయక చర్యలు చేపట్టడానికి వీలుగా పరిస్థితులను 30 రోజుల్లో మెరుగుపరచాలని, లేకపోతే సైనిక సహాయం ఆపేస్తామని ఇజ్రాయెల్ ప్రభుత్వాన్ని బైడెన్ సర్కార్ హెచ్చరించినట్లు మరోవైపు సీఎన్ఎన్ వెల్లడించింది.

భారత్‌పై కెనడా ఆంక్షలు?

విధించే అవకాశాలను తోసిపుచ్చలేం.. కెనడా మంత్రి మెలానీ జోలీ వ్యాఖ్యలు

» కెనడియన్లపై దాడులకు దౌత్యవేత్తలను, వ్యవస్థీకృత నేర శక్తులను వాడుతున్నారు

» ఇది భారత్ ఘోర తప్పిదం: ట్రూడో


మెలానీ జోలీ

న్యూఢిల్లీ/ఒట్టావా, అక్టోబరు 15: ఖలిస్థానీ ఉగ్రవాది హర్దీప్‌సింగ్ నిజ్జర్ హత్యపై భారత్, కెనడా మధ్య మొదలైన దౌత్య వివాదం మరింత ముదిరింది. ఇరు దేశాల మధ్య సంబంధాలు దెబ్బతిన్న నేపథ్యంలో భారత్‌పై ఆంక్షలు విధించే అవకాశాలను తోసిపుచ్చలేమని, ఈ విషయంలో నిర్ణయం తీసుకోవడానికి సిద్ధంగా ఉన్నామని కెనడా విదేశాంగ మంత్రి మెలానీ జోలీ తాజాగా వ్యాఖ్యలు చేశారు. రాయల్ కెనడియన్ మౌంట్ పోలీస్ (ఆర్‌సీఎంపీ) సేకరించిన ఆధారాలే భారత దౌత్యవేత్తను బహిష్కరించాలన్న నిర్ణయానికి కారణమని తెలిపారు. రెండు దేశాల పరస్పర ప్రయోజనాల కోసం జరుగుతున్న దర్యాప్తునకు సహకరించాలని భారత ప్రభుత్వాని జోలీ కోరారు. దౌత్యపరమైన ప్రత్యేక వెసులుబాట్లను రద్దుచేసి దర్యాప్తునకు సహకరించాలని భారత్‌ను కోరామని, కానీ వారు నిరాకరించారని చెప్పారు. ఈ విషయంలో భారత్‌పై ఒత్తిడి తెచ్చేలా భారత్‌పై ఒత్తిడి తెస్తూనే ఉంటామని, ఫైవ్ ఐస్ భాగస్వాములతో పాటు జీ7 దేశాలతో కూడా సంప్రదింపులు కొనసాగిస్తామని స్పష్టం చేశారు. భారత్‌తో దౌత్యపరమైన ఘర్షణలను తాము కోరుకోవడం లేదని తెలిపారు. కాగా, కెనడియన్లపై దాడి చేయడానికి, వారిలో భయాందోళనలు రేకెత్తించడానికి తమ దౌత్యవేత్తలను, వ్యవస్థీకృత నేరగాళ్లను వినియోగించడం ద్వారా భారత్ ఘోర తప్పిదానికి పాల్పడిందని కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో ఆరోపించారు. కెనడాలో హత్యాకాండలు, హింసాత్మక ఘటనలకు పాల్పడటంలో భారత ఏజెంట్లు కీలక పాత్ర పోషిస్తున్నారని ఆరోపిస్తూ ఆర్‌సీఎంపీ చీఫ్ నివేదిక సమర్పించిన తర్వాత ట్రూడో మీడియాతో మాట్లాడారు. ఈ ధోరణి మా దేశ పౌరుల భద్రతకు తీవ్ర ముప్పు అని పేర్కొన్నారు. తమ భాగస్వామ్య దేశాలతోనూ ఈ అంశంపై చర్చించామని, అక్కడ కూడా వారు భారత్ నుంచి ఇలాంటి ప్రవర్తనను ఎదుర్కొన్నారని తెలిపారు. 'భారత ఏజెంట్లు కెనడియన్ల భద్రతకు ముప్పు కలిగించే కార్యకలాపాల్లో నిమగ్నమై ఉన్నారని ఆర్‌సీఎంపీ తన నివేదికలో ఆధారాలతో సహా వెల్లడించిం' అని ట్రూడో ఆరోపించారు. మరోవైపు బిష్ణోయ్ గ్యాంగ్‌తో చేతులు కలిపిన భారత ఏజెంట్లు తమ దేశంలో కోవర్టు ఆపరేషన్లు చేస్తున్నారని కెనడా తీవ్ర ఆరోపణలు చేసింది. కెనడాలో నివసించే దక్షిణాసియా సమాజాన్ని ప్రత్యేకించి ఖలిస్థానీ మద్దతుదారులను భారత ఏజెంట్లు లక్ష్యంగా చేసుకున్నారని రాయల్ కెనడియన్ మౌంట్ పోలీస్ (ఆర్‌సీఎంపీ) ఆరోపించింది. ఈ సందర్భంగా బిష్ణోయ్ గ్యాంగ్ గురించి కూడా ప్రస్తావించింది. కొన్ని ముఠాల సాయంతో భారత ఏజెంట్లు కెనడా భూభాగంపై వ్యవస్థీకృత నేరాలకు పాల్పడుతున్నారు. ప్రత్యేకించి ఇందులో బిష్ణోయ్ గ్రూపు కీలక పాత్ర పోషించినట్లు తెలుస్తోంది. ఈ గ్యాంగ్‌కు భారత ఏజెంట్లతో సంబంధాలు ఉన్నాయని విశ్వసిస్తున్నాం' అని ఆర్‌సీఎంపీ అసిస్టెంట్ కమిషనర్ బ్రిగెట్టె గౌవిన్ వ్యాఖ్యానించారు. అయితే కెనడాలోని క్రిమినల్ ముఠాలతో భారత ఏజెంట్లకు సంబంధాలను అంటగడుతూ ఆ దేశ అధికారులు చేస్తున్న ప్రయత్నాలను భారత్ ఖండించింది. నిజ్జర్ కేసులో భారత్‌కు సాక్ష్యాధారాలు అందించామని ఒట్టావా చేస్తున్న వాదనలో ఏమాత్రం వాస్తవం లేదని ఇక్కడి అధికార వర్గాలు స్పష్టం చేశాయి. కెనడాలో పౌరులను లక్ష్యంగా చేసుకొని భారత్ కోవర్టు ఆపరేషన్లు నిర్వహిస్తోందంటూ ఆ దేశ ప్రధాని ట్రూడో చేసిన ఆరోపణలను కూడా ఆ వర్గాలు తోసిపుచ్చాయి. అస్పష్ట ఆరోపణలు చేయడం, తిరస్కరిస్తే నిందలు మోపడం అనే విధానాన్ని కెనడా మొదటినుంచీ అవలంబిస్తోందని మండిపడ్డాయి.

వ్యతిరేకతను తప్పించుకోవడానికేనా?

కెనడాలో ప్రజలతో పాటు సొంత పార్టీలో పెరిగిపోతున్న వ్యతిరేకతను తప్పించుకోవడానికే ప్రధాని జస్టిన్ ట్రూడో హఠాత్తుగా నిజ్జర్ హత్య కేసును తవ్వి తీశారన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అధికారంపై క్రమంగా పట్టు సడలిపోతుండటంతో భారత్‌పై వ్యూహాత్మకంగా నిందలకు పాల్పడుతున్నారని నిపుణులు పేర్కొంటున్నారు. రెండు రోజుల క్రితం ట్రూడోకు వ్యతిరేకంగా ఆ దేశ పార్లమెంట్ హాల్‌లో సొంత పార్టీ నేతలే సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టినట్లు సమాచారం. లిబరల్ పార్టీ ఎంపీలు పెద్దసంఖ్యలో ఇందులో పాల్గొన్నట్లు తెలిసింది. వచ్చే అక్టోబరులో జరిగే ఫెడరల్ ఎన్నికలకు ట్రూడో నేతృత్వంలో బరిలోకి దిగితే ఓటమి తప్పదని సొంత పార్టీ నేతలే భావిస్తున్నారు. మరోవైపు ట్రూడో ప్రభుత్వానికి మద్దతు ఇస్తున్న న్యూ డెమొక్రటిక్ పార్టీ (ఎన్‌డీపీ) గత నెలలోనే తన మద్దతును ఉపసంహరించుకుంది. ఈ పార్టీ కోసమే భారత్‌తో ట్రూడో విరోధం పెట్టుకున్నారు. కాగా, కెనడాలో నివసిస్తున్న లక్షలాది మంది సిక్కు ఓటర్లను ఆకట్టుకోవడానికి ఇరు దేశాల మధ్య సంబంధాలను పణంగా పెట్టడానికి సైతం ట్రూడో వెనుకాడటం లేదు. గతేడాది భారత్‌లో నిర్వహించిన జీ20 సమావేశాల తర్వాతే నిజ్జర్ హత్య వివాదం తెరపైకి వచ్చింది. భారత్‌పై ఆంక్షలు విధించే అంశాన్ని పరిశీలిస్తున్నట్లు ఆ దేశ విదేశాంగ మంత్రి మెలానీ జోలీ రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసిన వెంటనే దీనికి ఎన్‌డీపీ నేత జగ్మీత్ సింగ్ వంతపాడటం గమనార్హం.

దేశ వ్యాప్తంగా ఏడు విమానాలకు బాంబు బెదిరింపు

న్యూఢిల్లీ, అక్టోబరు 15: దేశవ్యాప్తంగా మంగళవారం 7విమానాలకు బాంబు బెదిరింపు ఎదురయ్యింది. 'ఎక్స్'లో వీటికి బాంబు బెదిరింపు రావడంతో పలు భద్రతా తనిఖీలు చేయాల్సి వచ్చింది. ఢిల్లీ నుంచి షికాగో వెళ్లే ఎయిర్ ఇండియా విమానాన్ని కెనడాలోని ఓ విమానాశ్రయానికి మళ్లించి తనిఖీ చేశారు. అలాగే జైపూర్ నుంచి అయోధ్య మీదుగా బెంగళూరు వెళ్లే ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ విమానం, దర్భంగా నుంచి ముంబయి వెళ్లే స్పైస్‌జెట్ విమానం, బాగ్‌డోగ్రా నుంచి బెంగళూరు వెళ్లే ఆకాశ ఎయిర్ విమానం, దమ్మాం(సౌదీ అరేబియా) నుంచి లక్‌నవూ వెళ్లే ఇండిగో విమానం, అమృత్‌సర్-డెహ్రాడూన్-ఢిల్లీ అలయన్స్ ఎయిర్ విమానం, మదురై నుంచి సింగపూర్ వెళ్లే ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ విమానాలకు బాంబు బెదిరింపులు వచ్చాయి. బాంబు బెదిరింపుతో మదురై-సింగపూర్ ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ విమానానికి సింగపూర్ సైన్యం రెండు యుద్ధ విమానాలతో రక్షణ కల్పించింది. అవి ఆ విమానాన్ని జనావాసాలకు దూరంగా మళ్లించి సింగపూర్ చాంగి విమానాశ్రయానికి చేర్చాయి. కాగా, ఈ బెదిరింపుల వెనుక ఉన్నవారిని గుర్తించేందుకు పౌర విమానయాన భద్రతా సంస్థ భారత సైబర్ సెక్యూరిటీ ఏజెన్సీల సాయం కోరింది. బాధ్యులను కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది.

చెన్నైని ముంచెత్తిన వాన



చెన్నై, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ఈశాన్య రుతుపవనాల ప్రభావంతో రెండు రోజులుగా కురుస్తున్న వర్షం తమిళనాడు రాజధాని నగరం చెన్నైను ముంచెత్తింది. నగరంలోని 300 ప్రాంతాలకు పైగా వరదనీటిలో చిక్కుకున్నాయి. భారీ వర్షం కారణంగా పలు విమాన సేవలకు అంతరాయం ఏర్పడగా, మరికొన్నింటిని రద్దు చేసినట్లు అధికారులు తెలిపారు. ఇక చెన్నైలో ప్రజా రోడ్డు రవాణా వ్యవస్థ కూడా దెబ్బతింది. వాణిజ్య కేంద్రంగా ఉన్న టి.నగర్‌లోని పలు వీధులు వరదనీట మునిగాయి. టి.నగర్ బస్‌స్టేషన్ చుట్టూ మోకాలిలోతున వర్షపు నీరు ప్రవహిస్తోంది. వాతావరణశాఖ ముందస్తు హెచ్చరికల నేపథ్యంలో చెన్నై, తిరువళ్లూరు, కాంచీపురం, చెంగల్పట్టు జిల్లాల్లో మంగళవారం విద్యాలయాలకు సెలవు ప్రకటించిన ప్రభుత్వం.. ప్రైవేటు కార్యాలయాల వారు ఇంటి నుంచే పని చేసుకునేందుకు వెసులుబాటు కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈశాన్య రుతుపవనాలకు తోడు బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పవాయుపీడనం బుధవారంలోగా వాయుగుండంగా మారనుండటంతో చెన్నై, తిరువళ్లూరు, కాంచీపురం, చెంగల్పట్టు, రాణీపేట, తిరువణ్ణామలై, వేలూరు, కడలూరు, విల్లుపురం జిల్లాలకు రెడ్ అలెర్ట్ జారీ చేశారు.

ఫ్లైఓవర్లపైనే కార్ల పార్కింగ్

చెన్నైకి వరద ముప్పు పొంచివుందన్న హెచ్చరికలతో నగరంలోని కార్ల యజమానులు అప్రమత్తమయ్యారు. గత అనుభవాల దృష్ట్యా తమ వాహనాలను మెరకప్రాంతాల్లో పెడుతున్నారు. అధికారులు జరిమానా విధిస్తున్నా పట్టించుకోకుండా ఎక్కడ ఫ్లైఓవర్లు కనిపిస్తే అక్కడ ఓ పక్కగా పార్క్ చేస్తున్నారు. దీంతో ఆయా మార్గాల్లో ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించడం పోలీసులకు సమస్యగా మారింది. మరీ ముఖ్యంగా లోతట్టు ప్రాంతమైన వేళచ్చేరికి చెందిన వాహనదారులు దగ్గరిలోని ఫ్లైఓవర్లను ఆశ్రయించారు. వాహనాలు వరదల్లో కొట్టుకుపోతుండటంతో వారు ఇలా చేశారు.

త్వరలో బెంగళూరుకు ఎయిర్ టాక్సీలు!

బెంగళూరు, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): బెంగళూరులో ట్రాఫిక్ సమస్యను అధిగమించేందుకు ఎయిర్ టాక్సీలను అందుబాటులోకి తీసుకువస్తున్నట్టు సరళ ఏవియేషన్ సీఈఓ ఆండ్రియన్ శ్రీమర్ తెలిపారు. ఈ దిశగా బెంగళూరు ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్‌తో ఒప్పందం చేసుకునేందుకు సరళ ఏవియేషన్ సిద్ధమైంది. దేశంలో తొలి ఎలక్ట్రికల్ వర్టికల్ టేకాఫ్ అండ్ ల్యాండింగ్ (ఇవిటోల్) ఎయిర్‌క్రాఫ్ట్‌లను ఆ సంస్థ సమకూర్చనుంది. ఇందిరానగర్ నుంచి బెంగళూరు ఎయిర్‌పోర్ట్‌కు గంటన్నర నుంచి కనీసం 2గంటల సమయం పడుతుండగా.. ఇకపై నిమిషాల వ్యవధిలో చేరుకోవచ్చని ఆయన అన్నారు. ఎలక్ట్రానిక్ సిటీ నుంచి ఎయిర్‌పోర్ట్‌కు రూ.1700 ఛార్జి ఉంటుందని, 19 నిమిషాల వ్యవధిలో గమ్యస్థానానికి చేరుతుందని సరళ ఏవియేషన్ వెబ్‌సైట్‌లో ప్రకటించింది. ప్రీమియం క్యాబ్‌లో ఇదే మార్గంలో 37.5 కిలోమీటర్లను 2 గంటలకుపైగా ప్రయాణించేందుకు రూ.2,500 ఖర్చు అవుతుందని పేర్కొంది.


ఎయిర్ ట్యాక్సీ నమూనా

కొత్త టీచర్ల చేరిక నేడే

» పూర్తయిన కౌన్సెలింగ్.. విడుదల కానున్న సీనియర్లు

» ఇంటర్ అడ్మిషన్ల గడువు ఈ నెల 20 దాకా పెంపు

హైదరాబాద్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): కొత్తగా ఎంపికైన ఉపాధ్యాయులకు పోస్టింగ్‌ను ఇచ్చేందుకు ఉద్దేశించిన కౌన్సెలింగ్ ప్రక్రియ పూర్తయింది. ఈ ఉపాధ్యాయులు తమకు కేటాయించిన ఆయా పాఠశాలల్లో బుధవారం ఉదయం చేరనున్నారు. రాష్ట్రంలో 10,006 మంది టీచర్లను ప్రభుత్వం కొత్తగా నియమించిన విషయం తెలిసిందే. కాగా, కౌన్సెలింగ్ సందర్భంగా పలుచోట్ల గందరగోళ పరిస్థితి నెలకొంది. ముఖ్యంగా వరంగల్, కామారెడ్డి, నిజామాబాద్, భద్రాద్రి జిల్లాల్లో ఖాళీల విషయంలో స్పష్టత లోపించడంతో, మధ్యాహ్నం వరకు సమస్యను పరిష్కరించి అనంతరం కౌన్సెలింగ్‌ను నిర్వహించారు. జూలైలో జరిగిన బదిలీల్లో చాలా మంది ఉపాధ్యాయులకు పాఠశాలలు కేటాయించినా.. టీచర్ల కొరత కారణంగా వారు రిలీవ్ కాలేదు. కొత్త ఉపాధ్యాయులు చేరబోయే స్థానాల్లో సీనియర్లు ఉంటే వారు గతంలో కేటాయించిన స్కూళ్లకు వెళ్లనున్నారు. ఇదిలావుండగా, ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం అడ్మిషన్ల గడువును ఈ నెల 20వ తేదీ వరకు పొడిగించారు.

4 రోజుల పాటు వర్షాలు

» యెల్లో అలెర్ట్ జారీ .. నైరుతి నిష్క్రమణ

» ఈశాన్య రుతుపవనాల రాక

హైదరాబాద్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ నుంచి నైరుతి రుతుపవనాలు పూర్తిగా నిష్క్రమించాయని, ఈశాన్య రుతుపవనాలు ప్రవేశించాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. ఈ ఏడాది నైరుతి రుతుపవనాలు ప్రవేశించిన జూన్ నుంచి అక్టోబరు 15 మధ్య కాలం లో విస్తారంగా వర్షాలు కురిశాయని తెలిపింది. నైరుతిలో రాష్ట్ర సగటు వర్షపాతం 738 మి.మీ. కాగా... ఈ ఏడాది అది 962 మి.మీ.గా నమోదైంది. గతేడాది 861 మి.మీ. వర్షపాతం నమోదైంది. జూలై, ఆగస్టు, సెప్టెంబరు మాసాల్లో ప్రతీనెలా సగటున 200మి.మీ. పైగా వర్షపాతం నమోదైనట్లు పేర్కొంది. మరోవైపు బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం.. వాయుగుండంగా మారిందని, దీని ప్రభావంతో తెలంగాణలో కొన్ని జిల్లాల్లో నేటి నుంచి శనివారం వరకు అక్కడక్కడ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. ఈ నాలుగు రోజులకు ఆ జిల్లాలకు యెల్లో అలెర్ట్ జారీ చేసింది.

నేడు ఏపీలోని ఆరు జిల్లాలకు రెడ్ అలర్ట్!

విశాఖపట్నం: బంగాళాఖాతంలో ఉన్న తీవ్ర అల్పపీడనం మంగళవారం రాత్రికి వాయుగుండంగా మారింది. దీని ప్రభావంతో ఏపీలోని ప్రకాశం, నెల్లూరు, తిరుపతి, చిత్తూరు, కడప, అన్నమయ్య జిల్లాలకు ముప్పు పొంచి ఉంది. బుధవారం ఈ జిల్లాల్లో కుంభవృష్టిగా, మరికొన్ని చోట్ల అతి భారీవర్షాలు కురిసే అవకాశం ఉండడంతో వాతావరణ శాఖ రెడ్ అలర్ట్ ప్రకటించింది. ఏపీలో నెల్లూరు, చిత్తూరు, కడప, తమిళనాడులోని చెన్నై, కాంచీపురం, తిరువల్లూరు జిల్లాలకు మంగళవారం రాత్రి నుంచి బుధవారం సాయంత్రం వరకూ ఆకస్మిక వరదలు సంభవిస్తాయని హెచ్చరికలు జారీ చేసింది.

ఇంట్లో కూర్చొనే పని చేస్తారా?

(మొదటి పేజీ తరువాయి)

స్టే ఇవ్వడానికి క్యాట్ నిరాకరించింది. ఈ ఆదేశాలతో తెలంగాణలో పనిచేస్తున్న ఐఏఎస్‌లు ఏపీకి.. ఏపీలో పనిచేస్తున్న వారు తెలంగాణకు రిపోర్ట్ చేయాల్సి ఉంటుంది. తాము ఎక్కడ పనిచేస్తున్నామో అక్కడే ఉంటామని.. డీవోపీటీ ఇచ్చిన ఆర్డర్‌ను కొట్టేయాలని పేర్కొంటూ ఏడుగురు ఐఏఎస్‌లు హైదరాబాద్ క్యాట్‌లో పిటిషన్‌లు దాఖలు చేశారు. ఈ పిటిషన్లపై లత బస్వరాజ్ పాట్నే, శాలినీ మిశ్రా బెంచ్ మంగళవారం విచారణ చేపట్టింది. ఐఏఎస్‌ల తరఫున సీనియర్ న్యాయవాదులు జి.విద్యాసాగర్, కేఆర్‌కేవీ ప్రసాద్, వి.మల్లిక్, కె.లక్ష్మీనర్సింహ తదితరులు వాదనలు వినిపించారు. క్యాడర్ విభజన కోసం 2014లో ఏర్పాటైన ప్రత్యూష్ సిన్హా కమిటీ సీనియారిటీని నిర్ణయించకుండానే విభజన చేయడం వల్ల సీనియారిటీకి విరుద్ధంగా ఏపీకి కేటాయించారని.. ఈ కేటాయింపు చెల్లదని, తెలంగాణలోనే ఉండేలా ఆదేశాలివ్వాలని రోనాల్డ్ రోస్ తరఫు న్యాయవాది పేర్కొన్నారు. హైకోర్టు ఆదేశాలకు విరుద్ధంగా డీవోపీటీ వ్యవహరించిందని.. వ్యక్తిగతంగా వాదనలు వినిపించడానికి అవకాశం ఇవ్వలేదని, ఏకసభ్య కమిటీ రిపోర్ట్ తమకు అందజేయలేదని వాకాటి కరుణ తరఫు న్యాయవాది పేర్కొన్నారు. తెలంగాణ స్థానికత ఉన్నా ఏపీకి కేటాయించడం అక్రమమన్నారు. డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ద్వారా వచ్చిన అన్ రిజర్వుడు కోటా ఐఏఎస్‌లకు పరస్పర అంగీకారంతో బదిలీ(స్వాపింగ్) అవకాశం ఇవ్వకపోవడం అన్యాయమని ఆమ్రపాలి తరఫు న్యాయవాది తెలిపారు. పుట్టినప్పటి నుంచి ఉన్నత విద్య వరకు తాను తెలంగాణలోనే ఉన్నప్పటికీ తన పేరును ఏపీ స్థానికత జాబితాలో పెట్టడం చెల్లదని వాణీప్రసాద్ న్యాయవాది వాదించారు. తాము ఏపీకి చెందిన వారమని, తమ స్థానికతను తప్పుగా చూపారని సృజన, శివశంకర్ తరఫు న్యాయవాదులు పేర్కొన్నారు. తాను ఎస్టీ సామాజిక వర్గానికి చెందిన



వ్యక్తిని అయినా జనరల్ కోటాలో ఎంపికయ్యానని, ఎస్టీ కోటాలో చూపడం చెల్లదని హరికిరణ్ న్యాయవాది పేర్కొన్నారు. డీవోపీటీ ఉత్తర్వులను కొట్టేయడంతోపాటు 16న రిపోర్ట్ చేయాలన్న ఆదేశాలపై తక్షణం స్టే ఇవ్వాలని కోరారు. డీవోపీటీ తరఫు న్యాయవాదులు స్పందిస్తూ.. ప్రత్యూష్ సిన్హా కమిటీ మార్గదర్శకాల ప్రకారమే ఐఏఎస్ అధికారుల రిప్రజెంటేషన్లపై చట్టబద్ధంగా అన్ని అంశాలు విచారించి నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఇందుకోసం ఏకసభ్య కమిటీని నియమించి రిపోర్ట్ సైతం తీసుకున్నామన్నారు. ప్రస్తుతానికి ఆ రిపోర్ట్ అందుబాటులో లేదని, దాంతోపాటు పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేస్తామని పేర్కొన్నారు. వాదనలు నమోదు చేసుకున్న బెంచ్.. ఐఏఎస్‌ల తీరును తీవ్రస్థాయిలో తప్పుబట్టింది. "ఐఏఎస్ అధికారులు ఇళ్లలోనే కూర్చొని సేవ చేస్తామంటే కుదరదు. సరిహద్దుల్లో సమస్యలు వస్తే అక్కడికి వెళ్లి పనిచేయరా? విజయవాడ వంటి ప్రాంతాల్లో భారీ వరదలు వచ్చి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అలాంటి చోట్లకు వెళ్లి ప్రజలకు సేవ చేయాలని లేదా? ఎక్కడికీ కదలబోమంటే కుదరదు. అత్యవసర పరిస్థితులు వచ్చినప్పుడు దేశం కోసం పనిచేయరా? ఈ పిటిషన్లన్నీ మేము ఇచ్చే తుది తీర్పునకు లోబడి ఉంటాయి. ముందు ఏ రాష్ట్రం వాళ్లు అక్కడ రిపోర్ట్ చేయండి. తర్వాత తుది విచారణ చేపడతాం. స్థానికత, స్వాపింగ్, ఇతర అన్ని అంశాలతో కేంద్ర ప్రభుత్వం కౌంటర్ దాఖలు చేయాలి. ఈ పిటిషన్లను అడ్మిట్ చేసుకున్నాం. కేంద్రానికి నోటీసులు ఇస్తున్నాం" అని పేర్కొంది.

క్యాట్ తీర్పుపై హైకోర్టులో లంచ్‌మోషన్ పిటిషన్లు

క్యాడర్ వివాదంలో ఉన్న ఐఏఎస్ అధికారులు గురువారం తమ తమ రాష్ట్రాల్లో రిపోర్ట్ చేయాలని డీవోపీటీ స్పష్టంగా ఉత్తర్వుల్లో పేర్కొంది. మంగళవారం క్యాట్‌లో సైతం ఎలాంటి ఊరట లభించకపోవడంతో తప్పనిసరిగా రిపోర్ట్ చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ నేపథ్యంలోనే క్యాట్ తీర్పుపై హైకోర్టులో లంచ్‌మోషన్ రూపంలో అత్యవసరంగా పిటిషన్‌లు దాఖలు చేస్తామని ఐఏఎస్ అధికారులు పేర్కొన్నారు. హైకోర్టులో వెలువడే తీర్పు ఆధారంగా.. ఆయా రాష్ట్రాల్లో రిపోర్ట్ చేసే అంశంపై నిర్ణయం తీసుకోనున్నట్లు సమాచారం. క్యాట్ తీర్పు అంశాన్ని పలువురు ఐఏఎస్‌లు తెలంగాణ సీఎస్ దృష్టికి తీసుకెళ్లడంతోపాటు ఏంచేయాలనేదానిపై చర్చలు జరిపినట్లు తెలిసింది.

హైకోర్టులో ఊరట లభించకపోతే

నేడు ఏపీకి ఆ ఐదుగురు!?

» ఖాళీ కానున్న కీలక స్థానాలు

» మరోసారి ఐఏఎస్‌ల బదిలీలు!

హైదరాబాద్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మరోసారి ఐఏఎస్ అధికారుల బదిలీలు తప్పవా? అంటే.. తాజా పరిణామాలు అవుననే అనిపిస్తున్నాయి. క్యాడర్ వివాదంలో ఐదుగురు ఐఏఎస్‌లు గురువారం ఏపీలో రిపోర్ట్ చేయాల్సిందేనని క్యాట్ తీర్పు ఇచ్చిన సంగతి తెలిసిందే. అయితే ఆ తీర్పుపై బుధవారం అధికారులు హైకోర్టులో లంచ్‌మోషన్ పిటిషన్లు వేయాలని నిర్ణయించారు. హైకోర్టులో వారికి ఊరట లభించకపోతే తప్పనిసరిగా ఏపీకి వెళ్లిపోవాల్సిందే. అప్పుడు రాష్ట్రంలో ఐఏఎస్ అధికారుల బదిలీలు చేపట్టాల్సిన పరిస్థితి నెలకొంటుంది. కొన్ని కీలకమైన పోస్టులను తప్పకుండా భర్తీ చేయాల్సి ఉంటుంది. ఐఏఎస్‌లు వాకాటి కరుణ, ఆమ్రపాలి కాట, వాణీప్రసాద్, రోనాల్డ్ రోస్ సోమవారం క్యాట్‌ను ఆశ్రయించారు. ఏ రాష్ట్ర క్యాడర్ ఐఏఎస్ అధికారులు ఆ రాష్ట్రానికి వెళ్లాల్సిందేనంటూ మంగళవారం క్యాట్ తేల్చి చెప్పింది. ముందు తమకు కేటాయించిన రాష్ట్రాల్లో రిపోర్టు చేయాలని, తర్వాత తుది విచారణ చేపడతామని తెలిపింది. ఈ క్రమంలో హైకోర్టులో బుధవారం అనుకూలంగా తీర్పు వస్తే వారంతా ఇక్కడే ఉంటారు. లేకపోతే తెలంగాణను వీడాల్సిందే. మంగళవారం రాత్రి 9 గంటల వరకు రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి రిలీవింగ్ ఉత్తర్వులూ జారీ చేయలేదు. ఈ ఐఏఎస్‌లు ఏపీకి వెళ్లిపోతే.. కీలక పోస్టులు ఖాళీ కానున్నాయి. ప్రస్తుతం జీహెచ్ఎంసీ కమిషనర్‌గా ఉన్న ఆమ్రపాలి కాట వెళ్లిపోతే.. ఆ పోస్టులో సీనియర్ ఐఏఎస్‌ను నియమించాల్సి ఉంటుంది. విద్యుత్తు శాఖ కార్యదర్శిగా ఉన్న రోనాల్డ్ రోస్ పోస్టు కూడా ఖాళీ కానుంది. ఇందులో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి స్థాయి అధికారిని నియవింంచే అవకాశాలున్నాయని సమాచారం. ఇలాంటి కీలక పోస్టులను భర్తీ చేయాలంటే ప్రభుత్వం మరోసారి బదిలీలు చేపట్టాల్సి ఉంటుంది.

మహిళపై ఆటోలో అత్యాచారం

» హైదరాబాద్‌లోని గచ్చిబౌలి ప్రాంతంలో ఘోరం

» అర్ధరాత్రి తర్వాత ఒంటరిగా ఆటో ఎక్కిన బాధితురాలు

» నిర్మానుష్య ప్రాంతంలో ఆటోడ్రైవర్ అఘాయిత్యం

» పోలీసుల అదుపులో నిందితుడు ?



రాయదుర్గం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని గచ్చిబౌలి ప్రాంతంలో దారుణం జరిగింది. ఒంటరిగా తన ఆటో ఎక్కిన మహిళపై ఆటో డ్రైవర్ అత్యాచారానికి పాల్పడ్డాడు. ఆటోను నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లి ఆమెపై అఘాయిత్యానికి తెగబడ్డాడు. సోమవారం అర్ధరాత్రి తర్వాత హైదరాబాద్‌లో జరిగిన ఈ ఘటన తీవ్ర కలకలం సృష్టించింది. గచ్చిబౌలి పోలీసుల కథనం ప్రకారం.. సుమారు 40 ఏళ్ల వయస్సు ఉన్న ఓ మహిళ కొండాపూర్ వెళ్లేందుకు సోమవారం అర్ధరాత్రి రెండున్నర గంటల సమయంలో ఆర్‌సీపురం పోలీసు స్టేషన్ సర్కిల్ వద్ద ఆటో ఎక్కింది. ఆటో మసీద్‌బండ ప్రాంతానికి రాగానే డ్రైవర్ వాహనాన్ని నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లి.. వెనుక సీట్లో ఉన్న మహిళపై అత్యాచారానికి పాల్పడ్డాడు. ఈ క్రమంలో ఆ మహిళ కేకలు విని అటుగా వెళుతున్న వాహనదారులు ఆటో వద్దకు చేరే సరికి ఆటో డ్రైవర్ పరారయ్యాడు. దీనిపై సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని బాధితురాలిని వైద్య పరీక్షల నిమిత్తం కొండాపూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అనంతరం బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కాగా, నిందితుడైన ఆటో డ్రైవర్‌ను గుర్తించిన పోలీసులు తమ అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నట్టు తెలిసింది.

బాధితురాలి పొంతన లేని సమాధానాలు.

బాధితురాలు పోలీసులు విచారణలో పొంతన లేని సమాధానాలు చెప్పినట్టు తెలిసింది. తాను ఎస్ఆర్ నగర్‌లోని ఓ ఇంటీరియర్ డిజైనింగ్ సంస్థలో పని చేస్తున్నట్టు బాధితురాలు పోలీసులకు చెప్పింది. ఆ సంస్థకు ఫోన్ చేసి పోలీసులు విచారించగా.. ఆ మహిళ తమ ఉద్యోగి కాదని, తమకు ఎస్ఆర్‌నగర్‌లో కార్యాలయం లేదని చెప్పారు. అంతేకాక, వైద్య పరీక్షలకు తొలుత నిరాకరించిన బాధితురాలు తర్వాత అంగీకరించినట్టు తెలిసింది. అలాగే, బాధితురాలు చెబుతున్న చిరునామా, వివరాలకు పొంతన లేనట్టు సమాచారం. మరోపక్క, బాధితురాలు పేర్కొన్న నిర్మానుష్య ప్రదేశంలో సీసీ కెమెరాలు లేకపోవడం, ఆటోకు నెంబర్‌ప్లేట్ లేకపోవడం దర్యాప్తునకు ఇబ్బందిగా మారింది.

ట్రేడింగ్ పేరిట సైబర్ మోసం

» 78.70 లక్షలు పోగొట్టుకున్న బాధితుడు

» 39 లక్షలు రికవరీ చేసిన పోలీసులు

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : ఆన్‌లైన్ ట్రేడింగ్‌లో అధిక లాభాలు వస్తాయని ఆశపడి.. సైబర్ క్రిమినల్స్ చేతికి చిక్కిన బాధితుడు రూ. 78.70 లక్షలు పోగొట్టుకున్నాడు. వెంటనే పోలీసులను ఆశ్రయించగా.. రంగంలోకి దిగిన సిటీ సైబర్‌క్రైమ్ పోలీసులు.. సైబర్ క్రిమినల్స్ బ్యాంకు ఖాతాలను ఫ్రీజ్ చేసి రూ. 39 లక్షలు రికవరీ చేయగలిగారు. డీసీపీ ధార కవిత తెలిపిన వివరాల ప్రకారం.. నగరానికి చెందిన 34 ఏళ్ల యువకుడికి స్టాక్ మార్కెట్లో, ఆన్‌లైన్ ట్రేడింగ్‌లో పెట్టుబడులు పెట్టే అలవాటు ఉంది. ఈ క్రమంలో ఎంఎస్ స్టాక్‌మ్యాక్స్‌లో పెట్టుబడులు పెడితే ఊహించని లాభాలు వస్తాయని ఆన్‌లైన్‌లో ప్రకటన కనిపించింది. దాంతో బాధితుడు వెంటనే అందులో రిజిస్టర్ అయ్యాడు. ప్రారంభంలో చిన్న మొత్తంలో పెట్టుబడులు పెట్టగానే మంచి లాభాలు వచ్చాయి. దాంతో మెల్లగా లాభాలకు అలవాటుపడిన బాధితుడు విడతలవారీగా రూ. 78,70,500 పెట్టుబడి పెట్టాడు. ఎక్కువ మొత్తంలో డబ్బులు చేతికి అందగానే అవతలి వ్యక్తులు విత్‌డ్రా ఆప్షన్ తొలగించి స్పందించడం మానేశారు. దాంతో మోసపోయినట్లు గుర్తించిన బాధితుడు సిటీ సైబర్ క్రైమ్ పోలీసులను ఆశ్రయించారు. పోలీసులు సాంకేతిక ఆధారాలతో సైబర్ క్రిమినల్స్ కొల్లగొట్టిన ఖాతాల్లో ఉన్న రూ. 39 లక్షలు ఫ్రీజ్ చేయాలని బ్యాంకు అధికారులకు లేఖలు పంపి ఖాతాలను స్తంభింపజేశారు. త్వరలోనే ఆ డబ్బును న్యాయస్థానం ఆదేశాలతో బాధితుని ఖాతాలో జమ చేస్తామని డీసీపీ తెలిపారు.

కృష్ణా నీటిని కేటాయించండి

» జస్టిస్ బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్‌కు ఐదు కీలక ప్రాజెక్టుల డీపీఆర్‌లు అందజేత

» 238 టీఎంసీలు కేటాయించాలని తెలంగాణ విజ్ఞప్తి

హైదరాబాద్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): కృష్ణాజలాల్లో 75శాతం డిపెండబులిటీ మేరకు (ప్రతీ నాలుగేళ్లలో కచ్చితంగా మూడేళ్లపాటు వరదను ప్రామాణికంగా చేసుకొని) 555 టీఎంసీలను కేటాయించాలని తెలంగాణ కోరింది. తెలంగాణ విజ్ఞప్తితో కృష్ణా జలాలను తెలుగు రాష్ట్రాలకు పంచడానికి వీలుగా కేంద్ర ప్రభుత్వం విచారణ విధివిధానాలు (టీవోఆర్) జారీ చేసిన విషయం విదితమే. జలాలను ఏ విధంగా పంచాలనే దానిపై ఇప్పటికే తెలంగాణ రాష్ట్రం స్టేట్‌మెంట్ ఆఫ్ కేస్(ఎస్‌వోసీ) కూడా దాఖలు చేసింది. ఏపీ కూడా ఎస్‌వోసీ సమర్పించింది. వచ్చేనెల నవంబరు 6 నుంచి 8 మధ్యలో కృష్ణా ట్రిబ్యునల్-2(జస్టిస్ బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్) విచారణ జరుపనుంది. దాంతో తెలంగాణ.. ఏయే ప్రాజెక్టులకు నీటి కేటాయింపులు అవసరమనే దానిపై కీలక ప్రాజెక్టుల సమగ్ర ప్రాజెక్టు నివేదిక(డీపీఆర్)లను ట్రిబ్యునల్‌లో దాఖలు చేసింది. నిర్మాణంలో ఉన్న పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతలకు 90 టీఎంసీలు, కల్వకుర్తి ఎత్తిపోతలకు 53, జవహర్ నెట్టెంపాడుకు 25.4, డిండి ఎత్తిపోతలకు 30, శ్రీశైలం లెఫ్ట్ బ్యాంకు కెనాల్(ఎస్ఎల్‌బీసీ)కు 40 టీఎంసీలు కలుపుకొని 238 టీఎంసీలు 5ప్రాజెక్టులకు కేటాయించాలని డీపీఆర్‌లను అందించింది. వీటిని అనుసరించి, నీటి కేటాయింపులు చేస్తే.. దాని ఆధారంగా కేంద్ర జలవనరుల సంఘం(సీడబ్ల్యూసీ)లో ఆయా ప్రాజెక్టులకు అనుమతులు కోరుతూ డీపీఆర్‌లను సమర్పిం చే అవకాశం ఉంది. అలాగే హైదరాబాద్ జంటనగరాల తాగునీటి అవసరాల కోసం ఎస్ఎల్‌బీసీకి అదనంగా మరో 20 టీఎంసీలు, కొడంగల్-నారాయణపేట ఎత్తిపోతల 7 టీఎంసీలు అవసరమని విజ్ఞప్తి చేసింది. ఇదివరకే పాత ప్రాజెక్టులకు 299 టీఎంసీలు, నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టులకు 238 టీఎంసీలు కలుపుకొని భవిష్యత్తులో చేపట్టనున్న జూరాల వరద కాలువ, కోయిల్‌కొండ-గండీడ్, జూరాల-శ్రీశైలం మధ్యలో ఒక బ్యారేజీ, భీమాపై మరో బ్యారేజీ కలుపుకొని మొత్తం 555 టీఎంసీలను కేటాయించాలని ఇదివరకే తెలంగాణ విన్నవించింది. కాగా, ప్రాజెక్టుల ఆపరేషనల్ ప్రొటోకాల్ లేదా హైడ్రాలజీపై అఫిడవిట్ దాఖలు చేయడానికి ఏపీకి ఈనెల 18దాకా ట్రిబ్యునల్ గడువు ఇచ్చింది. ఆ తర్వాత నవంబరు 6 నుంచి విచారణ ప్రారంభం కానుంది.

ట్రిపుల్ ఆర్ నిర్వాసితులకు తీపి కబురు?

నర్సాపూర్ డివిజన్‌లోని గ్రామాల్లో మార్కెట్ ధర ఇవ్వాలని సర్కారు యోచన

» దానికి మూడు రెట్లు పరిహారం ఇచ్చే చాన్స్

» దాంతో ఎకరాకు రూ.40 లక్షలు వచ్చే వీలు

» ఒకటి రెండు రోజుల్లో ప్రకటన



రెడ్డిపల్లి, కొంతాన్‌పల్లి రైతులతో మాట్లాడుతున్న ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి

నర్సాపూర్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ట్రిపుల్ ఆర్ ఉత్తర భాగంలోని నర్సాపూర్ డివిజన్‌లో భూములు కోల్పోతున్న రైతులకు త్వరలోనే తీపి కబురు అందనుంది. వీరందరికీ ప్రస్తు తం బహిరంగ మార్కెట్‌లో ఉన్న ధర ప్రకారం పరిహారం ఇవ్వాలని సర్కారు యోచిస్తోంది. దీని పై ఒకటి, రెండు రోజుల్లో ప్రకటన వెలువడే అవకాశం ఉంది. మెదక్ జిల్లాలో చేసిన సర్వే ప్రకా రం నర్సాపూర్, శివ్వంపేట మండలాల్లోని 17 గ్రామాల్లో 752.48 ఎకరాల మేర భూములు కోల్పోయే రైతులకు నోటీసులు జారీ చేశారు. ఈ నెల మొదటి వారంలో నిర్వహించిన సమావేశానికి దూరంగా ఉన్న రెడ్డిపల్లి, కొంతాన్‌పల్లి రైతుల నుంచి మంగళవారం అభిప్రాయాలను సేకరించారు. కాగా, ప్రస్తుతం నర్సాపూర్ నియోజకవర్గంలో బహిరంగ మార్కెట్‌లో ఎకరా రూ.50 లక్షలకు పైగా పలుకుతోంది. ప్రభుత్వ ధర మాత్రం రూ.4.50 లక్షలే ఉన్నది. దీంతో ట్రిపుల్ ఆర్ కోసం భూములు కోల్పోయే రైతులకు ఎకరాకు రూ.15 లక్షలకు మించి వచ్చే అవకాశం లేదు. ఈ క్రమంలో విలువైన భూములు కోల్పోతున్న తమకు అన్యాయం చేయవద్దంటూ సర్వేకు వచ్చిన అధికారులను రైతులు అడ్డుకోవడం, నిలదీయడం వంటివి చేస్తున్నారు. ఈ క్రమంలో సిద్దిపేట కలెక్టర్ రాహుల్‌రాజ్ ప్రత్యేక దృష్టి సారించారు. దీనిపై ఓ కమిటీని వేసి పరిహారం ఎంత పెంచాలనే విషయమై నిర్ధారించి ప్రభుత్వానికి నివేదిక ఇచ్చారు. ప్రస్తుతం ఉన్న రూ.4.50 లక్షలను.. బహిరంగ మార్కెట్‌తో సమానంగా రూ.13 లక్షలకు పెంచాలని నివేదించినట్లు అధికార వర్గాల ద్వారా తెలిసింది. ఆ రూ.13 లక్షలకు మూడింతల పరిహారం ఇవ్వాలని సర్కార్ భావిస్తున్నట్లు సమాచారం. దీంతో రైతులకు ఎకరాకు రూ.40 లక్షల వరకు వచ్చే అవకాశం ఉంది.

పరిహారం పెరగడం పక్కా: ఆర్డీవో

ట్రిపుల్ ఆర్‌లో భూములు కోల్పోయే రైతులకు ప్రస్తుతం బహిరంగ మార్కెట్‌లో ఉన్న ధరకు దగ్గరగా పరిహారం వచ్చేలా కలెక్టర్ రాహుల్‌రాజ్ ప్రత్యేకంగా ఓ కమిటీ వేసి ప్రభుత్వానికి నివేదిక ఇచ్చారు. ఆ నివేదిక ఆధారంగా రైతులకు న్యాయం జరిగే విధంగా ప్రభుత్వం నుంచి స్పష్టమైన ప్రకటన వస్తుంది. పరిహారం విషయంలో రైతులు ఆందోళన చెందొద్దు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

మరో 'మహా'పోరాటం

కేంద్ర ఎన్నికల సంఘం మంగళవారం మహారాష్ట్ర, జార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికల తేదీలు ప్రకటించింది. మహారాష్ట్రలో నవంబరు 20న ఒకేదశలో, జార్ఖండ్‌లో నవంబరు 13, 20వతేదీల్లో రెండు విడతల్లో పోలింగ్ జరగనుంది. 288 శాసనసభ్యులున్న మహారాష్ట్ర అసెంబ్లీకి నవంబరు 26తో గడువు ముగియబోతుంటే, 81 స్థానాలున్న జార్ఖండ్ శాసనసభ గడువు వచ్చే ఏడాది జనవరి 5వ తేదీతో ముగియనుంది. ప్రస్తుతం మహారాష్ట్రని మూడుపార్టీల 'మహాయుతి' సంకీర్ణం ఏలుతూంటే, జార్ఖండ్‌లో జెఎంఎం–కాంగ్రెస్ కూటమి అధికారంలో ఉంది. హర్యానాలో ఘనంగా గెలవగలనని అనుకొని, ఘోరంగా దెబ్బతిన్న కాంగ్రెస్‌కు మహారాష్ట్ర ఎన్నికలు మరో అగ్నిపరీక్ష. ప్రత్యర్థి పార్టీలను చీల్చి దక్కించుకున్న మహారాష్ట్రను మరోవిడత నిలబెట్టుకోవడం బీజేపీకి మహాపరీక్ష.

ఎదురుగాలులు వీస్తున్నాయని అనుకున్న హర్యానాలో మూడోసారి ధాటీగా అధికారంలోకి రావడంతో బీజేపీ మంచి ఉత్సాహం మీద ఉంది. సార్వత్రిక ఎన్నికల ఫలితాలు ఆ పార్టీకి తీవ్ర నిరాశను మిగల్చి, సొంత కాళ్ళమీద నిలబడలేకుండా చేసిన నేపథ్యంలో, హర్యానా మానసికంగా మంచి శక్తినీ ఉత్తేజాన్ని ఇచ్చింది. అయితే, మొన్నటి లోక్‌సభ ఎన్నికల సందర్భంలో 48స్థానాలున్న మహారాష్ట్రలో మహాయుతి కూటమి 17 మాత్రమే నెగ్గిన విషయం తెలిసిందే. ఇందులో తొమ్మిది బీజేపీవి. సరిగ్గా ఐదేళ్ళక్రితం అప్పటి శివసేన–బీజేపీ కూటమి 41స్థానాలు గెలుచుకొని, అందులో 23 బీజేపీ వాటాగా ఉన్న స్థితిని దృష్టిలో పెట్టుకుంటే, అనంతరకాలంలో రాష్ట్రంలోని రెండు ప్రధాన పక్షాలైన శివసేన, ఎన్సీపీలను ముక్కలు చేసి, ఆ చీలికలతో కలసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన బీజేపీ పట్ల ప్రజలు సానుకూలంగా లేరని అర్థం. శివసేనను చీల్చిన ఏక్‌నాథ్ షిండే దేశవ్యాప్తంగా వెన్నుపోటు రాజకీయాలకు ప్రతీకగా నిలిచిపోయారు. ఆ తరువాత శరద్‌పవార్‌నుంచి చీలిన అజిత్‌పవార్‌కు కూడా బీజేపీ అధికారంలో వాటా ఇచ్చింది. ఎన్నికల సంఘం దగ్గరా, న్యాయస్థానాల్లోనూ ఉద్ధవ్ ఠాక్రే, శరద్‌పవార్‌లు ఓడినప్పటికీ, మొన్న జూన్‌లో ప్రజాక్షేత్రంలో వారికి మంచి ఊరట దక్కింది. ఇక, వరాల వరదతో మహారాష్ట్రను ముంచెత్తుతున్న బీజేపీకి రాబోయే ఎన్నికలు పెద్ద పరీక్ష. బీజేపీ–షిండే మధ్య విభేదాలు ఉన్నాయని, అజిత్ పవార్ మళ్ళీ వెనక్కుపోతారని ఏవో వార్తలు వినబడుతున్నప్పటికీ, మహాయుతి ఆదినుంచీ సంఘటితంగానే వ్యవహరిస్తున్నది. వేలకోట్ల విలువైన ప్రాజెక్టులు, పథకాలతో ఉద్ధవ్, శరద్‌ల మీద ప్రజలకున్న సానుభూతిని తుడిచిపెట్టేసే ప్రయత్నమైతే చేస్తున్నది.

హర్యానాలో గెలిచివుంటే కాంగ్రెస్‌కు బేరసారాలు ఆడగలిగే శక్తి ఉండేదని, మహావికాస్ అగాడీలో దానిమాట చెల్లేదని, ఇప్పుడు సీట్లసర్దుబాటు చర్చల్లో కాంగ్రెస్‌ది పైచేయి కాలేదని విశ్లేషణలు సాగుతున్నాయి. అంత అహంకారం పనికిరాదనో, మిత్రులను విస్మరిస్తే ఇలాగే జరుగుతుందనో హర్యానా ఓటమి నేపథ్యంలో ఇండియా బ్లాక్ పార్టీలు కాంగ్రెస్ మీద విమర్శలు చేసిన విషయం తెలిసిందే. ఉద్ధవ్ ఠాక్రే కూడా ఓ నాలుగు మాటలు ఎక్కువే విసిరి కాంగ్రెస్ చేతులు కట్టేసే ప్రయత్నం చేశారు. మహావికాస్ ముఖ్యమంత్రి అభ్యర్థిగా ఉద్ధవ్ ఠాక్రేను ముందే ప్రకటించాలన్న అంశంతో సహా శరద్ పవార్ పార్టీ, కాంగ్రెస్‌ల ముందు శివసేన ఉంచుతున్న డిమాండ్లు చాలా ఉన్నాయట. మూడు పార్టీల మధ్యా సీట్ల సర్దుబాటు చర్చలు తీవ్రస్థాయిలో ఉద్రిక్తంగా సాగుతున్నాయని వార్తలు వినబడుతున్నాయి. ఇచ్చిపుచ్చుకోవడాల్లో ఎంతోకొంత రాజీపడి, అతిత్వరగా ఆ ప్రక్రియ ముగించి, సంఘటితంగా కదనరంగంలోకి దిగి పోరాడాల్సిన అవసరం ఉందని హర్యానా ఫలితాలు హెచ్చరిస్తున్నాయి. మొన్నటి ఎన్నికల్లో ఎక్కువ ఎంపీసీట్లు గెలుచుకోవడంతో మహావికాస్ అగాడీలోని మూడుపార్టీలకు ఎక్కడలేని ధైర్యమూ వచ్చింది. ఏక్‌నాథ్ షిండే ప్రభుత్వం పతనం ఆరంభమైందని, మహారాష్ట్రీయులు రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో మహాయుతిని మట్టిలో కలిపేస్తారని వారంతా భీకర ప్రకటనలు చేశారు. కానీ, లోక్‌సభ ఎన్నికల్లో అద్భుతం జరిగినంత మాత్రాన అసెంబ్లీ ఎన్నికల్లోనూ ప్రజలు బ్రహ్మరథం పడతారన్న గ్యారంటీ ఏమీలేదు. హర్యానా ప్రజలు ఈ రెండు సందర్భాల్లోనూ విభిన్నంగా ఓటేసిన విషయాన్ని మహావికాస్ నేతలు మరిచిపోకూడదు.

కెనడా రాజకీయాలలో సిక్కులు ఒక బలమైన వర్గంగా అవతరించడమే కాకుండా అక్కడి ప్రభుత్వ విధానాలను సైతం ప్రభావితం చేసే స్థాయికి ఎదిగారు. ఖలిస్తాన్ వాదాన్ని ఇంకా సజీవంగా ఉంచడానికి ప్రయత్నిస్తున్న కొన్ని దుష్ట శక్తులకు కెనడా ఒక ఆలంబనగా మారుతున్నది. ఈ నేపథ్యంలో తమ దేశ పౌరులు అయిన సిక్కు ఓటర్లను ఆకట్టుకోవడానికి కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో అవలంబిస్తున్న ఓటు బ్యాంకు రాజకీయాల పర్యవసానాలు భారత్‌కు ఒక సవాల్‌గా మారాయి.

భారత్ – కెనడా దౌత్య దుమారం


ప్రవాస భారతీయుల సంఖ్య పరంగా కొన్ని కీలక దేశాలలో కెనడా ఒకటి. ఈ దేశం ఇటీవల భారత్‌తో వ్యవహరిస్తున్న తీరు ఇరు దేశాల ద్వైపాక్షిక సంబంధాలపై ప్రతికూల ప్రభావం చూపిస్తోంది. భారతదేశం గానీ మరే దేశం గానీ రాయబారి స్థాయి దౌత్యవేత్తను వెనక్కి రప్పించడమనేది చాలా అరుదైన వ్యవహారం. భారత్ ఇప్పుడు అటువంటి అరుదైన నిర్ణయం తీసుకోవాల్సిన అనివార్య పరిస్థితిని కెనడా సృష్టించింది.

విస్తృత ఉపాధి, వాణిజ్య అవకాశాలకు అదనంగా సులభతరంగా లభించే శాశ్వత నివాస సదుపాయం వలన ప్రపంచవ్యాప్తంగా విద్యార్థి వీసాలపై కెనడాకు వెళ్లే వారి సంఖ్య పెరిగిపోతోంది. కెనడాలోని మొత్తం విదేశీ విద్యార్థులలో భారతీయుల సంఖ్య 40 శాతం కాగా వారిలో ఒక్క పంజాబ్‌కు చెందిన విద్యార్థులే 65 శాతానికి పైగా ఉన్నారు. మాతృభూమి పంజాబ్ తర్వాత సిక్కులు అధిక సంఖ్యలో నివసిస్తున్న దేశం కెనడా కావడం విశేషం. ఉత్తర అమెరికా ఖండంలో శాశ్వత నివాసానికి భారతీయ యువతకు కొంత కాలం క్రితం వరకు ఆశల గమ్యస్థానంగా ఉన్న కెనడా వాస్తవానికి ఒక శతాబ్దికి పైగా పంజాబీల ఆశల సౌధం. బ్రిటిష్ వలస పాలకుల హయాం నుంచి నేటి వరకు కెనడాకు సిక్కుల వలసలు నిరంతరాయంగా జరుగుతూనే ఉన్నాయి. పంజాబ్ రాజకీయాలలో కెనడాలోని ప్రవాసులు పరోక్షంగా కీలక పాత్ర పోషించడం కద్దు. అకాలీదళ్, కాంగ్రెస్, ఆమ్ ఆద్మీ పార్టీలలో వీరి పాత్ర చెప్పుకోదగ్గ స్థాయిలో ఉంది.

గల్ఫ్ లేఖ

కెనడా రాజకీయాలలో సిక్కులు ఒక బలమైన వర్గంగా అవతరించడమే కాకుండా అక్కడి ప్రభుత్వ విధానాలను సైతం ప్రభావితం చేసే స్థాయికి ఎదిగారు. ఖలిస్తాన్ వాదాన్ని ఇంకా సజీవంగా ఉంచడానికి ప్రయత్నిస్తున్న కొన్ని దుష్ట శక్తులకు కెనడా ఒక ఆలంబనగా మారుతుందనే ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో తమ దేశ పౌరులు అయిన సిక్కు ఓటర్లను ఆకట్టుకొనే ప్రయత్నంలో భాగంగా కెనడా నేత జస్టిన్ ట్రూడో అవలంబిస్తున్న ఓటు బ్యాంకు రాజకీయాలు భారత్‌కు ఒక సవాల్‌గా మారాయి. దౌత్యనీతి సంప్రదాయాలు పక్కదారి పడుతున్నాయి.

అంతర్జాతీయ దౌత్య మర్యాదలు, మన్ననలను పాటిస్తూ భారత్ హుందాగా వ్యవహరిస్తున్నది. అయితే అందుకు భిన్నంగా కెనడా దూకుడుగా వ్యవహరిస్తున్న తీరు సమంజసంగా లేదు. సాధారణంగా భద్రతాపరమైన అంశాలను ఇరు దేశాలు బహిర్గతం





చేయవు. చివరకు భారత్, పాకిస్తాన్‌లు కూడా ఈ విషయంలో ఒకింత లక్ష్మణరేఖకు లోబడి వ్యవహరిస్తాయి. మరి కెనడా ప్రధాని దౌత్య మర్యాదలు విడనాడి వ్యవహరిస్తుండడం ఆశ్చర్యం కలిగిస్తోంది.

కెనడాలోని ఒక గురుద్వారా ఆవరణలో ఖలిస్తానీ వేర్పాటువాది హర్దీప్‌సింగ్ నిజ్జర్ హత్యకు గురయ్యాడు. ఆ హత్య కేసులో కొందరు సీనియర్ భారతీయ దౌత్యవేత్తల గురించి ప్రస్తావిస్తూ కెనడా విదేశాంగ శాఖ చేసిన వ్యాఖ్యలకు ఒక్క భారతదేశం మాత్రమే కాదు, అంతర్జాతీయ దౌత్యవర్గాలూ ఉలిక్కిపడ్డాయి. ఈ పరిస్థితులలో భారత రాయబారితో సహా కొందరు కీలక దౌత్యవేత్తలను వెనక్కి రప్పించడం, భారత్‌లోని కెనడా దౌత్యవేత్తలను బహిష్కరించడం మినహా న్యూఢిల్లీకి గత్యంతరం లేకపోయింది. విదేశాలలోని భారతీయ ఎంబసీలలో నిఘా సంస్థ 'రా' అధికారులు పని చేస్తుండటం మామూలు విషయమే. అసలు అన్ని దేశాలలోని ఎంబసీలలో కొందరు అధికారులు ఆయా దేశాల నిఘా విభాగం పక్షాన పని చేస్తుంటారు. కెనడాలోని భారతీయ ఎంబసీలో పని చేసే పంజాబ్ పోలీసు శాఖకు చెందిన ఒక అధికారి పేరును కూడ ఈ హత్య కేసులో కెనడా ప్రభుత్వం మీడియాకు వెల్లడించింది. ఇది దౌత్య మర్యాదలను పూర్తిగా ఉల్లంఘించడమే, సందేహం లేదు.

సామాజిక మాధ్యమాల వినియోగం విస్తృతంగా పెరిగిపోతుండగా వాటిని అన్ని మతాల దురభిమానులు, ఛాందసవాదులు గరిష్ఠంగా వినియోగించుకుంటున్నారు. ఇందుకు సిక్కులూ మినహాయింపు కాదు. అయితే దుబాయిలో మామూలుగా పని చేసుకునే అమృత్‌పాల్ సింగ్ అనే ఒక ఖలిస్తాన్ వాది, 'వారిస్ దే' అనే పంజాబీ సంస్థను నడుపుతూ సిక్కు యువతను విశేషంగా ఆకర్షించిన వైనం శుభ పరిణామంగా కనిపించలేదు. అనతికాలంలోనే సదరు యువకుడు పంజాబ్ నుంచి లోక్‌సభకు పోటీ చేసి విజయం సాధించాడు. దీంతో ఖలిస్తాన్ వాదం మళ్లీ ఊపిరిపోసుకుంటుందనే ఆందోళన మొదలయింది. మత ఛాందసవాద సిక్కులలో ఖలిస్తాన్ సానుభూతిపరులు ఇప్పటికీ పెద్ద సంఖ్యలో ఉన్నారు. కెనడా, ఇతర పాశ్చాత్య దేశాలలో వారికి మద్దతుదారులు చెప్పుకోదగ్గ సంఖ్యలో ఉన్నారు. ఈ నేపథ్యంలో ఖలిస్తానీ వాదులకు ఇప్పటికీ ఒక స్థావరంగా ఉన్న కెనడాలో ఓట్ల రాజకీయాల కారణాన పరిస్థితులు భారత్‌కు వ్యతిరేకంగా పరిణమిస్తున్నాయి. విదేశీ గడ్డను ఉపయోగించుకుంటూ స్వదేశంలో ఓట్లను పండించుకోవడం నరేంద్ర మోదీతో సహా ఇతర దేశాల నాయకులకూ తెలుసు. ట్రూడో 2018లో భారత్ పర్యటనలో భాగంగా అమృత్‌సర్‌లోని స్వర్ణాలయాన్ని కుటుంబ సభ్యులతో సహా సందర్శించారు. ఆ సందర్భంగా ట్రూడోతో పాటు ఆయన కుటుంబ సభ్యులు సంప్రదాయ పంజాబీ వస్త్రాలను ధరించారు. కెనడాలోని సిక్కు ఓటర్లను ఆకట్టుకునేందుకే వారు అలా వ్యవహరించారని మరి చెప్పనవసరం లేదు.

■ మొహమ్మద్ ఇర్ఫాన్
(ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి)

ఈ మేధావుల త్యాగాలు వృథా అవుతాయా?



■ ఎ. కృష్ణారావు
ఇండియాగేట్

కొందరు కొన్ని జీవితాలను ఎందుకు ఎంచుకుంటారో తెలియదు. మూడు దశాబ్దాల క్రితం ఢిల్లీలో ఖల్సా కాలేజీలో విద్యార్థులకు ఆర్థిక శాస్త్రం బోధించే సివి సుబ్బారావు అక్కడితో సరిపెట్టుకోకుండా పౌరహక్కుల ఉద్యమంలో విస్తృతంగా పనిచేసేవారు. ఎమర్జెన్సీలో అనేకమంది నేతలతో పాటు అరెస్టయిన వారిలో సుబ్బారావు ఒకరు. విశాఖపట్టణంకు చెందిన సుబ్బారావు ఈశాన్య రాష్ట్రాల్లో జరుగుతున్న ప్రజాందోళనల గురించి మాత్రమే కాదు. దేశంలో ఎక్కడ ప్రజలకు సామూహికంగా ఏ అన్యాయం జరిగినట్లు సమాచారం వచ్చినా నిజనిర్ధారణ కమిటీల పేరుతో టీమ్‌ను వేసుకుని వెళ్లి ప్రజలను కలుసుకుని నివేదికలు సమర్పించేవారు. 1984లో సిక్కుల ఊచకోత జరిగినప్పుడు సుబ్బారావు సారథ్యంలో ప్రజల్లోకి వెళ్లి వాస్తవాలు సేకరించిన పౌరహక్కుల సంఘాలు 'ఎవరు నేరస్థులు' అన్న శీర్షికతో నివేదిక ప్రచురించాయి. అందులో ఢిల్లీ కాంగ్రెస్ నేతలు జరిపిన దారుణాలను పూసగుచ్చినట్లు వివరించారు. సిక్కుల ఊచకోతపై ఇప్పటికీ ఈ నివేదికలోనే సాధికారిక సమాచారం లభిస్తుంది. మానవ హక్కుల ఉల్లంఘనపై నిష్పాక్షికంగా, ఇరువైపులా వాస్తవాలను పరిశీలించాలనే విషయంలో సుబ్బారావుకు, బాలగోపాల్‌కు ఒకే రకమైన అభిప్రాయాలు ఉండేవి. సుబ్బారావు పౌరహక్కుల మీద కాకుండా రాజకీయార్థిక శాస్త్రం, సాహిత్యంపై దృష్టి కేంద్రీకరించి ఉంటే అద్భుతమైన రచనలు వచ్చేవి. ఆయన 'విభాత సంధ్యలు' ఇప్పటికీ సాహిత్య విద్యార్థులకు ఒక ప్రామాణిక గ్రంథం. ఆరోగ్యాన్ని లెక్కచేయకుండా 24గంటలు పనిచేయడం, విస్తృత పర్యటనలు చేయడం మూలంగా ఆయన 1994లో గుండెపోటుతో మరణించారు. ఢిల్లీ విద్యుత్ శ్మశానవాటికలో ఆయన భౌతిక కాయానికి అంత్యక్రియలు జరిగినప్పుడు వందలాది విద్యార్థులు, అధ్యాపకులు హాజరయ్యారు.

యలవర్తి నవీన్ బాబు (బాపట్ల ప్రాంతీయుడు) ఢిల్లీ జెఎన్‌యులో పిహెచ్‌డి చేస్తూ ఉండేవారు. 'వర్ణం నుంచి జాతి వరకు' అనే ఒక అద్భుతమైన పరిశోధనా పత్రాన్ని ఆయన వెలువరించారు. ఋగ్వేద కాలం నుంచి ఇప్పటి వరకు వర్ణ వ్యవస్థను ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక పరిణామంలో భాగంగా ఆయన ఈ పుస్తకంలో వివరించారు. నవీన్ బతికి ఉంటే ఇంకా ఎన్ని ఉత్తమ రచనలు చేసేవారో కదా. ఉన్నట్లుండి ఆయన విశాఖపట్టణం సమీపంలోని ఒక గ్రామంలో 2000 సంవత్సరంలో పోలీసులతో జరిగిన ఎదురు కాల్పుల్లో మరణించారని ఒక రోజు పేపర్లో వార్త చదివి దిగ్భ్రాంతి చెందాను.

ఢిల్లీలో నిజాముద్దీన్ ప్రాంతంలో ఒక చిన్న గదిలో బిడి శర్మ అనే మాజీ ఐఏఎస్ అధికారి నివసించేవారు. మాథమెటిక్స్‌లో పిహెచ్‌డి చేసిన ఆయన సివిల్ సర్వీస్‌కు ఎంపికై బస్తర్ జిల్లా కలెక్టర్‌గా పనిచేశారు. ఒక దశలో కరువు పరిస్థితుల్లో ఎవరి ఆదేశాలకోసం ఎదురు చూడకుండా ఫుడ్ కార్పొరేషన్ గోదాములు తెరిపించి అన్నార్తులకు ఆహార ధాన్యాలు సరఫరా చేయించారు. జాతీయ షెడ్యూల్డు కులాలు, జాతుల కమిషన్ కమిషనర్‌గా ఆయన ప్రచురించిన అద్భుతమైన నివేదికలే అణగారిన వర్గాల కోసం సబ్ ప్లాన్ వంటి పలు విధాన నిర్ణయాలు చేసేందుకు కారణమయ్యాయి. పదవీ విరమణ చేసిన తర్వాత మళ్లీ బస్తర్‌కు వెళ్లి ఆదివాసుల హక్కుల కోసం 'భారత్ జనాందోళన్' అనే సంస్థ ప్రారంభించి అనేక ఆందోళనలు నిర్వహించారు. స్లీపర్ క్లాసు రైళ్లలో, సిటీ బస్సులు, ఆటోల్లో ప్రయాణిస్తూ తన ఆదాయమంతా ఆదివాసీల కోసమే ఖర్చు చేసేవారు. 2012లో సుకుమా జిల్లా కలెక్టర్ అలెక్స్ పాల్ మీనన్‌ను నక్సలైట్లు కిడ్నాప్ చేసినప్పుడు ప్రొఫెసర్ హరగోపాల్‌తో కలిసి ఆయనను విడుదల చేయించడంలో కీలకపాత్ర పోషించారు. 2015లో శర్మ మరణించారు.

ఆరోగ్య, వైద్య రంగంలో అంతర్జాతీయ ఖ్యాతిని ఆర్జించిన డాక్టర వినాయక్ సేన్ జెఎన్‌యులో సోషల్ మెడిసిన్, కమ్యూనిటీ హెల్త్ కేంద్రంలో ఫ్యాకల్టీ సభ్యుడుగా ఉండేవారు. తర్వాత ఈ ఉద్యోగాన్ని వదులుకుని పౌర హక్కులకోసం పని చేయడం ప్రారంభించారు. ఛత్తీస్‌గఢ్‌లోని రాయపూర్‌కు వెళ్లి తన భార్య డాక్టర్ ఇలీనా సేన్‌తో కలిసి 'రూపాంతర్' అనే ఎన్జీవో స్థాపించి అనేక గ్రామాల్లో మద్యపానానికి, స్త్రీలపై అత్యాచారాలకు వ్యతిరేకంగా చైతన్యం కల్పించారు. ఆదివాసీల్లో పోషకాహార విలువల లేమిపై ఆందోళన వ్యక్తం చేసేవారు. పేద ప్రజలకోసం ఆసుపత్రి స్థాపించారు. 2000లో ఛత్తీస్‌గఢ్ ఏర్పడినప్పుడు ఆయనను ఆరోగ్య వ్యవహారాలపై ప్రభుత్వ సలహాదారుగా ఉండమని ఆ రాష్ట్ర ప్రభుత్వం కోరింది. 2005లో ఛత్తీస్‌గఢ్‌లో నక్సలైట్లకు వ్యతిరేకంగా సల్వాజుడుం ప్రారంభించినప్పుడు ఆయన దానివల్ల జరుగుతున్న దారుణాలను వెలుగులోకి తీసుకు రావడం ప్రారంభించారు. ఇదే ఆయన అరెస్టుకు కారణమైంది. తాను సల్వాజుడుంతో పాటు మావోయిస్టుల హింసాకాండను కూడా ఖండించానని చెప్పుకున్నా ఎవరూ పట్టించుకోలేదు. దాదాపు రెండు సంవత్సరాల తర్వాత ఆయనను సుప్రీంకోర్టు బెయిల్‌పై విడుదల చేసింది. ఆయన విడుదలైన రెండేళ్లకు 2007లో సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సుదర్శన్‌రెడ్డి సల్వాజుడుంను రాజ్యాంగ వ్యతిరేకమని ప్రకటించారు.

మరో మేధావి బాలగోపాల్. ఢిల్లీలో స్లీపర్ క్లాస్ కోచ్ దిగి కనీసం పది మైళ్లు నడుస్తూ ఇంటికి వచ్చేవారు. ఎప్పుడో ఉతికినట్లున్న షర్టు, అరిగిన చెప్పులు. వచ్చీ రాగానే తన బ్యాగులోంచి పాత టైప్ మిషన్ తీసి ఏదో నిజనిర్ధారణ కమిటీ నివేదిక టైప్ చేయడం మొదలు పెట్టేవారు. ఆయన కూడా జెఎన్‌యులో చదివినవారే. బహుముఖ ప్రతిభాశాలి అయిన బాలగోపాల్ ఏ రంగంలో ప్రవేశించినా ఉన్నత ఫలితాలు సాధించగలిగేవారు. కాని ఆయన మానవ హక్కుల రంగాన్ని కోరుకున్నారు. గ్రామ గ్రామాలూ తిరిగారు. మావోయిస్టుల్లోని చీకటి కోణాలనూ ప్రశ్నించారు. 'ఒక నాగరిక సమాజంలో మనిషి నేరస్థుడని నిరూపించేంతవరకూ అతడు మనిషిగా అన్ని హక్కులు అనుభవించాలి. ప్రజాస్వామ్యమంటే ఓట్లు వేయడం మాత్రమే కాదు. అది ఒక జీవన విధానంగా ఉండాలన్నదే నా ఆకాంక్ష' అన్న బాలగోపాల్ కొన్ని ఉన్నతమైన విలువలకోసం పోరాడారు. కాని ఆ విలువలను ఇవాళ న్యాయస్థానాలు కూడా పాటించలేకపోతున్నాయి.

వీరందరి కోవకు చెందిన మేధావే రెండు రోజుల క్రితం హైదరాబాద్‌లో మరణించిన అమలాపురానికి చెందిన జిఎన్ సాయిబాబా. వినాయక్ సేన్ మాదిరే ఆయననూ మావోయిస్టులతో సంబంధాలు ఉన్నాయన్న అనుమానంతో అరెస్టు చేశారు. ఇద్దరి వద్దా కీలకమైన హార్డ్ డిస్క్‌లు లభించాయని పోలీసులు ఆరోపించారు. ఇద్దరి విషయంలోనూ అంతర్జాతీయ సంస్థలు తీవ్ర నిరసన వ్యక్తం చేశాయి. అయితే సాయిబాబా తీవ్ర అంగ వైకల్యానికి గురికావడం, అనేక ఆరోగ్యసమస్యలు ఎదుర్కొన్నప్పటికీ ఆయన పట్ల అమానుషంగా వ్యవహరించారని ప్రభుత్వ సంస్థలు తీవ్ర ఆరోపణలు ఎదుర్కొన్నాయి. దాదాపు పదేళ్లు జైలులో ఉన్నా, ఆయనపై ఆరోపణలను రుజువు చేయలేకపోయారు. సాయిబాబాకు ఒక సమయంలో బెయిల్ వచ్చినప్పటికీ సుప్రీంకోర్టు ఆగమేఘాలపై శనివారం నాడు కూడా విచారణ జరిపి బెయిల్ నిరాకరించింది. సాయిబాబా ఉదంతం నేర న్యాయ వ్యవస్థలో ఉన్న లోపాలను వెల్లడించింది. న్యాయ వ్యవస్థ తీరుతెన్నులను కూడా ప్రశ్నార్థకం చేసింది. జైళ్లలో కులాల ఆధారంగా పనులు కేటాయించాలని బ్రిటిష్ కాలం నాటి జైళ్ల మ్యాన్యువల్స్‌లో ఉన్న నిబంధనలను రద్దు చేయాలని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి చంద్రచూడ్ తాజాగా తీర్పునివ్వడం సాయిబాబా జైళ్లలో కుల వ్యవస్థ గురించి చెప్పిన విషయాలు నిజమేనని రుజువు చేశాయి. అసలు సాయిబాబా అంగవైకల్యాన్ని తట్టుకుని ఢిల్లీలో మంచి అధ్యాపకుడుగా కొనసాగుతూ ఉండకుండా మానవ హక్కులు, ఆదివాసీ పోరాటాలు అంటూ ఎందుకు ప్రభుత్వ వ్యతిరేకతను కొని తెచ్చుకోవాల్సి వచ్చింది? సాయిబాబా మాత్రమే కాదు, బాలగోపాల్, సుబ్బారావు, నవీన్, బిడి శర్మ, వినాయక్ సేన్, సుధా భరద్వాజ్ లాంటి వారు ఎందుకు తాము కోల్పోయిన వ్యక్తిగత జీవితాలను పట్టించుకోకుండా ప్రజల హక్కుల కోసం పోరాడాలని అనుకున్నారు?

మేధావులను అరెస్టు చేయడం, మావోయిస్టులతో వారికి సంబంధాలను నిరూపించే ప్రయత్నం చేయడం, మావోయిజాన్ని తుదముట్టించాలనుకోవడం బీజేపీ హయాంలో ప్రారంభమైంది కాదు. 2013లోనే సాయిబాబా ఢిల్లీ నివాసంలో గడ్చిరోలి పోలీసులు వచ్చి సోదా చేశారు. అదే క్రమంలో అయనకు వ్యతిరేకంగా కేసు నమోదు చేశారు. సాయిబాబాకు డాక్టరేట్ డిగ్రీ ప్రదానం చేసిన అప్పటి రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీయే మావోయిస్టులను ఉక్కుపాదంతో అణిచివేయాలని పిలుపునిచ్చారు. హోంమంత్రిగా చిదంబరం ఉన్న కాలంలో ఆపరేషన్ గ్రీన్ హంట్ పేరిట మావోయిస్టుల నిర్మూలన ప్రారంభమైంది. నాటి ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ మావోయిజాన్ని 'దేశ అంతర్గత భద్రతకు తీవ్ర ముప్పుగా' ప్రకటించారు. ఇప్పుడు హోంమంత్రి అమిత్ షా ఒక డెడ్‌లైన్ పెట్టుకుని ప్రయత్నిస్తున్నారు. గతంలో కంటే ఎక్కువగా ఇప్పుడు రాష్ట్రాల మధ్య సమన్వయం, సాంకేతిక నైపుణ్యాన్ని ఉపయోగించడం పెరిగింది. అధికారంలో ఏ పార్టీ ప్రభుత్వం ఉన్నా మావోయిస్టుల పట్ల వైఖరి మారే అవకాశాలు లేవు. అదే సమయంలో ప్రజలకు ఆహార ధాన్యాలు ఉచితంగా సరఫరా చేయడం, పింఛన్ల పేరిట నిధులు మంజూరు చేయడం సంక్షేమ కార్యక్రమాలను అమలు చేయడం కూడా కేవలం ఓటు బ్యాంకు దృష్టితో కాకుండా వారిలో అశాంతి పెరగకుండా ఉండేందుకేనన్న విషయం గమనించాలి.

అయినా జీవితాలను త్యాగం చేసే మేధావులు ఏ పరిష్కారాలను సూచిస్తున్నారు? కుప్పలు తెప్పలుగా చెట్ల ఆకుల మధ్య కూలిపోయిన యువతీ యువకుల తెరుచుకున్న కళ్లు ఏ ప్రపంచాన్ని ఆశిస్తున్నాయి? నిరంతరం ఇరువైపులా కొనసాగుతున్న హింసవల్ల సమాజంలో ఏ మార్పు జరుగుతున్నదో ఆత్మావలోకనం చేసుకోవాల్సిన అవసరం ఉన్నది. ఒకే రోజు 30 మంది మరణించినా కనురెప్ప కూడా తడవని పరిస్థితి ఏర్పడుతోంది. సుదీర్ఘకాలంగా జరుగుతున్న ఈ పరస్పర హననానికి విరామం పలికి ఆచరణసాధ్యమైన పరిష్కారాల కోసం ప్రయత్నించాల్సిన తరుణం ఆసన్నమైంది. పరిష్కారాల గురించి ఆలోచించకుండా కేవలం సమస్యలపైనే ఆలోచించలేమని బాలగోపాల్ ఊరికే అనలేదు.

(ఆంధ్రజ్యోతి ఢిల్లీ ప్రతినిధి)



అసలు సాయిబాబా ఢిల్లీలో మంచి అధ్యాపకుడుగా కొనసాగుతూ ఉండకుండా మానవ హక్కులు, ఆదివాసీ పోరాటాలు అంటూ ఎందుకు ప్రభుత్వ వ్యతిరేకతను కొని తెచ్చుకోవాల్సి వచ్చింది? సాయిబాబా మాత్రమే కాదు, బాలగోపాల్, సుబ్బారావు, నవీన్, బిడి శర్మ, వినాయక్ సేన్, సుధా భరద్వాజ్ లాంటి వారు ఎందుకు తాము కోల్పోయిన వ్యక్తిగత జీవితాలను పట్టించుకోకుండా ప్రజల హక్కుల కోసం పోరాడాలని అనుకున్నారు?

హృదయ రక్షకుడు డాక్టర్ వేణుగోపాల్

కొందరుంటారు. ఎన్నో అరుదైన విలువలతో జీవితాన్ని గడుపుతూ నిరాడంబర వ్యక్తిత్వంతో ఎంతో మందిని ప్రభావితం చెయ్యగలుగుతారు. సమాజంలో తమదైన ముద్ర వెయ్యగలుగుతారు. ఎంత నిగర్వంగా, నిబద్ధతతో జీవితాన్ని గడపగలరో అంత నిశ్శబ్దంగా నిష్క్రమించగలరు కూడా. నేనెరిగిన డాక్టర్ పాణింగపల్లి వేణుగోపాల్ అలాంటి వ్యక్తి. 1942 జూలై 6న జన్మించి, 82 సంవత్సరాల వయస్సులో ఈ అక్టోబర్ 8న కాలధర్మం చెందారు. నాతో ఆయన పరిచయం కేవలం ఒక డాక్టర్‌గానే అయినప్పటికీ దగ్గర నుంచి ఆయన పనితీరుని గమనించటం సందర్భపడింది కాబట్టి, ఈ నివాళి ఆయనకివ్వడం అవసరమని భావిస్తున్నాను. ఆయనకి దక్కవలసిన గౌరవాన్ని తెలుగు జాతి గానీ, భారతదేశం గానీ ఇవ్వలేదని ఆయనని దగ్గరగా తెలిసిన వాళ్లందరూ భావిస్తారు.

దాదాపు నలభై ఏళ్లక్రితం... మావారికి ముప్పయ్యారేళ్ళ వయస్సులో మొదటిసారి గుండెపోటు వచ్చింది. ఆ వయస్సులో గుండెపోటు రావడం దురదృష్టమైతే, ఆ టైములో ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్‌కి కూతవేటు దూరంలో ఉన్న ఐఐటి ఢిల్లీలో మావారు ప్రొఫెసర్‌గా పనిచెయ్యడం ఒక అదృష్టం. దేశ రాజధానిలో ఉద్యోగ రీత్యా చేరిన అనతి కాలంలోనే వృత్తిపరంగా ఎదిగినా, ఆరోగ్యపరంగా అనుకోని దెబ్బ తిన్నారు మావారు. వృత్తి రీత్యా వేణుగోపాల్ అప్పటికే పేరెన్నికగన్న గుండెజబ్బుల శస్త్రవైద్యనిపుణులు. మొదటగా ఒక తెలుగువారే అయిన డాక్టర్ శ్రీనాథరెడ్డి గుండె వైద్య నిపుణులు కాబట్టి, వారి దగ్గరికి వెళ్లేవాళ్లం. దాదాపు రెండేళ్ల తర్వాత ఆయన సలహాననుసరించి వేణుగోపాల్‌ని కలిసాం. అయిదు బ్లాకులున్నాయని వెంటనే ఆపరేషన్ చెయ్యడం అత్యవసరమనీ చెప్పారు. అలా మొదలైంది మా పరిచయం. మావారు సెమిస్టర్ పూర్తవగానే ఆపరేషన్ చేయించుకుంటానని చెపితే, అంత సమయం వేచి ఉండవద్దని గట్టిగా చెప్పారు.


ఆ వయస్సులో హార్ట్ అటాక్ అంటే ఐఐటీలో కొంత మంది మిత్రులు కంగారుపడి మాకు తెలియకుండానే అమెరికా తీసుకెళ్లవచ్చా అని అడిగారని సందేహించిన డా. వేణుగోపాల్, మావారికి వెంటనే ఆపరేషన్ చెయ్యకుండా వార్డ్‌లోనే ఉంచి ఆలోచించారు. తర్వాత వచ్చి డాక్టర్ మీద నమ్మకం ఉండటం పేషంట్‌కి ఎంత ముఖ్యమో, డాక్టర్‌కీ అంత ముఖ్యమే, మీకు ధైర్యంగా లేకపోతే అమెరికా వెళ్లి చేయించుకోండి అని చెప్పారు. మావారు నమ్మకంగా నా కేసు సీరియస్ అని తెలిశాక అమెరికా వెళ్లే ప్రసక్తిలేదు, పైగా అంత స్తోమత మాకు లేదని చెప్పారు. నమ్మకం కుదిరింది కాబట్టే వేణుగోపాల్ ఆపరేషన్ చేసారు. ముందు రోజు వచ్చి ప్రొసీజర్ అంతా డయాగ్రామ్ వేసి మా మామగారికి, మా వారికీ వివరించి చెప్పి, ఇక వర్రీ అవడం నా వంతు, మీరు రిలాక్స్‌డ్‌గా ఉండండి అని ధైర్యం చెప్పి వెళ్లారు. అప్పటికింకా బైపాస్ సర్జరీలు ప్రాచుర్యంలోకి రాలేదు. ఆ డిపార్ట్‌మెంట్ హెడ్‌గా ఆయన అక్కడ ఎంతోమంది యువ వైద్యులకి శిక్షణ నిచ్చారు. క్రమశిక్షణకి పెట్టింది పేరు. అందరూ ఆయనంటే భయపడేవారు కాని, ఎదగాలంటే ఆయనని మించిన గురువు లేడని నమ్మిన ఎంతోమంది ఆయన వల్ల మంచి డాక్టర్లయి దేశవిదేశాల్లో విస్తరించారు. కెరియర్ మొత్తంమీద వేణుగోపాల్ 56 వేల ఆపరేషన్లు చేశారని, 26 గుండె మార్పిళ్లు చేశారని వికీపీడియా చెపుతోంది. దేశంలో మొట్టమొదటి గుండె మార్పిడి సర్జన్ వేణుగోపాల్. ఎంతో ప్రతిభావంతుడు. వ్యక్తిగతంగా కోపం ఎక్కువని అనుకునేవారు.

అప్పుడు మేము దాదాపు నెల్లాళ్లు ఆస్పత్రిలో ఉన్నాం. ఒక అయిదునెలల పసిపాపని గుండె జబ్బుతో ఆస్పత్రిలో చేర్చుకుని, తొమ్మిదో నెల వచ్చేదాక అక్కడే వుంచి జయప్రదంగా ఆపరేషన్ చేసి ఇంటికి పంపారాయన. ఒక ఆరేళ్ల రాజమండ్రి పాపకి క్లిష్టమైన వాల్వ్ మార్పిడి ఆపరేషన్ చేశారు. విజయవంతంగా ఆయన నిర్వహించిన అరుదైన కేసుల గురించి వార్డుల్లో రౌండ్స్ కొచ్చిన డాక్టర్స్ చర్చించుకుంటుంటే విని ఒక రకంగా ఆయనంటే ఒక ఆరాధనాభావాన్ని పెంచుకున్నాం. అయితే ఆయనతో మాట్లాడే ధైర్యాన్ని ఎప్పుడు కూడగట్టుకోలేకపోయినా ఆయన మాత్రం దాదాపు ఒక 15–20 ఏళ్లు ఎప్పుడెళ్లినా ఆప్యాయంగా పలకరించేవారు. ఆయనని వదిలి వేరే ఏ డాక్టర్నీ సంప్రదించదలుచుకోక, ఎక్కడ ఎలాంటి ఆఫర్లు వచ్చినా మావారు వెళ్లటానికి ఇష్టపడలేదు.

తెలుగు వాళ్లందరూ గర్వించదగిన వ్యక్తి డాక్టరు వేణుగోపాల్. ఇంత గొప్ప విజయాలు సాధించిన వ్యక్తికి మన ప్రభుత్వాలు 'భారతరత్న'కి ప్రయత్నించలేదు సరికదా, ఆయన డైరెక్టర్‌గా వున్న రోజుల్లోనే రాజకీయ నాయకులకి తగినంత గౌరవమివ్వలేదనో, రిజర్వేషన్లని సమర్థించలేదనో ఎన్నో వివాదాలని ఆయన ఎదుర్కోవాల్సి వచ్చింది. 'పద్మ' అవార్డ్‌తో ఆయనని సత్కరించిన సర్కారే, సర్వీసు చివర్లో ఆయనని వెంటాడి, వేధించింది. చివరికి సుప్రీం కోర్టు ద్వారా ఆయన గౌరవప్రదంగా రిటైరయ్యారు. ప్రతిభని గుర్తించలేం, నిజాయితీని నిబద్ధతని గౌరవించలేం, పౌరులుగా ఎన్ని అన్యాయాలు జరుగుతున్నా మాట్లాడలేం అనిపించేది ఆ రోజుల్లో పేపర్లు చదువుతుంటే.

ఇక్కడ ఇంకొక విషయం గుర్తుచేసుకోవాలి. మావారికి ఆపరేషన్ చేసిన రోజు ఒక పార్లమెంట్ మెంబర్ తాను అమెరికాలో గుండె వైద్యం చేయించుకుంటానని, అందుకు అనుగుణంగా తగ్గ ట్రీట్‌మెంట్ ఇండియాలో లేదని సర్టిఫికెట్ ఇవ్వమని అడగటానికి డాక్టర్ వేణుగోపాల్ వద్దకు వచ్చారు. అప్పుడాయన, తాను ఆరు గంటలపాటు క్లిష్టమైన ఆపరేషన్ చేసిన పేషంట్ గురించి చెప్పి "అయిదు బ్లాకులు తొలగించాను. నాకు ఈ వైద్యం రాదని సర్టిఫికెట్ ఇస్తానా" అని అంతెత్తున మండిపడటం అందరూ చూశారు. ఈ రకమైన అవమానాన్ని సహించాల్సిన అవసరం ఆయనకి లేదు. ఏ రాజకీయ నాయకులకీ ఆయన బెదరడం ఎప్పుడూ చూడలేదు. అవసరాన్ని బట్టే అందరికీ టైమ్ ఇచ్చేవారు. బీదాబిక్కీనా లేక ధనవంతుడా అని ఆయన ఎప్పుడూ ఆలోచించలేదు. ఎన్నో చోట్ల నుంచి ఆఫర్స్ వచ్చినా ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్‌లో వుంటే బీదవాళ్లకి వైద్యసేవలందించవచ్చని వాటిని వదులుకున్నారని ఆయనతో పని చేసిన వాళ్లు చెప్పేవారు. ఒక నిష్ఠాగరిష్ఠుడైన డాక్టరుగా ఆయన్ని గుర్తుపెట్టుకోవడమే ఆయనకి మనం ఇవ్వగలిగిన నివాళి. మాట కరుకు అనిపించినా, మనస్సు మెత్తని డాక్టరని, ఆయన దగ్గర ట్రీట్‌మెంట్‌కి వెళ్లిన వారందరూ అంటారు. విద్యార్థిగా ఉత్తర భారతంలో ఎయిమ్స్‌లో చేరిన ఆయన... తాను పొట్టిగా వుండడం వల్ల బాగా ర్యాగింగ్‌కి గురయిన చోటే తన ప్రతిభతో డాక్టరయి సహచరుల, విద్యార్థుల గౌరవాన్ని పొందారు. ఎన్ని జీవితాల్ని డాక్టరుగా స్పృశించారో వారందరికీ ఒక జీవితకాలపు జ్ఞాపకంగా మిగిలిపోతారు.

■ డా. కల్లూరి శ్యామల



దేశంలో మొట్టమొదటి గుండె మార్పిడి సర్జన్ డాక్టర్ పాణింగపల్లి వేణుగోపాల్. ఎంతో ప్రతిభావంతుడు, క్రమశిక్షణకి పెట్టింది పేరు. డిపార్ట్‌మెంట్ హెడ్‌గా ఎంతో మంది యువ వైద్యులకి శిక్షణనిచ్చారు. ఎదగాలంటే ఆయనని మించిన గురువు లేడని నమ్మిన ఎంతో మంది ఆయన వల్ల మంచి డాక్టర్లయి దేశవిదేశాల్లో విస్తరించారు. మాట కరుకు అనిపించినా, మనస్సు మెత్తని డాక్టరని, ఆయన దగ్గర ట్రీట్‌మెంట్‌కి వెళ్లిన వారందరూ అంటారు.

'నేను చావుని నిరాకరిస్తున్నాను'

ఢిల్లీ యూనివర్సిటీ పరిధిలోని రామ్‌లాల్ ఆనంద్ కాలేజీలో ప్రొఫెసర్‌గా పని చేసిన జిఎన్ సాయిబాబా తెలుగు సమాజానికి మేధో చైతన్యాన్ని అందించినవారిలో ముఖ్యులు. మావోయిస్టు రాజకీయాలతో సంబంధం ఉన్నదన్న ఆరోపణతో నిర్బంధానికి గురయ్యారు. విచారణ లేని తొమ్మిదేళ్ల కఠిన ఏకాంత కారాగార శిక్షను అనుభవించారు. చివరికి నిరపరాధిగా గుర్తించబడి, శిథిల శరీరంతో ఈ ఏడాది మార్చిలో విడుదలయ్యారు. ఆర్నెల్లు తిరగకుండానే తిప్పుకోలేని అనారోగ్య సమస్యలతో మరణించారు. ఇది నిస్సందేహంగా ఫాసిస్టుకాలపు అసహజ మరణం. సహజ మానవ హక్కుల కోసం, సామాజిక న్యాయం కోసం పోరాడుతూ నిలబడినందుకు అతి పెద్ద ప్రజాస్వామ్య భారతం, స్వతంత్ర ప్రతిపత్తి గల న్యాయవ్యవస్థ అతనికి విధించిన శిక్ష ఇది.

సాయిబాబా పదహారు పదిహేడేళ్ల వయసునుంచే ప్రజా సమస్యల పట్ల శ్రద్ధ కనబరిచాడు. కారంచేడు ఘటన పరిణామాలు, దళిత ఉద్యమ నిర్మాణం దగ్గర నుంచి చూస్తూ ప్రశ్నించటం నేర్చుకొన్నాడు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థిగా ప్రపంచంతో సంభాషణ ప్రారంభించి, పేద పీడిత వర్గాల స్వరంగా మారాడు. అఖిల భారత ప్రజాప్రతిఘటన వేదిక నిర్మాణ నిర్వహణలలో భాగమైనాడు. సామ్రాజ్యవాద వ్యతిరేక దృక్పథంతో పనిచేశాడు. ప్రాంతాలు, దేశాల హద్దులు చెరిపేసి పీడిత జాతుల ఐక్యత కోసం, విముక్తి కోసం నిజమైన కమ్యూనిస్టుగా ఆలోచించాడు. అందులో భాగంగానే వరంగల్ కేంద్రంగా ప్రజాస్వామిక తెలంగాణ ఆకాంక్షను సామూహిక ప్రకటన చేసాడు. అభివృద్ధి పేర ఆదివాసీ హననానికి రాజ్యం రచించిన కుట్రలను ఎదుర్కొన్నాడు.

సాయిబాబా ఉద్యమకారుడే కాదు. ఆంగ్ల సాహిత్య విద్యార్థి, అధ్యాపకుడు కూడా. విద్యా విషయక ఆసక్తులను సామాజిక చైతన్యంతో సమ్మిళితం చేసి విద్యార్థుల హృదయాలను చూరగొన్న అధ్యాపకుడు. విశ్వవిద్యాలయాలను ప్రజాస్వామిక రాజకీయాలతో చైతన్యవంతం చేసిన సమూహంతో ఉన్నాడు. అందువల్లనే ప్రభుత్వం అతనిని 'అర్బన్ నక్సలైట్' అన్నది. దేశభద్రతకు ముప్పుగా చూపించి నిర్బంధించింది. ఉద్యోగం నుంచి తొలగించటానికి కారణమైంది. మొత్తంగా అతని కుటుంబాన్ని, కుటుంబ సంబంధాలను చిన్నాభిన్నం చేసింది.

సాహిత్యం ద్వారా ప్రపంచ మానవుల హృదయాలను ముట్టుకొని మరింత సున్నిత మానవుడైనాడు సాయిబాబా. గుగీ వా థియాంగో ఆయన అభిమాన రచయిత. ఆయన బాల్యజ్ఞాపకాలను తెలుగులోకి అనువదించాడు. ఒంటరి నిర్బంధంలో తనతో తాను మాట్లాడుకొనటానికి, కుటుంబంతో మాట్లాడటానికి, ప్రపంచంతో మాట్లాడటానికి కవి అయినాడు. బాల్యంలో పోలియో సోకి కలిగిన అంగ వైకల్యాన్ని జయించడానికి ఆయన మేధో సృజన శక్తులను బలంగా రూపొందించుకున్నారు. న్యాయస్థానాలు కూడా ఆలోచించగలిగిన, ప్రశ్నించగలిగిన ఆయన మేధో శక్తికే భయపడ్డాయి. అందుకే జైలు అధికారులు తమ నిర్లక్ష్యంతో సరైన సమయంలో తగిన వైద్య సహాయం అందించకుండా ఆయన శరీరాన్ని హింసకి గురి చేశారు. ఆ పరిస్థితులలో మరణపు అంచులను తాకుతూ కూడా చావును నిరాకరించే దృఢత్వం ఆయన సంతరించుకొన్నాడు.

చలికాలం తనని కోత పెట్టడం గురించి ఆయన తన సహచరికి రాసిన ఉత్తరం విషాద కావ్యమై ఎంతోమంది హృదయాలను కదిలించింది. కానీ రాజ్యాన్ని తాకలేకపోయింది. మృత్యువు గురించి ఆలోచిస్తూనే దానిని ఒరుసుకొంటూ జీవితాన్ని గురించి ఆలోచించే తాత్విక స్థాయిని అందుకొన్నాడు. "నేను చనిపోయేలా ఏం చేయాలో / వాళ్ళకి తెలియడం లేదు / ఎందుకంటే / నాకు మొలకెత్తే గడ్డి సవ్వడులు / చాలా ఇష్టం" అనగలిగిన నిర్భీతి సాయిబాబా సొంతం. ఈ మొత్తం క్రమంలో ఆయన చూపిన పోరాట పటిమ ఉన్నతం, ఉదాత్తం.

మరణించీ జీవితం పట్ల నమ్మకాన్ని, ఆశావహ దృష్టిని ఇచ్చి వెళ్లిన సాయిబాబా స్ఫూర్తి నిత్యం, నిరంతరం అని భావిస్తూ ప్రజాస్వామిక రచయిత్రుల వేదిక ఆయన మరణానికి సంతాపం ప్రకటిస్తున్నది. సాయిబాబా సహచరి వసంతకు, కూతురు మంజీరకు, ఇతర కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి.

– ప్రజాస్వామిక రచయిత్రుల వేదిక

శ్రీశక్తి

ఆడపడుచు సలహాతో
ఐదొందల రూపాయలతో మొదలుపెట్టారు.
నడివయసులో వ్యాపారానికి శ్రీకారం చుట్టి...
ఆరు పదులు దాటినా
అదే ఉత్సాహంతో పని చేస్తున్నారు.
పచ్చళ్లు... పొడులు... అప్పడాలు...
అంచెలంచెలుగా ఎదుగుతూ...
సంస్థను నేడు కోట్ల టర్నోవర్‌కు తీసుకువెళ్లారు.
ఎందరో మహిళలకు ఉపాధి కల్పిస్తూ...
సంప్రదాయ రుచులను ప్రపంచంలోని
తెలుగువారందరికీ అందిస్తున్నారు.
'జంధ్యాల ఫుడ్స్' అధినేత
జయప్రద జంధ్యాలతో 'నవ్య' మాటామంతి.



సంప్రదాయ రుచులకు ఈమే చిరునామా

"అంతకముందు మా కుటుంబంలో వ్యాపారం చేసినవారు ఎవరూ లేరు. నాకూ ఆ ఆలోచన ఎప్పుడూ రాలేదు. అదికూడా పెళ్లయ్యి ఇద్దరు పిల్లలు పుట్టాక బిజినెస్ గురించి ఆలోచించేంత సమయం ఎక్కడుంటుంది! నాటి పరిస్థితులవల్ల అనుకోకుండా నా అడుగులు ఇటువైపు పడ్డాయి. ఇదంతా ఇరవయ్యేళ్ల కిందట మొదలైంది. మా నాన్నావాళ్లది గుంటూరు జిల్లా రేపల్లె దగ్గర పెదపులివర్రు. దర్శకుడు కె.విశ్వనాథ్ గారి ఊరు. మా అత్తగారిది తెనాలి. 1986లో నా పెళ్లి అయింది. మావారు జంధ్యాల శివరామకృష్ణకు హైదరాబాద్ ఐడీపీఎల్ మార్కెటింగ్ విభాగంలో ఉద్యోగం. నేను తెనాలి ప్రభుత్వ పాఠశాలలో హిందీ టీచర్‌గా చేసేదాన్ని. 1983లో ఉద్యోగంలో చేరాను. పెళ్లయ్యాక రెండేళ్లు తెనాలిలో మా అత్తగారి దగ్గర ఉన్నాను. అయితే ఆయన హైదరాబాద్‌లో... నేను తెనాలిలో... ఇలా అయితే కుదరదనుకున్నా. దాంతో 1990లో ఉద్యోగానికి రాజీనామా చేసి హైదరాబాద్‌కు వచ్చేశాను. సాధారణంగా కష్టపడి సాధించుకున్న ప్రభుత్వ ఉద్యోగం వదులుకోవడానికి ఎవరూ ఇష్టపడరు. కానీ మావారి కోసం ఆ నిర్ణయం తీసుకున్నాను. ఇక్కడ ఏదోఒక స్కూల్లో చేరవచ్చని అనుకున్నా. చాలాచోట్ల ప్రయత్నించాక ఒక స్కూల్లో ఉద్యోగం వచ్చింది.



ఆడపడుచు ఆలోచన...

కొన్నాళ్లకు మా అత్తగారు పోయారు. మా ఆడపడచులు, మరిది పెళ్లిళ్లు వచ్చాయి. మావారే ఇంటికి పెద్ద కావడం... ఆ బాధ్యతలన్నీ చూసుకోవాల్సి రావడంతో స్కూలు మానేశాను. అదే సమయంలో ఐడీపీఎల్ కూడా ఒడుదొడుకులు ఎదుర్కొంటోంది. దాంతో ఆయన వీఆర్ఎస్ తీసుకున్నారు. ఆయన ఖాళీ. నేనూ ఖాళీ. ఇద్దరు పిల్లలు, వారి చదువులు... ఇల్లు గడవాలి కదా. ఏంచేద్దామని ఆలోచిస్తున్నాం. ఒక రోజు మా ఆడపడుచు వచ్చింది. 'వదినా... నువ్వు పచ్చళ్లు, పొడులు బాగా చేస్తావు కదా. రూ.500 ఇస్తాను. దాంతో మొదలుపెట్టు' అంది. ఆ సలహా నాకు బాగా నచ్చింది. ఆ ఐదొందలతో కంది పప్పు, ఇతర దినుసులు తీసుకువచ్చాను. కంది పొడి కొట్టి తెలిసినవాళ్లదరికీ ఇచ్చాను. చాలా బాగుందన్నారు.

స్నేహితులకు పంపిస్తే...

తరువాత రెండు కిలోలు టమాటా, కిలో అల్లం తెచ్చి పచ్చళ్లు చేసి ఇచ్చాం. అందరికీ నచ్చాయి. మావారు... 'జయప్రద చేసింది' అని తన స్నేహితుడికి పంపించారు. ఆ పచ్చళ్లను తమ ఇంట్లో డైనింగ్ టేబుల్ మీద పెట్టుకున్నారట. అదే సమయంలో వాళ్లింటికి విదేశాల నుంచి స్నేహితులు వచ్చారు. వాళ్లు ఆ పచ్చళ్లు తిని, తమకూ కావాలని అడిగారు. వాళ్ల కోసం మొదటిసారి కాస్త ఎక్కువ మొత్తంలో పచ్చళ్లు చేసి ఇచ్చాను. అందరూ బాగున్నాయంటున్నారు. అలాంటప్పుడు దీన్ని ఒక వ్యాపారంగా మారిస్తే ఎలా ఉంటుంది? ఆ ఆలోచనతో 2003లో ఇంట్లోనే పచ్చళ్ల తయారీ మొదలుపెట్టాను. అప్పుడు నా వయసు నలభై ఏళ్లు. నెలకు ఐదు వేలు సంపాదిస్తే చాలనుకున్నాను. ఒక అమ్మాయిని హెల్పర్‌గా పెట్టుకున్నాను. పచ్చళ్లు, పొడులు... ఏదైనా పొద్దున అడిగితే సాయంత్రానికల్లా చేసేదాన్ని. మావారు కిలో అయినా... పావు కిలో అయినా ఆర్డర్లు ఇంటికి వెళ్లి ఇచ్చేవారు. వచ్చిన డబ్బుతో సరుకులు కొని... రొటేషన్ చేసేదాన్ని. గ్రైండర్ ఉన్నా... మంచి రుచి కోసం అన్నీ రోట్లోనే రుబ్బేదాన్ని. క్రమంగా ఆర్డర్లు పెరిగాయి. ఆరేడేళ్ల తరువాత ఒడియాలు కూడా ప్రారంభించాం. అప్పటినుంచి గ్రైండర్ వాడకం మొదలైంది.

> **ఇష్టంతో కష్టపడితేనే...**
>
> వ్యాపారంలో రాణించాలనుకొనే మహిళలకు నేను చెప్పేది ఏంటంటే... ఇష్టంతో కష్టపడాలి. ఆసక్తి ఉంటేనే ఇందులోకి అడుగుపెట్టాలి. ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకొని... పైకి ఎదగాలన్న పట్టుదల, కసితో నిజాయతీగా పని చేయాలి. స్వశక్తితో మనం నిలదొక్కుకొంటే... మనతోపాటు మరికొందరికి ఉపాధి మార్గం చూపినవారం అవుతాం. వ్యాపారంలో ఎంత బిజీగా ఉన్నా ఒక మహిళగా ఇంటి బాధ్యతలు కూడా తప్పవు. రెండిటినీ సమన్వయం చేసుకొంటూ ముందుకు సాగడం పెద్ద సవాలే. కానీ ఏ సవాలునైనా స్వీకరించడానికి సిద్ధంగా ఉండాలి.

ఇరవై దేశాలకు...

కొన్నేళ్లకు మా 'జంధ్యాల ఫుడ్స్' పేరిట వెబ్‌సైట్ తెరిచాం. ఇప్పుడు ఇరవై రకాల పచ్చళ్లు, పది రకాల పొడులు, అప్పడాలు, ఒడియాలు తయారు చేస్తున్నాం. చర్లపల్లిలో తయారీ యూనిట్ ఉంది. హబ్సిగూడలో ఒక స్టోర్ నెలకొల్పాం. మరో రెండు చోట్ల కూడా స్టోర్స్ ప్రారంభించే ఆలోచన ఉంది. అమెరికా, కెనడా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ సహా ఇరవై దేశాలకు మా ఉత్పత్తులు వెళతాయి. యాభై మందికి పైగా మా సంస్థలో పని చేస్తున్నారు. అందులో అత్యధికంగా మహిళలే. ఐదు వందలతో మొదలైన మా సంస్థ ఇప్పుడు 3.6 కోట్ల టర్నోవర్‌కు చేరింది.

వాళ్లిద్దరి నుంచే...

నేను వంటలు ఇంత బాగా చేయడానికి కారణం... మా అమ్మ, తరువాత మా అత్తగారు. తెనాలిలో అత్తగారి దగ్గర ఉన్నప్పుడు చాలా వంటలు నేర్చుకున్నా. ఏదైనా వెరైటీ చూస్తే... అది బాగా వచ్చేవరకు నిద్రపోను. వంట చేయడం నాకు ఎంతో ఇష్టం. మన సంప్రదాయ వంటలన్నీ బాగా చేస్తాను. అయితే మసాలాల జోలికి వెళ్లను. నాణ్యత, రుచి... ఇదే మా ప్రత్యేకత.

లేటు వయసులో మొదలుపెట్టి...

నలభై ఏళ్ల వయసులో కొత్తగా వ్యాపారం ఏంటని చాలామంది అనుకున్నారు. కానీ లక్ష్య సాధనలో పట్టుదల ఉంటే వయసు అవరోధం కాదనేది నా నమ్మకం. ప్రత్యేకించి ఆ వయసు మహిళలు... ఇల్లు, పిల్లలు, వారి బాధ్యతల్లో మునిగిపోతారు. వాటి నుంచి బయటికి రావడం అంత సులువు కాదు. అయితే ఎంచుకున్న రంగంలో మహిళలు రాణించాలంటే... కుటుంబ సహకారం ఎంతో అవసరం. నా విషయమే తీసుకొంటే... నేను బిజినెస్ ప్రారంభించేనాటికి మా అమ్మాయి సీఏ ఇంటర్ అయిపోయింది. మా అబ్బాయా పెద్ద తరగతుల్లో ఉన్నాడు. ఆర్థికంగా ఇబ్బందులు. అయితే నాకు ఇంట్లో ఖాళీ దొరికింది. మావారితో పాటు పిల్లలు కూడా నాకు సహకరించారు. వారందరి సహకారంతోనే ఇంతవరకు రాగలిగాను. ఇప్పుడు మా అమ్మాయికి పెళ్లయింది. మా అబ్బాయి నా బిజినెస్ చూసు కొంటున్నాడు.

• హనుమా

ఒక స్నైపర్ కిలోమీటరు దూరంలోని టార్గెట్‌ను సైతం గురి తప్పకుండా కాలుస్తారు. ఇందుకు ఎంతో కఠినమైన శిక్షణ అవసరం. అలాంటి శిక్షణను పూర్తి చేసుకుని మొట్టమొదటి మహిళా స్నైపర్‌గా గుర్తింపు పొందారు సుమన్‌కుమారి. సరిహద్దు భద్రతా దళంలో సబ్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న సుమన్‌కుమారి పట్టుదల ఉంటే ఏదీ అసాధ్యం కాదని నిరూపించారు. తద్వారా ఎంతోమంది మహిళా సైనికులకు స్ఫూర్తిగా నిలుస్తున్నారు.

గురి తప్పని స్నైపర్

కమాండో శిక్షణ తరువాత అత్యంత కఠినమైనది స్నైపర్ ట్రైనింగ్ అని చెబుతుంటారు బీఎస్ఎఫ్ అధికారులు. పురుషులు సైతం స్నైపర్ శిక్షణ అంటే వెనకంజ వేస్తారని అంటారు. అలాంటి పరిస్థితుల్లో నేను స్నైపర్‌ను అవుతాను అంటూ ముందుకెళ్లారు సుమన్‌కుమారి. ఆ శిక్షణలో 56 మంది పురుషులు



ఉంటే సమన్‌కుమారి ఒక్కతే మహిళ. ఆమె పట్టుదలను చూసి అధికారులు శిక్షణ ఇవ్వడానికి సై అన్నారు. వారి నమ్మకాన్ని ఆమె వమ్ముచేయలేదు. ఇండోర్‌లోని సెంట్రల్ స్కూల్ ఆఫ్ వెపన్స్ అండ్ టాక్టిక్స్(సీఎస్‌డబ్ల్యూటీ)లో ఎనిమిది వారాల స్నైపర్ కోర్సును విజయవంతంగా పూర్తి చేశారు. దాంతో బీఎస్ఎఫ్‌లో మొదటి మహిళా స్నైపర్‌గా గుర్తింపు సాధించారు.

పట్టుదలతో శిక్షణకు...

హిమాచల్‌ప్రదేశ్‌లోని మండి జిల్లాకు చెందిన సుమన్‌కుమారి దిగువ మధ్యతరగతి కుటుంబంలో జన్మించారు. ఆమె తండ్రి ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తారు. తల్లి గృహిణి. ఆమె విజయంలో తల్లిదండ్రుల పాత్ర కూడా ఉంది. బీఎస్ఎఫ్‌లో చేరతాను అంటే తల్లిదండ్రులు పూర్తి సహకారం అందించారు. 2021లో బీఎస్ఎఫ్‌లో చేరారు సుమన్‌కుమారి. అందులో చేరిన తరువాత సుమన్ కుమారి స్నైపర్ శిక్షణ తీసుకోవడానికి ఒక కారణం ఉంది. ఆమె పంజాబ్‌లో ఒక ప్లాటూన్‌కు నేతృత్వం వహిస్తున్న సమయంలో సరిహద్దులో స్నైపర్ దాడులు జరిగాయి. ఆ దాడులను తిరిగి ఇచ్చేయాలనే ఉద్దేశంతో స్నైపర్ శిక్షణ తీసుకున్నారు. సుమన్ కుమారి సంకల్పం చూసి అధికారులు సైతం ఓకే చెప్పారు.

> **స్నైపర్ శిక్షణలో అనేక శారీరక, మానసిక సవాళ్లను ఎదుర్కోవాల్సి ఉంటుంది. కమాండ్ శిక్షణ తరువాత కఠినమైనది స్నైపర్ శిక్షణే అని అధికారులు అంటారు. అలాంటి కఠినమైన శిక్షణలో సుమన్‌కుమారి అద్భుతమైన ప్రతిభ కనబరిచి అధికారుల ప్రశంసలు అందుకున్నారు.**

మహిళా సైనికులకు స్ఫూర్తి

స్నైపర్ శిక్షణలో అనేక శారీరక, మానసిక సవాళ్లను ఎదుర్కోవాల్సి ఉంటుంది. కమాండ్ శిక్షణ తరువాత కఠినమైనది స్నైపర్ శిక్షణే అని అధికారులు అంటారు. అలాంటి కఠినమైన శిక్షణలో సుమన్‌కుమారి అద్భుతమైన ప్రతిభ కనబరిచి అధికారుల ప్రశంసలు అందుకున్నారు. "ఆమె ఎంతోమంది మహిళలకు స్ఫూర్తిగా నిలవనున్నారు. 56 మంది పురుషులు ఉంటే ఆమె ఒక్కతే మహిళ. ప్రతి యాక్టివిటీలో అద్భుతమైన పర్‌ఫార్మెన్స్ కనబరిచింది. ఇకపై ఈ కోర్సులో మహిళలు చేరేందుకు ఆసక్తి చూపుతారని భావిస్తున్నాం" అని సెంట్రల్ స్కూల్ ఆఫ్ వెపన్స్ అండ్ టాక్టిక్స్ ఇన్‌స్పెక్టర్ జనరల్ భాస్కర్‌సింగ్ రావత్ అన్నారు. కోర్సు పూర్తయ్యాక 'ఇన్‌స్ట్రక్టర్ గ్రేడ్'ను అందుకున్నారు సుమన్‌కుమారి. "సాధారణంగా స్నైపర్ శిక్షణలో అద్భుతమైన ప్రతిభ కనబరిచిన వారికి ఆల్ఫా, బ్రావో గ్రేడింగ్ ఇస్తాం. కానీ సుమన్‌కుమారి 'ఇన్‌స్ట్రక్టర్ గ్రేడ్' సాధించారు. ఇందు కోసం ప్రత్యేకంగా స్క్రీనింగ్ టెస్ట్ నిర్వహించాం. ఈ గ్రేడ్‌తో ఆమె స్నైపర్ ఇన్‌స్ట్రక్టర్ పోస్టుకు అర్హత సాధించారు" అని రావత్ చెప్పుకొచ్చారు. "బీఎస్ఎఫ్‌లో మహిళా సైనికులు కఠినమైన చోట తమ అడుగులు వేస్తూ సమ్మిళిత దళంగా ఏర్పడుతున్నారు. ఈ కోవలోనే బీఎస్ఎఫ్ మొదటి మహిళా స్నైపర్‌ను పొందింది. వెల్‌కం టు ఫస్ట్ వుమెన్ స్నైపర్" అని బీఎస్ఎఫ్ ఎక్స్‌లో పోస్ట్ చేసింది. స్నైపర్ అంటే శత్రువుకు కనిపించకుండా నక్కి దాడి చేయాలి. ఒక్కోసారి శత్రువుకు కనిపించకుండా సమీపంలోకి వెళ్లాల్సి వస్తుంది. ఇలాంటి కఠినమైన కోర్సులో స్వచ్ఛందంగా చేరడం నిజంగా అభినందనీయం అని సుమన్



కుమారికి శిక్షణ ఇచ్చిన ఇన్‌స్ట్రక్టర్ ఒకరు అన్నారు. సుమన్‌కుమారి ఇంగ్లీషు, హిందీ, పంజాబీ భాషల్లో అనర్గళంగా మాట్లాడతారు. మ్యూజిక్ అంటే ఇష్టం. పుస్తకాలు చదవడాన్ని కూడా ఇష్టపడతారు. పట్టుదల ఉంటే ఏదీ అసాధ్యం కాదని అంటున్న సుమన్‌కుమారిని మనమూ అభినందిద్దామా.

గుడ్ హెల్త్

నల్ల మిరియాలతో ప్రయోజనాలెన్నో!

శీతాకాలంలో అందరూ ఎదుర్కొనే ప్రధాన సమస్య దగ్గు, జలుబు. వీటి నుంచి ఉపశమనం పొందాలంటే ప్రతి ఒక్కరూ ఆశ్రయించేది మిరియాలనే. ఈ సందర్భంగా మిరియాలతో కలిగే ఆరోగ్య ప్రయోజనాల గురించి తెలుసుకుందాం!

• వాతావరణ మార్పుల కారణంగా వచ్చే ఆరోగ్య సమస్యల నివారణకు మిరియాలు దివ్యౌషధంలా పని చేస్తాయి. వీటిలోని యాంటి సెప్టిక్ గుణాలు శరీరంలో సత్తువను పెంచుతాయి. వేడి వేడి పాలలో చిటికెడు మిరియాల పొడి కలుపుకొని తాగితే దగ్గు, జలుబుల నుంచి వెంటనే ఉపశమనం కలుగుతుంది. ఒక గ్లాసు నీటిలో మిరియాలు, తులసి ఆకులు, అల్లం వేసి బాగా కాచి గోరు వెచ్చగా అయ్యాక కొంచెం తేనె కలిపి తాగితే శరీరంలోని వ్యర్థాలన్నీ బయటకు వెళతాయి.



• మిరియాలు జీర్ణ వ్యవస్థ పనితీరును మెరుగుపరుస్తాయి. ఒక గ్లాస్ నీటిలో కొన్ని మిరియాలు వేసి నానబెట్టి ఆ నీటిని తాగితే గ్యాస్, అజీర్తి, కడుపు ఉబ్బరం వంటి సమస్యల నుంచి ఉపశమనం పొందవచ్చు.

• రక్తంలోని షుగర్ లెవెల్స్‌ను క్రమబద్ధీకరించి డయాబెటిస్‌ను అదుపులో ఉంచుతాయి. మిరియాలలోని యాంటీ ఆక్సిడెంట్లు రక్త సరఫరాను మెరుగు పరచి గుండె సంబంధిత వ్యాధులు రాకుండా తోడ్పడతాయి. మహిళల్లో రొమ్ము క్యాన్సర్‌ను నిరోధిస్తాయి.

• మిరియాల పొడిని నెయ్యితో కలిపి రాసుకుంటే చర్మ వ్యాధులు తగ్గుముఖం పడతాయి. అదే పసుపుతో కలిపి రాసుకుంటే మొటిమలు తగ్గిపోతాయి.

• కీళ్లవాతం ఉన్నవారు మిరియాలను నువ్వుల నూనెలో వేయించి పొడి చేసి నొప్పి ఉన్న ప్రాంతంలో కట్టు కడితే వాపు తగ్గుతుంది.

• దంత సమస్యల నివారణకు, శరీరంలో అధిక కొవ్వును కరగించేందుకు, గొంతు గరగర నుంచి ఉపశమనానికి మిరియాల పొడి ఉపకరిస్తుంది.

ఆహారమే ఔషధం

వర్షంలో తడవడం, చలి గాలులు, సీజనల్ మార్పుల కారణంగా అనారోగ్యానికి గురవుతుంటాం. అయితే పండ్లు, కూరగాయలు ఎక్కువగా తీసుకోవడం ద్వారా ఈ సమస్యల నుంచి ఉపశమనం పొందవచ్చు.



• క్యారెట్, అల్లం, మిరియాలు, పైనాపిల్, వెల్లుల్లి జలుబుని నియంత్రించడంలో సహాయపడతాయి. ముక్కుదిబ్బడ, ఆస్తమా నుంచి ఉపశమనం అందిస్తాయి.

• యాపిల్, కీర, క్యాబేజీ, అల్లం, ఆకుకూరలు తలనొప్పిని తగ్గిస్తాయి. అల్సర్ సంబంధిత సమస్యలను, డయాబెటిస్‌ను నివారిస్తాయి. ఆకు కూరలు, క్యారెట్, చేపలు కంటిచూపును మెరుగుపరుస్తాయి.

• పచ్చికాయ, కీరా, క్యారెట్ తరచుగా తింటే మూత్రపిండాలను ఆరోగ్యంగా ఉంటాయి. దానిమ్మ, క్యారెట్, ఆకు కూరలు నరాలను ఉత్తేజితం చేస్తాయి. పైనాపిల్, పుదీనా, నిమ్మకాయలు అజీర్తిని నివారిస్తాయి.

• దానిమ్మ, ద్రాక్ష, బీట్‌రూట్‌లు జ్ఞాపకశక్తిని పెంచితే, అరటిపండు, పియర్, స్ట్రాబెర్రీలు ఒత్తిడిని అధిగమించేందుకు సహాయపడతాయి.

• బ్రోకొలి, మొలకెత్తిన గింజలు ఊపిరితిత్తులకు మేలు చేస్తాయి.

చర్మాన్ని మెరిపించండిలా...

కాంతులీనే చర్మం కావాలని ప్రతి మహిళ కోరుకుంటుంది. అందుకోసం మార్కెట్లో దొరికే క్రీమ్‌లు, ఫేస్‌ప్యాక్‌లను ఆశ్రయిస్తుంటారు. అయితే ఇవి కొన్నిసార్లు చర్మానికి హాని కలిగిస్తుంటాయి. అలా కాకుండా మన ఇంట్లో దొరికే వస్తువులతోనే నిగనిగలాడే చర్మాన్ని సొంతం చేసుకోవచ్చు.



హెర్బల్ ఫేస్ ప్యాక్‌లు: ఒక బౌల్‌లో ఒక చెంచా శనగపిండి, ఒక చెంచా పెరుగు, అర చెంచా తేనె వేసి బాగా కలిపి ముఖానికి, మెడకి రాసుకోవాలి. మునివేళ్లతో మృదువుగా మర్దన చేయాలి. పావుగంట తరవాత చల్లని నీళ్లతో శుభ్రం చేసుకోవాలి. మెత్తని టవల్‌తో సున్నితంగా అద్దుకుంటూ తుడవాలి. ఈ ప్యాక్ వల్ల చర్మానికి తేమ అంది నిగారింపు సంతరించుకుంటుంది.

• ముఖాన్ని సహజంగా మెరిపించడంలో ముల్తానీ మట్టి ప్రముఖ పాత్ర పోషిస్తుంది. టీనేజ్‌లో మొటిమలకు కారణమైన సెబమ్ ఉత్పత్తిని ఇది అడ్డుకుంటుంది. రెండు చెంచాల ముల్తానీ మట్టిలో కొంచెం పెరుగు, కొన్ని చుక్కల రోజ్ వాటర్ వేసి ప్యాక్‌లా చేసి ముఖమంతా పట్టించాలి. ఇరవై నిమిషాల తరవాత నీళ్లతో కడగాలి. ఈ ప్యాక్ వల్ల చర్మ రంధ్రాలు శుభ్రపడి మొటిమలు, మచ్చలు తగ్గుతాయి.

హోమ్ మేడ్ స్క్రబ్: బౌల్‌లో ఒక చెంచా బియ్యప్పిండి, ఒక చెంచా పెరుగు, ఒక చెంచా తేనె వేసి బాగా కలిపి విశ్రమాన్ని ముఖానికి, చేతులకు, పాదాలకు పట్టించాలి. ఆరిన తరవాత వేళ్లతో ఒకే దిశలో మర్దన చేస్తూ ప్యాక్‌ను తొలగించాలి. తరవాత చల్లని నీళ్లతో కడగాలి. ఇలా రెండు వారాలకు ఒకసారి చేస్తే మృత కణాలు తొలగిపోతాయి.

పోషకాహారం: చర్మం ఆరోగ్యంగా ఉండాలంటే పోషకాహారం తప్పనిసరి. ప్రతి రోజూ విటమిన్లు, మినరల్స్, ఒమేగా-3 ఫ్యాటీ యాసిడ్స్ అందేలా డైట్ ప్లాన్ చేసుకోవాలి. వాల్‌నట్స్, చియా సీడ్స్, వేరుశనగల్లో ఒమేగా-3 ఫ్యాటీ యాసిడ్స్ పుష్కలంగా ఉంటాయి. విటమిన్ 'ఇ' అనేది సూర్యరశ్మిలోని అల్ట్రా వయొలెట్ కిరణాల నుంచి చర్మాన్ని కాపాడుతుంది. ఇది ఎక్కువగా బాదం, వాల్‌నట్స్‌లో దొరుకుతుంది. వీటితో పాటు ఒత్తిడి, ఆందోళన దరిచేరనీయకుండా చూసుకోవాలి. ప్రశాంతంగా ఉండడం వల్ల హార్మోన్ల పనితీరు సక్రమంగా ఉండి చర్మం ఆరోగ్యంగా ఉంటుంది.

ఫ్యాషన్



ఆర్గంజా అదరహో...

రాజసంగా, హుందాగా కనిపించాలంటే ఆర్గంజా డ్రస్ ఎంచుకోవాలి. తేలికగా, పలుచగా, స్టైలిష్‌గా ఉండే ఆర్గంజా డ్రస్‌లు అన్ని వేడుకలకూ నప్పుతాయి. ఈ మెటీరియల్‌తో తయారయ్యే చుడీదార్‌లు ఇవే!

బుట్టబొమ్మలా కనిపించాలనుకుంటే వాల్యూమ్ పెంచే మెటీరియల్ ఎంచుకోవాలి. అలాంటి వాటిలో చెప్పుకోదగినది ఆర్గంజా. నైలాన్, పాలియెస్టర్ లాంటి సింథటిక్ ఫైబర్లతో తయారవుతున్న ఆర్గంజా, వన్నె తగ్గకుండా ఎక్కువ కాలం మన్నుతుంది. రకరకాల డిజైన్లలో రూపొందే ఆర్గంజాను వేర్వేరు మోడల్ దుస్తుల తయారీ కోసం ఉపయోగిస్తూ ఉంటారు. వాటిలో ప్రత్యేకించి చుడీదార్‌ల కోసం ఫ్లవర్ డిజైన్లను ఎంచుకుంటూ ఉంటారు. లేత గులాబీ, నీలం, పసుపు... ఇలా ముదురు రంగులకు బదులుగా హాయిగొలిపే లేత రంగుల ఫ్లవర్ డిజైన్లు



తాజా ఫ్యాషన్.

వినూత్నమైన వెరైటీల్లో...

ఆర్గంజా సహజసిద్ధ మెరుపును కలిగి ఉంటుంది. కాబట్టి ఈ దుస్తులను ఈవినింగ్ పార్టీ వేర్‌గా ఎంచుకోవచ్చు. ఆర్గంజా డ్రస్ వెడ్డింగ్స్‌కు కూడా సూటవుతుంది. ఈ మెటీరియల్‌లో రకాలు కూడా ఉంటాయి. మిర్రర్, శాటిన్, క్రష్డ్, షాట్, ఎంబ్రాయిడర్డ్ ఆర్గంజాలలో డిజైన్ చేసే దుస్తులను బట్టి అందుకు నప్పే మెటీరియల్‌ను ఎంచుకోవాలి. సిల్క్, శాటిన్‌లతో కలిపి ఆర్గంజాను డిజైన్ చేసుకోవచ్చు.

శాటిన్‌తో జోడీ కట్టి...

ఆర్గంజాకు వెలుగును ప్రతిఫలించే స్వభావం ఉంటుంది. కాబట్టి లాంగ్ గౌన్స్, చున్నీ కలిగి ఉండే చుడీదార్స్ కుట్టించుకోవచ్చు. మరింత హుందాగా కనిపించడం కోసం శాటిన్ లైనింగ్ సెలెక్ట్ చేసుకోవాలి. హైహీల్స్, మెటల్ జ్యువెలరీలు ఈ రకం దుస్తులకు మ్యాచ్ అవుతాయి.



ఆంధ్రజ్యోతి

నవ్య చిత్రజ్యోతి

బుధవారం • 16 అక్టోబరు 2024

cinema@andhrajyothy.com

ఫ్లెక్సిబుల్ విధానం అవసరం



తెలుగు చిత్ర పరిశ్రమకు ఓటీటీతో పాటు సినిమా టికెట్ ధరల విషయంలోనూ ఇబ్బందులు ఉన్నాయని, ఇందు కోసం ఫ్లెక్సిబుల్ విధానం తీసుకురావాలని ఏపీ ఫిల్మ్ చాంబర్ మాజీ అధ్యక్షుడు, పూర్ణా పిక్చర్స్ ఎండీ గ్రంధి విశ్వనాథ్ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌కు విజ్ఞప్తి చేశారు. మంగళగిరిలోని డిప్యూటీ సీఎం కార్యాలయంలో మంగళవారం సాయంత్రం విశ్వనాథ్ మర్యాదపూర్వకంగా పవన్ కల్యాణ్‌ను కలిశారు. ఫ్లెక్సిబుల్ విధానం ఇతర రాష్ట్రాల్లో అమలులో ఉందనీ, ఈ అంశాన్ని పరిశీలించాలని ఆయన కోరారు. విశ్వనాథ్ సూచనలు విన్న డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ సానుకూలంగా స్పందించి ఈ వివరాలను సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్తానని తెలిపారు.

అమరావతి, (ఆంధ్రజ్యోతి)

మీ నమ్మకమే నా ధైర్యం!



తన తాజా చిత్రం 'దేవర 1'ను విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ జూనియర్ ఎన్టీఆర్ ధన్యవాదాలు తెలిపారు. కొరటాల శివ దర్శకత్వంలో రూపుదిద్దుకున్న ఈ చిత్రం భారీ ఓపెనింగ్స్ సాధించడమే కాకుండా రూ. 500 కోట్లకు పైగా వసూళ్లు సాధించినందుకు ఆయన ఆనందం వ్యక్తం చేశారు. అందుకే ఈ విజయాన్ని ఇచ్చిన ప్రేక్షకులకు, అభిమానులకు, చిత్ర బృందానికి పేరు పేరునా ధన్యవాదాలు తెలుపుతూ ఎన్టీఆర్ మంగళవారం ప్రెస్‌నోట్ విడుదల చేశారు. 'తన అభిమానులకు కృతజ్ఞతలు తెలుపుతూ 'మా కంటే ఈ సినిమాను ఎక్కువగా సెలబ్రేట్ చేసిన అభిమానులకు, ప్రేక్షకులకు థాంక్స్. మీ ప్రేమాభిమానాలను చూసి నాకు నోట మాట రావడం లేదు. నా వెన్నంటే ఉంటూ అంతులేని ప్రేమను పంచుతూ సపోర్ట్ చేస్తున్న నా అభిమానుల రుణాన్ని ఎప్పటికీ తీర్చుకోలేను. మీరు చూపించే ప్రేమ వల్లే ఈ స్థాయికి చేరుకోగలిగా. మీరు నా మీద పెట్టుకున్న నమ్మకమే నాకు ఎప్పుడూ ధైర్యాన్ని, శక్తిని ఇస్తుంటుంది. మీరు గర్వపడేలా చేయడానికి నిరంతరం ప్రయత్నిస్తుంటా' అన్నారు. చిత్ర దర్శకుడు కొరటాల శివకు, నిర్మాతలు సుధాకర్ మిక్కిలినేని, హరికృష్ణ కొసరాజుకు ఎన్టీఆర్ కృతజ్ఞతలు తెలిపారు.

అలరించే హనీ - బన్నీ



సమంత

వరుణ్‌ధావన్, సమంత జంటగా నటించిన వెబ్‌సిరీస్ 'సిటాడెల్: హనీ బన్నీ'. నవంబర్ 7 నుంచి ప్రముఖ ఓటీటీలో స్ట్రీమింగ్ అవనుంది. రాజ్ అండ్ డీకే దర్శకత్వం వహించిన ఈ సిరీస్ ట్రైలర్‌ను మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో విడుదల చేశారు. 90వ దశకం నేపథ్యంలో సాగే స్పై థ్రిల్లర్ ఇది, హాలీవుడ్ స్థాయి యాక్షన్ ఘట్టాలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా సమంత మాట్లాడుతూ 'అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మించిన వెబ్‌సిరీస్ ఇది. ఈ యాక్షన్ ప్యాక్డ్ ఎంటర్‌టైనర్‌లో అవకాశం దక్కినందుకు ఆనందంగా ఉంది. హనీ పాత్ర నటిగా నాకు సవాల్ విసిరింది. వృత్తిపరంగా, వ్యక్తిగతంగా ఇది నా కెరీర్‌లో చాలా ముఖ్యమైన పాత్ర' అని చెప్పారు. యాక్షన్ సన్నివేశాల కోసం నా శక్తికి మించి కష్టపడ్డాను అని వరుణ్‌దావన్ అన్నారు. ఒక సరికొత్త ప్రపంచంలో భాగమయ్యే అవకాశం 'హనీ బన్నీ'తో దక్కిందని రాజ్ అండ్ డీకే తెలిపారు.

కడుపుబ్బా నవ్విస్తుంది



'దృశ్యకావ్యం' ఫేమ్ రామ్‌కార్తీక్ నటించిన విన్స్టరీ కామెడీ థ్రిల్లర్ 'వీక్షణం'. మనోజ్ పల్లేటి దర్శకత్వంలో పి.పద్మనాభరెడ్డి, అశోక్‌రెడ్డి నిర్మించారు. ఈ నెల 18న సినిమా విడుదలవుతోంది. ఈ సందర్భంగా హీరో రామ్‌కార్తీక్, దర్శకుడు మనోజ్ పల్లేటి, సంగీత దర్శకుడు సమర్థ్ గొల్లపూడి మీడియాతో ముచ్చటించారు. రామ్ కార్తీక్ మాట్లాడుతూ "ఈ సినిమా కథ వినగానే ఆసక్తికరంగా అనిపించింది. ఇందులో నా పాత్ర.. ఇతరుల జీవితాల్లో ఏం జరుగుతుందో తెలుసుకోవాలనుకునే ఉత్సాహంతో అనుకోని సమస్యల్లో ఇరుక్కోవడం.. వాటిలోంచి బయటపడడమే కథాంశం. సినిమా మొత్తం చాలా వినోదాత్మకంగా.. గ్రిప్పింగ్‌గా ఉంటుంది" అని చెప్పారు. దర్శకుడు మనోజ్ మాట్లాడుతూ "ఈ సినిమా అద్భుతమైన థ్రిల్‌ని పంచడంతో పాటు కడుపుబ్బా నవ్విస్తుంది. ఓ కొత్త దర్శకుడిగా ఈ సినిమా షూట్‌లో ఎన్నో కొత్త విషయాలు తెలిశాయి" అని చెప్పారు. "అన్ని ఎమోషన్స్ ఉన్న సినిమా ఇది. ఇందులో ఉన్న మూడు సాంగ్స్ చాలా బాగా వచ్చాయి" అని అన్నారు.

నిరీక్షణ ఎవరికోసమో!



పీకాక్ మూవీ బ్యానర్‌పై సాయి వర్మ దాట్ల దర్శకత్వంలో నిర్మాత పి.సంతోష్‌రెడ్డి నిర్మిస్తున్న చిత్రం 'నా నిరీక్షణ'. అమర్ దీప్, లిషి గణేష్ కల్లపు హీరో, హీరోయిన్లుగా నటిస్తున్నారు. ఈ చిత్రానికి సంబంధించిన పూజా కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. ప్రముఖ నిర్మాతలు దిల్ రాజు, సురేష్ బాబుతోపాటు రాజా రవీంద్ర వంటి వారు ముఖ్య అతిథులుగా విచ్చేశారు. డైరెక్టర్ సాయి వర్మ దాట్ల మాట్లాడుతూ.. 'సినిమా కథ గురించి ఇప్పుడే చెప్పలేను కానీ ఓ మంచి చిత్రాన్ని అయితే తీస్తున్నాను' అని తెలిపారు. అమర్ దీప్ మాట్లాడుతూ.. 'హీరోగా ఇది నా రెండో చిత్రం. బిగ్ బాస్ తరవాత సెలెక్ట్ చేసుకున్న ఫస్ట్ స్క్రిప్ట్ ఇది' అని అన్నారు. కాగా, ఈ సినిమాకు శేఖర్ చంద్ర సంగీత సారథ్యం వహిస్తున్నారు.

అలరించేలా సందేశం



కన్నడ నటి ప్రియాంక ఉపేంద్ర లీడ్ రోల్‌లో నటిస్తున్న చిత్రం 'ఉగ్రావతారం'. గురుమూర్తి దర్శకత్వంలో ఎస్.జీ.సతీశ్ నిర్మిస్తున్నారు. నవంబర్ 1న విడుదల కానుందీ సినిమా. మంగళవారం చిత్ర ట్రైలర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా దర్శకుడు గురుమూర్తి మాట్లాడుతూ "ఇదో సందేశాత్మక చిత్రం. అందరినీ ఆకట్టుకుంటుంది" అని చెప్పారు. "నా కెరీర్‌లో ఇదే తొలి యాక్షన్ ఫిల్మ్. ఈ సినిమా కోసం టీమ్ అందరూ చాలా కష్టపడ్డారు. సినిమా తప్పక విజయం సాధిస్తుంది" అని హీరోయిన్ ప్రియాంక ఉపేంద్ర అన్నారు.

అంచనాలకు మించి...



వి. సముద్ర, దర్శకుడిగా తన కుమారులు అరుణ్ మహాశివ, రామ్ త్రివిక్రమ్‌లను హీరోలుగా పరిచయం చేస్తున్న చిత్రం 'దో కమీనే'. చంద్రపులుగుజ్జు నిర్మిస్తున్నారు. సుమన్, తన్మయి, శ్రీరాధా కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ సినిమాను ఇటీవలే ప్రారంభించారు. ఈ సందర్భంగా దర్శకుడు సముద్ర మాట్లాడుతూ "ఈ సినిమా అందరి అంచనాలకు మించి ఉంటుంది. తప్పకుండా విజయం సాధిస్తుంది" అని చెప్పారు.

రీల్ లైఫ్ ప్రేమికులు.. రియల్ లైఫ్ దంపతులు..!













రీల్ లైఫ్‌లో ప్రేమికులుగా నటించారు. ప్రేక్షకులను మెప్పించారు. అంతేనా...అవే జంటలు రియల్ లైఫ్‌లోనూ ప్రేమలో పడ్డాయి. ఆ ప్రేమను వివాహ బంధంతో పెనవేశారు. ఆదర్శవంతమైన జీవితం గడిపారు. అన్యోన్య దంపతులుగా గుర్తింపు పొందారు. కృష్ణ- విజయ నిర్మల, రాజశేఖర్- జీవిత, నాగార్జున-అమల, శ్రీకాంత్-ఊహా, మహేశ్ బాబు- నమ్రత జంటలు ఈ కోవకే చెందుతాయి. వీరిని ఆదర్శంగా తీసుకున్నారు నేటి తరం టాలీవుడ్ హీరో- హీరోయిన్లు.

V 2014లో విడుదలైన 'ముకుంద' సినిమాతో తెలుగు తెరకు హీరోగా పరిచయమయ్యారు కొణిదెల సాయి వరుణ్ తేజ్. ఆ తరవాత కంచె, ఫిదా, లోఫర్, ఎఫ్3 వంటి విజయవంతమైన చిత్రాల్లో హీరోగా నటించారు. 2012లో అందాల రాక్షసి చిత్రంతో తెలుగు ఫిల్మ్ ఇండస్ట్రీలో అడుగుపెట్టారు లావణ్య త్రిపాఠి. 2017లో విడుదలైన మిస్టర్ సినిమాలో వరుణ్ తేజ్ - లావణ్య త్రిపాఠి తొలిసారిగా కలిసి నటించారు. ఆ తరవాత వచ్చిన 'అంతరిక్షం' లోనూ ఈ జంట ప్రేక్షకులను మెప్పించింది. ఈ క్రమంలోనే ఇద్దరి మధ్య మొదలైన స్నేహం ప్రేమగా మారింది. గతేడాది నవంబరులో వీరిద్దరు వివాహం చేసుకున్నారు.

V నాగ చైతన్య అక్కినేని, శోభిత ధూళిపాళ్ల త్వరలో పెళ్లి పీటలు ఎక్కబోతున్నారు. వీరిద్దరి నిశ్చితార్థం ఇటీవల జరిగింది. 2017లో సమంతను నాగ చైతన్య ప్రేమ వివాహం చేసుకున్నారు. 2021లో విడాకులు తీసుకున్నారు. ఆ తరవాత నాగ చైతన్య, శోభిత చాలా సార్లు కలిసి కనిపించారు. వీరిద్దరి మధ్య ప్రేమ నడుస్తోందనే వార్తలు వచ్చాయి. అయితే ఈ వార్తలపై ఎవరూ స్పందించకపోయినప్పటికీ నిశ్చితార్థంతో వాటికి ఫుల్‌స్టాప్ పెట్టారు. ప్రస్తుతం నాగ చైతన్య 'తండేల్' సినిమాతో బిజీగా ఉన్నారు. 'మంకీ మ్యాన్' హాలీవుడ్ సినిమాలో శోభిత ధూళిపాళ్ల నటించారు. ప్రస్తుతం 'సితార' అనే హిందీ చిత్రంలో నటిస్తున్నారు. వీరిద్దరి పెళ్లి ఎప్పుడనే విషయం తరవాత వెల్లడికానుంది.


V 'బాణం' సినిమాతో తెలుగు తెరకు పరిచయం అయ్యారు నారా రోహిత్, ఆ తరవాత అసుర, సుందరకాండ వంటి పలు విజయవంతమైన చిత్రాల్లో హీరోగా నటించారు. 'ప్రతినిధి 2'లో నారా రోహిత్ సరసన నటించారు సిరి లేళ్ల. ఈ సినిమా షూటింగ్ కొనసాగుతుండగానే వీరిద్దరి మధ్య ఏర్పడిన స్నేహం ప్రేమగా మారింది. దాంతో ఇటీవల బంధు, మిత్రుల సమక్షంలో వీరిద్దరి నిశ్చితార్థం జరిగింది. సిరి లేళ్ల తెలుగమ్మాయే. ఏపీలోని రెంటచింతల ఆమె స్వగ్రామం. ఆస్ట్రేలియాలో మాస్టర్స్ డిగ్రీ చేసిన ఆమె నటనపై మక్కువతో ఇండియాకు తిరిగి వచ్చారు. వీరి వివాహం డిసెంబరులో జరగనుంది.

V 'రాజా వారు రాణిగారు' సినిమాతో ఎంట్రీ ఇచ్చారు కిరణ్ అబ్బవరం, రహస్య గోరఖ్. తొలి చిత్రంతోనే అందమైన జంటగా గుర్తింపు తెచ్చుకున్నారు. నిజ జీవితంలోనూ ప్రేమికులుగా మారారు. అయితే ఐదేళ్ల ప్రేమ విషయాన్ని గోప్యంగా ఉంచారు. ఈ ఏడాది మార్చిలో జరిగిన తమ నిశ్చితార్థంతో ప్రేమ విషయాన్ని అధికారికంగా తెలియజేశారు. ఈ ఏడాది ఆగస్టు 22న కర్ణాటకలోని కూర్గ్‌లో వివాహం చేసుకున్నారు. కాగా, కిరణ్, రహస్య ఇద్దరూ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లే. సినిమాలపై మక్కువతో ఇండస్ట్రీలోకి అడుగుపెట్టారు. ప్రస్తుతం కిరణ్ నటిస్తున్న 'క' చిత్ర నిర్మాణ వ్యవహారాలను రహస్య పర్యవేక్షిస్తున్నారు.

V ప్రముఖ దర్శకుడు రవిరాజా పినిశెట్టి వారసుడిగా ఫిల్మ్ ఇండస్ట్రీలోకి అడుగు పెట్టారు ఆది పినిశెట్టి. వైవిధ్యమైన పాత్రలను ఎంపిక చేసుకుంటూ తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపును సాధించాడు. కేవలం హీరో పాత్రలకే పరిమితం కాకుండా సపోర్టింగ్ రోల్స్ కూడా చేస్తూ ప్రత్యేకతను చాటుతున్నారు. 2016లో 'కృష్ణాష్టమి' లో సునీల్ సరసన నటించడం ద్వారా తెలుగు తెరకు పరిచయమయ్యారు నిక్కీ గల్రానీ. ఆ తరవాత ఆది పినిశెట్టితో కలిసి 'మలుపు, మరకత మణి' చిత్రాల్లో నటించారు. 'మలుపు' సినిమా వీరిద్దరి జీవితాల్ని ప్రేమ వైపు మలుపు తిప్పింది. 2022 మే నెలలో వీరిద్దరి వివాహం జరిగింది.

V 2007లో విడుదలైన 'హ్యాపీడేస్'తో తెలుగు తెరపై అరంగేట్రం చేశారు వరుణ్ సందేశ్. ఆ చిత్ర విజయంతో వరుసగా అవకాశాలు చేజిక్కించుకుని నటునిగా స్థిరపడ్డాడు. 2025లో విడుదలైన 'పడ్డానండి ప్రేమలో మరి' సినిమాలో వరుణ్ సందేశ్ సరసన హీరోయిన్‌గా నటించారు వితిక షేరు. సినిమా షూటింగ్ సమయంలోనే ఇద్దరి మధ్య ప్రేమ మొదలైంది. 2016లో పెళ్లి చేసుకుని వైవాహిక జీవితంలోకి అడుగుపెట్టారు.

సిక్స్ ప్యాక్‌తో..



శారీరకంగా, డిక్షన్ పరంగా మరింత మెరుగ్గా కనిపించడానికి కృషి చేస్తున్నానని హీరో సాయిదుర్గా తేజ్ ఆ మధ్య వెల్లడించారు. ఆ విషయం నిజమేననిపించింది ఆయన తాజా చిత్రం మేకింగ్ వీడియో చూసిన తర్వాత. సాయిదుర్గా తేజ్ పుట్టిన రోజు సందర్భంగా ఈ వీడియో విడుదల చేశారు. 'ఎస్‌డీటీ 18' అనే వర్కింగ్ టైటిల్‌లో రూపొందుతున్న చిత్రమిది. 'ధైర్యాన్నే తన కవచంగా, ఆశనే ఆయుధంగా చేసుకున్న ఈ వ్యక్తి అందరికోసం నిలబడతాడు. ఇది కేవలం ప్రారంభం మాత్రమే' అనే క్యాప్షన్‌తో వీడియో ఉంది. ఇందులో సాయితేజ్ లుక్ చూపించలేదు కానీ సిక్స్ ప్యాక్‌తో కండలు తిరిగిన ఆ దేహాన్ని వెనుక నుంచి చూపించడం విశేషం. ఈ సందర్భంగా సాయి దుర్గా తేజ్‌కు మేకర్స్ పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. 'హనుమాన్' వంటి బ్లాక్‌బస్టర్ చిత్రాలను నిర్మించిన కె.నిరంజన్ రెడ్డి, చైతన్య రెడ్డి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. రోహిత్ కేపీ దర్శకుడిగా పరిచయం అవుతున్నారు.

అల్లు అర్జున్ అభినందించారు



'ఇప్పుడు ప్రేక్షకులు కంటెంట్ నచ్చితేనే థియేటర్‌కు వస్తున్నారు. మా సినిమా టీజర్, సాంగ్స్‌కు మంచి రెస్పాన్స్ వచ్చింది. ఏదో కొత్త కంటెంట్ ఉండబోతోందనే వైబ్ క్రియేట్ అయింది. మా సినిమా తొలి రోజు షూటింగ్‌కు అల్లు అర్జున్ వచ్చి పెద్ద హిట్ కావాలని ఆశీస్సులు అందించారు. ఈ నెల 31న చాలా సినిమాలు విడుదలవుతున్నాయి. పోటీ బాగా ఉంది. అయితే మా సినిమా కొన్న వంశీ నందిపాటికి, మాకు కంటెంట్ మీద నమ్మకం ఉంది. ఆ నమ్మకంతోనే సినిమాను ఆ రోజు విడుదల చేస్తున్నాం' అని చెప్పారు హీరో కిరణ్ అబ్బవరం. ఆయన నటించిన భారీ పీరియాడికల్ ఫిల్మ్ 'క' విడుదల సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో మాట్లాడారు. నాలుగు భాషల్లో విడుదలవున్న ఈ సినిమాతో సుజీత్, సందీప్ దర్శకులుగా పరిచయవవుతున్నారు. విలేజ్ బ్యాక్‌డ్రాప్‌లో రూపుదిద్దుకుంటున్న ఈ యాక్షన్ థ్రిల్లర్‌ను చింతా గోపాలకృష్ణారెడ్డి నిర్మిస్తున్నారు. సినిమాలో జాతర సాంగ్ అలరిస్తుందనీ, అలాగే 15 నిమిషాల సేపు ఉండే యాక్షన్ సీన్‌కు మంచి రెస్పాన్స్ వస్తుందనీ కిరణ్ చెప్పారు. '70 వ దశకం నేపథ్యంలో 'క' సినిమా సాగుతుంది. అభినవ్ వాసుదేవ్ అనే ఓ పోస్ట్‌మ్యాన్ జీవితంలో జరిగే కథ ఇది. స్క్రీన్‌ప్లే బేస్డ్ సినిమా ఇది' అని దర్శకులు చెప్పారు.

మరపురాని క్షణాలు...



నటి పూజ హెగ్డే ఇటీవలే తన 34వ పుట్టినరోజును శ్రీలంకలోని ఓ రిసార్ట్‌లో తన కుటుంబంతో సెలబ్రేట్ చేసుకున్నారు. ఈ ట్రిప్‌కు సంబంధించిన ఫొటోలను ఆమె సోషల్‌మీడియాలో అభిమానులతో షేర్ చేసుకున్నారు. "అందమైన ప్రకృతిలో జన్మదిన వేడుక.. శుభాకాంక్షలు తెలిపిన అందరికీ కృతజ్ఞతలు. ఈ అద్భుతమైన క్షణాల్ని పూర్తిగా ఆస్వాదిస్తున్నా" అని పేర్కొన్నారు. సినిమాల పరంగా.. తెలుగులో చివరగా 'ఆచార్య', 'రాధే శ్యామ్' సినిమాల్లో నటించారీ బ్యూటీ. ప్రస్తుతం తమిళ్‌లో కార్తీక సుబ్బరాజ్ దర్శకత్వంలో సూర్య కథానాయకుడిగా తెరకెక్కుతున్న గ్యాంగ్‌స్టర్ ఫిల్మ్ 'సూర్య 44'.. హెచ్.వినోద్ దర్శకత్వంలో విజయ్ ఆఖరి చిత్రం 'విజయ్ 69' సినిమాల్లో నటిస్తున్నారు. బాలీవుడ్‌లో షాహిద్ కపూర్ సరసన ఆమె నటించిన 'దేవా' చిత్రం వచ్చే ఏడాది ఫిబ్రవరి 14న విడుదల కానుంది.

కొత్తగా..

రాకీ వచ్చేది ఎప్పుడంటే..



విష్వక్సేన్ హీరోగా నటిస్తున్న యాక్షన్, కామెడీ ఎంటర్‌టైనర్ 'మెకానిక్ రాకీ' చిత్రం విడుదలకు సిద్ధమవుతోంది. రవితేజ ముళ్లపూడి దర్శకత్వంలో రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రాన్ని నవంబర్ 22న విడుదల చేయనున్నట్లు నిర్మాత రామ్ తాళ్లూరి చెప్పారు. ఈ నెల 20న ట్రైలర్ విడుదల చేస్తామని తెలిపారు. ఇందులో మీనాక్షి చౌదరి, శ్రద్ధా శ్రీనాథ్ హీరోయిన్లు.

1980 బ్యాక్ డ్రాప్‌లో...



సన్ రైజ్ ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై నిర్మాత స్వాతి సుధీర్ నిర్మిస్తున్న సినిమా రామ్ భజరంగ్. రాజ్ తరుణ్, సందీప్ మాధవ్ హీరోలుగా నటిస్తున్న ఈ చిత్రానికి సి.హెచ్. సుధీర్ దర్శకత్వం వహిస్తున్నారు. మణిశర్మ సంగీతం అందించారు. 'గదర్ 2' హీరోయిన్ సిమ్రత్ కౌర్, బిచ్చగాడు ఫేమ్ సత్నా టీటస్, ఛాయాదేవి, మనసా రాధాకృష్ణన్ హీరోయిన్స్‌గా నటిస్తున్నారు. 1980 బ్యాక్ డ్రాప్‌లో రాబోతున్న ఈ సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్‌ని చిత్ర యూనిట్ విడుదల చేసింది. యాక్షన్‌తోపాటు ఫ్యామిలీ ఎలిమెంట్స్ ఉండే ఈ సినిమాను వచ్చే ఏడాది ఐదు భాషల్లో విడుదల చేయనున్నట్లు మేకర్స్ తెలిపారు.

ఖేల్ ఖతమ్ దర్వాజా బంద్



'డియర్ మేఘ', 'భాగ్ సాలే' వంటి భిన్నమైన చిత్రాలతో ప్రేక్షకుల్ని ఆకట్టుకున్న సంస్థ వేదాన్ష్ క్రియేటివ్ వర్క్స్. అర్జున్ దాస్యన్ నిర్మాతగా వ్యవహరిస్తున్న ఈ సంస్థ ప్రస్తుతం 'ఖేల్ ఖతమ్ దర్వాజా బంద్' చిత్రాన్ని నిర్మిస్తోంది. నూతన దర్శకుడు అశోక్ రెడ్డి కడదూరి రూపొందిస్తున్న ఈ చిత్రంలో రాహుల్ విజయ్, నేహా పాండే హీరో హీరోయిన్లుగా నటిస్తున్నారు. సినిమా ఫస్ట్ లుక్, టైటిల్‌ను వర్సటైల్ యాక్టర్ రానా దగ్గుబాటి లాంచ్ చేసి శుభాకాంక్షలు తెలిపారు.

యాక్షన్ ప్రేమ కథ 'కాక్రోచ్'



పి. సునీల్ కుమార్ రెడ్డి దర్శకత్వంలో శ్రీ లక్ష్మీ పిక్చర్స్, ఆదిత్య సినిమాస్ సంయుక్త బ్యానర్‌పై బి. బాపిరాజు, ముత్తుకి నాగ సత్యనారాయణ నిర్మిస్తున్న చిత్రం 'కాక్రోచ్'. ఈ చిత్రం టైటిల్‌ని యూనిట్ ప్రకటించింది. 'విశాఖపట్నం నేపథ్యంలో సాగే ఈ యాక్షన్ ప్రేమ కథ, పాత కొత్త నటీనటుల మేళవింపుతో విభిన్న కథాంశంతో సాగుతుంది. చిత్రం పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి. త్వరలో ప్రేక్షకుల ముందుకు తేవడానికి ప్రయత్నిస్తున్నాం' అని చిత్ర బృందం తెలిపింది.

కృష్ణ భక్తుని కథ



పీఎన్‌బీ సినిమాస్ బ్యానర్‌పై తెరకెక్కుతున్న యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్ డియర్ కృష్ణ. దినేశ్ బాబు దర్శకత్వంలో పీఎన్ బలరామ్ నిర్మిస్తున్నారు. అక్షయ్ హీరోగా మమిత బైజు, ఐశ్వర్య హీరోయిన్లు. నిర్మాత పీఎన్ బలరామ్ మాట్లాడుతూ... 'నిజ జీవిత ఘటనల ఆధారంగా కథను రూపొందించాం. శ్రీ కృష్ణుణ్ణి నమ్మే ఒక భక్తుడి కథ ఇది. నేటి తరం అభిరుచికి తగ్గట్టుగానే ఈ కథను తెరకెక్కించాం' అని తెలిపారు.

పతంగుల పోటీ



పతంగుల పోటీ కథతో రూపుదిద్దుకున్న స్పోర్ట్స్ డ్రామా 'పతంగ్'. డిసెంబర్ 27న విడుదల కానుంది. ఇన్‌స్టాగ్రామ్ సెన్సేషన్ ప్రీతి పగడాల, జీ సరిగమ రన్నరప్ ప్రణవ్ కౌశిక్, వంశీ పూజిత్ ముఖ్య పాత్రలు పోషించారు. అలాగే ఎస్పీ చరణ్ ఓ కీలక పాత్ర పోషించారు. ఈ చిత్రాన్ని ప్రణీత్ ప్రత్తిపాటి దర్శకత్వంలో విజయశేఖర్ అన్నే, సంపత్ మక, సురేశ్ కొత్తింటి నిర్మించారు. నాని బండ్రెడ్డి క్రియేటివ్ నిర్మాత. యూత్ ఫెస్టివల్‌లా ఈ సినిమా ఉంటుందనీ, చిత్రానికి కథే హీరో అని నిర్మాతలు చెప్పారు.

పవర్‌ఫుల్ పోలీస్



తమిళ, కన్నడ భాషల్లో విడుదలై ఘన విజయం సాధించిన చిత్రం 'ఝాన్సీ ఐపీఎస్'. గురుప్రసాద్ దర్శకుడు. లక్ష్మీ రాయ్ ప్రధాన పాత్రలో నటించిన ఈ చిత్రం తెలుగు రైట్స్‌ని ఆర్కే ఫిల్మ్స్ దక్కించుకుంది. ఈ సందర్భంగా ఆర్కే ఫిల్మ్స్ అధినేత, తెలంగాణ ఫిల్మ్ ఛాంబర్ అధ్యక్షుడు ప్రతాని రామకృష్ణ గౌడ్ మాట్లాడుతూ..' లక్ష్మీ రాయ్ పవర్‌ఫుల్ ఐపీఎస్ క్యారెక్టర్ పాత్రలో నటించారు. ఫైట్ మాస్టర్ థ్రిల్లర్ మంజు కంపోజ్ చేసిన ఎనిమిది ఫైట్స్ ఆమె కెరీర్‌లో నిలిచిపోతాయి. త్వరలో ట్రైలర్‌ను, నవంబరులో విడుదల చేయడానికి ప్లాన్ చేస్తున్నాం' అన్నారు.

మంగళవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 29.9 కనిష్ఠం 23.4

విద్యుత్ సమస్యల పరిష్కారానికి స్పెషలాఫీసర్లు

హైదరాబాద్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): దక్షిణ డిస్కమ్ (ఎస్పీడీసీఎల్ - హైదరాబాద్) పరిధిలోని విద్యుత్ వినియోగదారుల సమస్యల తక్షణ పరిష్కారం కోసం ప్రత్యేక అధికారులను నియమిస్తూ ఆ సంస్థ సీఎండీ ముషారఫ్ అలీ మంగళవారం ఉత్తర్వులు ఇచ్చారు. 15 జిల్లాల పరిధిలోని 66 అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో వినియోగదారుల సమస్యలను సత్వరం పరిష్కరించడం, శాసనసభ్యులతో సమన్వయం చేసుకోవడం ప్రత్యేక అధికారుల విధులని స్పష్టం చేశారు.

కొత్త గురువులొచ్చారు

- ఆనందోత్సవాల్లో నూతన టీచర్లు
- ఆశల ఉద్యోగాన్ని సాధించామని సంబురాలు
- కేటాయించిన స్కూళ్లలో నేడు చేరిక
- పాఠశాలల్లో తీరనున్న ఉపాధ్యాయుల కొరత

జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో బుధవారం నుంచి నవశకం మొదలుకానుంది. సమాజంలో అత్యంత ప్రాధాన్యం కలిగిన ఉపాధ్యాయ వృత్తిని సాధించాలనే పట్టుదలతో అహోరాత్రులు శ్రమించిన యువతరం నేడు కొత్త బంగారులోకంలో కొలువుదీర నుంది. నిన్నటివరకు విద్యార్థులుగా కొనసాగిన కొందరు, ఇప్పటికే ప్రైవేట్ విద్యాసంస్థల్లో టీచర్లుగా పనిచేస్తున్న మరికొందరు.. ఉపాధ్యాయులుగా విద్యార్థులను తీర్చిదిద్దనున్నారు.


డీఎస్సీ కౌన్సెలింగ్ సెంటర్‌కు విచ్చేసిన అభ్యర్థులు

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): స్కూల్ అలాట్‌మెంట్ ఆర్డర్లు అందుకున్న కొత్త ఉపాధ్యాయులు సంబురాలు చేసుకుంటున్నారు. ఇటీవల నిర్వహించిన మెగా డీఎస్సీ నేపథ్యంలో మెరిట్ లిస్టులో చోటు దక్కించుకున్న అభ్యర్థులకు మంగళవారం ఆబిడ్స్‌లోని స్టాన్లీ బాలికల ఉన్నత పాఠశాలలో కౌన్సెలింగ్ నిర్వహించి స్కూళ్లను కేటాయించారు. డీఎస్సీని పురస్కరించుకుని జిల్లాలోని మొత్తం 878 ఖాళీలకు 27,360 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరుకాగా, 1:3 ప్రాతిపదికన 2,634 మందిని ఎంపిక చేశారు. సర్టిఫికెట్ల పరిశీలన అనంతరం 584 మందికి ఈనెల 9న అపాయింట్‌మెంట్ లెటర్లు జారీ చేశారు. కోర్టు కేసులు, సర్టిఫికెట్లపై సందేహాలుండడంతో మిగతా 262 అభ్యర్థులను పెండింగ్‌లో పెట్టారు. అయితే 1:1లో ఎంపికైన అభ్యర్థులకు మెరిట్, రోస్టర్ పాయింట్ల ప్రాతిపదికన పాఠశాలలను కేటాయించారు.

సంబురాలు.. కేరింతలు

తెలంగాణలో 2017 నుంచి మొన్నటివరకు ఒక్క డీఎస్సీని కూడా నిర్వహించని పరిస్థితి నెలకొంది. నిరుద్యోగ యువతీ, యువకులు తీవ్ర నిరాశకు లోనవుతూ వచ్చారు. టీచర్ ఉద్యోగాన్ని సాధించాలంటూ ఏళ్ల తరబడి ఎదురు చూసినా కల నెరవేరలేదు. అయితే పాఠశాలల్లో ఏటా పదుల సంఖ్యలో ఖాళీలు ఏర్పడుతున్నప్పటికీ వాటిని భర్తీ చేయడంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరించిందనే ఆరోపణలున్నాయి. ఈ క్రమంలో కొందరు ప్రైవేట్ విద్యాసంస్థల్లో పనిచేస్తుండగా, మరికొందరు ఉపాధ్యాయ ఉద్యోగంపై ఆశలు వదులుకుని ఇతర రంగాల్లో స్థిరపడ్డారు. ఈ నేపథ్యంలో గతేడాది జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలో భాగంగా కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో కొన్ని నెలల క్రితం 11,062 పోస్టులతో మెగా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఇదే సమయంలో ఈ ఏడాది జూలై 18 నుంచి ఆగస్టు 5 వరకు పరీక్షలు నిర్వహించడంతో

మిగతా 8వ పేజీలో..



తండ్రిబాటలో తనయలు..

సికింద్రాబాద్ మోండా మార్కెట్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తెలుగు స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న హన్మంతు ఇద్దరు కూతుళ్లు కూడా ఇటీవల నిర్వహించిన డీఎస్సీలో ఉద్యోగాలు సాధించారు. హన్మంతు పెద్ద కూతురు శ్రావణి ఎస్జీటీ ఇంగ్లిష్ మీడియంలో 1127వ ర్యాంకు సాధించగా, చిన్న కూతురు సంగీత తెలుగు మీడియంలో సోషల్ స్కూల్ అసిస్టెంట్‌గా జాబ్ సంపాదించింది. కాగా, ఇద్దరు మొదటి డీఎస్సీలోనే ఉద్యోగం సాధించడంతో తండ్రి సంబరపడిపోయారు. పరీక్షల సమయంలో రోజుకు 14 గంటలు కష్టపడి చదివారని హన్మంతు తెలిపారు.

ప్రశాంతంగా డీఎస్సీ కౌన్సెలింగ్

- రాత్రి 10 వరకు సాగిన ప్రక్రియ

జిల్లాలో డీఎస్సీ కౌన్సిలింగ్ ప్రక్రియ మంగళవారం ప్రశాంతంగా జరిగింది. 1:1 మెరిట్‌లో నిలిచిన అభ్యర్థులకు స్థానికత, రోస్టర్ పాయింట్ల ఆధారంగా పాఠశాలలను కేటాయించారు. కాగా, మధ్యాహ్నం 2 గంటలకు ప్రారంభమైన కౌన్సిలింగ్ రాత్రి 10 గంటల వరకు సాగింది. ఆబిడ్స్‌లోని స్టాన్లీ బాలికల ఉన్నత పాఠశాలలో మంగళవారం కౌన్సిలింగ్ ఏర్పాటు చేశారు. అయితే ఉదయం 9 గంటలకు కౌన్సిలింగ్ ప్రక్రియ ప్రారంభమవుతోందని డీఈఓ రోహిణి సోమవారం ప్రకటించారు. దీంతో మెరిట్ అభ్యర్థులు ఉదయం 8 గంటల వరకు పాఠశాల వద్దకు చేరుకున్నారు. కాగా, ఉదయం 9.40 గంటలకు కౌన్సిలింగ్ ప్రక్రియను తాత్కాలికంగా వాయిదా వేస్తున్నట్లు విద్యాశాఖ ఉన్నతాధికారులు ప్రకటించడంతో అభ్యర్థులు తీవ్ర నిరుత్సాహానికి లోనయ్యారు. ఈ క్రమంలో చాలామంది ఇంటికి వెళ్లారు. అయితే మధ్యాహ్నం 2 గంటల నుంచి కౌన్సెలింగ్ ఉంటుందని విద్యాశాఖాధికారుల నుంచి సమాచారం అందడంతో స్టాన్లీ స్కూల్‌కు మళ్లీ అందరూ పరుగు పరుగున వచ్చారు. ఈ మేరకు ఎస్జీటీ, స్కూల్ అసిస్టెంట్, లాంగ్వేజ్ పండిట్లు, ఫిజికల్ డైరెక్టర్ (పీడీ)ల వారీగా కౌన్సెలింగ్‌కు పిలిచారు. తొలుత అభ్యర్థులకు స్కూల్ అలాట్‌మెంట్ కోసం అవకాశం ఇచ్చారు. వారి మెరిట్ ఆధారంగా అధికారులు పాఠశాలలను కేటాయించారు.

ఉపాధ్యాయ సంఘాల సహకారం

కౌన్సిలింగ్‌కు హాజరైన అభ్యర్థులకు టీపీటీఎఫ్, ఎస్టీయూ, యూటీఎఫ్, డీటీఎఫ్ ఉపాధ్యాయ సంఘాల నాయకులు తమవంతు సహకారం అందించారు. మెరిట్ ప్రాతిపదికన తమకు ఏ మండలం వస్తుంది, ఏ స్కూల్ ఆప్షన్ పెడితే వస్తుంది.. అనే వివరాలను అడిగిన వారికి వివరంగా తెలియజేశారు. మరో వైపు కొందరు నూతన టీచర్లకు సెల్‌ఫోన్ నంబర్లను తీసుకుని వాట్సప్ గ్రూపులను కూడా క్రియేట్ చేశారు.


నియామక పత్రం అందుకుంటున్న యువతి

కిం కర్తవ్యం..?

- నేడు ఏపీకి ఆమ్రపాలి?
- అక్కడ రిపోర్ట్ చేసే అవకాశం
- ఇన్‌చార్జ్ కమిషనర్‌గా సర్ఫరాజ్?
- ఇరు రాష్ట్రాల ప్రభుత్వాలు అంగీకరిస్తే తిరిగి వచ్చే అవకాశం
- లేని పక్షంలో బల్దియాకు కొత్త బాస్
- ఏపీ కేడర్‌గా ఉన్నా.. గతంలో తెలంగాణలోనే సోమేష్




ఆమ్రపాలి


సర్ఫరాజ్

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): డిపార్ట్‌మెంట్ ఆఫ్ పర్సనల్ ట్రైనింగ్ (డీఓపీటీ) ఉత్తర్వులపై స్టే ఇవ్వడానికి సెంట్రల్ అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్ (సీఏటీ) నిరాకరించిన నేపథ్యంలో జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి ఏపీకి వెళ్లాల్సిన అనివార్యత ఏర్పడింది. న్యాయస్థానాన్ని ఆశ్రయించాలని ఐఏఎస్ అధికారులు భావిస్తున్నా, డీఓపీటీ విధించిన గడువు నేటితో ముగియనున్న దృష్ట్యా.. ఏపిలో రిపోర్ట్ చేయాల్సి ఉంటుందని సీనియర్ ఐఏఎస్ అధికారొకరు తెలిపారు. కేటాయించిన రాష్ట్రాలకు వెళ్లండి.. తుది విచారణ తరువాత చేపడతామని క్యాట్ స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. ఈ నేపథ్యంలో ఆమ్రపాలి స్థానంలో ప్రస్తుతానికి ఇన్‌చార్జ్ కమిషనర్‌గా హెచ్ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్‌కు తెలంగాణ ప్రభుత్వం బాధ్యతలు అప్పగించే అవకాశమున్నట్టు సమాచారం. ఆమ్రపాలి ఏపీలో రిపోర్ట్ చేయడానికి ముందే తెలంగాణ నుంచి రిలీవ్ కావాల్సి ఉంటుంది. ఈ క్రమంలో బల్దియా బాస్‌ను నియమించక తప్పని పరిస్థితి. రాష్ట్ర విభజన సమయంలో ఆమ్రపాలిని ఏపీ కేడర్ అధికారిగా గుర్తించారు. వ్యక్తిగత వివరాల్లో విశాఖపట్టణం శాశ్వత చిరునామాగా పేర్కొన్న నేపథ్యంలో ఆమెను ఆంధ్రప్రదేశ్ కేడర్‌గా గుర్తించారు. అయినా ఆమె తెలంగాణలో పని చేస్తున్నారు. చిన్న వయసులోనే కీలకమైన జీహెచ్ఎంసీ కమిషనర్‌గానూ ప్రభుత్వం బాధ్యతలు అప్పగించింది. జూన్ 26వ తేదీన ఆమె బల్దియా కమిషనర్‌గా పూర్తి అదనపు బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆగస్టు 20న ఆమెను రెగ్యులర్ కమిషనర్‌గా ప్రభుత్వం నియమించింది. దాదాపు 110 రోజులు తనదైన శైలిలో ఆమె పని చేశారు. ఇంతలోనే డీఓపీటీ ఉత్తర్వులు వెలువడ్డాయి.

ఇరు రాష్ట్రాల ప్రభుత్వాలు అంగీకరిస్తే..

డీఓపీటీ ఉత్తర్వులతో ఏపీలో ఆమ్రపాలి రిపోర్ట్ చేసినా.. తిరిగి తెలంగాణకు వచ్చే అవకాశం లేకపోలేదని ఉన్నతాధికారులు చెబుతున్నారు. ఇరు రాష్ట్రాల ప్రభుత్వాలు పరస్పర అంగీకారంతో అధికారులను యథాతథంగా కొనసాగించవచ్చని ప్రచారం జరుగుతోంది. ఆమ్రపాలి ఏపీలో రిపోర్ట్ చేసిన అనంతరం.. అక్కడి సర్కారు అంగీకరిస్తే తిరిగి తెలంగాణలో విధులు నిర్వర్తించే అవకాశముంది. ఈ విషయంలో రెండు ప్రభుత్వాలు సంప్రదింపులు జరిపి నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది. ఏడుగురు ఐఏఎస్‌ల కేడర్‌పై ప్రస్తుతం వివాదం కొనసాగుతోంది. ఏపీ కేడర్‌కు చెందిన నలుగురు ఐఏఎస్‌లు తెలంగాణలో, తెలంగాణ కేడర్‌కు చెందిన ముగ్గురు ఏపీలో పని చేస్తున్నారు. ఈ నేపథ్యంలో తెలంగాణ, ఏపీ ప్రభుత్వాలు ఏ నిర్ణయం తీసుకుంటాయన్నది ఆసక్తికరంగా మారింది. కేటాయించిన రాష్ట్రంలోనే ఐఏఎస్‌లు పని చేయాలని ప్రభుత్వాలు భావించిన నేపథ్యంలో ఆమ్రపాలి ఏపీలోనే కొనసాగాల్సి

మిగతా 10వ పేజీలో..


తెరుచుకున్న గండిపేట గేట్లు

జంట జలాశయాల గేట్లు ఖుల్లా

నార్సింగ్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): జంట జలాశయాలకు ఇన్‌ఫ్లో పెరగడంతో హిమాయత్‌సాగర్‌కు ఒక గేటు, గండిపేటకు రెండు గేట్లు అడుగు మేర పైకెత్తి నీటిని దిగువకు విడుదల చేశారు. గండిపేట జలాశయానికి ఇన్‌ఫ్లో 350 క్యూసెక్కులు ఉండగా, ఔట్‌ఫ్లో 242 క్యూసెక్కులు. హిమాయత్‌సాగర్ ఇన్‌ఫ్లో 350 క్యూసెక్కులు ఉండగా, ఔట్‌ఫ్లో 348 క్యూసెక్కులు. రెండు జలాశయాల నుంచి మూసీకి నీటిని మంగళవారం ఉదయం విడుదల చేశారు. దీంతో లోతట్టు ప్రాంతాల ప్రజలను అధికారులు అప్రమత్తం చేశారు.


పొల్యూషన్ లేని
ఫ్యాషన్ 10


వ్యర్థాల తొలగింపునకు నేటి నుంచి
స్పెషల్ డ్రైవ్ 8

వావ్.. సిక్కు యువకుడి సవారీ



పంజాబ్ నుంచి సిక్కుల 16వ వర్తమాన అధిపతి జర్నల్ జాతేదార్ బాబా జోగా సింగ్ జీ రాజేంద్రనగర్ సర్కిల్ సిక్‌చావునీలోని సిక్కుల గురుద్వారాను మంగళవారం సందర్శించారు. ఆయన వెంట వచ్చిన సిక్కు యువకులు గుర్రపు స్వారీ విన్యాసాలు చేస్తూ ఆకట్టుకున్నారు.
- రాజేంద్రనగర్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి)



ఆ ఇద్దరు మినహా..

19 మంది సబ్ రిజిస్ట్రార్లకు స్థానచలనం

రిజిస్ట్రేషన్ల శాఖలో భారీగా ప్రక్షాళన

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఇటీవల జరిగిన సబ్ రిజిస్ట్రార్ల బదిలీల్లో అక్రమాలు చోటు చేసుకున్నాయని భావించిన ప్రభుత్వం మరోమారు భారీ ప్రక్షాళన చేపట్టింది. మొత్తం 19 మంది సబ్ రిజిస్ట్రార్లకు స్థాన చలనం కల్పించగా, ఇందులో 12మందికి బదిలీలు, మరో ఏడుగురికి ఆన్‌డ్యూటీపై పోస్టింగులు ఇస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీచేసింది. తాజా ఉత్తర్వుల మేరకు 8ఏ కేటగిరీ, 7బీ, 4సీ కేటగిరీ స్థానాల్లో కొత్త సబ్ రిజిస్ట్రార్లు రానున్నారు. అయితే, మొత్తం ప్రక్షాళనలో కేవలం రెండు ఎస్సార్వో(సబ్ రిజిస్ట్రార్ ఆఫీసు)ల్లో సబ్ రిజిస్ట్రార్ల నియామకంపై

మిగతా 10వ పేజీలో..



ఈ క్రీడలకే..
- క్రికెట్ ● షటిల్
- బ్యాడ్మింటన్ ● టెన్నిస్
- క్యారమ్ ● స్కేటింగ్
- చెస్ ● బాస్కెట్ బాల్
- వాలీబాల్ ● ఫుట్‌బాల్
- టెన్నికాయిట్
- టేబుల్ టెన్నిస్

డివిజన్‌కు రూ.2 లక్షల క్రీడా సామగ్రి

- రూ.3 కోట్లతో ప్రతిపాదనలు ● రేపు స్టాండింగ్ కమిటీలో చర్చ

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): మహానగరంలో క్రీడా సదుపాయాల మెరుగుదలపై జీహెచ్ఎంసీ దృష్టి సారించింది. ఆసక్తి ఉన్న వారి కోసం అవసరమైన క్రీడా సామగ్రిని ప్లే గ్రౌండ్‌లు, ఇండోర్ స్టేడియంలలో అందుబాటులో ఉంచాలని నిర్ణయించింది. కార్పొరేటర్ల విజ్ఞప్తి మేరకు డివిజన్‌కు రూ.2 లక్షల విలువైన క్రీడా సామగ్రిని మంజూరు చేయనున్నారు. ఇందుకు సంబంధించిన ప్రతిపాదనలపై రేపు జరగనున్న స్టాండింగ్ కమిటీలో చర్చించనున్నారు. ఒక్కో డివిజన్‌కు రూ.2 లక్షల చొప్పున 150 డివిజన్లలో రూ.3 కోట్ల విలువైన క్రీడా సామగ్రిని జీహెచ్ఎంసీ అందుబాటులో ఉంచనుంది. స్థానిక కార్పొరేటర్లు 11 క్రీడలకు సంబంధించిన సామగ్రిని యువజన సంఘాలు, కాలనీ అసోసియేషన్లు, క్రీడలపై ఆసక్తి ఉన్న వారికి అందజేయనున్నారు. గతంలోనూ డివిజన్‌కు రూ.2 లక్షల విలువైన క్రీడా సామగ్రిని కార్పొరేటర్ల ద్వారా జీహెచ్ఎంసీ ఔత్సాహికులకు అందజేసింది.

గతంలో అవకతవకలు

వాస్తవంగా జీహెచ్ఎంసీలో తెలంగాణ ఏర్పాటుకు ముందు ఏటా కార్పొరేటర్ల ద్వారా క్రీడా సామగ్రి పంపిణీ జరిగేది. ఈ ప్రక్రియలో అవకతవకలు జరిగినట్టు గతంలో గుర్తించారు. అధికారులు, కొందరు కార్పొరేటర్లు క్రీడా సామగ్రిని పూర్తిస్థాయిలో పంపిణీ చేయకుండా చేసినట్టు చూపారని తేల్చారు. మెటీరియల్ సరఫరా చేయకుండానే పలు సంస్థలకు బిల్లుల చెల్లింపులు జరిగాయని గుర్తించారు. దీంతో క్రీడా సామగ్రి పంపిణీని నిలిపివేసి.. జీహెచ్ఎంసీకి చెందిన ప్లే గ్రౌండ్‌లు, ఇండోర్ స్టేడియంలలో అందుబాటులో ఉంచడం ప్రారంభించారు. గత సర్కారు హయాంలోనే కార్పొరేటర్ల విజ్ఞప్తి మేరకు స్పోర్ట్స్ మెటీరియల్ పంపిణీ జరిగింది. మరోసారి కార్పొరేటర్ల ద్వారా క్రీడా సామగ్రిని అందజేసేందుకు రంగం సిద్ధం చేస్తున్నారు.

మట్టే బంగారమాయె..

ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో నిలిచిన తవ్వకాలు

- మట్టి కోసం పక్క జిల్లాలకు ● స్థానికంగా రెట్టింపైన ధరలు

ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో రెండు నెలలుగా మట్టి తవ్వకాలు నిలిచిపోయాయి. అక్రమ తవ్వకాలపై ఫిర్యాదుల పేరుతో పూర్తిగా మట్టి సరఫరా ఆపేశారు. దీంతో ఇళ్ల నిర్మాణం, ఇతర అవసరాలకు మట్టి కోసం స్థానికులు పక్క నియోజకవర్గాలు, జిల్లాలపై ఆధారపడుతున్నారు. ఫలితంగా మట్టికి విపరీతమైన డిమాండ్ ఏర్పడింది.

హయత్‌నగర్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): అబ్దుల్లాపూర్‌మెట్, యాచారం, మంచాల్, ఇబ్రహీంపట్నం మండలాలలో ప్రభుత్వ, ప్రైవేటు భూముల్లో అక్రమంగా మట్టి తవ్వకాలను నిలిపివేయాలని రంగారెడ్డి జిల్లా మైన్స్ అండ్ జియాలజీ డిపార్టుమెంట్ అసిస్టెంట్ డిప్యూటీ డైరెక్టర్ ఎం. నర్సిరెడ్డి రెండు నెలల క్రితం ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో మట్టికి విపరీతమైన డిమాండ్ ఏర్పడింది. తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధి కోహెడ గ్రామంలో మట్టి తవ్వకాలు జోరుగా సాగుతున్నాయంటూ పలువురు ఆగస్టులో జిల్లా మైనింగ్ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో అక్రమ మైనింగ్ ఆపాలని సెప్టెంబర్ 9వ తేదీన అసిస్టెంట్ డిప్యూటీ డైరెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో ఎక్కడ అక్రమంగా మట్టి తవ్వకాలు జరిగినా చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, మట్టి తరలిస్తున్న వాహనాలను సీజ్ చేయాలని అబ్దుల్లాపూర్‌మెట్, ఇబ్రహీంపట్నం, మంచాల, యాచారం మండలాల తహసీల్దార్లను ఆదేశించారు.


కోహెడ గుట్టల నుంచి మట్టిని తరలిస్తున్న లారీలు (ఫైల్)

ఇబ్బందుల్లో లారీ యజమానులు

మట్టి అక్రమ మైనింగ్ నిలిపివేయడంతో లారీల యజమానులు, భవన నిర్మాణ దారులు, కార్మికులు ఇబ్బంది పడుతున్నారు. శివారు ప్రాంతాలలో అనేక మంది యువకులు లారీలను కొనుగోలు చేసి మట్టి, కంకరను నగరానికి తరలిస్తుంటారు. నెల రోజుల నుంచి మట్టి తరలింపు లేకపోవడంతో లారీల కిస్తులు కట్టలేక ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బండరావిరాల, మునగనూర్, బ్రాహ్మణపల్లి, తొర్రూర్, కొహెడ, తారామతిపేట్ ప్రాంతాలలోని సుమారు రెండు వేల మంది లారీలపైనే ఆధారపడి జీవిస్తున్నారు. ప్రభుత్వం ఉపాధి చూపించాలని లారీల యజమానులు కోరుతున్నారు.

యాదాద్రి భువనగిరి నుంచి..

ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో మట్టి తవ్వకాలు నిలిపి వేయడంతో లారీల యజమానులు ఇతర ప్రాంతాల నుంచి మట్టిని నగరానికి తరలిస్తున్నారు. అయితే దాదాపు రెట్టింపు ధర తీసుకుంటున్నారు. ప్రధానంగా మహేశ్వరం నియోజకవర్గం, యాదాద్రి భువనగిరి జిల్లా పోచంపల్లి, తూప్రాన్‌పేట్, సరళ మైసమ్మ, రాచకొండ గుట్టలు, మల్కాపురం, మునుగోడు, దేవరకొండ ప్రాంతాల నుంచి

మిగతా 8వ పేజీలో..

ప్రభుత్వ భూములను క్షేత్రస్థాయిలో పరిశీలించాలి

● అదనపు కలెక్టర్ వెంకటాచారి

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రభుత్వ భూములను క్షేత్రస్థాయిలో పరిశీలించి ఈనెల 31లోగా నివేదిక సమర్పించాలని అదనపు కలెక్టర్ వెంకటాచారి సర్వేయర్లను ఆదేశించారు. మంగళవారం ఆయన జిల్లా సర్వే, ల్యాండ్ రికార్డ్స్ కార్యాలయంలో సర్వేయర్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సర్వే పనులు పెండింగ్‌లో ఉండొద్దని, దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిశీలించి సర్వే విధులు నిర్వహించాలని సూచించారు. ఆయా స్థలాల్లో కొలతలు చేసి, సవివరంగా మ్యాపులను తయారు చేయాలన్నారు. సమావేశంలో సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ అసిస్టెంట్ డైరెక్టర్ వి. శ్రీరామ్, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్లు రాజేశం, బుచ్చయ్య మహేందర్‌రెడ్డి, సర్వేయర్లు పాల్గొన్నారు.

వ్యర్థాల తొలగింపునకు నేటి నుంచి స్పెషల్ డ్రైవ్

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్‌లో పేరుకుపోయిన చెత్త తొలగింపునకు జీహెచ్ఎంసీ ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తోంది. బుధవారం మొదలయ్యే డ్రైవ్ వచ్చే నెల 8వ తేదీ వరకు కొనసాగనుంది. నగరంలోని రహదారులు, డ్రెయిన్లు, పార్కులు, వాటర్ బోర్డు, విద్యుత్ శాఖల పనుల కారణంగా పేరుకుపోయిన చెత్త, నిర్మాణ రంగ వ్యర్థాలను తొలగించనున్నారు. ఇందుకోసం అవసరమైన వాహనాలు, సిబ్బందిని అదనంగా సమకూర్చినట్టు అధికారులు తెలిపారు.

వాటర్‌బోర్డులో సమ్మెలు నిషేధం

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): వాటర్‌బోర్డులో ఉద్యోగులు, కార్మికులు సమ్మెలు చేయడంపై నిషేధం విధిస్తూ మున్సిపల్ శాఖ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో ఆరు నెలల పాటు సమ్మెలపై నిషేధం విధిస్తూ ఉత్తర్వులివ్వగా.. ఆ గడువు ఈ నెల 20తో ముగియనుంది. ఈ నేపథ్యంలో మరో ఆరు నెలల పాటు ఉద్యోగులు, కార్మికులు సమ్మె చేయడాన్ని నిషేధిస్తూ ఆదేశాలిచ్చారు.

కాంట్రాక్ట్ వైద్యులకు ఇంటర్వ్యూలు 19న

గచ్చిబౌలి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లాలోని డిస్ట్రిక్ట్ హాస్పిటల్స్‌లో కాంట్రాక్ట్ పద్ధతిలో వైద్య సేవలు అందించడానికి అర్హులైన వైద్యులకు ఈనెల 19న కొండాపూర్‌లోని ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నామని జిల్లా కో-ఆర్డినేటర్ హాస్పిటల్స్ సర్వీసెస్ సూపరింటెండెంట్ చంద్రశేఖర్ తెలిపారు. ఇంటర్వ్యూకు ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలన్నారు.

సుస్థిర ప్రపంచ నిర్మాణంలో

భారతీయ ప్రమాణాలది కీలకపాత్ర

● ప్రపంచ ప్రమాణాల దినోత్సవ వేడుకల్లో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ



మాట్లాడుతున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): సుస్థిర ప్రపంచాన్ని నిర్మించడంలో భారతీయ ప్రమాణాలు కీలకపాత్ర పోషిస్తున్నాయని రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ అన్నారు. సోమాజిగూడలో ఓ హోటల్‌లో మంగళవారం బీఐఎస్ ఆధ్వర్యంలో జరిగిన ప్రపంచ ప్రమాణాల దినోత్సవ వేడుకల్లో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భారతీయ ప్రమాణాల ప్రభావం ప్రతీఒక్కరి జీవితాలపై ఉందని, మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా అలవాట్లనూ మార్చుకోవాల్సిన అవసరముందన్నారు. ప్రతీ ఒక్కరూ వ్యక్తిగత బాధ్యతగా ప్రపంచ ప్రమాణాల దినోత్సవ సందేశంతో పాటు 17 సుస్థిరాభివృద్ధి లక్ష్యాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలన్నారు. మోక్షగుండం విశ్వేశ్వరయ్య, ఏపీజే అబ్దుల్ కలాం లాంటి మహనీయులు సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సందేశాన్ని ఎప్పుడో వివరించారని, వారి అడుగుజాడల్లో నడుచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పాల్గొన్న ప్రతినిధులతో నాణ్యమైన వస్తువులే వినియోగిస్తామని, మార్కెట్లో నాణ్యతను డిమాండ్ చేస్తామని ప్రతిజ్ఞ చేయించారు.

రాష్ట్ర పరిశ్రమల శాఖ డైరెక్టర్ డా.జి.మల్సూర్ మాట్లాడుతూ.. తెలంగాణలో పారిశ్రామిక విప్లవం రాబోతుందన్నారు. పారిశ్రామిక విధానాలు మారుతున్నాయని సుస్థిరాభివృద్ధి లక్ష్య సాధనలో తమ పాత్ర ఉంటుందన్నారు. బీఐఎస్ శాఖాధిపతి పీవీ శ్రీకాంత్ కార్యక్రమ ప్రాధాన్యతను వివరించారు. బీఐఎస్ విద్యాలయాల్లో ఏర్పాటు చేసిన స్టాండర్డ్స్ క్లబ్స్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఉపాధ్యాయులు స్వాతి (పభుత్వ పాఠశాల - మౌలాలి), డాక్టర్ వై.వాసుదేవ రెడ్డి (గవర్నమెంట్ సిటీ కాలేజ్), డాక్టర్ నరహరి సుజాత (శ్రీనిధి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ)ను సన్మానించారు. రాష్ట్ర స్థాయి క్విజ్ పోటీ విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పరిశ్రమల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

జువెనైల్ హోంలు పరివర్తన కేంద్రాలు

● చిన్నారులు సమాజం మెచ్చే పౌరులుగా ఎదగాలి
● మంత్రి సీతక్క


హోం బాలలతో కలిసి సహపంక్తి భోజనం చేస్తున్న మంత్రి సీతక్క

సైదాబాద్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): చిన్నారులు సమాజం మెచ్చే మంచి పౌరులుగా ఎదగాలని మంత్రి సీతక్క సూచించారు. సైదాబాద్‌లోని జువెనైల్ హోంను మంత్రి మంగళవారం సందర్శించారు. చిన్నారులతో సహపంక్తి భోజనం చేసి వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. హోంలో ఆర్చరీ శిక్షణలో బాలల ప్రదర్శనను చూసి ప్రశంసించారు. మంత్రి సీతక్క బాణాన్ని వేసి అందరినీ ఆశ్చర్యపరిచారు. చిన్నారుల్లో సృజనాత్మకతను వెలికితీసి వారిని ప్రోత్సహిస్తే దేశాభివృద్ధిలో కీలక పాత్రపోషించే అవకాశం ఉంటుందని అన్నారు.

అనంతరం బాలుర పరిశీలన గృహంలో ఏర్పాటు చేసిన సమావేశంలో సీతక్క మాట్లాడారు. జువెనైల్ హోంలు అంటే పరివర్తన కేంద్రాలని, ఇక్కడి నుంచి మంచి బాలలుగా బయటకు వెళ్లాలని కోరారు. తల్లిదండ్రులు గర్వపడే స్థాయికి ఎదగాలని సూచించారు. హోంలో యోగా కేంద్రం, లైబ్రరీ ఏర్పాటు చేయనున్నట్టు వెల్లడించారు. తయారు చేసిన బెడ్‌షీట్లను మంత్రికి బహూకరించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ కొత్తకాపు అరుణ, మహిళా సహకార అభివృద్ధి కార్పొరేషన్ చైర్‌పర్సన్ శోభారాణి, కాంగ్రెస్ అధికార ప్రతినిధి సంధ్యారెడ్డి, మహిళా శిశు సంక్షేమ శాఖ ప్రత్యేక కార్యదర్శి వాకాటి కరుణ, డైరెక్టర్ నిర్మలా కాంతి వెస్లీ, జువెనైల్ హోం డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ మీర్జా రజా అలీ బేగ్, హోం సూపరింటెండెంట్‌లు అఫ్జల్, సంఘమేశ్వర్, నవీన్, గోపీ తదితరులు పాల్గొన్నారు.

డ్యూయల్ డెస్కుల నాణ్యతలో రాజీ పడొద్దు

● చంచల్‌గూడ జైలులో తయారీ కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్


చంచల్‌గూడలో టేబుల్స్ తయారీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

హైదరాబాద్ సిటీ/సైదాబాద్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): డ్యూయల్ డెస్కుల(టేబుల్స్)ను త్వరగా తయారు చేసి ప్రభుత్వ పాఠశాలలకు అందించాలని, నాణ్యతలో రాజీ పడొద్దని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి సూచించారు. చంచల్‌గూడ కేంద్ర కారాగారంలోని డ్యూయల్ డెస్కుల తయారీ కేంద్రాన్ని ఆయన మంగళవారం సందర్శించారు. ఆర్డర్ ఇచ్చి రెండు నెలలు అయినా టేబుల్స్ అందజేయలేదని, ఇప్పటి వరకు ఎన్ని సరఫరా చేశారని, ఇంకా ఎన్ని చేయాల్సినవి ఉన్నాయని, అవి ఎప్పటి వరకు అందజేస్తారని అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రతీరోజూ టేబుల్స్ ఎన్ని తయారవుతున్నాయనే విషయాన్ని గూగుల్ షీట్‌లో నమోదు చేయాలన్నారు. ఎక్కువ విద్యార్థులున్న పాఠశాలలకు త్వరగా పంపాలని సూచించారు. కార్యక్రమంలో జైలు సూపరింటెండెంట్ నవాబ్ శివకుమార్‌గౌడ్, ఈఈ షఫీమియా, ప్రిన్సిపాల్ ప్రవీణ్‌కుమార్, విద్యాశాఖ కో-ఆర్డినేటర్ రజిత, దేవుల నాయక్, లెక్చరర్లు, ఉపాధ్యాయులు, అధికారులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాల నిర్మాణ పనుల పరిశీలన

చంచల్‌గూడ ప్రభుత్వ డిగ్రీ కళాశాలను మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాలతో కలిసి కలెక్టర్ మంగళవారం సందర్శించారు. కళాశాల ఆవరణలో రూ. 5 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న ప్రభుత్వ జూనియర్ కళాశాల పనులు పరిశీలించారు. కళాశాలలో విద్యార్థుల శాతం పెంచాలని ప్రిన్సిపాల్‌ను ఆదేశించారు. డిగ్రీ కళాశాలలో ఫ్లోరింగ్, కిటికీలు తదితర ఏర్పాట్లు త్వరగా చేపట్టాలని సూచించారు.

సీవరేజీ లైన్లకు ఔట్‌లెట్లు

● కొత్తగా నిర్మించాలని వాటర్ బోర్డు ఎండీ ఆదేశాలు
● ఎల్బీనగర్, నాగోల్‌లో మ్యాన్‌హోల్ పనుల పరిశీలన


నాగోల్‌లో సీవరేజీ పనులను పరిశీలిస్తున్న ఎండీ అశోక్‌రెడ్డి

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ఎల్బీనగర్ ప్రాంతంలో దాదాపు 15 కాలనీల్లో సీవరేజీ ఔట్‌లెట్లు లేకపోవడంతో మురుగు సమస్యలు తలెత్తుతున్నాయని వాటర్‌బోర్డు ఎండీ అశోక్‌రెడ్డి గుర్తించారు. మురుగు సమస్య పరిష్కారానికి సీవరేజీ లైన్లకు ఔట్‌లెట్లను నిర్మించాలని అధికారులను ఆదేశించారు. మ్యాన్‌హోళ్లలో పూడికతీత, సిల్ట్ తొలగింపు, ధ్వంసమైన వాటిని పునర్‌నిర్మించే పనులను చేపట్టాలని సూచించారు. సీవరేజీ ఓవర్ ఫ్లో నివారణపై వాటర్‌బోర్డు చేపట్టిన 90 రోజుల స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా ఎల్బీనగర్, నాగోల్ ప్రాంతాల్లో చేపడుతున్న డీ-సిల్టింగ్, సీవరేజీ, మ్యాన్‌హోళ్ల పునర్‌నిర్మాణ పనులను ఎండీ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వర్షపు నీటి డ్రెయిన్లలో జీహెచ్ఎంసీ డీ-సిల్టింగ్ పనులు చేపట్టకపోవడంతో మురుగు పొంగి రోడ్లపైకి వస్తుందని, ఈ సమస్య పరిష్కారానికి ఇక్కడ కొత్త సీవరేజీ పైపులైన్ నిర్మించి మూసీలో ఉన్న సీవరేజీ ట్రంక్ మెయిన్‌కి అనుసంధానం చేయాలని సూచించారు. పైపులైన్ నిర్మాణానికి సర్వే నిర్వహించి అంచనాలు రూపొందించాలని ఆదేశించారు. కొన్ని ప్రాంతాల్లో జీహెచ్ఎంసీ నిర్మించిన మ్యాన్‌హోళ్లలో లోపలి వైపున ప్లాస్టరింగ్ చేయకుండా వదిలిపెట్టడంతో అందులో పూడిక పెరిగిపోతుందని, ఇది క్రమంగా పెద్ద సమస్యగా మారే అవకాశం ఉండటంతో.. ముందు జాగ్రత్త చర్యగా గతంలో నిర్మించిన మ్యాన్‌హోల్స్ గుర్తించి వాటికి లోపలి వైపున ప్లాస్టరింగ్ పూర్తి చేయాలన్నారు. పాత సీవరేజీ పైపులైన్ల స్థానంలో కొత్తవి నిర్మించాలని బహుళ అంతస్థుల భవనాల యజమానులకు నోటీసులు అందజేయాలని ఆదేశించారు. హాస్పిటల్స్, హాస్టల్స్ లాంటి వాణిజ్య భవనాలు సిల్ట్ చాంబర్స్ నిర్మించుకోవడానికి అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్ స్వామి, సీజీఎం నాగేందర్, జీఎంలు, డీజీఎంలు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్‌శాఖలో బదిలీల గందరగోళం

● జాబితా గోప్యతపై అభ్యంతరాలు
● హెచ్ఆర్ ఇన్‌చార్జి సీఈ చాంబర్‌కు పెద్దసంఖ్యలో ఉద్యోగులు
● ట్రాన్స్‌ఫర్ గైడ్‌లైన్స్‌లో లేని వాళ్లకు ఆర్డర్లు
● నిబంధనలను పాటించలేదని విమర్శలు

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): దక్షిణ తెలంగాణ విద్యుత్‌పంపిణీ సంస్థలో ఇంజనీర్ల బదిలీలపై గందరగోళం నెలకొంది. 111 మంది డీఈ, 263 మంది ఏడీఈలతో పాటు 521 మంది ఏఈలను బదిలీలు చేస్తూ రెండురోజుల క్రితం ఉత్తర్వులిచ్చారు. వెబ్ ఆప్షన్లతో బదిలీ ప్రక్రియ పూర్తిచేయడంతో ఎవరికి ఎక్కడ పోస్టింగ్‌లిచ్చారనే అంశంపై గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. ఖైరతాబాద్ టీజీఎస్పీడీసీఎల్ ప్రధానకార్యాలయంలో హెచ్ఆర్ ఇన్‌చార్జి సీఈ చాంబర్ వద్దకు మంగళవారం పలు అసోసియేషన్ల నేతలు, ఉద్యోగులు పెద్దసంఖ్యలో చేరుకొని ఆగ్రహం వ్యక్తం చేశారు. బదిలీలపై గైడ్‌లైన్స్ ఇచ్చిన యాజమాన్యం వాటిని అమలు చేయకుండా కొంత మందికి పోస్టింగులిచ్చిందటూ ఆరోపించారు.

ట్రాన్స్‌ఫర్ గైడ్‌లైన్స్‌లో లేని కొంతమందికి ఆర్డర్లు ఎలా ఇచ్చారంటూ ఆందోళన వ్యక్తం చేశారు. నిబంధనలకు వ్యతిరేకంగా ఘట్‌కేసర్, ప్రగతినగర్, గచ్చిబౌలి, కూకట్‌పల్లి, మేడ్చల్, ఇస్నాపూర్, నార్సింగ్, హిమాయత్‌నగర్ ప్రాంతాల్లో కొంతమందికి పోస్టింగులు ఇవ్వడంపై కొంతమంది ఇంజనీర్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మంత్రి సిఫార్సుతోపాటు డబ్బులు ఖర్చు పెట్టుకున్నవాళ్లకే మంచి పోస్టింగులిచ్చి, విధుల్లో కష్టపడ్డ వారిని పక్కన పెట్టారంటూ పలువురు విమర్శిస్తున్నారు. హెచ్ఆర్ విభాగంలో ఏ నిర్ణయం తీసుకున్నా దాన్ని అమలు చేయడానికి ముందే కొంతమందికి చెప్పి సమస్యలకు కారణమైన వారిపై సీఎండీ ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలున్నాయి. బదిలీ అయిన ఉద్యోగుల జాబితాను ప్రకటించాలని ఇంజనీర్లు డిమాండ్ చేస్తున్నారు.

కొత్త గురువులొచ్చారు

(7వ పేజీ తరువాయి)

పాటు గత సెప్టెంబరులో ఫలితాలు విడుదల చేసి మెరిట్ అభ్యర్థులకు పోస్టులను కేటాయించడంతో వారు సంబురాలు జరుపుకుంటున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఉద్యోగాలు భారీ సంఖ్యలో రావడంతో కేరింతలు కొడుతున్నారు.

ప్రాథమిక పాఠశాలల్లో తీరనున్న కొరత..

జిల్లాలో 1 నుంచి 5వ తరగతి ఉండే ప్రాథమిక పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత తీరనుంది. ఇటీవల జరిగిన డీఎస్సీలో మొత్తం 878 ఖాళీల్లో సెకండరీ గ్రేడ్ టీచర్ (ఎస్‌జీటీ) పోస్టులను 537 చూపించారు. ఇంగ్లిష్, హిందీ, తెలుగు, ఉర్దూ, మరాఠీలో తాజాగా 386 మంది విధుల్లో చేరుతున్నారు. మిగతా 151 పోస్టుల్లో కొన్ని బ్యాక్‌లాగ్ ఉన్నట్లు తెలిసింది. ఉదాహరణకు ఉర్దూ మీడియంలో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు నోటిఫికేషన్‌లో పోస్టులను చూపించినప్పటికీ అందులో అర్హులు లేకపోవడంతో అవి బ్యాక్‌లాగ్‌లో పడ్డాయి. అలాగే కన్నడ, తమిళంలోని పోస్టులు కూడా ఖాళీగా ఉన్నట్లు సమాచారం.

అయితే తెలుగు, ఇంగ్లిష్, ఉర్దూ భాషల్లో చదివి పోస్టులను దక్కించుకున్న వారితో ఆయా పాఠశాలల్లో బోధన ఇబ్బందులు తీరనున్నాయి. అలాగే పదుల సంఖ్యలో స్కూల్ అసిస్టెంట్, లాంగ్వేజ్ పండిట్లు కూడా విధుల్లో చేరనుండడంతో ప్రభుత్వ పాఠశాలల్లో బుధవారం నుంచి సందడి కనిపించనుంది.

రైతు కుటుంబం నుంచి..

వనపర్తి జిల్లాకు చెందిన భాస్కర్‌ది రైతు కుటుంబం. తండ్రి వ్యవసాయం చేస్తూ చదివించడంతో ఆయన కష్టపడ్డాడు. నగరంలోని బోరబండ రెసిడెన్షియల్ స్కూల్‌లో ప్రాథమిక, ఉన్నత విద్యాభ్యాసం చేసిన భాస్కర్ 2019లో హైదరాబాద్‌లో డీఈడీ పూర్తిచేశాడు. అప్పటి నుంచి డీఎస్సీ కోసం ఎదురుచూస్తున్నాడు. తాజాగా జరిగిన పరీక్షలో ఆయన ఎస్‌జీటీ ఇంగ్లిష్ మీడియంలో సెకండ్ ర్యాంకులో నిలిచాడు. కాగా, కౌన్సెలింగ్‌లో ఆయనకు బండ్లగూడలోని పూల్‌బాగ్ నిర్కిత్ స్కూల్‌ను కేటాయించారు. తల్లిదండ్రుల కలను నెరవేర్చేందుకే తాను కష్టపడి చదివానని చెప్పారు.

నా జాబ్ నాన్నకు అంకితం..

నగరంలోని కాళీమందిర్ ప్రాంతానికి చెందిన కిశోర్‌రెడ్డి ఎస్‌జీటీ ఇంగ్లిష్ మీడియంలో పరీక్ష రాసి లోకల్ కేటగిరీలో 2వ ర్యాంకుతో ఉద్యోగాన్ని సాధించాడు. ఆయన తండ్రి ఇంటివద్ద పిండిగిర్ని నడిపిస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. అయితే తనలాగా కష్టపడవద్దని, జీవితంలో ఉన్నత స్థానంలో స్థిరపడాలంటే ప్రభుత్వ ఉద్యోగాన్ని సాధించాలని తండ్రి తరచూ ప్రోత్సహిస్తుండడంతో పట్టుదలతో టీచర్ జాబ్ సంపాదించానని కిశోర్‌రెడ్డి తెలిపారు.

టార్గెట్ గ్రూప్-1

ఆరాంఘర్ ప్రాంతానికి చెందిన సతీష్ ఎస్‌జీటీ ఇంగ్లిష్ మీడియంలో 22వ ర్యాంకు సాధించి ఉద్యోగం పొందాడు. 2017 డీఎస్సీలో ఉద్యోగం రాకపోయినా కుంగిపోలేదని, అప్పటి నుంచి పట్టుదలతో ఉండి ముందుకుసాగానని చెప్పాడు.

స్కూల్‌లో చేరిన తర్వాత నిబద్ధతతో పనిచేసి విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దుతానని చెప్పారు. భవిష్యత్‌లో గ్రూప్-1 ఉద్యోగం సాధించాలనేది తన లక్ష్యమన్నాడు.

23 నుంచి స్వదేశీ మేళా


స్వదేశీ మేళా వెబ్‌సైట్‌ను ప్రారంభిస్తున్న కిషన్‌రెడ్డి

బర్కత్‌పుర, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): స్వదేశీ జాగరణ మంచ్ తెలంగాణ ఆధ్వర్యంలో ఈనెల 23 నుంచి 27వ తేదీ వరకు పీపుల్స్ ప్లాజాలో స్వదేశీ మేళా నిర్వహిస్తున్నామని జాగరణ మంచ్ ప్రచార ప్రముఖ్ కేశవసోని తెలిపారు. మంగళవారం బర్కత్‌పురలోని తన నివాసంలో కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి స్వదేశీ మేళా వెబ్‌సైట్‌ను ప్రారంభించారన్నారు. చేతి వృత్తుల ఉత్పత్తులు, చేనేత వస్తువుల నుంచి స్వదేశీ వస్తువులు ఈ మేళాలో ప్రదర్శిస్తారని వివరించారు. స్వదేశీ ఉత్పత్తులను ప్రోత్సహించాలని కోరారు.

'కొత్త విషయాలను నేర్చుకోవడానికి 'కవచ్' ఉపయోగం'

అల్వాల్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): కార్ప్స్ 82వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆర్మ్‌డ్ ఎక్విప్‌మెంట్‌పై శిక్షణ కోసం ఏర్పాటు చేసిన 'కవచ్' శిక్షణ కేంద్రాన్ని ఎంసీఈఎంఈ కమాండెంట్ లెఫ్టినెంట్ జనరల్ నీరజ్ వర్షనే మంగళవారం ప్రారంభించారు. కవచ్‌లో అత్యాధునిక ప్రయోగశాలతోపాటు ఆధునిక తరగతి గదులు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వర్షనే మాట్లాడుతూ.. కొత్త విషయాలను నేర్చుకోవడానికి, ఆధునిక సాంకేతికతలపై ఆర్మీ అధికారులకు, కేడెట్స్‌కు శిక్షణ ఇవ్వడానికి కవచ్ ఉపయోగపడుతుందన్నారు.


గాంధీ మెడికల్ కాలేజీలో హాస్టల్ భవనానికి భూమి పూజ చేస్తున్న మంత్రి దామోదర రాజనర్సింహ

క్యాన్సర్ ఆస్పత్రుల ఏర్పాటుకు ప్రణాళిక

● వైద్య ఆరోగ్య శాఖ మంత్రి రాజనర్సింహ

అడ్డగుట్ట, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఇప్పటి వరకు 8 మెడికల్ కాలేజీలను ప్రవేశపెట్టామని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి రాజనర్సింహ తెలిపారు. మంగళవారం సికింద్రాబాద్ గాంధీ మెడికల్ కాలేజీ ఆవరణలో వైద్య విద్యార్థుల హాస్టల్ భవనం కోసం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి తీసుకున్న ప్రత్యేక చొరవతో వైద్య రంగంలో కొత్త ఊపు వచ్చిందన్నారు. రాబోయే కాలంలో కొత్తగా క్యాన్సర్ ఆస్పత్రులు, అత్యవసర వైద్య విభాగాలను ఏర్పాటు చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నామని, ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో క్యాన్సర్‌పై ప్రజల్లో అవగాహన లేదని, ఇలాంటి పరిస్థితిలో కేన్సర్ ఆస్పత్రులు ఏర్పాటు చేస్తూనే ప్రజల్లో చైతన్యం కలిగించేందుకు సన్నాహాలు చేస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్, ఎంపీ అనీల్‌కుమార్, డీఎంఈ డాక్టర్ వాణి, మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ ఇందిర, వైద్యశాఖ అధికారులు పాల్గొన్నారు.

హయత్‌నగర్-ఆటోనగర్ మధ్య.. యూటర్న్ సమస్యకు పరిష్కారం


యూటర్న్ సమస్యను పరిశీలిస్తున్న అడిషనల్ డీసీపీ

హయత్‌నగర్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): హయత్‌నగర్ నుంచి ఆటోనగర్ వరకు మూడు కిలోమీటర్లకు ఒకే యూటర్న్.. విజయవాడ జాతీయ రహదారిపైన వాహనదారుల ఇబ్బందుల పేరుతో మంగళవారం ఆంధ్రజ్యోతి దినపత్రికలో ప్రచురితమైన కథనానికి ట్రాఫిక్ పోలీసులు, ప్రజా ప్రతినిధులు, ఆర్ అండ్ బీ అధికారులు స్పందించారు. మంగళవారం మధ్యాహ్నం ఎల్బీగర్-2 ట్రాఫిక్ అడిషనల్ డీసీపీ జి. శ్రీనివాస్‌కుమార్, హయత్‌నగర్ కార్పొరేటర్ నవ జీవన్‌రెడ్డి, ట్రాఫిక్ సీఐలు గట్టుమల్లు, శ్రీనివాస్‌రెడ్డితో పాటు ఆర్ అండ్ బీ అధికారులు హయత్‌నగర్ నుంచి ఆటోనగర్ వరకు ఉన్న యూటర్న్ సమస్యను పరిశీలించారు. వాహనదారులు, ప్రయాణికులకు కలుగుతున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. మధ్యలో ఎక్కడైనా రోడ్డును దాటే ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఈ నెల 17వ తేదీన మరోసారి స్థానిక కాలనీ వాసులు, జాతీయ రహదారి అధికారులు, ట్రాఫిక్ పోలీసులు సమావేశమై నిర్ణయం తీసుకుంటామని అడిషనల్ డీసీపీ జి. శ్రీనివాస్‌కుమార్ తెలిపారు. హయత్‌నగర్ కార్పొరేటర్ నవజీవన్‌రెడ్డి యూటర్న్ సమస్యపై డీసీపీ వి. శ్రీనివాసులుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఏసీపీ నవీన్‌రెడ్డి, సీఐలు పాల్గొన్నారు.

ప్రైవేటు కళాశాలలో హిజాబ్ వివాదం

● సోషల్ మీడియాలో వీడియోలు వైరల్
● కార్పొరేటర్, రాష్ట్రీయ వానరసేన ప్రతినిధుల ఆందోళన
● ప్రిన్సిపాల్‌ను తొలగించిన యాజమాన్యం


వానరసేన ప్రతినిధులతో కలిసి కళాశాలకు వెళ్లిన కార్పొరేటర్ బద్దం ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి

దిల్‌సుఖ్‌నగర్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): చైతన్యపురిలోని ఓ ప్రైవేటు కళాశాలలో హిందూ విద్యార్థినులను హిజాబ్ దుస్తులు ధరింపజేసి, ఆ వీడియోలను సోషల్ మీడియాల్ పోస్ట్ చేయడంపై హిందూ సంఘాలు మండిపడ్డాయి.

చైతన్యపురిలోని ఓ కళాశాలలో ప్రిన్సిపాల్ హిందూ మతానికి చెందిన విద్యార్థినులకు కళాశాల తరగతి గదిలో బురఖా ధరింపజేసిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో రాష్ట్రీయ వానర సేన ప్రతినిధులు, బీజేపీ కార్పొరేటర్ బద్దం ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి కళాశాలలో మంగళవారం ఆందోళనకు దిగారు. హిజాబ్ ధరించాలని విద్యార్థినులను ప్రిన్సిపాల్ ప్రోత్సహించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యాలయాల్లో మతపరమైన అంశాలను ప్రోత్సహించడం ఎంతవరకు సమంజసమని నిలదీశారు. హిజాబ్‌లను ప్రచారం చేస్తున్న ప్రిన్సిపాల్‌పై చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ప్రిన్సిపాల్‌ను తొలగిస్తున్నట్లు చైతన్యపురి బ్రాంచ్ ఇన్‌చార్జి జీవీరెడ్డి లిఖిత పూర్వకంగా హామీ ఇవ్వడంతో ఆందోళన సద్దుమణిగింది.

మట్టే బంగారమాయె..

(7వ పేజీ తరువాయి)

మట్టిని తీసుకొస్తున్నారు.

ధర రెట్టింపు

మైనింగ్ శాఖ మట్టి తవ్వకాలను ఆపివేయడంతో కొరత ఏర్పడడంతో ధర పెరిగింది. గతంలో 300 ఫీట్ల లారీ మట్టికి రూ. 3,500 తీసుకునే వారు, ప్రస్తుతం రూ. 6,500 వరకు తీసుకుంటున్నారు. 600 ఫీట్ల లారీకి రూ. 6,500 తీసుకుంటుండగా ఇప్పుడు రూ. 10 వేలు తీసుకుంటున్నారు. 12 టైర్ల లారీ మట్టికి రూ. 10 వేలకుగాను ప్రస్తుతం రూ. 15 వేలు తీసుకుంటున్నారు.

పోలీసుల చేతివాటం

వివిధ ప్రాంతాల నుంచి నగరానికి మట్టి తరలిస్తున్న లారీలను పోలీసులు టార్గెట్‌గా చేసుకొని అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారని పలువురు లారీల యజమానులు ఆరోపిస్తున్నారు. లారీకి సుమారు రూ. 5 వేలు వసూలు చేస్తున్నారని అంటున్నారు.

ప్రశ్నిస్తే.. వే బిల్లు చూపించమంటున్నారని వాపోయారు. కంకర లారీలను వే బిల్లులు అడగడం లేదంటున్నారు. తమకు వచ్చే లాభం పోలీసుల పరం అవుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


పోలీసుల అదుపులో ఉన్న నిందితులు

ఇవ్వాల్సిన డబ్బులివ్వడం లేదని స్నేహితుడి కిడ్నాప్

● ఆరుగురిని అరెస్టు చేసిన పోలీసులు

చాంద్రాయణగుట్ట, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ఇవ్వాల్సిన డబ్బులు ఇవ్వడంలేదని స్నేహితుడిని కిడ్నాప్ చేసిన ఘటనలో ఫలక్‌నుమా పోలీసులు ఆరుగురిని అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు. ఫలక్‌నుమా ఏసీపీ కార్యాయంలో ఏసీపీ ఎంఏ జావిద్, ఇన్‌స్పెక్టర్ ఆదిరెడ్డి వివరాలను వెల్లడించారు. ఫలక్‌నుమా బీబీకా చస్మా ప్రాంతానికి చెందిన జుబేర్ యాకుత్‌పురా రైన్‌బజార్‌కు చెందిన మహ్మద్ హమీద్ వద్ద రెండు నెలల క్రితం రూ.30 వేల విలువైన వాషింగ్ మెషీన్, రిఫ్రిజిరేటర్ తీసుకున్నాడు. జుబేర్ ఎంతకీ డబ్బులు ఇవ్వకపోవడంతో అతడి స్నేహితుడైన మహ్మద్ అలీని కిడ్నాప్ చేశారు. మహ్మద్ హమీద్ (24), మహ్మద్ సిరాజ్‌ఖాన్ (42), వట్టేపల్లికి చెందిన అమ్జద్‌ఖాన్ (38), షాహీన్‌నగర్‌కు చెందిన సయ్యద్ ఖాజా షర్ఫుద్దీన్ అలియాస్ సయ్యద్ ఉబేద్(24), కామాటిపురాకు చెందిన మహ్మద్ రహీంపాషా(37), బార్కస్‌కు చెందిన మహ్మద్ ఆసిఫ్(25) ఈ నెల 13న రాత్రి అలీని కిడ్నాప్ చేశారు. అతడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు కిడ్నాపర్లు కర్ణాటకలోని గుల్బర్గాలో ఉన్నట్లు గుర్తించి, అక్కడి పోలీసుల సాయంతో నిందితులను అరెస్టు చేశారు. అలీ కిడ్నాప్‌కు రెండు రోజుల ముందు జుబేర్ తమ్ముడిని బెదిరించి ద్విచక్రవాహనం లాక్కున్నారని తెలిసింది.

మహిళ అదృశ్యం


తిరుపతమ్మ

అఫ్జల్‌గంజ్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ఏటీఎం సెంటర్‌కు వెళ్లి వచ్చేసరికి సోదరి కనిపించకుండా పోయింది. ఈ సంఘటన అఫ్జల్‌గంజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వనపర్తి జిల్లా పెబ్బేరు మండలం శంకాపూర్ గ్రామానికి చెందిన టి.ఎల్లస్వామి బతుకుదెరువు కోసం నగరానికి వచ్చి అల్వాల్ భరత్‌నగర్‌కాలనీలో నివాసముంటున్నాడు. ఇతడి సోదరి టి.తిరుపతమ్మ ఊరి నుంచి వచ్చి సోదరుడి దగ్గర ఉంది. ఈనెల 10వ తేదీన దసరా పండుగ కోసం ఇద్దరూ తమ స్వస్థలానికి వెళ్లడానికి మహాత్మాగాంధీ బస్టాండ్‌కు వచ్చారు. ప్లాట్‌ఫాం నంబర్.41 వద్ద బస్సు ఎక్కారు. ఇంతలో ఎల్లస్వామి వాటర్ బాటిల్ కోసమని వెళ్లి సరిపోను డబ్బులు కూడా లేవని ఏటీఎం సెంటర్‌కు వెళ్లి డబ్బులు తీసుకుని వచ్చాడు. ఇంతలో ప్లాట్‌ఫాంపై ఉన్న బస్సు తిరుపతమ్మ కనిపించలేదు. ఊరికి వెళ్లిపోయి ఉంటుందని సాయంత్రం ఊరిలో ఉన్న కుటుంబసభ్యులకు ఫోన్ చేసి వాకబు చేయగా రాలేదని చెప్పారు. దీంతో ఎల్లస్వామి మంగళవారం అఫ్జల్‌గంజ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి


గుర్తు తెలియని మృతదేహం

కార్వాన్, అక్టోబర్ 15 (ఆంధ్రజ్యోతి): లంగర్‌హౌజ్ బాపూఘాట్‌లోని మూసీ పరీవాహక ప్రాంతంలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని పోలీసులు మంగళవారం స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... లంగర్‌హౌజ్ వద్ద మూసీలో ఓ వ్యక్తి మృతదేహం ఉన్నట్లు స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతుడి వయస్సు 58 సంవత్సరాలు ఉంటాయని పోలీసులు తెలిపారు.

మద్యం మత్తులో గుడిలోకి రాళ్లు విసిరిన వ్యక్తి

అంబర్‌పేట, అక్టోబరు 15(ఆంధ్ర జ్యోతి): గుడి తలుపులు తెరవనందుకు మద్యం మత్తులో ఉన్న ఓ వ్యక్తి సోమవారం రాత్రి 11గంటల సమయంలో గుడిలోకి రాళ్లు వేసిన ఘటన అంబర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ అశోక్ తెలిపిన ప్రకారం.. బాగ్‌అంబర్‌పేట ధోబీగల్లీలో నివాసం ఉండే మహేష్ రాత్రి 11 గంటల సమయంలో మద్యం తాగి అంబర్‌పేట మహాకాళి అమ్మవారి ఆలయానికి వచ్చాడు. గుడి తలుపులు తెరవమని సెక్యూరిటీగార్డును కోరాడు. సెక్యూరిటీగార్డు గుడి తలుపులు తెరవలేదు, దీంతో మహేష్ అక్కడే ఉన్న కొన్ని రాళ్లను తీసుకుని గుడిలో వేశాడు, విషయం తెలుసుకున్న ఆలయ కమిటీ సభ్యులు వెంటనే గుడి వద్దకు వచ్చి అతడిని అంబర్‌పేట పోలీసులకు అప్పగించారు. ఎస్ఐ మౌనిక కేసు దర్యాప్తు చేస్తున్నారు.

దేశంలో తిరుగులేని శక్తిగా బీజేపీ

చాంద్రాయణగుట్ట, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): బీజేపీ దేశంలో తిరుగులేని శక్తిగా ఎదుగుతున్నదని ఆ పార్టీ భాగ్యనగర్ జిల్లా అధ్యక్షుడు సురేందర్‌రెడ్డి పేర్కొన్నారు. చాంద్రాయణగుట్ట నియోజకవర్గం ఉప్పుగూడ డివిజన్ అరుంధతికాలనీలో మహిళా మోర్చా ఆధ్వర్యంలో మంగళవారం బీజేపీ సభ్యత్వ నమోదును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ బూత్‌లో 200 మంది సభ్యత్వం నమోదు చేయాలని, కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు జాలిగం చిరంజీవి, నియోజకవర్గ కన్వీనర్ ఎడ్ల పండరీనాథ్, మహిళా మోర్చా డివిజన్ అధ్యక్షురాలు జయ, సువర్ణ తదితరులు పాల్గొన్నారు.


సభ్యత్వ నమోదులో సురేందర్‌రెడ్డి తదితరులు

శ్మశానవాటికల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలి


జోనల్ కమిషనర్ వెంకన్నకు వినతిపత్రం ఇస్తున్న బీజేపీ నాయకులు

చాంద్రాయణగుట్ట, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): శ్మశానవాటికల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని బీజేపీ భాగ్యనగర్ జిల్లా ప్రధాన కార్యదర్శి కొడి మహేందర్ కోరారు. మంగళవారం ఆయన జీహెచ్‌ఎంసీ జోనల్ కమిషనర్ టి.వెంకన్నకు వినతిపత్రం అందజేశారు. దీపావళి సందర్భంగా చాంద్రాయణగుట్ట హిందూ శ్మశానవాటిక, లలితాబాగ్ శ్మశానవాటిక, ఇందిరానగర్, నల్లవాగు శ్మశానవాటికలోని పిచ్చిమొక్కలు, చెత్తాచెదారం తొలగించాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు నిరంజన్ యాదవ్, మహేశ్, విజయ్‌కుమార్, శ్రీనివాస్, సుబోధ్ తదితరులు పాల్గొన్నారు.

‘అంకుర’లో ఆరు నెలల పాపకు ప్రాణం


చిన్నారి తల్లిదండ్రులతో డాక్టర్ల బృందం

కార్వాన్, అక్టోబర్ 15 (ఆంధ్రజ్యోతి): స్త్రీలు, శిశువుల ఆరోగ్యంలో ప్రత్యేక సేవలందించే ప్రముఖ ఆరోగ్య సంరక్షణ సంస్థ అంకుర ఫర్ ఉమెన్, చిల్డ్రన్ ఆస్పత్రి మూత్రపిండ వ్యాధితో బాధపడుతున్న ఆరు నెలల పాపకు ప్రాణం పోసింది. అంకుర ఆస్పత్రి మెడికల్ డైరెక్టర్ డాక్టర్ అంకుష్ కొమ్మువార్ మాట్లాడుతూ క్లినిక్ పరీక్ష ఫలితాల ఆధారంగా చిన్నారి మూత్రపిండ గొట్టపు అసిడోసిస్‌తో బాధపడుతున్నట్లు నిర్ధారించినట్లు తెలిపారు. చిన్నారికి మూత్రం, మూత్రపిండాలు రావడంతో ఇబ్బంది ఉందని, రోగికి పెరిటోనియల్ డయాలసిస్ అనేది సాధారణంగా పని చేయడం లేదు కాబట్టి ఈ ప్రక్రియ గురించి పిల్లల తల్లిదండ్రులతో చర్చించామని తెలిపారు. వారి ఆమోదం పొందిన తర్వాతనే డాక్టర్ రవిదీప్ పీడియాట్రిక్ నెఫ్రాలజిస్ట్ మార్గదర్శకత్వంలో డాక్టర్లు విజయవంతంగా శస్త్ర చికిత్స చేసినట్లు తెలిపారు. అనంతరం డాక్టర్ కృష్ణప్రసాద్ మాట్లాడుతూ అంకుర ఆస్పత్రిలో ప్రాణాలను కాపాడడం, రోగుల శ్రేయస్సును నిర్ధారించడమే లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలతో ముందుకెళ్తున్నామని పేర్కొన్నారు.

స్థానికసంస్థల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలి

● బీసీ కమిషన్ మాజీ సభ్యుడు ఉపేంద్ర

రంగారెడ్డి జిల్లా కోర్టులు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సమగ్ర కులగణన జరిపి స్థానికసంస్థల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని తెలంగాణ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు ఉపేంద్ర డిమాండ్ చేశారు. ప్రముఖ రచయిత, సాహిత్య అకాడమీ మాజీ చైర్మన్ జూలూరీ గౌరీశంకర్ రచించిన ‘మా వాటా మాకే’ అనే పుస్తకాన్ని మంగళవారం సీనియర్ న్యాయవాదులు, సామాజిక కార్యకర్తలతో కలిసి రంగారెడ్డి జిల్లా కోర్టుల ఆవరణలో ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ కామారెడ్డి డిక్లరేషన్‌లో అధికారంలోకి వస్తే కులగణన జరిపి బీసీలకు రిజర్వేషన్లు ఇస్తామని ప్రకటించారన్నారు. ఇచ్చిన మాట ప్రకారం వెంటనే సమగ్ర కులగణన జరిపి బీసీ రిజర్వేషన్లను పెంచాలని డిమాండ్ చేశారు. సీనియర్ న్యాయవాది సదానందం మాట్లాడుతూ స్వాతంత్రం వచ్చినప్పటి నుంచి బీసీలకు అన్యాయం జరుగుతూ వస్తున్నదన్నారు. ఇప్పటికైనా బీసీలకు న్యాయం చేయాలని కోరారు. బార్ అసోసియేషన్ మాజీ ప్రధాన కార్యదర్శి దేవరాజు మాట్లాడుతూ రాహుల్‌గాంధీ, రేవంత్‌రెడ్డి ఎన్నికల ముందు బీసీలకు న్యాయం చేస్తామని మాట ఇచ్చారని, రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినందున ఇక జాప్యం చేయకుండా వెంటనే బీసీలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు భిక్షమయ్య, ఆంజనేయులుగౌడ్, నర్సింగ్‌రావు కళ్యాణ్, కృష్ణాగౌడ్, పాండు, సత్యనారాయణరెడ్డి, జయప్రసాద్, కిషన్, రమేష్‌యాదవ్, వెంకటకృష్ణ, శివకుమార్‌గౌడ్, ప్రభాకర్ పాల్గొన్నారు.


రంగారెడ్డి జిల్లా కోర్టుల ఆవరణలో ‘మా వాటా మాకే’ పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఉపేంద్ర, న్యాయవాదులు


డ్రగ్స్‌పై అవగాహన కార్యక్రమంలో డీఎస్పీ భిక్షపతిరావు

విద్యార్థులు, యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి

● రైల్వే యాంటీ నార్కోటిక్ డ్రగ్స్ డీఎస్పీ భిక్షపతిరావు

బర్కత్‌పుర, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు, యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని రైల్వే యాంటీ నార్కోటిక్ డ్రగ్స్ డీఎస్పీ పి.భిక్షపతిరావు సూచించారు. మంగళవారం కాచిగూడ రైల్వే పీఎస్ సీఐ ఆర్.ఎల్లప్ప ఆధ్వర్యంలో కాచిగూడ రైల్వేస్టేషన్‌లో డ్రగ్స్‌కు వ్యతిరేకంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు, యువత సన్మార్గంలో నడిచి ఉన్నతస్థాయికి ఎదగాలన్నారు. డ్రగ్స్‌కు అలవాటు పడితే జీవితం నాశనమవుతుందని అన్నారు. కార్యక్రమంలో టీజీ యాంటీ నార్కోటిక్ డ్రగ్స్ సీఐ సామ్యనాయక్ తదితరులు పాల్గొన్నారు.


మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జయంతిని పురస్కరించుకుని కందికల్‌గేట్ భట్టినగర్‌లో ఆయన చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎస్సీ డెవలప్‌మెంట్ సొసైటీ అధ్యక్షుడు పులికంటి నరేశ్, బస్తీవాసులు నాగేశ్వర్ రావు, రాజు, శేఖర్ తదితరులు
- చాంద్రాయణగుట్ట, ఆంధ్రజ్యోతి


మైలార్‌దేవుపల్లి డివిజన్ పరిధిలోని శ్రీరాంనగర్, బుద్వేల్ రైల్వేస్టేషన్ బస్తీలో అబ్దుల్ కలాం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నవయువ యూత్ క్లబ్ ప్రతినిధులు ఎర్ర కుమారస్వామి, రమేశ్‌రెడ్డి తదితరులు
- రాజేంద్రనగర్, ఆంధ్రజ్యోతి


హైదర్‌గూడలో తెగిపడిన కేబుల్ వైర్లు

తెగిన కేబుల్, నెట్ తీగలు

రాజేంద్రనగర్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ఇటీవల హైదర్‌గూడలోని పలు వీధుల్లో కేబుల్ వైర్లు, నెట్ వైర్లు తెగిపోయాయి. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత అధికారులు కేబుల్, నెట్ తీగలను సరి చేయాలని స్థానికులు కోరారు.


నూతనంగా బాధ్యతలు చేపట్టిన విద్యుత్ శాఖ చార్మినార్ సర్కిల్ డీఈ ఎం.శ్రీధర్‌కు శుభాకాంక్షలు చెబుతున్న 327-ఉద్యోగ సంఘం నాయకులు ఎం.శివశంకర్, హరిప్రసాద్, అబ్దుల్ హకీమ్
- మదీన, ఆంధ్రజ్యోతి

విగ్రహాల ధ్వంసం విచారకరం


ఆలె జితేంద్ర

చాంద్రాయణగుట్ట, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): నగరంలో వరుసగా జరుగుతున్న విగ్రహాల ధ్వంసంపై సమగ్ర విచారణ జరిపించాలని మాజీ కార్పొరేటర్ ఆలె జితేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పాతబస్తీ రక్షాపురం, నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్, తాజాగా సికింద్రాబాద్ కుమ్మరిగూడలో అమ్మవారి విగ్రహాలను ధ్వంసం చేయడం భక్తులను ఆవేదనకు గురిచేస్తుందని ఆయన పేర్కొన్నారు. దుండగులు విగ్రహాలను ధ్వంసం చేస్తుంటే పోలీసులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. రాష్ట్రంలో ప్రభుత్వం, నిఘా సంస్థ, పోలీస్ వ్యవస్థ విఫలమైందని ఆయన ఆరోపించారు.

అదుపుతప్పి కారు బోల్తా..

● స్వల్ప గాయాలతో బయటపడ్డ నలుగురు వ్యక్తులు


బోల్తా పడిన కారు

అబ్దుల్లాపూర్‌మెట్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): నగర శివారు నాగోల్ నుంచి గౌరెల్లి రేడియల్ రోడ్డులో వెళ్తున్న కారు కుంట్లూర్ పరిధిలోని జీవీఆర్‌కాలనీ మలుపు వద్ద అదుపుతప్పి బోల్తా పడింది. ప్రమాదం జరిగిన సమయంలో కారులో నలుగురు వ్యక్తులు ఉన్నట్లు తెలిసింది. కారులోని ఎయిర్ బెలూన్స్ తెరుచుకోవడంతో అందులోని వ్యక్తులు స్వల్పగాయాలతో బయటపడ్డారు. వెంటనే వారిని అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించారు.

ఇంకో చాన్స్ ప్లీజ్..!

● మళ్లీ ఎన్నికలు నిర్వహించాలని స్థానిక నేతల వినతి
● గ్రేటర్‌లో విలీనం ప్రతిపాదనపై అసంతృప్తి
● బడంగ్‌పేట్, మీర్‌పేట్‌లను కలిపి ఒకే కార్పొరేషన్ చేయాలి
● మొత్తం 20-25 డివిజన్లకు పరిమితం చేయాలని సూచన
● బండి సంజయ్ ‘ఉద్యమం’ ప్రకటన ఏమైనట్టు..?



బడంగ్‌పేట్ కార్యాలయం

సరూర్‌నగర్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): కార్పొరేషన్‌గా ఏర్పడిన తర్వాత కేవలం ఒక్కసారే ఎన్నికలు జరిగిన మీర్‌పేట్, బడంగ్‌పేట్‌లకు మళ్లీ ఎన్నికలు నిర్వహించి పాలకవర్గాలను ఎన్నుకోవాలని స్థానిక నేతలు కోరుతున్నారు. ఇవి రెండు 2019లో మునిసిపాలిటీల నుంచి కార్పొరేషన్లుగా రూపాంతరం చెంది, అనంతరం 2020లో ఎన్నికలు జరిగి పాలకవర్గాలతో కొలువుదీరిన సంగతి విదితమే! బడంగ్‌పేట్‌ను మొదట 2011లో నగర పంచాయతీగా ఏర్పాటు చేసి, ఆ తర్వాత 2014లో ఎన్నికలు నిర్వహించగా, మీర్‌పేట్‌ను సరూర్‌నగర్ మండల పరిషత్ పాలకవర్గం పదవిలో ఉండగానే 2016లో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం మునిసిపాలిటీగా ఏర్పాటు చేసి గందరగోళం సృష్టించింది. దాంతో ఓ వైపు మునిసిపల్ అధికారులు, మరోవైపు మండల పరిషత్ పాలకవర్గంతో మీర్‌పేట్‌లో పాలన అస్తవ్యస్తంగా కొనసాగింది. బడంగ్‌పేట్‌కు మాత్రం 2014లో నగర పంచాయతీ ఎన్నికలు నిర్వహించి చైర్మన్, వైస్ చైర్మన్‌తో పాటు కౌన్సిలర్లను ఎన్నుకున్నారు. అదే ఏడాది మీర్‌పేట్, జిల్లెలగూడ, జల్‌పల్లి, పహాడీషరీఫ్, కొత్తపేట, బాలాపూర్‌లోని నగం భాగం(మిగతా సగం భాగాన్ని బడంగ్‌పేట్ నగర పంచాయతీలో కలిపారు) కలిపి అప్పటి సరూర్‌నగర్ మండల పరిషత్‌కు ఎన్నికలు నిర్వహించారు. దాంతో ఎంపీపీ, వైస్ ఎంపీపీతో పాటు ఎంపీటీసీ, జడ్పీటీసీ సభ్యులు సైతం ఎన్నికయ్యారు. ఆ వెంటనే 2016లో మీర్‌పేట్, జిల్లెలగూడలను కలిపి ‘మీర్‌పేట్’ పేరుతో ఒక మునిసిపాలిటీని, జల్‌పల్లి, పహాడీషరీఫ్, కొత్తపేట్, బాలాపూర్‌లోని నగం భాగాన్ని కలిపి ‘జల్‌పల్లి’ పేరుతో మరో మునిసిపాలిటీని ఏర్పాటు చేశారు. సదరు రెండు మునిసిపాలిటీలకు అధికారులను సైతం నియమించడంతో అటు అధికారులు, ఇటు మండల పరిషత్ పాలకవర్గాలతో ఆయా మునిసిపాలిటీల్లో గందరగోళ పరిస్థితులు తలెత్తాయి. అదే సమయంలో నగర పంచాయతీగా ఉన్న బడంగ్‌పేట్‌ను సైతం మునిసిపాలిటీగా అప్‌గ్రేడ్ చేశారు.


మీర్‌పేట్ కార్యాలయం

కార్పొరేషన్‌లుగా మార్చి..
చిన్న,చిన్న డివిజన్లు ఏర్పాటు చేసి..

ఇక 2019లో ఈ రెండు మునిసిపాలిటీలను కార్పొరేషన్లుగా మారుస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దాదాపు 1.30లక్షల జనాభా ఉన్న మీర్‌పేట్‌లో 46 డివిజన్లు, 90వేల జనాభా ఉన్న బడంగ్‌పేట్‌లో 32 డివిజన్లు ఏర్పాటు చేశారు. మీర్‌పేట్‌లో కేవలం 1,600 నుంచి 1,800 మంది ఓటర్లకు ఒక డివిజన్‌ను ఏర్పాటు చేయడం గమనార్హం! ఇక బడంగ్‌పేట్‌లో 2,500 నుంచి 2,800 మంది ఓటర్లకు ఒక డివిజన్‌ను ఏర్పాటు చేశారు. 2020 జనవరిలో కార్పొరేషన్ ఎన్నికలు నిర్వహించగా రెండు కార్పొరేషన్లలో కొత్త పాలకవర్గాలు కొలువుదీరాయి. సదరు పాలకవర్గాల పదవీకాలం వచ్చే ఏడాది జనవరి 27వ తేదీతో ముగియనుంది.

‘గ్రేటర్’ ప్రతిపాదనతో నేతల్లో నైరాశ్యం

కార్పొరేషన్లుగా మారిన తర్వాత కేవలం ఒక్కసారే ఎన్నికలు జరిగిన మీర్‌పేట్, బడంగ్‌పేట్‌లతో పాటు సిటీ చుట్టుపక్కల గల ఇతర కార్పొరేషన్లు, మునిసిపాలిటీలను సైతం గ్రేటర్‌లో విలీనం చేయాలని ప్రస్తుత ప్రభుత్వం ప్రతిపాదించడంతో ‘స్థానిక’ నేతల్లో నైరాశ్యం నెలకొంది. మరోసారి ఎన్నికల్లో పోటీచేసి ‘స్థానిక’ ప్రజాప్రతినిధులుగా కొనసాగుదామనుకున్న నాయకులకు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం మింగుడు పడడం లేదు. ఆయా కార్పొరేషన్లలోని పలు కాలనీలు, గ్రామాలు నేటికీ పల్లె వాతావరణంతోనే ఉన్నాయని, వాటిని ఉన్న ఫళంగా గ్రేటర్‌లో కలిపితే ఎలా అని స్థానిక నేతలు, ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇంకోసారి ఇక్కడ మునిసిపల్ ఎన్నికలు నిర్వహించి కార్పొరేషన్లకు పాలకవర్గాలను ఎన్నుకుంటేనే ఉత్తమమని వారు సూచిస్తున్నారు. ప్రభుత్వం తన నిర్ణయంపై పునరాలోచన చేయాలని కార్పొరేటర్ పదవులపై ఆశలు పెట్టుకున్న అనేక మంది స్థానిక నేతలు కోరుతున్నారు.

రెండు కార్పొరేషన్లను కలపాలి

మీర్‌పేట్, బడంగ్‌పేట్ కార్పొరేషన్లను వేర్వేరుగా కాకుండా రెండింటినీ కలిపి ఒకే కార్పొరేషన్‌గా ఏర్పాటు చేసి.. ఎక్కువ మంది ఓటర్లతో తక్కువ డివిజన్లుగా విభజిస్తే పాలనకు సౌలభ్యంగా ఉంటుందని ఆయా ప్రాంతాలకు చెందిన పలు రాజకీయ పార్టీల నాయకులు, మేధావులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం రెండు కార్పొరేషన్లలో కలిపి 78 డివిజన్లు ఉన్నాయని, వాటిని ఒకే కార్పొరేషన్‌గా ఏర్పాటు చేసి మొత్తం డివిజన్ల సంఖ్యను 20 నుంచి 25కి పరిమితం చేయాలని వారు సూచిస్తున్నారు. ఈ ఒక్కసారి మళ్లీ ఎన్నికలు నిర్వహించి, వచ్చే ఐదేళ్ల తర్వాత గ్రేటర్‌లో విలీనం చేస్తే బాగుంటుందనే అభిప్రాయం స్థానికంగా వ్యక్తమవుతోంది.

బీజేపీ నేతల ఉద్యమం ఏమైనట్టు..?

బడంగ్‌పేట్, మీర్‌పేట్‌తో పాటు నగర శివారులోని కార్పొరేషన్లు, మునిసిపాలిటీలను గ్రేటర్‌లో విలీనం చేసే ప్రతిపాదనను తమ పార్టీ తీవ్రంగా వ్యతిరేకిస్తున్నదని, దీనిపై పెద్దఎత్తున ఉద్యమం చేపడతామని గత ఆగస్టులో గుర్రంగూడలో జరిగిన బోనాల వేడుకలకు హాజరైన కేంద్ర మంత్రి బండి సంజయ్ ప్రకటించిన సంగతి విదితమే. గ్రామీణ ప్రాంతాలుగా ఉన్న ఇక్కడి ప్రాంతాలను కార్పొరేషన్లుగా మార్చడమే పెద్ద తప్పు అని, ఇప్పుడు వాటిని ఏకంగా గ్రేటర్‌లో విలీనం చేయాలనుకోవడం మరో తప్పు అని ఆయన వ్యాఖ్యానించారు. కాగా, బండి సంజయ్ ఈ ప్రకటన చేసి దాదాపు మూడు నెలలు కావస్తున్నా బీజేపీ నేతల నుంచి ఉద్యమంపై ఎలాంటి స్పందనా కనిపించక పోవడం గమనార్హం! ఇక్కడ ప్రస్తుతం బీజేపీ ఎంపీ ప్రాతినిధ్యం వహిస్తున్న నేపథ్యంలో ఆ పార్టీ ఉద్యమం మొదలుపెడితే ప్రజలు, ‘స్థానిక’ నేతలు మద్దతుగా నిలిచే అవకాశాలు మెండుగా కనిపిస్తున్నాయి. మరి.. బండి సంజయ్ చెప్పినట్టుగా బీజేపీ ఆ దిశలో అడుగులు వేస్తుందా.. లేక ప్రభుత్వం తీసుకునే నిర్ణయానికే మౌనంగా తలూపుతుందా? అన్నది వేచి చూడాల్సిందే.

దివ్యాంగులకు అతీతమైన శక్తి

● గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ



దివ్యాంగురాలిని జ్ఞాపికతో సత్కరిస్తున్న గవర్నర్

హైదరాబాద్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగులకు అతీతమైన శక్తి ఉండడం వల్లే జీవితంలో ఎన్నో సవాళ్లను ఎదుర్కొంటారని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. అంతర్జాతీయ వైట్ కేన్ డే-2024ను పురస్కరించుకుని రాజ్‌భవన్ సంస్కృతి హాల్‌లో ఎన్జీవో సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. గవర్నర్ ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. దివ్యాంగుల అసాధారణ శక్తి, స్ఫూర్తిని కొనియాడారు. దివ్యాంగులకు వారి జీవితంలో ఎదురయ్యే సవాళ్లను అధిగమించగల సామర్థ్యం దివ్యశక్తి వల్లే సాధ్యమవుతుందని అన్నారు. బహుముఖ ప్రజ్ఞాశాలి స్వప్న నేతృత్వంలోని బృందం స్ఫూర్తిదాయక నృత్య ప్రదర్శనను గవర్నర్ అభినందించి వెంటనే రూ.50 వేలు నగదు బహుమతి ప్రకటించారు.

కదలిక లేని ఉద్యోగాలతో వెన్ను సమస్యలు

● కిమ్స్-సన్‌షైన్ ఆస్పత్రి ఎండీ డాక్టర్ గురువారెడ్డి



కిమ్స్ సన్‌షైన్ ఆస్పత్రిలో స్పైన్ స్క్రీనింగ్ హెల్త్ ప్యాకేజీ ప్రారంభోత్సవంలో డాక్టర్ గురువారెడ్డి

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): నేటి యువత కుర్చీలకు పరిమితమయ్యే ఉద్యోగాలు చేస్తుండడం, అధిక సమయం కదలిక లేకుండా పనిచేయడం వల్ల చిన్నతనంలోనే వెన్నెముక సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని సన్‌షైన్ బోన్ అండ్ జాయింట్ ఇన్‌స్టిట్యూట్ చైర్మన్, కిమ్స్-సన్‌షైన్ హాస్పిటల్ ఎండీ డాక్టర్ గురువారెడ్డి అన్నారు. వరల్డ్ స్పైన్ డేను పురస్కరించుకొని మంగళవారం బేగంపేటలోని కిమ్స్ సన్‌షైన్ ఆస్పత్రిలో స్పైన్ స్క్రీనింగ్ హెల్త్ ప్యాకేజీని ప్రారంభించి మాట్లాడారు. దేశ జనాభాలో 60 శాతం మంది ఏదో ఒక సమయంలో వెన్నెముక సంబంధిత సమస్యలను ఎదుర్కోవాల్సి వస్తుందని పరిశోధనలు సూచిస్తున్నాయన్నారు. లైఫ్‌స్టయిల్ పోచర్స్ (శరీర భంగిమలు), కదలిక లేని ఉద్యోగాలు, అధిక ఒత్తిడి వంటి జీవనశైలి కారణాల వల్ల వెన్నుముక సంబంధ సమస్యలకు దారి తీస్తున్నాయని పేర్కొన్నారు.

గుండె కవాటాలపై పరిశోధనలు

సక్సెస్ అయితే బ్లడ్ క్లాటింగ్‌కు చెక్ ● కార్డియోథొరాసిక్ సర్జన్ డాక్టర్ లోకేశ్వరరావు



సజ్జా హార్ట్ ఫౌండేషన్ వార్షికోత్సవంలో డాక్టర్ లోకేశ్వరరావు సజ్జా, ఇతర వైద్యనిపుణులు

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): గుండె కవాటాలపై సరికొత్త పరిశోధనలు జరుగుతున్నాయని, ఇవి విజయవంతమైతే బ్లడ్ క్లాటింగ్ చాలావరకు నియంత్రించొచ్చని కార్డియోథొరాసిక్ సర్జన్, సజ్జా ఫౌండేషన్ అధ్యక్షుడు డాక్టర్ లోకేశ్వరరావు సజ్జా పేర్కొన్నారు. సజ్జా హార్ట్ ఫౌండేషన్ 10వ వార్షికోత్సవాన్ని బేగంపేటలోని గ్రీన్‌పార్క్ హోటల్‌లో మంగళవారం నిర్వహించారు. కార్డియాక్ సర్జన్లు, కార్డియాలజిస్టులు, నెఫ్రాలజిస్టులు, వైద్యులు, సర్జన్లు, రీసెర్చ్ స్కాలర్‌లు పాల్గొన్నారు. డాక్టర్ లోకేశ్వరరావు మాట్లాడుతూ.. యూఎస్, భారత పేటెంట్లు పొందిన మెకానికల్ ప్రొస్తెటిక్ హార్ట్ వాల్వ్ గ్రౌండ్ బ్రేకింగ్ డిజైన్‌ను అభివృద్ధి చేసినట్టు తెలిపారు. నెలరోజులుగా జంతు అధ్యయనాలు కొనసాగుతున్నాయని, ఈ పరిశోధనలు సక్సెస్ అయితే గుండె కవాట మార్పిడి శస్త్రచికిత్స చేయించుకుంటున్న రోగుల జీవన నాణ్యతను మారుస్తుందన్నారు. ఈ పరికరాన్ని ఏ వయస్సు వారికైనా వినియోగించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో కార్డియోథొరాసిక్ సర్జరీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ గోపీచంద్ మన్నం, సీసీఎంబీ హైదరాబాద్ డైరెక్టర్ డాక్టర్ వినయ్ కె.నందికూరి, ప్రొఫెసర్ ప్రభాకరన్ దొరైరాజ్ తదితరులు పాల్గొన్నారు.

వారాస్ చెస్ టోర్నమెంట్ షురూ

● ప్రారంభించిన మధు యాష్కీ



చెస్ ఆడుతున్న మధు యాష్కీ


హైదరాబాద్, ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి: వారాస్ ఇంటర్నేషనల్ ఫిడే రేటింగ్ చెస్ టోర్నమెంట్‌ను టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్, మాజీ ఎంపీ మధు యాష్కీ గౌడ్ ప్రారంభించారు. మంగళవారం బిర్లా ప్లానిటోరియం సమావేశ మందిరంలో ప్రారంభమైన ఈ పోటీలు ఈనెల 19 వరకు జరగనున్నాయి. ఈ సందర్భంగా మాజీ ఎంపీ మాట్లాడుతూ చెస్‌తో విద్యార్థుల్లో సృజనాత్మకత, చురుకుదనం పెరుగుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు రాఘవ్ శ్రీవత్సవ్, వనస్థలిపురం కార్పొరేటర్ వెంకటేశ్వర్‌రెడ్డి, ప్లానిటోరియం సెక్రటరీ శ్యామ్, చెస్ ఆర్బిటర్ ప్రమోద్ తదితరులు పాల్గొన్నారు.

టెక్నిక్స్ తెలియకే

టెక్ నెక్ పెయిన్!

స్క్రీన్ టైమ్ పెరగడంతోనే ఇబ్బందులు

- ఆస్పత్రులకు వస్తున్న యువతలో అధిక శాతం మంది మెడనొప్పి బాధితులే
- ఫోన్, ల్యాప్‌టాప్ వినియోగించే విధానం మార్చుకుంటే సమస్యలకు పరిష్కారం



హైదరాబాద్ సిటీ, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ఇటీవలి కాలంలో నగరంలో పేరొందిన ఆస్పత్రులకు వస్తున్న ఓపీ కేసుల్లో మరీ ముఖ్యంగా యువతలో అత్యధిక శాతం మెడ నొప్పి లేదా వెన్నునొప్పి కేసులే ఉంటున్నాయని వైద్యులు చెబుతున్నారు. గంటల తరబడి మొబైల్, ల్యాప్‌టాప్‌లకు అతుక్కుపోవడం వంటి కారణాలతో టెక్‌నెక్ పెయిన్ బారిన పడుతున్నట్లు తెలిపారు. ఈ పెయిన్ ఎక్కువ కాలం ఉంటే వెన్ను సమస్యలకు దారితీసే ప్రమాదం ఉందంటున్నారు. మొబైల్, ల్యాప్‌టాప్, ట్యాబ్‌పై గడిపే ప్రతి నిమిషం మెడ నరాలు పట్టేయడానికి కారణమవుతాయని, తప్పనిసరిగా జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.

మొబైల్‌తో ముడిపడి ఉన్న పనులే ఎక్కువ

రోజువారీ కార్యక్రమాల్లో అధికశాతం మొబైల్‌పైనే ఆధారపడుతున్నాం. నిద్ర లేవడానికి అలారం మొదలు ఆఫీస్‌కు వెళ్లడానికి క్యాబ్, ఫుడ్ ఆర్డర్, స్నేహితులతో సరదా కబుర్లు, సోషల్ మీడియా సందేశాలు.. ఇలా ప్రతీదానికి మొబైల్ అవసరమే. ఈ సుదీర్ఘ వినియోగమే ఆరోగ్య ప్రమాదాలను కలిగిస్తుందంటున్నారు డాక్టర్లు. ఆర్థోపెడీషియన్ బాబు మాట్లాడుతూ.. మనం ఫోన్ పట్టుకునే విధానం, ల్యాప్‌టాప్, ట్యాబ్‌పై పనిచేసే విధానం అనేక సమస్యలకు కారణమవుతుందన్నారు. మణికట్టు నొప్పి, చేతుల నొప్పులు, మెడ నొప్పి, నడుంనొప్పి వంటి సమస్యలు తలెత్తుతాయన్నారు. మెడనొప్పి కేసుల్లో అధికశాతం గాడ్జెట్స్ వల్ల వచ్చేవే కావడంతో టెక్ నెక్ లేదా టెక్స్ట్ నెక్ పెయిన్ అని పిలుస్తున్నట్లు తెలిపారు.

మెడనొప్పికి యోగాతో చెక్

నగరంలో వెన్ను, మెడ సమస్యలతో బాధపడుతున్న యువతలో అధికశాతం మంది యోగా మార్గాన్ని అనుసరిస్తున్నారు. అర్థోపెడిక్ డాక్టర్లను సంప్రదించినా శాశ్వత పరిష్కారం కోసం యోగాతోనే మేలంటున్నారు. యోగా నిపుణులు దశరథ్ మాట్లాడుతూ.. కంప్యూటర్స్, మొబైల్స్‌తో అధికంగా గడిపేవారికి కండరాల్లో బలం తగ్గుతుందన్నారు. ఇది మెడ, భుజాల సమస్యలకు దారితీస్తుందని, ఇలాంటి వారికి సింపుల్ హ్యాండ్, లెగ్ వ్యాయామాలు ఉపయోగపడతాయన్నారు.

మొబైల్‌ను పట్టుకునే విధానం

- ఫోన్‌ను ఎక్కువ సమయం వాడాల్సి వస్తే మొబైల్ స్టాండ్ వినియోగించడం మంచిది. ఇది కళ్లు, నరాలపై ఒత్తిడి తగ్గిస్తుంది.
- మణికట్టును మరీ వంచకుండా, మోచేతులు కొద్దిగా వంచి ఫోన్‌ను నడుం లేదా ఛాతి వరకు తీసుకురావాలి. ఆ పొజిషన్‌లో మొబైల్ పట్టుకుంటే మెడ అధికంగా వంచాల్సిన అవసరం ఉండదు. తద్వారా మెడ నరాలపై ఒత్తిడి తగ్గుతుంది.
- రెండు చేతులతో ఫోన్ పట్టుకుని టైపింగ్ కోసం రెండు బొటనవేళ్లనూ వినియోగిస్తే చేతులపై ఒత్తిడి తగ్గుతుంది.
- కుర్చీలో కూర్చున్నప్పుడు వెన్నుముక నిటారుగా ఉండేలా చూసుకోవడంతో పాటు భుజాలు విశ్రాంతిగా ఉంటే మెడ, భుజాలపై ఒత్తిడి తగ్గుతుంది.
- భుజాలపై ఒత్తిడి తగ్గించుకోవడానికి మోచేతులను డెస్క్‌పై ఉంచాలి.
- ప్రతి 20-30 నిమిషాలకు కనీసం 5 నిమిషాల పాటు బ్రేక్ తీసుకోవడం మంచిది.

టెక్ నెక్ లక్షణాలు

మెడ పట్టేయడం, తలనొప్పి, భుజాల నొప్పి ఉంటే అది టెక్ నెక్ సమస్య కావొచ్చు. ఈ సమస్య ఉన్న వారికి కొన్నిసార్లు శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు ఎదురవుతాయి. భావోద్వేగాలను నియంత్రించలేకపోవడం వంటి సమస్యలు సైతం ఉత్పన్నమవుతాయి.

రీల్స్ మోజులో డేంజర్ స్టంట్లు



రీల్స్ మోజులో కొందరు బాలలు, యువకులు బైక్‌లు, రైళ్ల ప్లాట్‌ఫారాలపై అత్యంత ప్రమాదకరంగా స్టంట్లు వేస్తూ ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. సోమవారం అర్ధరాత్రి దాటిన తర్వాత పీవీ ఎక్స్‌ప్రెస్‌వే యువకులు కింద బైక్‌లను గాల్లోకి లేపుతూ ప్రమాదకరంగా స్టంట్స్ చేయడంతో వాహనదారులు భయాందోళనకు గురయ్యారు. అలాగే నలుగురు బాలురు కాచిగూడ రైల్వేస్టేషన్‌లో నడుస్తున్న ఎంఎంటీఎస్ వెంట పరుగెత్తి స్టంట్స్ చేశారు. ఈ వీడియోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. *-రాజేంద్రనగర్ /బర్కత్‌పుర, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి)*



ఆదివారం ఎంజాయ్ చేద్దాం..

● 20న కేబీఆర్ పార్క్ వద్ద ప్రొమెనేడ్

ఖైరతాబాద్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): ప్రజలకు మరింత చేరువయ్యేందుకు జీహెచ్ఎంసీ వినూత్న కార్యక్రమాలకు శ్రీకారం చుట్టింది. ఇటీవల మోజంజాహి మార్కెట్ వద్ద 'గజల్ ఔర్ షాయరీకి షామ్' విజయవంతం కావడంతో ఈనెల 20న ఆదివారం బంజారాహిల్స్ కేబీఆర్ పార్కు వద్ద 'నేచర్, కల్చర్ అండ్ ప్యావిలీ రెజువనేట్ పేరిట ' కేబీఆర్ ప్రొమెనేడ్' నిర్వహిస్తోంది. ప్రజా సంబరాలు పేరుతో జరిగే ఈ కార్యక్రమం ఆదివారం మధ్యాహ్నం 12.30 నుంచి సాయంత్రం 6.30 గంటల వరకు నిర్వహిస్తున్నట్లు ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతి తెలిపారు. సాంస్కృతిక కార్యక్రమాలు, లైవ్ మ్యూజిక్, ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్స్, ఫన్‌తోపాటు అడ్వెంచర్ కార్యక్రమాలు ఉంటాయని చెప్పారు.

నగరంలో-నేడు

- అబిడ్స్‌లోని డాక్ సదన్ (జీపీవో) వద్ద ఉదయం 10 గంటల నుంచి తపాలశాఖ విశ్రాంత ఉద్యోగుల జేఏసీ ఆధ్వర్యంలో శాంతియుత నిరసన, రిలేనిరాహారదీక్ష.
- రంగారెడ్డి జిల్లా నందిగామ (ఓఆర్ఆర్ ఎగ్జిట్ నం.3) వద్ద రిసోనాన్స్ క్యాంపస్‌లో మధ్యాహ్నం 3 గంటలకు ఐవోక్యూఎం (ఇండియన్ ఒలింపియాడ్ క్వాలిఫైయర్ ఇన్ మ్యాథమేటిక్స్)లో ప్రతిభ కనబరిచిన వారికి అభినందన కార్యక్రమం.
- 50వేల కార్నియా మార్పిడి పూర్తయిన సందర్భంగా బంజారాహిల్స్ ఎల్వీప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్‌లో సాయంత్రం 5.45 గంటలకు విజయోత్సవ కార్యక్రమం.

లైక్ కొట్టు.. డబ్బు పట్టు

- ఇన్‌స్టాగ్రామ్‌లో ఒక్కో వీడియోకు రూ.150 ఇస్తామని బురిడీ
- క్రిప్టో పేరుతో ఉచ్చులోకి దింపి రూ. 20.35 లక్షలు కాజేత

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ఇన్‌స్టాగ్రామ్‌లో వీడియోలు లైక్ చేయండి.. డబ్బును తీసుకోండి అంటూ ప్రచారం చేసిన సైబర్ నేరగాళ్లు ఓ వ్యక్తి నుంచి సుమారు రూ.20.35లక్షలు కొల్లగొట్టారు. మోసపోయినట్లు గుర్తించిన బాధితుడు సిటీ సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సైబర్ క్రైమ్ డీసీపీ కవిత తెలిపిన వివరాల ప్రకారం.. సికింద్రాబాద్‌కు చెందిన వ్యక్తి(39)కి 'ఫైషర్ వరల్డ్' అనే కంపెనీ నుంచి వాట్సాప్‌లో ఒక మెసేజ్ వచ్చింది. 'ఇన్‌స్టాగ్రామ్‌లో వీడియోలు లైక్ చేసి, స్క్రీన్‌షాట్స్ పంపితే ఒక్కో వీడియోకు రూ. 150 చొప్పున చెల్లిస్తాం.. వర్క్‌ఫ్రమ్ హోమ్ చేసి రోజుకు రూ.4000-5000 వరకు సంపాదించుకోవచ్చు. మీకు ఇష్టమైతే రిప్లై ఇవ్వండి' అని ఆ మెసేజ్ సారాంశం. దాంతో బాధితుడు ఓకే అని రిప్లై ఇచ్చారు. వెంటనే స్పందించిన అవతలి వ్యక్తులు టెలీగ్రామ్‌లో ఒక ఇన్‌స్టా లింకును పంపారు. లింకును ఓపెన్ చేసి ఒకటి, రెండు వీడియోలకు లైక్ చేసి స్క్రీన్‌షాట్స్ పంపాడు. వాటికి డబ్బులు వచ్చాయి. క్రిప్టో కరెన్సీకి సంబంధించిన మరో లింకును బాధితునికి పంపి ఉచ్చులోకి దింపారు. వర్క్‌ఫ్రమ్ చేసుకుంటూనే క్రిప్టోలో రూ. లక్షల్లో సంపాదించొచ్చని నమ్మించారు. అందులో డబ్బులు పెట్టగానే మొత్తం నష్టపోయినట్లు సమాచారం వచ్చింది. ఇదేంటని ప్రశ్నించగా.. మీరు టెక్నికల్ మిస్టేక్ చేసి ఉంటారని, ఇప్పుడే క్రిప్టో కరెన్సీకి చెందిన యూఆర్ఎల్ లింక్ పంపుతున్నాము అందులో చెక్ చేయండి అని చెప్పారు. వారు పంపిన లింక్‌లో చెక్ చేయగా.. అందులో పెట్టుబడి పెట్టిన డబ్బులకు లాభాలు వచ్చినట్లు చూపించారు. కానీ విత్‌డ్రా చేసుకునే అవకాశం లేకుండా చేశారు. మీరు మరింత ఎక్కువ మొత్తంలో పెట్టుబడి పెడితేనే విత్‌డ్రా ఆప్షన్ కల్పిస్తామని చెప్పడంతో వారి మాటలు నమ్మి విడతలవారీగా రూ.20.35లక్షల వరకు పెట్టుబడి పెట్టాడు. అయినా విత్‌డ్రా ఆప్షన్ ఇవ్వకుండా, ఇంకా డబ్బులు చెల్లించాలని ఇబ్బంది పెట్టడంతో మోసమని భావించి బాధితుడు వెంటనే సిటీ సైబర్ క్రైమ్ పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు డీసీపీ తెలిపారు.

ఆ ఇద్దరు మినహా.. రిజిస్ట్రేషన్ల శాఖలో భారీగా ప్రక్షాళన

(7వ పేజీ తరువాయి)

రిజిస్ట్రేషన్ల శాఖలో మళ్లీ చర్చ మొదలైంది. 18 స్థానాల్లో ఏ నుంచి బీ, సీ కేటగిరీ, బీ నుంచి ఏ, సీ కేటగిరీ, సీ నుంచి బీ,సీ కేటగిరీ స్థానాలకు సబ్ రిజిస్ట్రార్లను బదిలీ చేసినా ఒక ఏ కేటగిరీలో ఉన్న సబ్ రిజిస్ట్రార్‌కు మాత్రం మరొక ఏ కేటగిరీ స్థానానికే బదిలీ చేశారు. అలాగే 11 ఏళ్ల పాటు ఏ కేటగిరి స్థానంలో పనిచేసిన సబ్ రిజిస్ట్రార్ ఒకరు కేవలం నెలరోజుల కిందట బీ కేటగిరీకి బదిలీ కాగా, తాజాగా అతన్ని ఏ కేటగిరీ ఎస్సార్వోకు బదిలీ చేయడం రిజిస్ట్రేషన్ వర్గాలను విస్మయానికి గురిచేస్తోంది. రిజిస్ట్రేషన్ల శాఖ లెక్కల ప్రకారం ఏ కేటగిరీలో ఉన్న కుత్బుల్లాపూర్ సబ్ రిజిస్ట్రార్‌ను తాజా బదిలీల్లో భాగంగా మరొక ఏ కేటగిరి ఎస్సార్వో అయిన పటాన్‌చెరుకు ఉన్నతాధికారులు బదిలీ చేయడం విశేషం. అలాగే, జనగాం సబ్ రిజిస్ట్రార్‌గా ఒకే ఆఫీసులో 11ఏళ్లపాటు పనిచేసిన ఒక సబ్ రిజిస్ట్రార్‌ను నెలరోజుల కిందట స్టేషన్ ఘన్‌పూర్‌కు బదిలీ చేసిన ఉన్నతాధికారులు, తాజాగా అతన్ని జనగాం ఎస్ఆర్‌వోకు సబ్ రిజిస్ట్రార్‌గా నియమించారు. రిజిస్ట్రేషన్ల శాఖలో ఏళ్ల తరబడి పాతుకుపోయిన అధికారులను సమూలంగా ప్రక్షాళన చేద్దామని ప్రభుత్వం ఎంతగా పట్టుబడుతున్నా, ఆ శాఖలోని కొందరు ఉన్నతాధికారులు మోకాలడ్డుతున్నారనే భావన ఉద్యోగుల్లో వ్యక్తమవుతోంది. రిజిస్ట్రేషన్ల శాఖలో మొత్తం 11 జిల్లాలు ఉండగా, ఇందులో ఐదు జిల్లాల్లో ఎంతోకాలంగా బీ, సీ కేటగిరీ ఆఫీసుల్లో పనిచేస్తున్న సబ్ రిజిస్ట్రార్లను తాజా బదిలీల్లో పరిగణనలోకి ఎందుకు తీసుకోలేదో అర్థం కావడం లేదని బాధిత బాధిత సబ్ రిజిస్ట్రార్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాజా బదిలీల్లోనూ అవకతవకలు జరిగాయని, అందుకు కారకులైన వారిపై చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు. అలాగే, ఏ కేటగిరీ స్థానాల్లో పనిచేస్తున్న సబ్ రిజిస్ట్రార్లను, జిల్లా రిజిస్ట్రార్లను బీసీ కేటగిరీ స్థానాలకు బదిలీ చేసిన ప్రభుత్వం డీఐజీ స్థాయి అధికారుల బదిలీను చేపట్టకపోవడాన్ని ఉద్యోగ సంఘాలు ఆక్షేపిస్తున్నాయి. ప్రభుత్వం వెంటనే అన్ని స్థాయిల్లో ఉద్యోగులను, అధికారులను బదిలీ చేయాలని ఆయా సంఘాల నేతలు విజ్ఞప్తి చేస్తున్నారు.

కిం కర్తవ్యం..?

(7వ పేజీ తరువాయి)

ఉంటుంది. అదే జరిగితే.. బల్దియాకు సీనియర్ ఐఏఎస్‌ను నియమిస్తారా..? జూనియర్‌కు బాధ్యతలు అప్పగిస్తారా..? అన్నది తేలాల్సి ఉంది. డీఓపీటీ ఉత్తర్వులతో జీహెచ్ఎంసీ కమిషనర్‌గా ఆమ్రపాలి ఉంటారా.. లేదా..? అన్న చర్చ నాలుగు రోజులుగా అధికార వర్గాల్లో జోరుగా సాగింది. క్యాట్ ఆదేశాలు వెలువడినా.. ఏపీ నుంచి ఆమె తిరిగి వస్తారా..? లేదా..? అన్న చర్చా మొదలైంది. ఏపీ కేడర్‌గా గుర్తించిన సోమేష్‌కుమార్ తొమ్మిదేళ్ల తెలంగాణలో పని చేశారు. జీహెచ్ఎంసీ కమిషనర్‌గా ఉన్న సమయంలోనే కేడర్ వివాదం రాగా, క్యాట్‌ను ఆశ్రయించిన ఆయన ఏకంగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా విధులు నిర్వర్తించారు. అసెంబ్లీ ఎన్నికల ముందు అనివార్య పరిస్థితుల్లో సోమేష్ ఏపీలో రిపోర్ట్ చేశారు. అనంతరం స్వచ్ఛందంగా ఉద్యోగ విరమణ చేశారు.

పొల్యూషన్ లేని

ఫ్యాషన్ మేలు

- ఫాస్ట్ ఫ్యాషన్స్‌తో ముప్పేనంటున్న డిజైనర్లు
- సస్టెయినబల్ ఫ్యాషన్ అవసరమంటున్న అధ్యయనాలు
- రీ సైకిల్డ్ ఫ్యాషన్ల పట్ల ప్రత్యేక శ్రద్ధ
- ప్లాస్టిక్, ఫైబర్, బాంబూ.. అన్నీ ఫ్యాషన్ మెటీరియల్స్‌గా కనువిందు





హైదరాబాద్ సిటీ, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): వాతావరణ మార్పుల గురించి ప్రపంచమంతా ఆందోళన చెందుతోంది. కార్బన్ ఫుట్ ప్రింట్ తగ్గించుకునేందుకు అనేక కంపెనీలు ప్రయత్నాలు చేస్తున్నాయి. నెట్ జీరో కార్బన్ కంట్రీగా మారతామంటూ భారత్ అనేక ప్రయత్నాలు చేస్తోంది. వాహన, పారిశ్రామికరంగాల స్థాయిలో కాకపోయినా నదీ జలాలు కలుషితం కావడానికి, ల్యాండ్ ఫిల్స్‌లో ఖాళీ లేకుండా చేయడానికి కారణమవుతున్న ఫ్యాషన్ రంగం సైతం కాలుష్య నియంత్రణకు తమ ప్రయత్నాలను ఇప్పుడిప్పుడే ప్రారంభిస్తోంది. నిద్ర లేవడంతోనే సెల్ఫీలో తమ అందాలను చూసి మురిసిపోకుండా మంచం దిగని నవతరంలో అధికశాతం మంది ఒకసారి వాడిన దుస్తులను మళ్లీ వాడకుండా కాలుష్యానికి కారణమవుతున్నారని, డిజైనర్లకు సైతం తప్పని సరై ఆ తరహా ఫ్యాషన్లను మాత్రమే రూపొందించాల్సిన అవసరం వచ్చిందని నగరంలోని ఓ ప్రముఖ డిజైనర్ చెబుతున్నారు. ఫ్యాషన్ రంగంలో కేవలం ఒక్క శాతం మాత్రమే రీసైక్లింగ్‌కు పనికి వస్తుందని పలు అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. ప్రస్తుతం దుస్తులను పదిసార్లు మాత్రమే ధరిస్తున్నారని, తర్వాత రంగు వెలిసిపోతుండటంతో పడేస్తున్నారని.. ఇది కాలుష్యానికి దారితీస్తోందని నిపుణులు చెబుతున్నారు.

మారుతున్న ట్రెండ్

ఫ్యాషన్ రంగంలో కాలుష్యాన్ని తగ్గించేందుకు ఇటీవలి కాలంలో డిజైనర్లు విభిన్న మార్గాలను అనుసరిస్తుంటే వినియోగదారులు సైతం తమ వంతు ప్రయత్నాలు చేస్తున్నారు. లెదర్ బ్యాగ్‌లకు బదులుగా మొక్కల ఆధారిత ఉత్పత్తులతో తీర్చిదిద్దిన వాటిని వాడుతున్నారు. ఫ్యాషన్ డిజైనర్లు, బ్రాండ్లు ఇప్పుడు ఆర్గానిక్ కాటన్, రీసైకిల్డ్ ఫ్యాబ్రిక్స్ వంటివి వినియోగిస్తున్నారు. ఇటీవలి కాలంలో బాంబూ వస్త్రాలు, సముద్రాల నుంచి సేకరించిన ప్లాస్టిక్స్‌తో తీర్చిదిద్దిన ఫైబర్స్‌తో ఫ్యాషన్ వస్త్రాలను రూపొందిస్తున్నారు. పాత ఫ్యాషన్‌లకు కొత్త హంగులు అద్దుతున్నారు.

అధికంగా కొనుగోలు.. వేగంగా డిస్పోజల్

ప్రతి సంవత్సరం అధికారికంగా పలు సంస్థలు 80 బిలియన్ గార్మెంట్స్‌ను ఉత్పత్తి చేస్తున్నాయి. అనధికారికంగా ఉత్పత్తి చేసే సంస్థలు చాలానే ఉన్నాయి. వరల్డ్ వైడ్ ఫండ్ (డబ్ల్యూడబ్ల్యూఎఫ్) లెక్కల ప్రకారం ఒక టీ షర్ట్ తయారు చేయడానికి 2700 లీటర్ల నీరు అవసరమవుతోంది. ఫాస్ట్ ఫ్యాషన్, యూజ్ అండ్ త్రో కల్చర్‌తో గ్రీన్‌హౌస్ గ్యాస్‌లు వాతావరణంలో కలుస్తున్నాయి. వ్యవసాయానికి వాడే ఎరువుల తర్వాత అంతర్జాతీయంగా స్వచ్ఛమైన నీటిని కలుషితం చేస్తున్న వాటిలో టెక్స్‌టైల్ డైయింగ్ రెండో అతిపెద్ద కారణమని అనేక నివేదికలు వెల్లడిస్తున్నాయి. 15 ఏళ్ల క్రితంతో పోలిస్తే ఇప్పుడు 60 శాతం వస్త్రాలను అధికంగా కొనుగోలు చేయడంతోపాటు చాలా వేగంగా వాటిని డిస్పోజ్ చేస్తున్నారు. నిజానికి మనం వాడి పడేసే 95% వస్త్రాలను తిరిగి ధరించడం లేదా రీసైకిల్ చేయవచ్చు. ఈ కారణంతోనే ఇటీవలి కాలంలో పాతవి ఇవ్వండి కొత్తవి తీసుకెళ్లండి అంటూ పలు సంస్థలు ప్రచారం చేస్తున్నాయి. సుప్రసిద్ధ డిజైనర్లు వ్యర్థాల నుంచి డిజైన్లను తయారుచేస్తున్నారు.

సస్టెయినబల్ ఫ్యాషన్ ట్రెండ్స్ ఎలా ఉన్నాయంటే..

- ఇప్పుడు సర్క్యులర్ ఫ్యాషన్ ప్రాచుర్యంలోకి వచ్చింది. వీలైనన్ని ఎక్కువసార్లు ఫ్యాషన్ ఉత్పత్తులను వినియోగించడం ద్వారా పర్యావరణంపై ప్రభావాన్ని తగ్గిస్తున్నారు.
- అప్‌సైక్లింగ్ విధానం ద్వారా పాత వస్త్రాలకు కొత్త హంగులు అద్ది నూతన వస్త్రాలుగా తీర్చిదిద్దుతున్నారు.
- పర్యావరణ అనుకూల డైల వాడకంతో నీటి కాలుష్యాన్ని తగ్గించే ప్రయత్నం చేస్తున్నారు.
- ఇటీవలి కాలంలో వచ్చినఫ్యాషన్.. ఆన్ డిమాండ్ ఫ్యాషన్. సాధారణంగా మార్కెట్‌లోకి వచ్చిన డిజైనర్ వస్త్రాలలో 10-45% వరకు సేల్ కావడం లేదు. దీంతో మార్కెట్ అంచనాలను బట్టి కాకుండా, వాస్తవ పరిస్థితులను బేరీజు వేసుకుని ఫ్యాషన్‌లను తీర్చిదిద్దుతున్నారు.
- ఇక ఎప్పటి నుంచో ఉన్నది, ఇటీవలి కాలంలో హై ఎండ్ లగ్జరీ ఫ్యాషన్ స్టోర్లలో చేరిన ధోరణి సెకండ్ హ్యాండ్ క్లాతింగ్ మార్కెట్. సెకండ్ హ్యాండ్ ఫ్యాషన్ వస్త్రాల విక్రయాలు ఈ ఏడాది అంతర్జాతీయ మార్కెట్లో 10 శాతం వరకు ఉండే అవకాశం ఉందని పలు నివేదికలు చెబుతున్నాయి.

నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్‌పై ఉక్కుపాదం మోపాలి

● ఎక్సైజ్ అధికారులకు డిప్యూటీ కమిషనర్ ఆదేశాలు

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): డ్రగ్స్, నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్‌పై ఉక్కుపాదం మోపాలని డిప్యూటీ కమిషనర్ పి.దశరథ్ టాస్క్ ఫోర్స్ అధికారులను ఆదేశించారు. మంగళవారం అబ్కారీ భవన్‌లో రంగారెడ్డి జిల్లా పరిధిలోని ఎక్సైజ్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సెప్టెంబర్ నెలలో ఎక్సైజ్ అధికారులు, స్టేషన్ల పనితీరు సంతృప్తికరంగా ఉందన్నారు. నాటుసారా తయారీ కేంద్రాలపై దాడులు నిర్వహించి 56 కేసులు నమోదు చేశారని.. 53 మందిని అరెస్టు చేసి 111 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. దూల్‌పేట్‌లో గట్టి చర్యలు చేపట్టడంతో గంజాయి వ్యాపారాలు హైదరాబాద్ పరిసర ప్రాంతాల నుంచి అమ్మకాలు సాగిస్తున్నారనే సమాచారం ఉందని, మరింత నిఘా పెంచి గంజాయి, డ్రగ్స్‌ను నిర్మూలించాలని ఆదేశించారు. పెండింగ్ కేసుల్లో చార్జిషీట్స్ వేయాలని, లిక్కర్ అమ్మకాల్లో ధరల వ్యత్యాసాలు లేకుండా చూడాలని సూచించారు. సమావేశంలో అసిస్టెంట్ కమిషనర్ ఆర్.కిషన్, శంషాబాద్, మేడ్చల్, మల్కాజ్‌గిరి, సరూర్‌నగర్, వికారాబాద్ ఎక్సైజ్ సూపరింటెండెంట్లు కృష్ణప్రియ, ఎస్‌కే పయాజోద్దీన్, కె.నవీన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ కమిషనర్ దశరథ్

హైడ్రా కమిషనర్ రంగనాథ్‌ను కలిసిన వీహెచ్

నల్లకుంట, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): దసరా పండుగను పురస్కరించుకుని హైడ్రా కమిషనర్ రంగనాథ్‌ను మాజీ ఎంపీ వి.హనుమంతరావు కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా అంబర్‌పేట నియోజకవర్గం బాగ్ అంబర్‌పేట డివిజన్‌లోని బతుకమ్మకుంట భూ వ్యవహారంపై ఆయనతో చర్చించారు. వీహెచ్ వెంట మాజీ కార్పొరేటర్ పుల్లా నారాయణస్వామి ఉన్నారు.


రంగనాథ్‌కు పూలబోకే అందజేస్తున్న వీహెచ్

యాత్రికుల స్వర్గధామంగా మధ్యప్రదేశ్

● ఆ రాష్ట్ర పర్యాటక శాఖ ముఖ్య కార్యదర్శి షియో శేఖర్ శుక్లా

హైదరాబాద్, అక్టోబర్ 15 (ఆంధ్రజ్యోతి): నూతన అన్వేషణలను కోరుకునే యాత్రికుల స్వర్గధామంగా మధ్యప్రదేశ్ పర్యాటక కేంద్రాలు దేశ విదేశీ సందర్శకులను ఆకట్టుకుంటున్నాయి. వినోదం, విజ్ఞానం, సాంస్కృతిక అనుభవాల సాటి లేని సంగమంగా గాంధీసాగర్ ఫారెస్ట్ రీట్రీట్ అనుభవం నిలుపుతుందని మధ్యప్రదేశ్ రాష్ట్ర సాంస్కృతిక-పర్యాటక శాఖ ముఖ్య కార్యదర్శి, పర్యాటక బోర్డు మేనేజింగ్ డైరెక్టర్ షియో శేఖర్ శుక్లా పేర్కొన్నారు. మాండ్‌సౌర్‌లో ఆయన గాంధీసాగర్ ఫారెస్ట్ రిట్రీట్ మూడో ఎడిషన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా శేఖర్ శుక్లా మాట్లాడుతూ.. గాంధీసాగర్ బ్యాక్ వాటర్స్ ఒడ్డున ఉన్న గాంధీసాగర్ ఫారెస్ట్ రిట్రీట్ సమావేశాలు, చర్చాగోష్ఠులు, ప్రదర్శనలు, వివాహాలకు గమ్యస్థానంగా మారుతుందన్నారు. హాట్ ఎయిర్‌బెలూనింగ్, పారామోటరింగ్, జెట్ స్కీయింగ్, కయాకింగ్, మోటార్ బోటింగ్‌తో సహా అనేక రకాల థ్రిల్లింగ్ కార్యకలాపాలతో పర్యాటకులు ఆహ్లాదంగా గడపవచ్చని సూచించారు.

నేడు జేఎన్‌టీయూహెచ్‌లో జాతీయ సెమినార్

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): 'వికసిత్ భారత్-2047 లక్ష్యానికి చేరువ కావడంలో సాంకేతిక విద్యాసంస్థల పాత్ర' అంశంపై బుధవారం జేఎన్‌టీయూహెచ్ పరిశోధన, అభివృద్ధి విభాగం ఆధ్వర్యంలో జాతీయ సెమినార్ నిర్వహిస్తున్నట్లు కన్వీనర్ డాక్టర్ వి.కామాక్షిప్రసాద్ తెలిపారు. ముఖ్య అతిథిగా జేఎన్‌టీయూ అనంతపురం మాజీ ఉపకులపతి ప్రొఫెసర్ కె.లాల్‌కిషోర్, గౌరవ అతిథులుగా జేఎన్‌టీయూహెచ్ రెక్టార్ విజయకుమార్ రెడ్డి, రిజిస్ట్రార్ వెంకటేశ్వరరావు, యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్(యూజీసీ) మాజీ సభ్యుడు శివరాజ్‌సింగ్ తదితరులు హాజరుకానున్నట్లు వెల్లడించారు. విశ్వవిద్యాలయాల్లో పరిశోధనలకు కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ప్రాముఖ్యత ఇస్తున్న నేపథ్యంలో పరిశోధన రంగంలో తీసుకురావాల్సిన మార్పులపై రోడ్‌మ్యాప్‌ను రూపొందించేందుకు ఈ సెమినార్ దోహదపడుతుందన్నారు. జేఎన్‌టీయూహెచ్‌కు అనుబంధంగా ఉన్న 40 పరిశోధన కేంద్రాల నుంచి ప్రతినిధులు పాల్గొననున్న ఈ సమావేశానికి వర్సిటీ ఆర్ అండ్ డీ విభాగం ఉపసంచాలకులు ఉమాదేవి కోకన్వీనర్‌గా వ్యవహరించనున్నారు.

పేదలకు భూ పంపిణీ జరగాలి

● వ్యవసాయ కార్మిక సంఘం డిమాండ్

రాజేంద్రనగర్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): 78 ఏళ్ల స్వతంత్ర భారతదేశంలో ఎన్ని ప్రభుత్వాలు, పాలకులు మారినా వ్యవసాయ కార్మికులైన పేదలకు భూ పంపిణీ జరగడం లేదని రాష్ట్ర వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కలకొండ కాంతయ్య అన్నారు. రాజేంద్రనగర్‌లోని సీపీఐ జిల్లా కార్యాలయంలో సంఘం రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు జె.అంజయ్య అధ్యక్షతన మంగళవారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కాంతయ్య మాట్లాడుతూ.. పేదలకు భూములు, ఇళ్లు ఇస్తామని చెప్పి అధికారంలోకి వస్తున్నారు తప్ప ప్రజల సమస్యలను ఎవరూ పట్టించుకోవడం ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలకు చెందిన పేదలు వ్యవసాయ కూలీలుగా జీవిస్తున్నారని.. వారిలో చాలామందికి ఇప్పటికీ భూములు లేవన్నారు. దీనికి కారణం పాలకుల నిర్లక్ష్యమేనని ఆయన ఆక్షేపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీలను అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. నవంబరు 29, 30 తేదీల్లో శంషాబాద్‌లో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర సమితి సమావేశాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ మాజీ సభ్యుడు పుస్తకాల నర్సింగ్‌రావు, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర సమితి సభ్యుడు ఓరుగంటి యాదయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి బుద్దుల జంగయ్య, రైతు సంఘం రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.ప్రభులింగం, రాజేంద్రనగర్ మండల సీపీఐ కార్యదర్శి ఎండీ రియాజ్, గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు టి.నర్సింహారెడ్డి పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న కలకొండ కాంతయ్య

ఐఐఎంఆర్‌లో ముగిసిన 'హిందీ చేతన మాస్'

రాజేంద్రనగర్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): రాజేంద్రనగర్‌లోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మిల్లెట్ రీసెర్చ్ (ఐఐఎంఆర్)లో సెప్టెంబరు 14 నుంచి నిర్వహిస్తున్న హిందీ చేతన మాస్ కార్యక్రమం మంగళవారం ముగిసింది. ఐఐఎంఆర్ హిందీ సెల్ ఇన్‌చార్జి డాక్టర్ జీను జాకబ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం కొనసాగింది. ఇందులో భాగంగా నిర్వహించిన వివిధ రకాల పోటీలలో పాల్గొని విజేతలుగా నిలిచిన వారికి ఐఐఎంఆర్ డైరెక్టర్ డాక్టర్ టి.తారాసత్యవతి నగదు బహుమతులతో పాటు సర్టిఫికెట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. హిందీ భాష కు దేశంలోని అన్ని రాష్ట్రాలలో ప్రాధాన్యత ఉంటుందన్నారు. కార్యక్రమంలో రితూదళాల్, జి.సరస్వతి, డాక్టర్ మహేశ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.


విజేతలకు బహుమతులు, సర్టిఫికెట్లు అందజేస్తున్న ఐఐఎంఆర్ డైరెక్టర్ డాక్టర్ టి.తారాసత్యవతి

పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలి

బర్కత్‌పుర, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): కులికుతుబ్‌షా నగరాభివృద్ధి సంస్థ ఉద్యోగులకు గత రెండు నెలల వేతనాలను వెంటనే చెల్లించాలని సంస్థ ఉద్యోగుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు సయ్యద్ షంషాద్‌ఖాద్రీ, మహ్మద్ హసన్ డిమాండ్ చేశారు. మంగళవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఎస్ఎంఆర్ ఉద్యోగులు టైమ్ స్కేల్‌కు అర్హత కలిగి ఉన్నప్పటికీ కాలయాపన చేయడం సరికాదన్నారు. మృతిచెందిన ముత్తయ్య కుమారుడు పోచయ్యకు ఇంత వరకు ఉద్యోగం ఇవ్వలేదని, అతనికి వెంటనే పోస్టింగ్ ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు సంజీవ్, పి.ఆనంద్ పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న సయ్యద్ షంషాద్‌ఖాద్రీ

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను
48 గంటల్లో విడుదల చేయాలి

● ప్రభుత్వానికి ఆర్.కృష్ణయ్య అల్టిమేటం

బర్కత్‌పుర, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను 48 గంటల్లో విడుదల చేయకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని మాజీ ఎంపీ ఆర్.కృష్ణయ్య ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఫీజులు చెల్లించకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. మంగళవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేముల రామకృష్ణల సంయుక్త ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన డిగ్రీ, పీజీ కళాశాలల బంద్ విజయవంతమైందన్నారు. 12 లక్షల మంది విద్యార్థులకు చెల్లించాల్సిన బకాయిలు రూ.4,500 కోట్లను తక్షణమే విడుదల చేయాలని.. లేనిపక్షంలో మిలిటెంట్ పోరాటాలకు విద్యార్థులు సిద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు. తెలంగాణ ప్రైవేట్ డిగ్రీ, పీజీ కాలేజెస్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ (టీపీడీపీఎంఏ) అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ బి.సూర్యనారాయణ రెడ్డి, వై.రామకృష్ణ మాట్లాడుతూ.. నగదు తమ అకౌంట్లలో పడేవరకు కళాశాలల బంద్ నిర్వహిస్తామని హెచ్చరించారు. అప్పులు చేసి కళాశాలలు నడుపుతున్నామని, కనీసం కరెంట్ బిల్లులు సైతం కట్టలేని దుస్థితిలో ఉన్నామని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో బీసీ సంఘాల నేతలు నీల వెంకటేష్, జిల్లపల్లి అంజి, జి.మల్లేష్‌యాదవ్, రాంకోటి ముదిరాజ్, జి.అనంతయ్య, నందగోపాల్, మోదీరాందేవ్ పాల్గొన్నారు.


సమావేశంలో అభివాదం చేస్తున్న మాజీ ఎంపీ ఆర్.కృష్ణయ్య, వేముల వెంకటేష్, సూర్యనారాయణరెడ్డి తదితరులు

వర్గీకరణ చేస్తే మాలల తిరుగుబాటు తప్పదు

● ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి నేత రాజు ఉస్తాద్

కవాడిగూడ, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును పునసమీక్షించాలని షెడ్యూల్డ్ కులాల హక్కుల పరిరక్షణ జాతీయ అధ్యక్షుడు, ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి హైదరాబాద్ చైర్మన్ రాజు ఉస్తాద్ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. లేనిపక్షంలో కేంద్ర ప్రభుత్వంపై మాలల తిరుగుబాటు తప్పదని ఆయన హెచ్చరించారు. ఈ అంశంపై పరేడ్‌గ్రౌండ్ లేదా ఎల్‌బీ స్టేడియంలో మాలల బహిరంగ సభ నిర్వహించి తమ సత్తా చాటుతామన్నారు. మంగళవారం లోయర్ ట్యాంక్‌బండ్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ భవన్‌లో సమితి నేతలు, ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజు ఉస్తాద్ మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణ విషయంలో తెలంగాణ ప్రభుత్వం తీసుకునే ఎలాంటి నిర్ణయమైనా జూన్ 2014 నుంచి అమలులో ఉన్న అంశాలను మాత్రమే పరిగణలోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. దళితబంధు, గురుకుల విద్యా సంస్థల అడ్మిషన్లు, విదేశీ ఓవర్సీస్, ఎస్సీ బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీ వంటి వివరాలపై శ్వేతపత్రం విడుదల చేయాలని కోరారు. పెరిగిన జనాభాకు అనుగుణంగా రిజర్వేషన్లను పెంచాలని, రాష్ట్రం ఏర్పడినప్పటి నుంచి ఎస్సీల అభివృద్ధిపై సిట్టింగ్ జడ్జితో విచారణ చేయించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఎస్సీ వర్గీకరణ పోరాట సమితి కో కన్వీనర్లు శంకర్, రంగన్న, జంగా శ్రీనివాస్, బల్వంత్‌రావు, మాల రవీందర్, మేకల సత్యనారాయణ, మన్నె శ్రీధర్‌రావు తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాతున్న రాజు ఉస్తాద్

రామాయణానిది 14 వేల ఏళ్ల చరిత్ర

● వెల్లడించిన టెడెక్స్ స్పీకర్ నీలేష్ నీలకాంత్

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): అందరూ నమ్ముతున్నట్లుగా రామాయణం 5 వేల ఏళ్ల క్రితం జరిగినది కాదని, అంతకు మించిన చరిత్ర రామాయణానికి ఉందని రచయిత, యాంటిక్ పరిశోధకుడు, టెడెక్స్ స్పీకర్ నీలేష్ నీలకాంత్ ఓక్ అన్నారు. తన అంచనాల ప్రకారం రామాయణం 14 వేల సంవత్సరాల క్రితం జరిగితే, మహాభారతం 7 వేల సంవత్సరాల క్రితం జరిగిందన్నారు. ఇక రుగ్వేదానికి 21 వేల సంవత్సరాల చరిత్ర ఉందని ఆయన పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని నాలెడ్జిసిటీలో జరిగిన ఫిక్కీ లేడీస్ ఆర్గనైజేషన్ (ఫ్లో) సదస్సులో 'హీరోయిన్స్ ఆఫ్ ధర్మ: ద అన్‌కాంప్రమైజింగ్ స్పిరిట్ ఆఫ్ ఉమెన్ ఫ్రమ్ ఇండియన్ ఎపిక్స్' అనే అంశంపై ఆయన మాట్లాడారు. తాను ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వ్యక్తినని చెప్పిన ఆయన.. తన పూర్వీకులు 17వ శతాబ్దంలో కర్నూలు నుంచి వలస వెళ్లినట్లు తెలిపారు. తారాబాయ్ భోంస్లే లేకపోతే హిందువులు, హిందుత్వం ప్రశ్నార్థకమేనని పేర్కొన్న ఆయన.. దాదాపు 27 సంవత్సరాల పాటు పోరాడిన ఆమె ఔరంగజేబు సేనలను పలు యుద్ధాలలో ఓడించి మరాఠా సామ్రాజ్యాన్ని విస్తరింపజేశారన్నారు. మొఘల్ సామ్రాజ్యాన్ని ఎదుర్కొని మరాఠా కీర్తిపతాక ఎగరడంలో ఆమె పోరాటపటిమ ప్రశంసనీయమని కొనియాడారు. కాగా, మహాభారతం, రామాయణాలకు సంబంధించి నీలేష్ నీలకాంత్ మూడు పుస్తకాలను రాశారు. ఈ కార్యక్రమంలో ఫ్లో చైర్‌పర్సన్ ప్రియా గజ్దార్ తదితరులు పాల్గొన్నారు.


కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న అతిథులు

కర్ణాటక పుణ్యక్షేత్రాల సందర్శనకు ప్రత్యేక రైలు

బర్కత్‌పుర, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): కర్ణాటకలోని పుణ్యక్షేత్రాలను సందర్శించేందుకు డిసెంబర్ 5న భారత్ గౌరవ్ సౌత్ స్టార్ రైల్‌ను ఏర్పాటు చేసినట్లు టూర్ టైమ్స్ రీజనల్ మేనేజర్ రమేష్ అయ్యంగార్, సౌత్‌స్టార్ రైల్ ప్రాజెక్ట్ డైరెక్టర్ విఘ్నేష్ తెలిపారు. మంగళవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రైల్వే టూర్ పోస్టర్‌ను ఆవిష్కరించి వారు మాట్లాడారు. మార్గశిర మాసం సందర్భంగా నవ బృందావనం, గోకర్ణ, మురుడేశ్వర్, కొల్లూరు, శృంగేరి, హోంనాడు, ధర్మస్థల, కుకి సుబ్రహ్మణ్య, మైసూర్, శ్రీరంగపట్నం, మేల్‌కోటేలను సందర్శించడానికి 9 రోజుల పాటు యాత్ర కొనసాగుతుందని వారు పేర్కొన్నారు. ఈ టూర్‌కు 33 శాతం రాయితీ పొందవచ్చని, సీనియర్ సిటిజన్స్ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. డిసెంబర్ 5న చెన్నైలో బయల్దేరనున్న ఈ ట్రైన్ ఏపీలోని గూడూరు, నెల్లూరు, ఒంగోలు, చీరాల.. తెలంగాణలోని మిర్యాలగూడ, నల్గొండ, సికింద్రాబాద్‌లలో ఆగుతుందన్నారు. పూర్తి వివరాలకు 9355021516 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.


టూర్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న రమేష్ అయ్యంగార్, విఘ్నేష్

ఆర్టీసీ కార్మికుల సమస్యల పరిష్కారానికి వినతి

హైదరాబాద్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ తెలంగాణ జాతీయ మజ్దూర్ యూనియన్(టీజేఎంయూ) ప్రధాన కార్యదర్శి కె.హన్మంతు ముదిరాజ్ రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతిపత్రం అందజేశారు. 2013 పీఆర్‌సీ బాండ్ బకాయిలను సంస్థ ఉద్యోగులందరికీ చెల్లించాలని, ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు యూనియన్‌లను అనుమతించాలని, ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వ ఉద్యోగులుగా పరిగణించే ప్రక్రియను ప్రారంభించాలని విజ్ఞప్తి చేశారు. బ్రీత్ అనలైజర్ పేరుతో ఉద్యోగం నుంచి తొలగించిన డ్రైవర్లను తిరిగి నియమించాలని కోరారు. తమ వినతికి మంత్రి సానుకూలంగా స్పందించారని.. ప్రభుత్వంలో ఆర్టీసీ విలీనం పరిశీలనలో ఉన్నట్టు చెప్పారంటూ ఆయన ఓ ప్రకటనలో వివరించారు.

పంచదార లారీ మాయం డ్రామానే

● సరుకు అమ్ముకునేందుకు నాటకమాడిన యజమాని

జగ్గయ్యపేట, అక్టోబరు 15: జాతీయ రహదారిపై నిలిపి ఉంచిన పంచదార బస్తాల లారీ చోరీ కేసు మిస్టరీని చిల్లకల్లు పోలీసులు ఛేదించారు. యజమానే లారీని దాచిపెట్టి, సరుకును అమ్ముకోవాలనే ఉద్దేశంతోనే డ్రామాలాడినట్లు కృష్ణా జిల్లా జగ్గయ్యపేట సీఐ జానకీరాం వెల్లడించారు. నిందితుడు తెలంగాణలోని ఇల్లెందు వద్ద వదిలేసిన లారీతో పాటు అదే ప్రాంతంలో షెడ్‌లో దాచిపెట్టిన పంచదార బస్తాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ నెల 13న జాతీయ రహదారిపై చిల్లకల్లు సమీపంలోని కింగ్ దాబా వద్ద లారీని నిలిపి ఉంచగా అపహరణకు గురైనట్టు లారీ యజమాని జగ్గయ్యపేట పట్టణం తొర్రగుంటపాలెంకు చెందిన యాకుబ్ బాషా చిల్లకల్లు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. లారీలో 630 బస్తాల పంచదార ఉందని ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఈ నెల 9న కర్ణాటకలో శివశక్తి షుగర్ ఫ్యాక్టరీ వద్ద పంచదార బస్తాలను ఎగుమతి చేసుకుని ఒడిశాలోని కుర్దాలో దిగుమతి చేసేందుకు బయల్దేరినట్లు చెప్పాడు. 11న లారీ రిపేరు రావడంతో డ్రైవర్ ఆరిఫ్ జగ్గయ్యపేట ఆటోనగర్‌లో మరమ్మతులు చేయించి 12న ఒడిశా వెళ్లేందుకు హైవేపై నిలిపినట్లు ఫిర్యాదులో వివరించాడు. కేసు నమోదు చేసిన చిల్లకల్లు పోలీసులు లోతైన దర్యాప్తు జరపడంతో అసలు విషయం వెలుగులోకి వచ్చింది. 8 లారీలు నడుపుతున్న యాకుబ్ వాహనాలకు కిస్తీలు కట్టలేక ఈ డ్రామా ఆడారని, పంచదార బస్తాలు అమ్మేసి ఆ డబ్బును వాడుకోవాలని పథకం పన్నాడని సీఐ పేర్కొన్నారు. 24 గంటల్లో కేసును ఛేదించిన సీఐను, చిల్లకల్లు పోలీసులను ఉన్నతాధికారులు అభినందించారు.


హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ మార్గ్ అంబేడ్కర్ విగ్రహం వద్ద వర్షం కారణంగా చేరిన చెత్త, మురుగు నీరు


సభ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఐఎఫ్‌టీయూ నేతలు ఎస్.ఎల్.పద్మ, వి.ప్రవీణ్ తదితరులు

20న టీయూసీఐలో ఐఎఫ్‌టీయూ విలీన సభ

నల్లకుంట, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ దేశ సంపదను కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టడమే కాకుండా కార్మికుల హక్కులను హరిస్తున్నారని భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఐఎఫ్‌టీయూ) నేతలు ఆరోపించారు. మంగళవారం విద్యానగర్‌లోని మార్క్స్ భవన్‌లో ఐఎఫ్‌టీయూ హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల కమిటీ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా హాజరైన అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.ఎల్.పద్మ, వి.ప్రవీణ్ మాట్లాడారు. ఈ నెల 20న సుందరయ్యవిజ్ఞాన కేంద్రంలో టీయూసీఐలో ఐఎఫ్‌టీయూ విలీన సభ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సభకు సంబంధించిన పోస్టర్‌ను వారు ఆవిష్కరించారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సూర్యం, ఉపాధ్యక్షులు ఎం.హన్మేష్, నాయకులు జి.లింగంగౌడ్, నల్లన్న, బి.ప్రభాకర్, మొహమ్మద్, ఆఫ్జల్, జె.వెంకటేష్ పాల్గొన్నారు.

కుల, మతాంతర వివాహితులను గుర్తించాలి

రాంనగర్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): కులగణన చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని కులాంతర వివాహితుల సంక్షేమ సంఘం పేర్కొంది. ఈ మేరకు మంగళవారం సంఘం గౌరవాధ్యక్షులు వినయ్‌కుమార్, టి.స్కైలాబ్ బాబు, కార్యదర్శి ఎం.దశరథ్ బాగ్‌లింగంపల్లిలో విలేకరులతో మాట్లాడారు. కుల, మతాంతర వివాహాలు చేసుకున్న వారిని ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని, అయితే కులగణనలో వారి వివరాలు సేకరించాలని కోరారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ ఉపకులాల మధ్య వివాహాలను సైతం కులాంతర వివాహాలుగా గుర్తించాలని వారు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

కొచ్చువేలి, నెమోమ్ రైల్వే స్టేషన్‌ల పేర్లు మార్పు

హైదరాబాద్, అక్టోబర్ 15(ఆంధ్రజ్యోతి): దక్షిణ మధ్య రైల్వే పరిధిలోని కొచ్చువేలి, నెమోమ్ రైల్వే స్టేషన్‌ల పేర్లు మార్పు చేసినట్లు రైల్వే అధికారులు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. కొచ్చువేలి స్టేషన్‌ను తిరువనంతపురం ఉత్తరం, నెమోమ్ స్టేషన్ పేరును తిరువనంతపురం సౌత్‌గా మార్పు చేసినట్లు పేర్కొన్నారు.

బీఎస్పీ రాష్ట్ర కో-ఆర్డినేటర్లుగా ఇబ్రాం శేఖర్, ఈశ్వర్

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్ర కో-ఆర్డినేటర్లుగా ఇబ్రాం శేఖర్, ఈశ్వర్‌లను నియమించినట్లు ఆ పార్టీ సెంట్రల్ కో ఆర్డినేటర్ రాంజీ గౌతమ్ తెలిపారు. ఈ మేరకు రాష్ట్ర కేంద్ర కార్యాలయంలో మంగళవారం వారు బాధ్యతలు స్వీకరించారు. బీఎస్పీ బలోపేతానికి కృషి చేస్తామని వారు పేర్కొన్నారు.

స్కిల్ యూనివర్సిటీలో ఫిషరీస్ కోర్సులను ప్రవేశపెట్టాలి

హైదరాబాద్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటుచేసిన యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీలో ఫిషరీస్ కోర్సులు ప్రవేశపెట్టాలని ఫిషరీస్ ఫెడరేషన్ మాజీ చైర్మన్ పిట్టల రవీందర్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మంగళవారం సీఎం రేవంత్‌రెడ్డికి ఆయన లేఖ రాశారు. యూనివర్సిటీలో 17 కోర్సులు నిర్వహిస్తున్నట్లు ప్రకటించారని, అయితే వాటిల్లో ఫిషరీస్, ఆక్వాకల్చర్ కోర్సు లేకపోవటం శోచనీయమన్నారు. తెలంగాణలో అపరిమితమైన నీటి వనరులు ఉన్నప్పటికీ చేపల ఉత్పత్తిలో రాష్ట్రం పూర్తిగా వెనుకబడిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.


తహసీల్దార్ జానకి సమక్షంలో సర్వే చేస్తున్న అధికారులు

సర్వే చేసి మొగులయ్యకు స్థలం అప్పగింత

హయత్‌నగర్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): పద్మశ్రీ అవార్డు గ్రహీత, కిన్నెర వాయిద్యకారుడు మొగులయ్యకు హయత్‌నగర్‌లో కేటాయించిన 600 గజాల స్థలాన్ని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మంగళవారం మరోసారి సర్వే చేసి ఆయనకు అప్పగించారు. హయత్‌నగర్ తహసీల్దార్ జానకి, సీఐ నాగరాజుగౌడ్ సమక్షంలో సర్వే చేసి హద్దులు చూపించారు. కార్యక్రమంలో ఆర్ఐ నరసింహయాదవ్, సర్వేయర్ జ్యోతి, వీఆర్ఓ వీరన్న తదితరులు పాల్గొన్నారు.

విజయవంతంగా స్వచ్ఛత పక్వాడా ప్రచార కార్యక్రమాలు

హైదరాబాద్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): స్వచ్ఛభారత్ మిషన్ పదో వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని అక్టోబరు 1 నుంచి 15 వరకు స్వచ్ఛత పక్వాడ ప్రచార కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించినట్లు దక్షిణ మధ్య రైల్వే అధికారులు తెలిపారు. జోన్ పరిధిలోని 636 రైల్వే స్టేషన్లలో పరిశుభ్రతను మెరుగుపరిచినట్లు వివరించారు. 5,196 కిలో మీటర్ల రైల్వే ట్రాక్‌ను శుభ్రం చేశామని.. ఈ కార్యక్రమాల్లో 36,183 మంది అధికారులు, సిబ్బంది, పాఠశాల విద్యార్థులు పాల్గొన్నట్లు తెలిపారు. యాంటీ లిటరింగ్ డ్రైవ్‌లో భాగంగా రైల్వే స్టేషన్‌లు, రైళ్లలో చెత్త వేయకుండా 5,010 మందికి కౌన్సెలింగ్ ఇవ్వడంతో పాటు చెత్త వేసిన 283 మందికి జరిమానా విధించినట్లు వివరించారు. 73,836 చెట్లను నాటడంతో పాటు రైల్వే ట్రాక్‌లు, రైల్వే ప్రాంగణాల నుంచి 27.44 టన్నుల ప్లాస్టిక్‌ను సేకరించినట్లు వారు వెల్లడించారు. స్వచ్ఛత పక్వాడా ప్రచార కార్యక్రమంలో పాల్గొన్న వారిని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్ అభినందించారు.

అడ్డంకులు.. అవాంతరాలు ఎదురైనా

రాడార్ స్టేషన్‌కు శంకుస్థాపన

రంగారెడ్డి అర్బన్/పరిగి/పూడూర్, అక్టోబర్ 15 (ఆంధ్రజ్యోతి) : వికారాబాద్ జిల్లా పూడూరు మండలం దామగుండం అడవుల్లో వీఎల్ఎఫ్ నేవీ రాడార్ స్టేషన్ ఏర్పాటు సుదీర్ఘ కాలం తర్వాత శంకుస్థాపన జరిగింది. ఈ స్టేషన్ ఏర్పాటు విషయంలో అనేక అడ్డంకులు.. అవాంతరాలు ఎదురైనప్పటికీ ఎట్టకేలకు కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్, సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా మంగళవారం శంకుస్థాపన జరిగింది. 2010-11లోనే ఈ ప్రాజెక్టు ఏర్పాటుకు బీజం వేసినప్పటికీ 14 ఏళ్ల పుణ్యకాలం తర్వాత మోక్షం కలగడం విశేషం. కేంద్రంలో, రాష్ట్రంలో ప్రభుత్వాలు వేర్వేరుగా ఉండటం.. ఇతర అంశాల నేపథ్యంలో పరస్పర ఆమోదం లభించని కారణంగా ఈ ప్రాజెక్టు శంకుస్థాపనలో జాప్యం జరుగుతూ వచ్చింది. గత ప్రభుత్వ హయాంలోనే రాష్ట్ర ప్రభుత్వం అంగీకారం తెలిపినప్పటికీ.. కొన్ని షరతుల కారణంగా జాప్యం జరిగిందని అధికార వర్గాలు చెబుతూ వచ్చాయి. సీఎం రేవంత్‌రెడ్డి బాధ్యతలు చేపట్టాక నేవీ శాఖ అధికారుల మరోమారు సంప్రదింపులు జరిపారు. సీఎం అంగీకారం లభించిన నేపథ్యంలోనే అటవీశాఖకు చెందిన 2,935 ఎకరాల భూములను నేవీ శాఖకు అప్పగించారు. అనంతరం ఆ శాఖ అధికారులు వీఎల్ఎఫ్ నేవీ రాడార్ స్టేషన్ ఏర్పాటు ప్రక్రియను వేగిరం చేశారు. చివరకు అడ్డంకులు.. అవాంతరాలను అధిగమించి శంకుస్థాపన ఘట్టం ముగిసింది.

వీఎల్ఎఫ్ రాడార్ స్టేషన్ శంకుస్థాపన సాగిందిలా...

కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్, సీఎం రేవంత్‌రెడ్డి ముందుగా ఇచ్చిన షెడ్యూల్‌కు గంట ఆలస్యంగా వచ్చారు. నగరంలో కురిసిన భారీ వర్షం కారణంగా వాతావరణం అనుకూలించక హెలికాప్టర్‌లో రావాల్సిన రక్షణ మంత్రి, సీఎం రోడ్డు మార్గాన దామగుండం చేరుకున్నారు. మధ్యాహ్నం 1.35 గంటలకు రక్షణ మంత్రి, సీఎం వేదిక వద్దకు విచ్చేసి 1.40గంటలకు రాడార్ స్టేషన్ శంకుస్థాపన చేశారు. దామగుండం ప్రాంతంలో ఏర్పాటు కానున్న రాడార్ నమూనాను కేంద్ర మంత్రి, సీఎం, రాష్ట్ర మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, అధికారులు కలిసి పరిశీలించారు. మంత్రి రాజ్‌నాథ్‌సింగ్, సీఎం రేవంత్‌రెడ్డిని శాలువాతో సన్మానించారు. 1.52 గంటలకు భారత నౌకదళ ప్రధానాధికారి దినేష్ త్రిపాఠి చేపడుతున్న ప్రాజెక్టు పనులను చదివి వినిపించారు. 1.58 గంటల నుంచి మధ్యాహ్నం 2.10 గంటల వరకు 12 నిమిషాలు సీఎం ప్రసంగించారు. 2.10 గంటల నుంచి 2.37 గంటల వరకు (27 నిమిషాలు) రక్షణశాఖ మంత్రి ప్రసంగించారు. అనంతరం రక్షణ మంత్రి, సీఎం, కేంద్ర మంత్రి బండి సంజయ్, స్పీకర్ ప్రసాద్‌కుమార్, రాష్ట్ర మంత్రి కొండా సురేఖ, మండలి చీఫ్ విప్ మహేందర్‌రెడ్డి, ఎంపీలు కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, డీకే అరుణ, ఎమ్మెల్యేలు రామ్మోహన్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి, కాలె యాదయ్యలకు భారత నౌకాదళ ప్రధానాధికారి దినేష్ త్రిపాఠి జ్ఞాపికలను అందించి సత్కరించారు. 2.45 గంటలకు కార్యక్రమాన్ని ముగించారు.

ఐఐటీ హైదరాబాద్‌ను సందర్శించిన కెన్యా బృందం

హైదరాబాద్, అక్టోబరు 15: కెన్యా నేషనల్ ఇన్నోవేషన్ ఏజెన్సీ సారథ్యంలోని ప్రతినిధి బృందం ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ) హైదరాబాద్‌ను సందర్శించింది. ఐఐటీ-హెచ్‌లోని అధునాతన టెక్నాలజీ ఇన్నోవేషన్ సెంటర్ (ఐటీఐసీ)తో పాటు పలు విభాగాలను కెన్యా బృంద సందర్శించింది. ఈ సందర్భంగా భారత్-కెన్యా దేశాలు అధునాతన సాంకేతిక పరిజ్ఞానం, అంకుర సంస్థలు తదితర అంశాలపై పరస్పరం సహకరించుకునేందుకు వీలుగా భాగస్వామ్య చార్టర్‌పై సంతకాలు చేశారు. కెన్యా రిపబ్లిక్ పార్లమెంటు సభ్యులు అమీనా డికా అబ్దుల్లా, ఎదిత్ వెతి న్యాన్జే, ఇన్నోవేషన్ ఏజెన్సీ ప్రతినిధులతో పాటు ఆ దేశానికి చెందిన 11 విశ్వవిద్యాలయాల వైస్ చాన్సలర్లు, సీనియర్ సభ్యులు రెండు రోజుల పాటు ఐఐటీని సందర్శించారు. భవిష్యత్తులో సాంకేతిక విద్య, నూతన ఆవిష్కరణలు, అంకుర సంస్థల రంగాల్లో పరస్పరం సహకరించుకునే ఈ చార్టర్ తోడ్పడుతుందని ఐఐటీ హైదరాబాద్ డైరెక్టర్ ప్రొఫెసర్ బి.ఎస్.మూర్తి అన్నారు.

ఎవరితో ఎవరు	
	ఆస్ట్రేలియా X సౌతాఫ్రికా (గురువారం)
	వెస్టిండీస్ X న్యూజిలాండ్ (శుక్రవారం)

సెమీస్‌లో వెస్టిండీస్

- ఆఖరి లీగ్‌లో ఓడిన ఇంగ్లండ్ అవుట్
- దక్షిణాఫ్రికా ముందంజ ●వరల్డ్‌కప్

దుబాయ్: మహిళల టీ20 వరల్డ్ కప్‌లో ఆఖరి లీగ్ మ్యాచ్ నెగ్గిన వెస్టిండీస్ సెమీఫైనల్ బెర్త్ దక్కించుకుంది. ఈ మ్యాచ్‌లో ఓడిన ఇంగ్లండ్ టోర్నీ నుంచి నాకౌట్ అయ్యింది. గ్రూపులో వెస్టిండీస్, దక్షిణాఫ్రికా, ఇంగ్లండ్ తలా ఆరేసి పాయింట్లతో నిలిచాయి. అయితే అత్యుత్తమ రన్‌రేట్‌తో విండీస్ అమ్మాయిలు (+1.504) అగ్రస్థానం కైవసం చేసుకోగా, సఫారీలు (+1.382) రెండో స్థానంలో నిలిచారు. ఇక ఇంగ్లండ్ (+1.117) మూడో స్థానంతో వైదొలగింది. మంగళవారం జరిగిన మ్యాచ్‌లో ఇంగ్లండ్ తొలుత 141/7 స్కోరు చేసింది. స్కివర్ బ్రంట్ (57)తో సత్తా చాటింది. ఫ్లెచర్ మూడు వికెట్లు పడగొట్టింది. ఛేదనలో వెస్టిండీస్ 18 ఓవర్లలో 144/4 స్కోరు చేసి నెగ్గింది. క్వియానా (52), హేలీ మాథ్యూస్ (50) హాఫ్ సెంచరీలతో అదరగొట్టారు.

రెండో టీ20 లంకదే!

దంబుల్లా: స్పిన్నర్ దిముత్ వెల్లలగే (3/9) తిప్పేయడంతో.. రెండో టీ20లో శ్రీలంక ఘన విజయం సాధించింది. మంగళవారం జరిగిన మ్యాచ్‌లో లంక 73 పరుగుల తేడాతో వెస్టిండీస్‌ను చిత్తు చేసి మూడు టీ20ల సిరీస్‌ను 1-1తో సమం చేసింది. తొలుత శ్రీలంక నిర్ణీత 20 ఓవర్లలో 162/5 స్కోరు చేసింది. టాపార్డర్ బ్యాటర్లు పథుం నిస్సంక (54) రాణించాడు. ఛేదనలో విండీస్ 16.1 ఓవర్లలో 89 పరుగులకు కుప్పకూలింది. ఏడుగురు బ్యాటర్లు సింగిల్ డిజిట్‌కే పరిమితమయ్యారు. సిరీస్ నిర్ణాయక ఆఖరి, మూడో టీ20 గురువారం జరగనుంది.

సింధు ముందంజ

లక్ష్యసేన్ ఓటమి
డెన్మార్క్ ఓపెన్

ఒడెన్స్: పీవీ సింధు డెన్మార్క్ ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీలో ముందంజ వేసింది. అయితే లక్ష్యసేన్ మొదటి రౌండ్‌ను దాటలేకపోయాడు. మంగళవారం జరిగిన మహిళల సింగిల్స్ తొలి రౌండ్‌లో సింధు 21-8, 13-7తో ఆధిక్యంలో ఉన్న దశలో ప్రత్యర్థి పాయ్ యు పో (తైపీ) గాయంతో వైదొలగింది. మరో మ్యాచ్‌లో మాళవికా బన్సోడ్ 13-21, 21-21తో ఎన్‌గ్యూయెన్ (వియత్నాం) చేతిలో, ఆకర్షి కశ్యప్ 13-21, 12-21తో సుపనిద (థాయ్‌లాండ్) చేతిలో ఓటమి పాలైంది. లక్ష్యసేన్ 21-19, 19-21, 14-21తో లు గ్వాంజ్ (చైనా) చేతిలో పరాజయం పాలయ్యాడు. మహిళల డబుల్స్‌లో రుతుపర్ణ/శ్వేతపర్ణ జోడీ కూడా నిష్క్రమించింది.

భారత్‌ను ఆపతరమా?

జోరు మీదున్న రోహిత్ సేన



వరుస ఓటములతో కివీస్ • నేటి నుంచి తొలి టెస్టు

ఉదయం 9.30 నుంచి స్పోర్ట్స్18లో..

బెంగళూరు: ఓవైపు సొంత గడ్డపై వరుసగా 18 టెస్టు సిరీస్‌లను ఖాతాలో వేసుకున్న టీమిండియా..మరోవైపు స్వదేశంలో ఆసీస్‌పై, తర్వాత శ్రీలంక టూర్‌లోనూ వైట్‌వాష్‌కు గురై ఆత్మవిశ్వాసం పూర్తిగా అడుగంటిన న్యూజిలాండ్ జట్టు. ఇప్పుడీ రెండు జట్లమధ్య మూడు టెస్టుల సిరీస్‌కు సమయం ఆసన్నమైంది. ఇందులో భాగంగా నేటి నుంచి చిన్నస్వామి స్టేడియంలో తొలి టెస్టు జరుగనుంది. అన్ని విభాగాల్లో దూకుడుమీదున్న రోహిత్ సేనను కివీస్ ఏమేరకు అడ్డుకోగలుతుందనే ఆసక్తి సర్వత్రా వ్యక్తమవుతోంది. కీలక ప్లేయర్లు గాయాలతో దూరమైన వేళ పర్యాటక జట్టు తమ స్థాయికి మించిన ప్రదర్శన కనబర్చాల్సి ఉంది. కివీస్ ఇప్పటివరకు భారత్‌లో టెస్టు సిరీస్ గెలవకపోవడం గమనార్హం. మరోవైపు ఇటీవలే బంగ్లాదేశ్‌ను చిత్తుగా ఓడించి సిరీస్ దక్కించుకున్న భారత జట్టు రెట్టించిన ఉత్సాహంతో కివీస్‌ను కకావికలం చేయాలనుకుంటోంది. వరల్డ్ టెస్టు చాంపియన్‌షిప్ ఫైనల్‌లో చోటును ఆశిస్తున్న ఆతిథ్య జట్టుకు ఈ సిరీస్‌ను క్లీన్‌స్వీప్ చేయడం చాలా అవసరం.





కివీస్ కెప్టెన్ లేథమ్

సమస్యల వలయంలో..

తొలి టెస్టుకు ముందే కివీస్ జట్టును సమస్యలు చుట్టుముట్టాయి. తమ ప్రధాన బ్యాటర్ కేన్ విలియమ్సన్ ఈ టెస్టుకు దూరం కాగా పేసర్ బెన్ సియర్స్ గాయంతో సిరీస్ నుంచే తప్పుకొన్నాడు. అతడి స్థానంలో అన్‌క్యాప్డ్ జాకబ్ డఫీని తీసుకున్నారు. ఇక వీరి బ్యాటింగ్ విభాగం కూడా పేలవ ఫామ్‌తో ఉంది. లంక స్పిన్నర్ల ధాటికి ఒక్కరు కూడా సెంచరీ చేయలేకపోయారు. ఇక పదునైన భారత పేసర్లు, నాణ్యమైన స్పిన్నర్లను ఎదుర్కోవడం సవాల్‌గా మారనుంది. కొత్త కెప్టెన్ టామ్ లేథమ్, కాన్వే, మిచెల్ కూడా ఫామ్‌లో లేరు. బౌలింగ్‌లో కొత్త పేసర్ విల్ ఓరూర్కె, స్పిన్నర్ ఎజాజ్ పటేల్‌పైనే జట్టు ఆశలు పెట్టుకుంది. కివీస్ ఇక్కడి చివరి పర్యటనలో ఎజాజ్ పదికి పది వికెట్లతో అబ్బురపరిచాడు. సీనియర్లు సౌథీ, శాంట్నర్ లంక టూర్‌లో ప్రభావం చూపలేదు. ఈ తరుణంలో భారత బ్యాట్స్‌మన్‌ను ఇబ్బందిపెట్టాలంటే కివీస్ బౌలర్లు చెమటోడ్చాల్సిందే.

వరుణుడితో ఇబ్బందే

బెంగళూరులో ప్రస్తుతం భారీ వర్షాలు కురుస్తున్నాయి. దీంతో తొలి టెస్టు సజావుగా సాగే అవకాశాలు కనిపించడం లేదు. ఇప్పటికే మంగళవారం కురిసిన వర్షానికి ఇరు జట్ల ప్రాక్టీస్ కూడా రద్దయ్యింది. దీనికి తోడు బుధవారం కుంభవృష్టికి చాన్స్ ఉండడంతో ఎల్లో అలర్ట్ జారీ చేస్తూ స్థానిక పాఠశాలలకు సెలవు ప్రకటించారు. దీంతో మొదటి రోజు ఆటగాళ్లు బరిలోకి దిగడం కష్టమే. రానున్న మూడు, నాలుగు రోజులు కూడా ఇదే పరిస్థితి ఉండనున్నట్టు వాతావరణ శాఖ హెచ్చరించింది. మరోవైపు చిన్నస్వామి స్టేడియంలో ఆధునిక డ్రైనేజీ వ్యవస్థ ఉండడం అభిమానులకు కాస్త ఊరటనిచ్చే అంశం.

తుది జట్లు (అంచనా)

భారత్: రోహిత్ శర్మ (కెప్టెన్), జైస్వాల్, గిల్/సర్ఫరాజ్, విరాట్, పంత్, రాహుల్, జడేజా, అశ్విన్, ఆకాశ్‌దీప్/కుల్దీప్, బుమ్రా, సిరాజ్.
న్యూజిలాండ్ : కాన్వే, లేథమ్ (కెప్టెన్), విల్ యంగ్, రచిన్, మిచెల్, బ్లండెల్, ఫిలిప్స్, శాంట్నర్/బ్రేస్‌వెల్, సౌథీ, ఓరూర్కీ, ఎజాజ్.

పిచ్

ఇక్కడి పిచ్ సహజంగా బ్యాటింగ్‌కు అనుకూలిస్తుంటుంది. అయితే వాతావరణ పరిస్థితి కారణంగా పిచ్‌ను కొన్ని రోజులుగా కవర్లతో కప్పి ఉంచారు. 2022లో ఈ చిన్నస్వామి స్టేడియంలో జరిగిన చివరి టెస్టులో భారత్-శ్రీలంక జట్లు ముగ్గురేసి స్పిన్నర్లతో బరిలోకి దిగాయి.

రోహిత్, విరాట్ చెలరేగాల్సిందే..

భారత జట్టు వరుస విజయాలు ఎలా ఉన్నా కెప్టెన్ రోహిత్ శర్మ, స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ ఫామ్ టీమ్ మేనేజ్‌మెంట్‌ను ఆందోళనపరుస్తోంది. బంగ్లాతో సిరీస్‌లో ఈ జోడీ కనీసం అర్ధసెంచరీ చేయలేకపోయింది. రోహిత్ ఈ ఏడాది ఆడిన 15 ఇన్నింగ్స్‌లో రెండు శతకాలు మాత్రమే సాధించాడు. ఇక కోహ్లీ ఆడిన ఆరు ఇన్నింగ్స్‌లో కనీసం ఓ హాఫ్ సెంచరీ కూడా లేదు. న్యూజిలాండ్ స్పిన్నర్లు ఎజాజ్ పటేల్, రచిన్ గతంలో విరాట్‌ను ఇబ్బందిపెట్టారు. ఏదిఏమైనా మున్ముందు ఆసీస్‌తో సిరీస్ ఆడాల్సి ఉండడంతో వీరు తమ పరుగుల దాహన్ని తీర్చుకోవాల్సిందే. ఇక ఓపెనర్ గిల్ మెడ సమస్యతో ఈ టెస్టుకు అందుబాటులో ఉండేది సందేహంగా మారింది. అతను ఆడలేకపోతే సర్ఫరాజ్‌ను బరిలోకి దించే చాన్సుంది. మరో ఓపెనర్ జైస్వాల్ సూపర్ ఫామ్‌లో ఉన్నాడు. అతడి చివరి 8 ఇన్నింగ్స్‌లో డబుల్ సెంచరీతో పాటు ఐదు అర్ధసెంచరీలుండడం విశేషం. నేటి ఉదయం వాతావరణ పరిస్థితిని బట్టి అదనపు స్పిన్నర్‌తో వెళ్లాలా? లేక పేస్ త్రయం బుమ్రా, సిరాజ్, ఆకాశ్‌దీప్‌లతో బరిలోకి దిగాలా? అనేది నిర్ణయించనున్నారు.

సీఎం చెప్పినా వినరా?



గచ్చిబౌలి స్టేడియంలో 19న సంగీత విభావరికి అనుమతి

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): స్టేడియాలను ఇకపై బహిరంగ సభలు, సమావేశాలు, క్రీడేతర కార్యక్రమాలకు వినియోగించబోమని సాక్షాత్తూ సీఎం రేవంత్ రెడ్డి రెండునెలల కిందట ఎల్బీ స్టేడియం వేదికగా చెప్పిన మాటలను స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ (శాట్) యంత్రాంగం బేఖాతరు చేస్తోంది. వచ్చే శనివారం గచ్చిబౌలి ప్రధాన స్టేడియంలో దేవిశ్రీ ప్రసాద్ సంగీత విభావరి నిర్వహించేందుకు అనుమతి ఇచ్చింది. ఇటీవలే రాష్ట్ర ప్రభుత్వం సుమారు రూ.16 కోట్లకు పైగా వెచ్చించి, స్టేడియంలోని సీట్లు, ఫుట్‌బాల్ మైదానాన్ని ఆధునికీకరించింది. అథ్లెటిక్ ట్రాక్‌ను కూడా మరమ్మతు చేసే ఆలోచనలో ఉన్న సమయంలో ఈ సంగీత విభావరికి స్టేడియంను 'శాట్ ఎలా కేటాయించిందని క్రీడాకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఇళయరాజా సంగీత విభావరికి స్టేడియాన్ని ఇచ్చినప్పుడు ఫుట్‌బాల్ మైదానంలో గుంతలు తవ్వడం, ఆహార పదార్థాల వ్యర్థాలు, ప్లాస్టిక్ వాటర్ బాటిళ్లు పడేసి చిందరవందరగా తయారు చేశారు. ఇప్పటికే సంగీత విభావరి నిర్వాహకులు అథ్లెటిక్ సింథటిక్ ట్రాక్‌పైన స్టేజ్ కూడా వేయడంతో 'శాట్ అధికారుల తీరుపై క్రీడాకారులు, క్రీడాభిమానులు మండిపడుతున్నారు.

టాప్ లేపిన ఉదిత



రూ. 32 లక్షల భారీ ధర
మహిళల హాకీ లీగ్ వేలం

న్యూఢిల్లీ: భారత జట్టు డిఫెండర్ ఉదిత దుహన్ మహిళల హాకీ ఇండియా లీగ్ (హెచ్‌ఐఎల్)లో అత్యధిక ధర పలికిన ప్లేయర్‌గా నిలిచింది. మంగళవారం జరిగిన వేలంలో బెంగాల్ టైగర్స్ రూ. 32 లక్షలకు ఉదితను కొనుగోలు చేసింది. రూ. 29 లక్షలతో డచ్ స్టార్ డ్రాగ్ ఫ్లికర్ ఇబ్బీ జన్సెన్ (ఒడిశా వారియర్స్) భారీ ధర పలికిన క్రీడాకారిణి గా రెండో స్థానంలో నిలిచింది. భారత ప్లేయర్లు లాల్‌రెమ్సియామిని బెంగాల్ టైగర్స్ రూ. 25 లక్షలకు కొనుగోలు చేయగా.. ఢిల్లీ ఎస్‌జీ పైపర్స్ సునెలిటా టొప్పోను రూ. 24 లక్షలకు, సంగీత కుమారిని రూ. 22 లక్షలకు సొంతం చేసుకొంది. భారత జట్టు కెప్టెన్ సలీమా టిటే (రూ. 20 లక్షలు), ఇషిక చౌదరి (రూ. 16 లక్షలు), నేహా గోయల్ (రూ. 10 లక్షలు)ను ఒడిశా వారియర్స్ కొనుగోలు చేసింది.

అరంగేట్రంలో శతకం

- అదరగొట్టిన గులామ్
- ఇంగ్లండ్-పాక్ రెండో టెస్టు

ముల్తాన్: అరంగేట్రంలోనే కమ్రాన్ గులామ్ (118) సెంచరీతో అదరగొట్టడంతో.. ఇంగ్లండ్‌తో రెండో టెస్ట్‌లో పాకిస్థాన్ నిలకడగా ఆడుతోంది. మంగళవారం ఆరంభమైన మ్యాచ్‌లో తొలి ఇన్నింగ్స్‌లో పాక్ 259/5 స్కోరు చేసింది. రిజ్వాన్ (37), సల్మాన్ ఆగా (5) క్రీజులో ఉన్నారు. గులామ్.. ఆడిన తొలి టెస్ట్‌లోనే శతకం బాదిన 13వ పాక్ బ్యాటర్‌గా రికార్డులకెక్కాడు. అయితే, ఆఖరి సెషన్‌లో కమ్రాన్‌ను బషీర్ బౌల్డ్ చేశాడు. సైమ్ అయూబ్ (77) రాణించగా.. అబ్దుల్ షఫీక్ (7), కెప్టెన్ షాన్ మసూద్ (3), సౌద్ షకీల్ (4) స్వల్ప స్కోర్లకే వెనుదిరిగారు. జాక్ లీచ్ 2 వికెట్లు పడగొట్టాడు.





ఐదేళ్లలో 5 లక్షల ఉద్యోగాలు

టాటా సన్స్ చైర్మన్ ఎన్ చంద్రశేఖరన్

న్యూఢిల్లీ: వచ్చే ఐదేళ్లలో టాటా గ్రూప్ తయారీ రంగంలో 5 లక్షల ఉద్యోగాలను సృష్టించనుందని టాటా సన్స్ చైర్మన్ నటరాజన్ చంద్రశేఖరన్ మంగళవారం తెలిపారు. సెమీకండక్టర్లు, ప్రెసిషన్ మాన్యుఫాక్చరింగ్, అసెంబ్లింగ్, విద్యుత్ వాహనాలు (ఈవీ), బ్యాటరీలు, సంబంధిత పరిశ్రమల్లో ఈ ఉద్యోగాలను కల్పించనుందన్నారు. ఇండియన్ ఫౌండేషన్ ఫర్ క్వాలిటీ మేనేజ్‌మెంట్ (ఐఎఫ్‌క్యూఎం) నిర్వహించిన సింపోజియమ్‌లో ప్రసంగిస్తూ ఆయన ఈ విషయాన్ని వెల్లడించారు. ఈ సింపోజియమ్‌లో కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్, టీవీఎస్ మోటార్ కంపెనీ గౌరవ చైర్మన్ వేణు శ్రీనివాసన్ కూడా పాల్గొన్నారు. చంద్రశేఖరన్ ఇంకా ఏమన్నారంటే..

- అసోంలో టాటా సెమీకండక్టర్ల తయారీ ప్లాంట్‌ను ఏర్పాటు చేస్తోంది. అలాగే ఈవీలు, వాటి బ్యాటరీలతో పాటు పలు తయారీ యూనిట్లను నెలకొల్పుతోంది. ఈ ప్లాంట్ల ఏర్పాటుతో భారీగా ఉద్యోగాల కల్పనతో పాటు వాటికి సమీపంలో కనీసం 5 లక్షల చిన్న, మధ్య స్థాయి పరిశ్రమలు సైతం ఏర్పాటు కావచ్చని అంచనా.
- కేంద్ర ప్రభుత్వం తయారీ రంగానికి, ఈ రంగంలో ఉద్యోగాల కల్పనకు భారీగా మద్దతునిస్తోంది. 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా ఎదగాలన్న భారత లక్ష్య సాకారంలో మాన్యుఫాక్చరింగ్ రంగం కీలక పాత్ర పోషించనుంది. ఈ రంగంలో భారీగా ఉద్యోగాలు సృష్టించలేకపోతే వికసిత్ భారత్ లక్ష్యాన్ని చేరుకోలేం. ఎందుకంటే, ప్రతి నెలా 10 లక్షల మంది యువత ఉద్యోగ మార్కెట్లోకి వస్తున్నారు. వారందరికీ ఉపాధి కల్పించేందుకు 10 కోట్ల ఉద్యోగాలు సృష్టించాల్సిన అవసరం ఉంది.
- సెమీకండక్టర్ల వంటి ఆధునిక సాంకేతికతతో కూడిన ఉత్పత్తుల తయారీ రంగంలో కల్పించే ప్రతి ఒక్క ఉద్యోగం 8 నుంచి 10 పరోక్ష ఉపాధి అవకాశాలను సృష్టించగలదు.

వారిని గుడ్డిగా అనుసరించవద్దు: శ్రీనివాసన్

అత్యంత నాణ్యమైన సేవలు, ఉత్పత్తుల మార్కెట్లో ప్రపంచ అగ్రగామిగా ఎదిగేందుకు మనదైన ప్రత్యేక శైలి అవసరమని టీవీఎస్ చైర్మన్ వేణు శ్రీనివాసన్ సూచించారు. ఆర్థికాభివృద్ధి విషయంలో జర్మనీ, అమెరికా, జపాన్, దక్షిణ కొరియా, చైనా ఎంచుకున్న బాటను మనమూ గుడ్డిగా అనుసరించవద్దని, అలా చేస్తే మనం వెనకబడిపోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు.

ఎన్నికలతో సంబంధం లేని అభివృద్ధి పథం: వైష్ణవ్

దేశంలో ఎన్నికలతో సంబంధం లేకుండా అభివృద్ధి చెందే ప్రక్రియకు పునాది వేస్తున్నట్లు కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ చెప్పారు. 2047 నాటికి భారత్ అభివృద్ధి చెందిన దేశంగా అవతరించాలంటే నావినల్ జీడీపీ 30 లక్షల కోట్ల డాలర్లకు, తలసరి ఆదాయం 18,000 డాలర్ల స్థాయికి చేరుకోవాలన్నారు. ప్రస్తుతం జీడీపీ 4 లక్షల కోట్ల డాలర్లు, తలసరి ఆదాయం 3,000 డాలర్ల స్థాయిలో ఉందన్నారు. ఈ లెక్కన మనం లక్ష్యాన్ని చేరుకునేందుకు రాబోయే 25 ఏళ్లలో 6-7 రెట్ల వృద్ధిని సాధించాల్సిన అవసరం ఉందన్నారు.

డిజిటల్ టెక్నాలజీలపై జర జాగ్రత్త



అంతర్జాతీయ కట్టుబాట్లే మేలు

- 'ఏఐ'కీ నైతిక ప్రమాణాలు ఉండాలి
- సమిష్టి కృషితోనే సైబర్ నేరాలకు చెక్
- ప్రధాని నరేంద్ర మోదీ

న్యూఢిల్లీ: డిజిటల్ టెక్నాలజీల వినియోగానికి సంబంధించి అంతర్జాతీయ కట్టుబాట్లు ఉండాలని ప్రధాని నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. ఢిల్లీలో ప్రారంభమైన ఇండియన్ మొబైల్ కాంగ్రెస్ (ఐఎంసీ), ఐటీయూ డబ్ల్యూటీఎస్ఏ, 2024 సదస్సులో ప్రసంగిస్తూ ఆయన ఈ సూచన చేశారు. 'డిజిటల్ టెక్నాలజీలు, యాప్స్‌కు ఎలాంటి భౌతిక సరిహద్దులు లేవు. దీంతో ప్రస్తుతం ఏ ఒక్క దేశమూ ఒంటరిగా తన పౌరులను సైబర్ నేరాల నుంచి రక్షించుకునే స్థితి లేదు. ఈ నేపథ్యంలో డిజిటల్ టెక్నాలజీలతో చేయదగ్గ, చేయకూడని పనులు, వ్యవహారాలకు సంబంధించి అంతర్జాతీయ కట్టుబాట్లు ఏర్పాటు చేసుకోవాలి. ఇందుకోసం అన్ని దేశాలు కలిసికట్టుగా పనిచేయాలి' అని ప్రధాని అన్నారు. ఏఐ వంటి డిజిటల్ టెక్నాలజీల కట్టుబాట్ల విషయంలో వివిధ దేశాల వైవిధ్యం, అవసరాలను దృష్టిలో ఉంచుకుని నైతిక ప్రమాణాలు రూపొందించుకోవాల్సిన అవసరం కూడా ఉందని ప్రధాని మోదీ నొక్కి చెప్పారు.

మన డేటా మన దగ్గరే ఉండాలి

భారత వినియోగదారులకు సంబంధించిన డేటాను మన దేశంలోనే స్టోర్ చేయాలని రిలయన్స్ జియో చైర్మన్ ఆకాశ్ అంబానీ కోరారు. ఇందుకోసం కృత్రిమ మేధ (ఏఐ), మెషిన్ లెర్నింగ్ (ఎంఎల్) టెక్నాలజీల సాయంతో డేటా కేంద్రాలు ఏర్పాటు చేసేందుకు ముందుకు వచ్చే కంపెనీలకు విద్యుత్ వంటి విషయాల్లో ప్రభుత్వం కొన్ని ప్రోత్సాహకాలు ఇవ్వాలని కోరారు. ఏఐ అన్ని రంగాల స్వరూపాలను మార్చి వేసే ఒక విప్లవాత్మక టెక్నాలజీ అని అంబానీ అన్నారు.

వొడాఫోన్ ఐడియాను గట్టెక్కిస్తాం

వొడాఫోన్ ఐడియా కంపెనీని ఆర్థిక కష్టాల నుంచి గట్టెక్కిస్తామని ఐఎంసీ సదస్సులో పాల్గొన్న ఆదిత్య బిర్లా గ్రూప్ చైర్మన్ కుమార మంగళం బిర్లా అన్నారు. ఇప్పుడిప్పుడే కంపెనీ ఆర్థిక కష్టాల నుంచి బయటపడి కొత్త పెట్టుబడులతో ముందుకు వెళుతోందన్నారు.

రూ.1,099కే జియో కొత్త 4జీ ఫోన్లు

ఈ సదస్సు సందర్భంగా రిలయన్స్ జియో కొత్త 4జీ ఫోన్లను ఆవిష్కరించింది. జియో భారత్ వీ3, జియో భారత్ వీ4 పేరుతో విడుదల చేసిన ఈ 4జీ ఫోన్ల ధర రూ.1,099 మాత్రమే. రూ.123 నెలవారీ రీచార్జ్‌తో ఈ ఫోన్ల ద్వారా అపరిమిత వాయిస్ కాల్స్, 14 జీబీ డేటా లభిస్తుంది.

బిజినెస్

స్పెక్ట్రం వేలమే కరెక్ట్

కృత్రిమ ఉపగ్రహాల ద్వారా టెలికాం సేవలు అందించే కంపెనీలు కూడా స్పెక్ట్రంను వేలం ద్వారానే పొందాలని ఆకాశ్ అంబానీ, ఎయిర్‌టెల్ చీఫ్ సునీల్ మిట్టల్ స్పష్టం చేశారు. అలాగే ఈ కంపెనీల నుంచి లైసెన్స్ ఫీజు వసూలు చేయాలన్నారు. అప్పుడే అన్ని కంపెనీలకు సమాన అవకాశాలు ఏర్పడతాయని మిట్టల్ తెలిపారు. అయితే ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ మాత్రం ఈ సూచనను తోసిపుచ్చారు. ట్రాయ్ సూచించిన విధంగా ఈ కంపెనీలకు స్పెక్ట్రంను ప్రత్యేక కేటాయింపుల ద్వారానే కేటాయించాలన్నారు. ఈ విషయంలో అంబానీ, మిట్టల్ సూచన అసాధారణంగా ఉందన్నారు. ఉపగ్రహాల ద్వారా మన దేశంలో టెలికాం సేవలు అందించేందుకు మస్క్ నాయకత్వంలోని 'స్టార్ లింక్' కంపెనీ కూడా దరఖాస్తు చేసింది.

బిజినెస్ ఫిన్లాండ్‌తో సైయెంట్ జట్టు

CYIENT

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ఎమర్జింగ్ టెక్నాలజీల్లో ఇన్నోవేషన్ కోసం బిజినెస్ ఫిన్లాండ్‌తో సైయెంట్ అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది 5జీ, కృత్రిమ మేధ (ఏఐ), సస్టేనబిలిటీ సొల్యూషన్స్, స్పేస్ టెక్నాలజీ, రోబోటిక్స్ సహా కటింగ్-ఎడ్జ్ టెక్నాలజీలపై మరింతగా దృష్టి సారించేందుకు ఈ ఒప్పందం దోహదపడుతుందని సైయెంట్ తెలిపింది. అంతేకాకుండా యూరప్ సహా ఫిన్లాండ్‌లో సైయెంట్ కార్యకలాపాలను మరింత పటిష్ఠం చేసే అవకాశం లభిస్తుందని పేర్కొంది. ఫిన్లాండ్ ప్రభుత్వ సంస్థ అయిన బిజినెస్ ఫిన్లాండ్.. ప్రపంచవ్యాప్తంగా 40 కార్యాలయాలతో పాటు ఫిన్లాండ్ వ్యాప్తంగా 16 రీజినల్ కార్యాలయాలను నిర్వహిస్తోంది.

ఫామ్‌గేట్ ధర		వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్	
హైదరాబాద్	126	విజయవాడ	135
వరంగల్	126	గుంటూరు	135
కరీంనగర్	126	ఒంగోలు	135
మహబూబ్‌నగర్	126	చిత్తూరు	135
కర్నూలు	126	నెల్లూరు	135
విశాఖపట్నం	125	నెల్లూరు	135
గోదావరి	135	అనంతపురం	135

రిలయన్స్ షేర్లు పడేశాయ్..

సెన్సెక్స్ 153 పాయింట్లు డౌన్

ముంబై: మార్కెట్ దిగ్గజం రిలయన్స్ ఇండస్ట్రీస్‌తో పాటు హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, బజాజ్ ఫైనాన్స్ షేర్లలో అమ్మకాల కారణంగా ప్రామాణిక ఈక్విటీ సూచీలు మంగళవారం నష్టాలు చవిచూశాయి. సెన్సెక్స్ ఒక దశలో 337 పాయింట్ల మేర క్షీణించినప్పటికీ, చివరికి 152.93 పాయింట్ల నష్టంతో 81,820.12 వద్ద ముగిసింది. నిఫ్టీ 70.60 పాయింట్లు కోల్పోయి 25,057.35 వద్ద స్థిరపడింది. ధరల సూచీ మళ్లీ ఎగబాకడంతో పాటు నిరాశాజనక త్రైమాసిక ఆర్థిక ఫలితాలు ట్రేడింగ్ సెంటిమెంట్‌కు గండికొట్టాయని విశ్లేషకులు పేర్కొన్నారు. సెన్సెక్స్‌లోని 30 కంపెనీల్లో 20 నష్టపోగా.. బజాజ్ ఫైనాన్స్ షేరు 2.73 శాతం క్షీణించి సూచీ టాప్ లూజర్‌గా మిగిలింది. సెప్టెంబరు త్రైమాసికంలో రిలయన్స్ ఇండస్ట్రీస్ లాభం 5% తగ్గడంతో కంపెనీ షేరు 2.09% పతనమైంది. ఆర్థిక ఫలితాలు మెరుగ్గా ఉండటంతో హెచ్‌సీఎల్ టెక్ షేరు ఇంట్రాడేలో 1.40% పెరిగి రూ.1,882 వద్ద సరికొత్త ఏడాది గరిష్ఠాన్ని నమోదు చేసింది. చివరికి 0.76% లాభంతో రూ.1,870 వద్ద స్థిరపడింది.

కొచ్చిన్ షిప్‌యార్డ్‌లో 5% వాటా విక్రయం

కేంద్ర ప్రభుత్వం.. కొచ్చిన్ షిప్‌యార్డ్‌లో 5 శాతం వరకు వాటాను ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్) పద్ధతిన విక్రయించనున్నట్లు మంగళవారం ప్రకటించింది. షేరు కనీస ధరను రూ.1,540గా నిర్ణయించింది. బుధవారం నుంచి వాటా విక్రయం ప్రారంభం కానుందని.. రిటైల్ ఇన్వెస్టర్లు, సంస్థ ఉద్యోగులు గురువారం బిడ్ వేయవచ్చని పెట్టుబడులు, ప్రభుత్వ ఆస్తుల నిర్వహణ డిపార్ట్‌మెంట్ (దీపం) వెల్లడించింది. కంపెనీలో వాటా విక్రయం ద్వారా ప్రభుత్వానికి రూ.2,000 కోట్ల వరకు ఆదాయం సమకూరనుంది. ప్రస్తుతం కొచ్చిన్ షిప్‌యార్డ్‌లో కేంద్ర ప్రభుత్వం 72.86 శాతం వాటా కలిగి ఉంది.

హ్యుండయ్ ఐపీఓకు 18% సబ్‌స్క్రిప్షన్

హ్యుండయ్ మోటార్ ఇండియా లిమిటెడ్ రూ.27,870 కోట్ల మెగా ఐపీఓకు తొలి రోజున 18 శాతం సబ్‌స్క్రిప్షన్ లభించింది. ఐపీఓలో భాగంగా కంపెనీ 9,97,69,810 షేర్లను అమ్మకానికి పెట్టగా..మంగళవారం 1,77,89,457 షేర్ల కొనుగోలుకు బిడ్లు దాఖలైనట్లు ఎన్ఎస్ఈ వెల్లడించింది.

ట్రూ గుడ్ రూ.75 కోట్ల సమీకరణ

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): హైదరాబాద్‌కు చెందిన మిల్లెట్ ఆధారిత స్నాక్ బ్రాండ్ ట్రూ గుడ్.. రూ.75 కోట్ల (90 లక్షల డాలర్లు) నిధులను సమీకరించింది. ప్రస్తుత ఇన్వెస్టర్లయిన ఓక్స్ అసెట్ మేనేజ్‌మెంట్, వీ ఓషియన్ ఇన్వెస్ట్‌మెంట్‌తో పాటు తాజాగా ప్యూరో వెల్‌నెస్ నుంచి ఈ మొత్తాలను సమీకరించినట్లు ట్రూ గుడ్ వెల్లడించింది. మౌలిక సదుపాయాల విస్తరణ, డిస్ట్రిబ్యూషన్ సామర్థ్యాల పెంపు సహా ఉత్పత్తుల ఇన్నోవేషన్‌కు ఈ నిధులను వినియోగించనుంది. 2021 నవంబరులో సిరీస్ ఏ రౌండ్‌లో భాగంగా ట్రూ గుడ్ రూ.55 కోట్లు సమీకరించింది.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	77,400 ▼	70,950 ▼	1,03,000 ▼
ముంబై	75,930 ▼	69,552 ▼	89,800 ▼

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)			
16వ తేదీ			
హైదరాబాద్	480	విజయవాడ	515
వరంగల్	482	గోదావరి	515
చిత్తూరు	538	విశాఖపట్నం	515
		దజను గుడ్లు రూ. 72	

ప్రధాన ఆకర్షణగా 'రోబోటిక్ డాగ్'



ఇండియన్ మొబైల్ కాంగ్రెస్ (ఐఎంసీ)లో రాకీ అనే రోబోటిక్ డాగ్ ప్రధాన ఆకర్షణగా నిలిచింది. ఎరిక్సన్ కంపెనీ అభివృద్ధి చేసిన ఈ 5జీ పవర్డ్ డాగ్ కేంద్ర టెలికాం మంత్రి జ్యోతిరాదిత్య సింధియాను కూడా ఆకర్షించింది. ఐఎంసీ సదస్సుకు హాజరైన ఆయన ఎరిక్సన్ స్టాల్‌కి వెళ్లి మరీ ఈ రోబోటిక్ డాగ్‌ను పరిశీలించి దాన్ని 'శభాష్ రాకీ' అంటూ అభినందించారు. ఈ విషయాన్ని ఆయన స్వయంగా తన 'ఎక్స్'లో పోస్టు చేశారు. అగ్ని ప్రమాదాల వంటి అత్యవసర సమయాల్లో ఈ రోబోటిక్ డాగ్ అద్భుతమైన సేవలు అందిస్తుందని ఎరిక్సన్ తెలిపింది.

'6జీ'లో సత్తా చూపిస్తాం

4జీ, 5జీ సేవల్లో ఇతర దేశాలను అనుసరించిన భారత్ 6జీ టెక్నాలజీ విషయంలో మాత్రం నాయకత్వ పాత్ర పోషిస్తుందని సింధియా అన్నారు. ఇందులో భాగంగా ఈ టెక్నాలజీకి సంబంధించి అంతర్జాతీయంగా నమోదయ్యే పేటెంట్లలో కనీసం పది శాతమైనా మన దేశం నుంచి నమోదు కావాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు తెలిపారు. దేశీయంగా 6జీ టెక్నాలజీ అభివృద్ధిని సమన్వయం చేసేందుకు 'భారత్ 6జీ అలయెన్స్' పేరుతో ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేసినట్టు సింధియా తెలిపారు.

పథకాల అమలుకు పైసలు తీసుకోవద్దు

» నేతలు అక్రమాలకు పాల్పడితే చర్యలు: మహేశ్ గౌడ్



హైదరాబాద్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): "సంక్షేమ పథకాల అమలుకు ఎవరివద్దా ఒక్క పైసా కూడా తీసుకోవద్దు. క్షేత్రస్థాయిలో ప్రభుత్వ పథకాలు అమలు సమయంలో నాయకులు పూర్తి స్థాయిలో అండగా ఉండి పని చేయాలి. పార్టీ నాయకులు అక్రమాలకు పాల్పడ్డట్టుగా రుజువైతే కఠినంగా చర్యలుంటాయి" అని టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ స్పష్టం చేశారు. గాంధీభవన్‌లో మంగళవారం ఆయన ఉమ్మడి మెదక్, ఆదిలాబాద్ జిల్లాల పార్టీ నేతలు, ఇన్‌చార్జి మంత్రులతో సమీక్ష సమావేశాలు నిర్వహించారు. జిల్లాల్లో పార్టీ బలోపేతం, స్థానిక సంస్థల ఎన్నికలకు సన్నద్ధత తదితర అంశాలపైన సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రానున్న ఎమ్మెల్సీ స్థానిక సంస్థల ఎన్నికలు కాంగ్రెస్‌కు చాలా కీలకమని, వాటిని ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని క్రమశిక్షణతో పనిచేయాలని, మంచి ఫలితాలు రాబట్టాలన్నారు. పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ మాట్లాడుతూ.. మెదక్‌లో కేసీఆర్, హరీశ్ రావు వంటి బీఆర్ఎస్ అగ్ర నేతలు ఉన్నారని, అక్కడి కాంగ్రెస్ నేతలు చాలా కష్టపడి పనిచేయాలన్నారు.

ఆ పోలీసులపై క్రిమినల్ చర్యలు చేపట్టాలి

» బోడగుట్ట ఘటనపై సీబీఐతో విచారించాలి

» మానవ హక్కుల వేదిక డిమాండ్

హైదరాబాద్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : భద్రాద్రి జిల్లా కరకగూడెం మండలం బోడగుట్ట అటవీ ప్రాంతంలో సెప్టెంబరు 5న ఆరుగురు మావోయిస్టులను (అందరు ఆదివాసీలే) కాల్చి చంపిన పోలీసులపై క్రిమినల్ చర్యలు చేపట్టాలని మానవ హక్కుల వేదిక డిమాండ్ చేసింది. ఈ ఘటనపై సీబీఐ లేదా రాష్ట్ర పోలీసు విభాగానికి సంబంధం లేని స్వతంత్ర దర్యాప్తు సంస్థతో నేర పరిశోధన జరిపించాలని వేదిక తెలంగాణ ప్రధాన కార్యదర్శి డా. ఎస్.తిరుపతయ్య, తెలంగాణ, ఏపీ సమన్వయ కమిటీ సభ్యుడు వీఎస్ కృష్ణ మంగళవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. బోడగుట్ట ఘటనపై ముగ్గురు సభ్యులతో కూడిన మానవ హక్కుల వేదిక నిజనిర్ధారణ బృందం అక్టోబరు 13న కరకగూడెం, పినపాక మండలాల్లోని గ్రామాల్ని సందర్శించి స్థానికులతో మాట్లాడిందని, పోలీసులు చెబుతున్నట్లు ఇరువైపుల నుంచి కాల్పులు జరగలేదని తేలిందని పేర్కొన్నారు.

చెరువుల సుందరీకరణకు నిధులివ్వండి:ఈటల

న్యూఢిల్లీ, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి):హైదరాబాద్‌లోని చెరువులు మురికి కూపాలుగా మారిపోయాయని, వాటిని పరిశుభ్రం చేయడానికి నిధులు కేటాయించాలని కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి మనోహర్ లాల్ కట్టర్‌ని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ కోరారు. ఢిల్లీలోని మంత్రి నివాసంలో కలిసి వినతిపత్రం అందజేశారు. హరియాణాలో హ్యాట్రిక్ విజయం సాధించినందుకు అభినందనలు తెలిపారు. ప్రధాన మంత్రి ఆవాస్ యోజన కింద ఎక్కువ గృహాలను కేటాయించాలని కోరారు. స్వచ్ఛభారత్‌లో తెలంగాణకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల మంత్రి నితిన్ గడ్కరీని కలిశారు. రీజనల్ రింగ్ రోడ్డు ప్రాజెక్టుకు సంబంధించి చర్చించారు.

సాయిబాబా మృతికి మావోయిస్టు పార్టీ సంతాపం

హైదరాబాద్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): పౌర హక్కుల ఉద్యమ నేత, ప్రొఫెసర్ సాయిబాబా మృతి పట్ల మావోయిస్టు పార్టీ తెలంగాణ రాష్ట్ర కమిటీ ప్రగాఢ సంతాపం ప్రకటించింది. పౌర హక్కుల పరిరక్షణకు ప్రజల తరపున గొంతెత్తి పోరాడిన సాయిబాబాను బ్రాహ్మణీయ హిందూత్వ ఫాసిస్టు రాజ్యం పథకం ప్రకారం హత్య చేసిందని ఆరోపించింది. ఈ మేరకు పార్టీ తెలంగాణ రాష్ట్ర కమిటీ అధికార ప్రతినిధి జగన్ పేరుతో మీడియాకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. సాయిబాబా నెలకొల్పిన ఆశయాలు, ఆదర్శాలను కొనసాగించాలని లేఖలో కోరారు. ఢిల్లీ ప్రొఫెసర్‌గా కొనసాగుతూ మలి దశ తెలంగాణ ఉద్యమానికి సాయిబాబా మార్గ నిర్దేశం చేశారని గుర్తు చేశారు. 90 శాతం వైకల్యంతో కదలలేని స్థితిలో చక్రాల కుర్చీల ఉన్న సాయిబాబాను అన్యాయంగా 10 సంవత్సరాలు ఒంటరిగా జైలులో నిర్బంధించారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన మరణానికి హిందూత్వ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, న్యాయ వ్యవస్థలే బాధ్యత వహించాలని మావోయిస్టులు లేఖలో పేర్కొన్నారు.

ప్రజావాణికి భారీగా తరలివచ్చిన వీఆర్ఏలు

» కారుణ్య నియామకాల జీవోలు అమలు చేయాలని వినతి

బేగంపేట, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవంలో మంగళవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి రాష్ట్రం నలుమూలల నుంచి భారీ ఎత్తున విలేజ్ రెవెన్యూ అసిస్టెంట్స్ (వీఆర్ఏ) లు తరలివచ్చారు. 3,797 మంది విఆర్ఏల వారసులకు కారుణ్య నియామకం కోసం జారీ చేసిన జీవో నంబర్లు 81, 85లను వెంటనే అమలు చేయాలని కోరారు. ప్రజావాణి ఇన్‌చార్జి, రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జి.చిన్నారెడ్డి, సంబంధిత అధికారి దివ్యలకు వినతి పత్రాలు సమర్పించారు. యూరోపియన్ దేశాల్లో ఉద్యోగాలు కల్పిస్తామని బంజారాహిల్స్‌కు చెందిన ఓ కన్సల్టెన్సీ తమను తమ వద్ద నుంచి పెద్ద ఎత్తున డబ్బులు వసూలు చేసి ముఖం చాటేసిందని బాధితులు ఫిర్యాదు చేశారు. దీనిపై తక్షణం స్పందించిన చిన్నారెడ్డి హైదరాబాద్ సిటీ పోలీస్ కమిషనర్ సి.వి. ఆనంద్‌కు ప్రత్యేకంగా లేఖ రాశారు.

ప్రముఖ గైనకాలజిస్ట్ కొత్త ఉషాలక్ష్మి కన్నుమూత



హైదరాబాద్ సిటీ, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ గైనకాలజిస్ట్ డాక్టర్ కొత్త ఉషాలక్ష్మి (91) మరణించారు. గుండెపోటుతో మంగళవారం రాత్రి ఆమె కన్నుమూశారని కుటుంబసభ్యులు తెలిపారు. ఏపీలోని గుంటూరుకు చెందిన డాక్టర్ ఉషాలక్ష్మి.. తెలుగు రాష్ట్రాల్లో అత్యంత పేరొందిన గైనకాలజిస్టుల్లో ఒకరు. ప్రసూతి, గైనకాలజీ ప్రొఫెసర్‌గా హైదరాబాద్‌లోని నీలోఫర్ ఆస్పత్రిలో ఆమె సుదీర్ఘకాలం సేవలందించారు. 69 ఏళ్ల వయసులో రొమ్ము క్యాన్సర్ బారిన పడిన ఉషాలక్ష్మి ఆ వ్యాధికి ఎదురొడ్డి విజేతగా నిలిచారు. దీంతో ఆమె కుమారుడు డాక్టర్ రఘురామ్ 2007లో కిమ్స్-ఉషాలక్ష్మి బ్రెస్ట్ క్యాన్సర్ ఫౌండేషన్‌ను స్థాపించారు. ఆ సంస్థ ద్వారా రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అంతేకాక రోగులకు అధునాతన వైద్య సేవలందిస్తున్నారు. కాగా, క్యాన్సర్‌పై అవగాహన కల్పించేందుకు పింక్ పవర్ రన్ పేరిట ఇటీవల నిర్వహించిన అవగాహన ర్యాలీలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. డాక్టర్ ఉషాలక్ష్మిని సత్కరించారు.



10 రూపాయల నాణేలపై అవగాహన కల్పిస్తున్న యూనియన్ బ్యాంక్ సిబ్బంది

మేం అంగీకరిస్తాం.. మీరూ అంగీకరించండి

» రూ.10 నాణేలపై యూనియన్ బ్యాంక్ ప్రచారం

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో రూ.10 నాణేల చెల్లుబాటుపై నెలకొన్న అపోహను తొలగించేందుకు యూనియన్ బ్యాంక్ విస్తృతమైన ప్రచారం నిర్వహిస్తోంది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆదేశాల మేరకు కొన్ని ఎంపిక చేసిన బ్యాంకుల సిబ్బందితో సోమ, మంగళవారాల్లో యూనియన్ బ్యాంక్ అధికారులు 'రూ.10 నాణేలను మేం తీసుకుంటాం.. మీరూ తీసుకోండి' అంటూ నగరంలోని వ్యాపారులకు, వర్తకులకు, ప్రజలకు అవగాహన కల్పించారు. కొన్ని ఫేక్ వార్తలు, సందేశాలు వ్యాప్తి చెందడంతో చిరు వ్యాపారులు, వర్తకులు రూ.10 నాణేలను అనుమతించడం లేదని పేర్కొన్నారు. దీనిపై యూనియన్ బ్యాంకు సిబ్బంది రిటైల్ కస్టమర్లకు, స్వనిధి లబ్ధిదారులకు కరపత్రాలు పంచి అవగాహన కల్పించారు. అంతేకాకుండా రూ.10 నాణేలకు ఉన్న చట్టపరమైన చెల్లుబాటును ధ్రువీకరిస్తూ పలు దుకాణాల వద్ద, ముఖ్యమైన ప్రాంతాల్లో పోస్టర్లను అతికించారు. రూ.10 నాణేలను స్వీకరించడంలో వ్యాపారులు, వర్తకులు విముఖత చూపవద్దని విజ్ఞప్తి చేశారు.

వెయ్యి ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాల్లో స్పెషలిస్టు ఓపీ సేవలు

(మొదటిపేజీ తరువాయి)

నిర్వహించారు. ప్రస్తుతం ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌లలో సాధారణ ఓపీ సేవలు అందుబాటులో ఉన్నాయి. స్పెషలిస్టు ఓపీ సేవల కోసం సమీపంలోని జిల్లా ఆస్పత్రులు, సామాజిక ఆరోగ్య కేంద్రాల(సీహెచ్‌సీ) నుంచి స్పెషలిస్టు వైద్యులను రొటేషన్ విధానంలో పంపనున్నారు. తెలంగాణ వైద్యవిధాన పరిషత్, మెడికల్ కాలేజీల్లోని స్పెషాలిటీ వైద్యుల వివరాలను ఇవ్వాలని ఇప్పటికే వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ కమిషనర్ ఆర్వీ కర్ణన్ ఆయా విభాగాధిపతులను కోరారు. ఆ వైద్యుల వివరాలను జిల్లాల్లోని జిల్లా వైద్యాధికారి(డీఎంహెచ్‌వో)కి పంపుతారు. తమ పరిధిలోని ఆరోగ్య మందిర్‌లకు డీఎంహెచ్‌వో ప్రతిరోజూ ఒక స్పెషలిస్టు వైద్యుడిని పంపుతారు. ఇలా రోజూ రొటేషన్ పద్ధతిలో రోజుకొక స్పెషలిస్టు వైద్యుడు ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌లలో ఓపీ చూస్తారు. అవసరమైతే వైద్యవిద్య సంచాలకుల పరిధిలో బోధనాస్పత్రుల్లోని స్పెషలిస్టు వైద్యుల సేవలను కూడా ఇందుకోసం వినియోగించుకునే అవకాశం ఉంది. ఇక్కడ రోగులను పరీక్షించి చిన్న ఆరోగ్య సమస్య అయితే మందులు రాస్తారు. తీవ్రతను బట్టి పై ఆస్పత్రులకు సిఫారసు చేస్తారు. ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌లలో కేవలం స్ర్కీనింగ్ చేస్తారని, అవసరమైతేనే టెస్టుల కోసం పెద్దాస్పత్రులకు రాస్తారని వైద్య ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు వెల్లడించారు. కాగా, ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌లలో 12 రకాల స్పెషలిస్టు ఓపీ వైద్య సేవలు అందుబాటులో ఉంటాయని వైద్యవర్గాలు తెలిపాయి. ఇందుకు సంబంధించి ఇప్పటికే కసరత్తు పూర్తైనట్లు ఆ వర్గాలు వెల్లడించాయి. జనరల్ మెడిసిన్, గైనకాలజీ, ఆర్థోపెడిక్, దంత, ఈఎన్‌టీ లాంటి వాటితో పాటు మరో ఐదారు రకాల స్పెషాలిటీ ఓపీ వైద్య సేవలను ఏర్పాటు చేయనున్నట్లు వైద్యవర్గాలు తెలిపాయి.

రోగుల జేబు ఖర్చు తగ్గుతుంది

దేశంలోనే తొలిసారిగా ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాల్లో స్పెషలిస్టు ఓపీ వైద్య సేవలను అందుబాటులోకి తీసుకువస్తున్నాం. ప్రస్తుతం ప్రైవేటు ఆస్పత్రుల్లో స్పెషలిస్టు వైద్యుడి దగ్గరకు వెళ్లే ఓపీ ఫీజు రూ.500-రూ.700 వరకు ఉంటోంది. ప్రభుత్వ నిర్ణయంతో పేద, మధ్య తరగతిపై ఆ భారం తగ్గుతుంది. వారి జేబుల నుంచి ఖర్చుపెట్టే అవసరం ఉండదు.

-ఆర్వీ కర్ణన్, వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ కమిషనర్

జిల్లాల్లో

ప్రభుత్వ సంతాన సాఫల్య కేంద్రాలు

దశలవారీగా ఏర్పాటు.. గాంధీలో పూర్తిస్థాయిలో అందుబాటులోకి .. ప్రైవేటు దవాఖానాల్లో రూ. లక్షల వసూలు

» సంతానలేమి దంపతులకు వరంగా సర్కారీ నిర్ణయం



హైదరాబాద్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో తొలిసారి ప్రభుత్వ ఆసుపత్రుల్లో సంతాన సాఫల్య సేవలు (ఐవీఎఫ్) అందుబాటులోకి వచ్చాయి. గాంధీ దవాఖానలోని ఫర్టిలిటీ సెంటర్‌లో ఐవీఎఫ్ సౌకర్యాన్ని ఆరోగ్యశాఖ అందుబాటులోకి తీసుకొచ్చింది. దీంతో పాటుగా హైదరాబాద్‌లో మరో రెండు, వరంగల్, నిజామాబాద్, కరీంనగర్, ఖమ్మం వంటి ఉమ్మడి జిల్లా కేంద్రాల్లోనూ ఫర్టిలిటీ సెంటర్లను ప్రారంభించేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. సంతానలేమి సమస్యతో బాధపడుతున్న దంపతులకు సంతాన సాఫల్య కేంద్రాలు వరంగా మారనున్నాయి. రూ. లక్షలు ఖర్చయ్యే ఐవీఎఫ్ సేవలు ఉచితంగా అందనున్నాయి. రాష్ట్రంలో సంతాన సమస్యలతో బాధపడే యువ జంటల సంఖ్య సాధారణం కంటే ఎక్కువగా ఉంటోంది. ప్రతి వంద జంటల్లో 30-40 జంటలు ఈ సమస్యను ఎదుర్కొంటున్నాయి. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఇన్‌ఫర్టిలిటీకి చికిత్స అందించే సౌకర్యాలు లేకపోవడం, ప్రైవేటు దవాఖానాల్లో రూ. లక్షలు వసూలు చేస్తుండడంతో ఎంతో మంది మానసికంగా, ఆర్థికంగా కుంగిపోతున్నారు. ఈ ఏడాది ఏప్రిల్‌లో బ్రహ్మోత్సవాల సందర్భంగా చిలుకూరి బాలాజీ ఆలయంలో ఇచ్చే గరుడ ప్రసాదం స్వీకరిస్తే సంతానం కలుగుతుందని అక్కడి పూజారులు చెబితే, ఏకంగా ఒకే రోజు లక్ష మంది మహిళలు ప్రసాదం కోసం ఆ గుడికి పోటెత్తారంటే రాష్ట్రంలో సమస్య తీవ్రత ఎంతుందో అర్థం చేసుకోవచ్చు.

జిల్లా ఆస్పత్రుల్లో ఐవీఎఫ్ కేంద్రాలు

ప్రస్తుతం స్త్రీ, పురుషులిద్దరిలోనూ సంతాన సమస్యలు బాగా పెరిగాయి. అందుకు ప్రధాన కారణం మారిన జీవనశైలి. పిల్లలు పుట్టకపోవడంతో కొత్త జంటలు మానసిక వేదనకు లోనవుతున్నాయి. దీన్ని దృష్టిలో పెట్టుకునే నాటి బీఆర్ఎస్ సర్కారు ప్రభుత్వ దవాఖానాల్లో ఫర్టిలిటీ సెంటర్లు పెడతామని 2017లో ప్రకటించింది. అయితే 2023 వరకు ఒక్క గాంధీలో మాత్రమే ఫర్టిలిటీ సెంటర్ అందుబాటులోకి తీసుకొచ్చింది. గతేడాది అసెంబ్లీ ఎన్నికలకు ముందు అక్టోబరులో అప్పటి ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు ఈ కేంద్రాన్ని హడావుడిగా ప్రారంభించారు. కానీ అక్కడ ఒక్కరికి కూడా ఐవీఎఫ్ చేయలేదు. సామగ్రి, మందులు లేకపోవడం ఎంబ్రియాలజిస్టును నియవించకపోవడమే ఇందుకు కారణం. నెల రోజుల క్రితం గాంధీ ఆసుపత్రిలో పర్యటించిన ఆరోగ్య మంత్రి దామోదర రాజనర్సింహ దృష్టికి ఈ విషయాన్ని అధికారులు తీసుకొచ్చారు. దీంతో ఆయన ఎంబ్రియాలజిస్టును నియమించాలని, సామగ్రి, మందులు కొనుగోలు చేయాలని ఆరోగ్య కార్యదర్శిని ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా ఫర్టిలిటీ, ఐవీఎఫ్ సేవలను అందుబాటులో తీసుకొచ్చేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. గాంధీతో పాటు పేట్లబుర్జు ఆస్పత్రి, వరంగల్, కరీంనగర్, ఖమ్మం, నిజామాబాద్ జిల్లా కేంద్రాల్లోని ఆస్పత్రుల్లోనూ ఐవీఎఫ్ కేంద్రాల ఏర్పాటుకు అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఈ సెంటర్లు ప్రారంభించాక మిగిలిన ఉమ్మడి జిల్లా కేంద్రాలకూ ఫర్టిలిటీ, ఐవీఎఫ్ సేవలను విస్తరించే యోచనలో ప్రభుత్వం ఉందని చెబుతున్నారు.

దంపతుల్లో పెరుగుతున్న అవగాహన

కనీసం ఏడాది పాటు లైంగిక జీవితం గడిపినా.. గర్భం దాల్చకపోతే ఇన్‌ఫర్టిలిటీ సమస్య ఉన్నట్టుగా డాక్టర్లు చెబుతున్నారు. మన దేశంలో ఈ సమస్య వేగంగా పెరుగుతోంది. అయితే ఇంతకుముందు సంతానలేమి సమస్యకు మహిళలను మాత్రమే కారణంగా చూపేవారని, ఇప్పుడు పెరిగిన అవగాహనతో సమస్య ఎవరిలో ఉందో తెలుసుకోవడం కోసం పురుషులు కూడా ముందుకు వస్తున్నారని డాక్టర్లు చెబుతున్నారు.

రూ. లక్షలు వసూలు చేస్తున్న ప్రైవేటు కేంద్రాలు

ప్రైవేటు ఆసుపత్రులు మార్కెటింగ్ జిమ్మిక్కులతో బాధిత దంపతులను మభ్యపెట్టి లక్షల్లో దండుకుంటున్నాయి. కొంత మంది డాక్టర్లు సమస్య తీవ్రతను అర్థం చేసుకుని వందల సంఖ్యలో ఫర్టిలిటీ సెంటర్లు ఏర్పాటు చేసుకుని రూ. లక్షలు దండుకుంటున్నారు. సంతానలేమి సమస్య ప్రభుత్వ దవాఖానాల్లో అసలు ఫర్టిలిటీ చికిత్స అందుబాటులో లేకపోవడం వీరికి మరింత కలిసొచ్చింది. ఫర్టిలిటీ చికిత్స పేరిట ప్రత్యేక ప్యాకేజీలు పెట్టి మరీ బాధితుల వద్ద రూ.లక్షల్లో వసూలు చేస్తున్నారు. రూ.50-80 వేల మధ్యలో పూర్తయ్యే ఐవీఎఫ్ చికిత్సకు, రూ.3-6 లక్షల మధ్య వసూలు చేస్తున్నారు. ఇంత ఖర్చు చేస్తున్నా.. సగం మందికి ఫలితం దక్కడం లేదు. ఈ దందాపై దృష్టి పెట్టాలని ప్రభుత్వాన్ని సంతానలేమి దంపతులు కోరుతున్నారు.

19 మంది సబ్ రిజిస్ట్రార్ల బదిలీ

హైదరాబాద్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం 19 మంది సబ్ రిజిస్ట్రార్లను బదిలీ చేసింది. రెండు నెలల క్రితం జరిగిన బదిలీల్లో అవకతవకలు చోటుచేసుకున్నాయనిఆరోపణలు రావడంతో ప్రభుత్వం మరోసారి బదిలీలు చేపట్టింది. ఇటీవల ఉప్పల్ సబ్ రిజిస్ట్రార్(ఎస్ఆర్)గా బదిలీపై వచ్చిన ఆర్.సతీశ్‌ను మల్కాజిగిరి (మార్కెట్ వాల్యూ డివిజన్)కు, కుత్బుల్లాపూర్ ఎస్ఆర్ సురేందర్‌ను పటాన్‌చెరువుకు, కూకట్‌పల్లి ఎస్ఆర్ సురేష్‌ను హైదరాబాద్ (మార్కెట్ వాల్యూ డివిజన్)కు, పటాన్‌చెరు ఎస్ఆర్-1 రవికాంత్‌ను కొడంగల్‌కు, పటాన్‌చెరు జాయింట్ ఎస్ఆర్-2 శ్రీనివాస్‌ను పరిగి ఎస్ఆర్‌గా, స్టేషన్ ఘన్‌పూర్ ఎస్ఆర్ అంజాద్ అలీని జనగాంకు బదిలీ చేశారు. ఈ బదిలీల్లో ఉప్పల్ ఎస్ఆర్‌గా మోజెస్ భాస్కర్ నియమితులయ్యారు. ఈయన ములుగు, సత్తుపల్లిలో ఉండగా వివాదాలు తలెత్తాయి. ప్రస్తుతం ఆయనను ఉప్పల్ వంటి ప్రాధాన్యం ఉన్న చోటుకు డిప్యుటేషన్‌పై తీసుకురావడంపై ఉద్యోగుల్లో చర్చ జరుగుతోంది. ఇటీవల బదిలీ అయిన అంజాద్ అలీని తిరిగి ఆయన గతంలో ఆరేళ్లకు పైగా పనిచేసిన జనగాంకే పంపడం కూడా చర్చకు దారితీసింది. దూలపల్లి ఎస్ఆర్ వనజ కుమారిని కాప్రాకు, శేరిలింగంపల్లి ఎస్ఆర్ రాజశేఖర్ రెడ్డిని రంగారెడ్డి జిల్లా మార్కెట్ వాల్యూ ఎస్ఆర్‌గా, గండిపేట ఎస్ఆర్ మహేందర్‌ను వికారాబాద్‌కు, పరిగి ఎస్ఆర్ మధుసూదన్ రెడ్డిని రంగారెడ్డి ఎస్ఆర్-2గా, కాప్రా ఎస్ఆర్ సతీశ్‌కుమార్‌ను దూద్‌బౌలికి బదిలీ చేశారు. కాగా, ఇతర జోన్ల నుంచి హైదరాబాద్‌లో ఉన్న కార్యాలయాలకు ఏడుగురు సబ్ రిజిస్ట్రార్లను డిప్యుటేషన్ మీద తీసుకురావడంపై విమర్శలు వచ్చాయి. ఒక జోన్ నుంచి మరో జోన్‌కు బదిలీ.. రాష్ట్రపతి ఉత్తర్వుల ఉల్లంఘన కిందకు వచ్చే అవకాశం ఉండటంతో డిప్యుటేషన్ పేరుతో తీసుకొచ్చారని ఉద్యోగుల్లో చర్చ జరుగుతోంది. రామగుండం ఎస్ఆర్ ఎం.బాలకిషన్‌ను గండిపేటకు, మెట్‌పల్లి ఎస్ఆర్‌ను ఎం.అసిఫుద్దీన్‌ను శేరిలింగంపల్లికి, మెదక్ ఎస్ఆర్‌ను ఎం.శ్రీలతను సరూర్‌నగర్‌కు, వరంగల్ జిల్లా నర్సంపేట్ ఎస్ఆర్ ఎ.గిరిధర్‌ను కూకట్‌పల్లికి, నల్గొండ జిల్లా మోత్కూర్ ఎస్ఆర్ అశోక్‌ను కుత్బుల్లాపూర్, మహబూబ్‌నగర్ జిల్లా నాగర్‌కర్నూల్ ఎస్ఆర్ మహ్మద్ అబ్బులుద్దీన్‌ను పటాన్‌చెరు జాయింట్ సబ్ రిజిస్ట్రార్-2గా డిప్యుటేషన్‌పై తీసుకొచ్చారు.

కేటీఆర్‌పై ఉట్నూర్ ఠాణాలో కేసు

ఆదిలాబాద్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి కేటీఆర్‌పై ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. రూ.లక్షన్నర కోట్లు అంటూ ప్రచారం చేస్తున్న మూసీ ప్రాజెక్టు దేశంలోనే అతి పెద్ద కుంభకోణమని, దేశంలో వచ్చే ఎన్నికల కోసం కావలసిన నిధుల కోసం కాంగ్రెస్ ఈ ప్రాజెక్టును రిజర్వ్ బ్యాంకులా వాడుకోవాలని చూస్తోందని 15 రోజుల క్రితం కేటీఆర్ విమర్శించారు. దీనిపై కాంగ్రెస్ నేత ఆత్రం సుగుణ గత నెల 30న ఉట్నూర్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పార్టీ ప్రతిష్ఠకు భంగం కలిగేలా కేటీఆర్ మాట్లాడారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ముఖ్యమంత్రి స్థాయిని తగ్గించేలా నిరాధారమైన ఆరోపణలు చేసిన కేటీఆర్‌పై చర్యలు తీసుకోవాలని కోరారు. విచారణ చేపట్టిన పోలీసులు బీఎన్ఎస్ సెక్షన్లు 352, 353(2), 356(2) కింద కేసు నమోదు చేశారు.

కానిస్టేబుళ్ల లీవ్‌మాన్యువల్ మార్చడం దుర్మార్గం

» వారికి రేవంత్ దసరా కానుక ఇదేనా?

» మాజీ మంత్రి తన్నీరు హరీశ్ రావు



హైదరాబాద్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): నిబంధనలు మార్చుతూ పోలీసు సోదరుల పట్ల ప్రభుత్వం కర్కశంగా వ్యవహరిస్తోందని మాజీ మంత్రి తన్నీరు హరీశ్ రావు విమర్శించారు. టీజీఎస్పీ కానిస్టేబుళ్లు 15 రోజులకోసారికి బదులు నెలకు ఒకసారి ఇంటికి వెళ్లేలా లీవ్‌మాన్యువల్ మార్చడం దుర్మార్గమని వ్యాఖ్యానించారు. ఇది వారాల పాటు కుటుంబాలకు వారికి దూరం చేయడమేనా? అని మంగళవారం ఎక్స్ వేదికగా ప్రశ్నించారు. హోం మంత్రిగా, ముఖ్యమంత్రిగా ఉన్న రేవంత్‌రెడ్డి పోలీసులకు ఇచ్చిన దసరా, దీపావళి కానుక ఇదేనా? అని నిలదీశారు. టీఎస్ఎస్పీ కానిస్టేబుళ్లకు నెలకొకసారి లీవు విధానం అమలు చేయకుండా, ప్రస్తుత విధానాన్ని కొనసాగించాలని ఆయన డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం సివిల్, ఏఆర్ ఇతర విభాగాల పోలీసులకు 15 రోజుల టీఏ ఇచ్చేదని, కానీ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఏడు రోజులకు దాన్ని కుదించిందని అన్నారు. పాతవిధానం ప్రకారమే 15 రోజుల టీఏ ఇవ్వాలన్నారు. కాంగ్రెస్ పాలనలో అత్యాచారాలు, హత్యలు, ఇతర నేరాల రేటు గణనీయంగా పెరిగిందని, శాంతి భద్రతలు క్షీణిస్తున్నా ప్రభుత్వానికి కనీస పట్టింపులేదని ఎక్స్ వేదికగా ఆరోపించారు. హై సెక్యూరిటీ ప్రాంతంగా చెప్పుకొనే గచ్చిబౌలిలో యువతిపై అత్యాచారం జరగటంపై ప్రభుత్వం సిగ్గుతో తలదించుకోవాల్సిన దుస్థితి నెలకొందని పేర్కొన్నారు.

విద్యారంగాన్ని భ్రష్టుపట్టిస్తున్న సర్కార్

» గురుకులాల అద్దె చెల్లించరా?: కేటీఆర్

హైదరాబాద్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): "పేద, మధ్యతరగతి విద్యార్థులను విద్యకు దూరం చేసేలా రేవంత్ సర్కారు నిర్ణయాలు తీసుకుంటోంది. రాష్ట్ర విద్యారంగాన్ని పూర్తిగా భ్రష్టుపట్టిస్తోంది. ప్రభుత్వ విద్యాసంస్థలను నిర్లక్ష్యం చేస్తున్నారు. ప్రైవేటులో చదువుతున్న వారికి ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయడంలేదు" బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. వేలమంది విద్యార్థులకు కార్పొరేట్‌స్థాయి విద్యను అందించిన గురుకులాలను నిర్వీర్యం చేస్తున్నారని మండిపడ్డారు. గురుకుల భవనాలకు కనీసం అద్దె చెల్లించకపోవడంతో యాజమానులు తాళాలు వేసే దుస్థితి తెచ్చారన్నారని విమర్శించారు. మూసీ సుందరీకరణ కోసం రూ.1.50లక్షల కోట్లు ఖర్చు చేస్తామని చెబుతున్న ప్రభుత్వం వద్ద పేద, మధ్య తరగతి విద్యార్థుల చదువుకోసం డబ్బుల్లేవా? అని ప్రశ్నించారు. విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు వెంటనే చెల్లించాలని, రెండు, మూడురోజుల్లో సమస్య పరిష్కరించకుంటే విద్యార్థులతో కలిసి ప్రభుత్వంపై పోరాటం చేస్తామని కేటీఆర్ హెచ్చరించారు.

గురుకులాలకు తాళాలు

(మొదటిపేజీ తరువాయి)

తెలియక గందరగోళంలో పడ్డారు. ఏం చేయాలో తోచక వారంతా భవనాల ఎదుట పడిగాపులు కాయాల్సి వచ్చింది. గత నెల 30వ తేదీన హైదరాబాద్‌లో సమావేశమైన అద్దె భవనాల యజమానుల సంఘం నేతలు దసరా సెలవులు ముగిసేలోపు బకాయిలు చెల్లించకుంటే భవనాలకు తాళాలు వేయాలని నిర్ణయించుకున్నారు. పలుమార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా స్పందించకపోవడంతో మంగళవారం భవనాలకు తాళాలు వేశారు. ఈ సందర్భంగా పలువురు ప్రైవేటు భవనాల యజమానులు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా రూ.500 కోట్ల అద్దెను ప్రభుత్వం తమకు చెల్లించాల్సి ఉందని తెలిపారు. తమకు చెల్లించాల్సిన బిల్లులు చెల్లించే వరకు పాఠశాలలోనికి ఉపాధ్యాయులను, విద్యార్థులను అనుమతి చేది లేదని స్పష్టం చేశారు. కొన్ని ప్రాంతాల్లో కలెక్టర్, ఉన్నతాధికారులు భవన యజమానులతో మాట్లాడి హామీ ఇవ్వడంతో గేట్లు తెరిచారు. చివరికి బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ హైదరాబాద్‌లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి బకాయిలు తప్పనిసరిగా చెల్లిస్తామని హామీఇవ్వడంతో ఆయా భవనాల యజమానులు మధ్యాహ్నం పాఠశాలల గేట్ల తాళాలు తీశారు. రాష్ట్రంలో 1,022 గురుకుల పాఠశాలలు ఉండగా అందులో 665 ఎస్సీ, బీసీ, మైనార్టీ గురుకుల పాఠశాలలు, సుమారు 200లకు పైగా సంక్షేమ హాస్టళ్లు అద్దె భవనాల్లో నడుస్తున్నాయి. ఒక్కో భవనానికి భవన వైశాల్యాన్ని బట్టి, ప్రాంతాన్ని బట్టి నెలకు రూ.రెండులక్షల నుంచి పది లక్షల వరకు అద్దె చెల్లిస్తున్నారు. ఎస్సీ, బీసీ గురుకుల పాఠశాలల భవనాలకు 8 నెలల అద్దె, మైనార్టీ గురుకుల పాఠశాలలు, సంక్షేమ హాస్టళ్ల భవనాలకు 14 నుంచి 20 నెలల వరకు అద్దె చెల్లించాల్సి ఉంది.

గురుకులాల్లో నాణ్యమైన విద్యను అందించాలి

» కార్యదర్శులు గురుకులాలను సందర్శించాలి

» అద్దె భవనాల కిరాయి బిల్లులను చెల్లించండి

» మెస్ చార్జీలు, కాస్మెటిక్ చార్జీలను పెంచండి

» అధికారులతో సమీక్షలో డిప్యూటీ సీఎం భట్టి



హైదరాబాద్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ గురుకుల విద్యాలయాల్లో నాణ్యమైన విద్యను అందించడానికి చర్యలు చేపట్టాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ గురుకుల విద్యా సంస్థల కార్యదర్శులతో మంగళవారం ఆయన సచివాలయంలో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ.. విద్యాలయాల్లో బోధన తీరుపై నిపుణులతో పరిశీలన జరిపించాలని, అనంతరం ఉపాధ్యాయులకు అవసరమైన సూచనలు, సలహాలు ఇప్పించాలని చెప్పారు. విద్యార్థుల మెస్ చార్జీలు, కాస్మెటిక్ చార్జీలను ఎప్పటికప్పుడు చెల్లిస్తున్నామని, అధికారులు ఈ విషయాలకే పరిమితం కాకుండా బోధనలో నాణ్యతను పెంచేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. గురుకుల విద్యాసంస్థల కార్యదర్శులు రోజూ ఒక విద్యాలయాన్ని సందర్శించి, పరిస్థితులను పరిశీలించాలని సూచించారు. ఒక పూట అక్కడే ఉండి అన్ని విషయాలను సమీక్షించాలని ఆదేశించారు. కార్యదర్శులు ఎన్ని విద్యాసంస్థలను సందర్శించారు.. ఏ ఏ అంశాలను గమనించారు.. ఎలాంటి చర్యలు చేపట్టారు? అన్న వివరాలతో ఈ నెలాఖరులోగా నివేదిక ఇవ్వాలన్నారు. కార్యదర్శులు పర్యటించి సమస్యలు పరిష్కరించడం ద్వారా సిబ్బందికి భరోసా ఏర్పడుతుందని చెప్పారు. అద్దె భవనాల్లో ఉన్న గురుకుల విద్యాలయాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అద్దె భవనాల యజమాలతో మాట్లాడి, భవనాల్లో అన్ని సౌకర్యాలు కల్పించేలా చూడాలని, కిరాయి బిల్లులను వెంటనే చెల్లించాలని ఆదేశించారు. గురుకులాలను సందర్శించాలంటూ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు సమాచారమిచ్చామని, వారు సందర్శించే సమయాల్లో కార్యదర్శులు అందుబాటులో ఉండాలన్నారు. పెరుగుతోన్న ధరలకు అనుగుణంగా మెస్ చార్జీలను పెంచాలని ప్రభుత్వం నిర్ణయించిందని, ఈ దృష్ట్యా అధికారులు అన్ని విషయాలను పరిగణనలోకి తీసుకుని మెస్ చార్జీల పెంపుపై తుది నిర్ణయం తీసుకోవాలని సూచించారు. వీటితో పాటు కాస్మెటిక్ చార్జీలు, ట్యూటర్ల చార్జీల పెంపుపైనా నిర్ణయం తీసుకోవాలని ఆయన ఆదేశించారు. సమీక్షలో అధికారులు కె.రామకృష్ణారావు, సందీప్‌కుమార్ సుల్తానియా, బుర్ర వెంకటేశం, గురుకుల విద్యాసంస్థల కార్యదర్శులు సైదులు, తఫ్సీల్ ఇక్బాల్, సీతాలక్ష్మి పాల్గొన్నారు.

గురుకులాలకు తాళం వేస్తే క్రిమినల్ కేసులు

» కలెక్టర్లకు మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశాలు



హైదరాబాద్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): గురుకుల పాఠశాలల గేట్లకు తాళాలు వేసిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయించాలని బీసీ సంక్షేమం, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ జిల్లా కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేశారు. దసరా పండగ సెలవుల్లో ఇళ్లకు వెళ్లిన విద్యార్థులు తిరిగి పాఠశాలలకు చేరుకుంటున్న తరుణంలో కొన్నిప్రాంతాల్లో ఆయా భవనాల యజమానులు అద్దెలు చెల్లించని కారణంగా తాళాలు వేసిన నేపథ్యంలో మంత్రి పొన్నం తీవ్రంగా స్పందించారు. రాష్ట్రంలో 70 శాతం గురుకులాలు అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయని, అయితే ఆయా భవనాలకు అద్దె బకాయిలు గడిచిన పది నెలలకు సంబంధించినవి కాదనే విషయాన్ని యజమానులు గమనించాలన్నారు. కొన్నేళ్లుగా వారు గత ప్రభుత్వాన్ని బకాయిలు అడగలేక పోయారని అన్నారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క రాష్ట్రంలోని అన్ని గురుకులాలపై సమీక్ష నిర్వహించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నారని, అధికారుల నుంచి వివరాలను తెప్పించుకుని బకాయిలు విడుదల చేయాలని ఆదేశించారని తెలిపారు. చాలా వరకు పాత బకాయిలతో సహా మెస్ చార్జీలు మూడు రోజుల క్రితమే చెల్లించినట్టు వివరించారు. త్వరలో అద్దె బకాయిలను ప్రభుత్వం విడుదల చేయనున్న నేపథ్యంలో ఎవరి మాటలో పట్టుకుని కవ్వింపు చర్యలకు పాల్పడవద్దని భవన యజమానులను మంత్రి హితవు పలికారు. గురుకులాల్లో పెట్టిన బ్యానర్లను తక్షణం తొలగించాలని కోరారు. గురుకులాలకు తాళం వేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎక్కడైనా యజమానులు ఇబ్బందులు పెడితే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని గురుకుల ప్రిన్సిపల్ ఆర్సీవోలకు సూచించారు. ప్రత్యామ్నాయంగా వేరే భవనాలు చూడాలన్నారు.

సర్కారు కొలువులో చేరరేమి?

» 674 మందికి గాను 310 మంది మాత్రమే జాయిన్

» ఏఈఈ పోస్టులకు దూరం

హైదరాబాద్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) ద్వారా నీటి పారుదల శాఖ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఏఈఈ) పోస్టులకు 674 మందికి ప్రభుత్వం నియామక పత్రాలు అందించగా మంగళవారం దాక 310 మంది మాత్రమే చేరారు. సెప్టెంబరు 26న నియామక పత్రాలు అందుకున్న వీరికి విధుల్లో చేరడానికి ఈ నెల 25 దాకా అవకాశం ఉంది. మొత్తం 687 మంది ఎంపిక కాగా ధ్రువపత్రాల తనిఖీకే 13 మంది దూరంగా ఉన్నారు. ఎంపికైనవారిలో 10 మంది ఐఐటీ పట్టభద్రులు. 21 మంది ఐఐటీలో పీజీ చేసిన వారు. 50 మంది ఎన్ఐటీ పట్టభద్రులు, 33 మంది అందులో పీజీలు చదివినవారు ఉన్నారు. ఈ 114 మందిలో కొందరు చేరకపోవచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. గడువు ఈ నెల 25తో ముగియనుంది. ఈ నెల 21 నుంచి వారం పాటు తెలంగాణ స్టేట్ ఇంజనీరింగ్ ల్యాబరేటరీలో 45 మందికి తొలి బ్యాచ్‌లో ప్రాథమిక శిక్షణ ప్రారంభం కానుంది. కాగా, ఏఈఈలు సంబంధిత చీఫ్ ఇంజనీర్లకు (సీఈ)లకు రిపోర్టు చేయాల్సి ఉంటుంది. కొత్తవారందరికీ గ్రామీణ, మారుమూల ప్రాంతాల్లోనే పోస్టింగులు ఇస్తామని, హైదరాబాద్ సమీప ప్రాంతాలకు పరిగణించబోమని ప్రభుత్వం స్పష్టం చేసింది. చేరికలపై ఈ ప్రభావం పడి ఉండొచ్చని భావిస్తున్నారు. హైదరాబాద్ చీఫ్ ఇంజనీర్ పరిధిలో 10 మందిని కేటాయిస్తే 9 మంది విధుల్లో చేరారు. మహబూబ్‌నగర్ సీఈకి 48కి 8 మంది, నల్లగొండలో 76 మందికి 49, సూర్యాపేటలో 32 మందికి ఇద్దరే రిపోర్టు చేశారు. ఆదిలాబాద్ సీఈకి 24 మందిని కేటాయిస్తే 15 మంది మాత్రమే చేరారు.


చండూరులో ధర్నా చేస్తున్న పాల్వాయి శ్రవణ్ కుమార్ దంపతులు

పాల్వాయి కుటుంబంలో ఆస్తి తగాదాలు

- తమ కూతురుని స్రవంతి కిడ్నాప్ చేసిందని.. గోవర్ధన్‌రెడ్డి పెద్ద కుమారుడి ఆందోళన
- ఆస్తి కాజేసేందుకు యత్నిస్తోందని ఆరోపణ

చండూరు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): దివంగత నేత, మాజీ ఎంపీ పాల్వాయి గోవర్ధన్‌రెడ్డి కుటుంబంలో ఆస్తి తగాదాలు భగ్గుమన్నాయి. గోవర్ధన్‌రెడ్డికి ఇద్దరు కుమారులు, కుమార్తె స్రవంతి ఉన్నారు. వారి మధ్య ఇటీవల ఆస్తి విషయంలో వివాదం నెలకొంది. ఈ నేపథ్యంలో పెద్ద కుమారుడు శ్రవణ్ కుమార్ దంపతులు మంగళవారం అర్ధరాత్రి కుటుంబసభ్యులు, మద్దతుదారులతో చండూరులో ఆందోళనకు దిగారు. సెప్టెంబరు 11న అర్ధరాత్రి తన చెల్లెలు, బీఆర్ఎస్ నేత స్రవంతి.. తమ కుమార్తెను కిడ్నాప్ చేసిందని.. పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. శ్రవణ్ కుమార్తె(16)ను నాలుగేళ్లుగా స్రవంతి సంరక్షణలో ఉంచారు. మునుగోడు ఉప ఎన్నిక తర్వాత కుటుంబంలో ఆర్థిక వివాదాలు తలెత్తాయి. తాను తల్లిదండ్రుల వద్ద ఉండబోనని, మేనత్త(స్రవంతి) వద్ద ఉంటానని శ్రవణ్ కుమార్తె చెప్పటంతో వివాదం మొదలైందని తెలిసింది. తండ్రి గోవర్ధన్‌రెడ్డి పేరిట ఉన్న ఆస్తిని మనవరాలైన తమ కుమార్తె పేరిట రాయించుకుని, దక్కించుకునేందుకే స్రవంతి తమ బిడ్డను కిడ్నాప్ చేసిందని శ్రవణ్ ఆరోపిస్తున్నారు. కాగా, బాలిక మైనర్ కావడంతో జిల్లా కేంద్రంలోని బాలల సంరక్షణ కేంద్రంలో ఉంచినట్లు పోలీసులు తెలిపారు. బాలిక కోరిక మేరకు చట్టపరమైన నిర్ణయాలు తీసుకుంటామని చెప్పారు.

ఝార్ఖండ్‌కు భట్టి, మహారాష్ట్రకు ఉత్తమ్, సీతక్క

- అసెంబ్లీ ఎన్నికలకు పరిశీలకులుగా నియమించిన కాంగ్రెస్

న్యూఢిల్లీ, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): మహారాష్ట్ర, ఝార్ఖండ్ రాష్ట్రాల్లో జరిగే అసెంబ్లీ ఎన్నికలకు తెలంగాణ మంత్రులను పార్టీ తరఫున సీనియర్ పరిశీలకులుగా కాంగ్రెస్ నియమించింది. తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క.. ఝార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికలకు సీనియర్ పరిశీలకులుగా నియమితులయ్యారు. భట్టితోపాటు తారిఖ్ అన్వర్, అధిర్ రంజన్ చౌదరి తదితర సీనియర్ నేతలకు ఝార్ఖండ్ బాధ్యతలు అప్పగించారు. మరో పక్క, మహారాష్ట్రలోని ఐదు డివిజన్లకు మొత్తం 11 మందిని సీనియర్ పరిశీలకులుగా నియమించారు. ఇందులో తెలంగాణ మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, సీతక్కకు చోటు దక్కింది. మరాఠ్వాడా ప్రాంతానికి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఉత్తర మహారాష్ట్ర ప్రాంతానికి సీతక్క సీనియర్ పరిశీలకులుగా వ్యవహరించనున్నారు. ఈ నియామకాలకు సంబంధించిన ఉత్తర్వులను కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ జారీ చేశారు.

నాణ్యత పాటించండి.. నిపుణత సాధించండి

- కొత్తగా నియమితులైన ఏఈఈలతో మంత్రి సీతక్క

హైదరాబాద్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వపరంగా చేపట్టే నిర్మాణాలు ఏవైనా పదికాలాలపాటు పదిలంగా ఉండాలంటే.. నాణ్యతలో రాజీపడకుండా ఇంజనీర్లు పనులు చేయించాలని మంత్రి సీతక్క అన్నారు. ఇటీవల నియామక పత్రాలు అందుకున్న మిషన్ భగీరథ, పంచాయతీరాజ్ విభాగాలకు చెందిన ఏఈఈలకు (అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లకు) మంగళవారం పంచాయతీరాజ్ ఇంజనీర్ ఇన్‌చీఫ్ కార్యాలయంలో చేపట్టిన శిక్షణ కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా... వేలమందితో పోటీపడి ఉద్యోగాలు దక్కించుకున్న ఏఈఈలు అదేపట్టుదలతో బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు.

2000 మంది సిబ్బందితో ఎస్‌డీఆర్ఎఫ్ ఏర్పాటు

దాదాపు 2000 మంది సిబ్బందితో రాష్ట్ర విపత్తు నిర్వహణ బలగాన్ని(ఎస్‌డీఆర్ఎఫ్) ఏర్పాటు చేస్తున్నట్లు సీఎస్ శాంతికుమారి తెలిపారు. వీరికి నవంబరు మొదటివారం నుంచి శిక్షణ ఇవ్వనున్నామని చెప్పారు. విపత్తు నిర్వహణ, ఎస్‌డీఆర్ఎఫ్ ఏర్పాటు అంశాలపై ఆమె విపత్తు నిర్వహణ శాఖ ప్రత్యేకప్రధాన కార్యదర్శి అర్వింద్‌కుమార్, ఇతర ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. ఇటీవల రాష్ట్రంలో సంభవించిన వరదలతో లోతట్టు ప్రాంతాలు నీట మునిగి, పలు విధాలుగా నష్టం వాటిల్లిందని తెలిపారు. దాదాపు 2000 మందితో ఎస్‌డీఆర్ఎఫ్‌ను ఏర్పాటు చేయాలంటూ సీఎం ఆదేశించారని వివరించారు. ఈ దృష్ట్యా... ఎస్‌డీఆర్ఎఫ్‌ను ఏర్పాటు చేస్తున్నామని, వీరందరికి శిక్షణ ఇస్తామని ఆమె తెలిపారు.

రాష్ట్రంలో మొదటిసారిగా పోలీస్ డ్యూటీ మీట్

రాష్ట్రం ఏర్పడ్డ తర్వాత తెలంగాణలో తొలిసారిగా పోలీస్ డ్యూటీ మీట్ నిర్వహిస్తున్నారు. సీఐడీ విభాగం ఆధ్వర్యంలో పోలీస్ అకాడమీలో బుధవారం నుంచి శనివారం వరకు 4 రోజులపాటు ఈ కార్యక్రమం కొనసాగుతుంది. పోలీస్ డ్యూటీ మీట్-2024ను సీఎస్ శాంతి కుమారి బుధవారం ప్రారంభిస్తారు. శనివారం ముగింపు కార్యక్రమానికి సీఎం రేవంత్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఆయా విభాగాల నుంచి సుమారు 400మంది అధికారులు, సిబ్బంది ఇందులో పాల్గొంటున్నారు. ఏదైనా నేరం జరిగితే నిందితుల్ని గుర్తించి పట్టుకునేందుకు అనుసరించాల్సిన విధానాలు, న్యాయస్థానంలో శిక్షపడేలా చేసేందుకు అవసరమైన ఆధారాల సేకరణ, క్లూస్, సైంటిఫిక్ ఎవిడెన్స్ తదితర అంశాలపై ఈ వేదికగా అధికారులు, సిబ్బంది పరస్పరం ఆలోచనలు పంచుకుంటారు.

2 రాష్ట్రాల రైతులకు ఉపయోగపడేలా విత్తనోత్పత్తి

- విజయవాడలో కార్పొరేషన్ చైర్మన్ల భేటీ

హైదరాబాద్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల రైతాంగానికి ఉపయోగపడేలా విత్తనోత్పత్తి చేయాలని నిర్ణయించినట్లు రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ సుంకెట అన్వేష్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ఏపీ సీడ్ కార్పొరేషన్ చైర్మన్ మన్నె సుబ్బారెడ్డితో ఆయన విజయవాడలో భేటీ అయ్యారు. శనగ, మినుము, వేరుశనగ, వరి విత్తనాల లభ్యత, ఉభయ రాష్ట్రాలకు అవసరమైన విత్తనాలు, విత్తనోత్పత్తి, సరఫరాపై సమగ్రంగా చర్చించినట్లు తెలిపారు. సీడ్ కార్పొరేషన్‌కు సంబంధించి విభజన అంశాలపై వీలైనంత త్వరగా పరిష్కరించుకునేలా కార్యాచరణ ప్రణాళిక ఉండాలని నిర్ణయించినట్లు చెప్పారు. ఉద్యోగులకు సంబంధించిన భవిష్యనిధి సమాచారం కూడా నెల రోజుల్లో తెలంగాణకు ఇచ్చేందుకు ఏపీ సీడ్స్ చైర్మన్ అంగీకరించినట్లు వెల్లడించారు.

గోనె సంచిలో ఏడేళ్ల బాలిక మృతదేహం

- తల్లి, ప్రియుడు కలిసి చంపేశారని అనుమానం

గాజులరామారం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): దసరా పండుగ రోజున అదృశ్యమైన ఏడేళ్ల బాలిక.. నాలుగు రోజుల తర్వాత మేడ్చల్ పరిధిలో మృతదేహంగా కనిపించింది. తమ వివాహేతర బంధానికి అడ్డుగా ఉందని.. చిన్నారి తల్లి, ఆమె ప్రియుడు కలిసి.. బాలికను చంపేసి ఉండొచ్చని పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆదిలాబాద్ జిల్లాకు చెందిన దంపతులు తమ ఇద్దరు కుమార్తెలతో కలిసి సూరారం ప్రాంతంలో కొంతకాలంగా నివాసం ఉంటూ, కూలి పనులు చేసుకుంటున్నారు. వీరి పక్క గ్రామానికి చెందిన తిరుపతికి ఆ దంపతులతో మంచి పరిచయం ఉంది. ఈ నేపథ్యంలో సూరారంలో ఉంటున్న వీరి ఇంటికి తిరుపతి తరచూ వచ్చేవాడు. ఈ క్రమంలో స్నేహితుడి భార్యతో చనువు పెంచుకున్నాడు. అది కాస్త వివాహేతర సంబంధానికి దారితీసింది. తమ సంబంధానికి దంపతుల కూతురు (7) అడ్డుగా ఉందని భావించిన తిరుపతి.. ఎలాగైనా ఆ చిన్నారిని అడ్డు తొలగించుకోవాలని భావించాడు. దసరా రోజు ఇంటిముందు ఆడుకుంటున్న చిన్నారిని కిడ్నాప్ చేసి చంపేశాడు. మృతదేహాన్ని గోనె సంచిలో మూట గట్టి మేడ్చల్ పరిధిలోని బాసరగడీ గ్రామం సమీపంలో చెట్ల పొదల్లో పడేశాడు. కూతురు కనిపించకపోవడంతో బాలిక తండ్రి సూరారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ క్రమంలో మంగళవారం మేడ్చల్ పరిధిలో బాలిక మృతదేహం లభించింది. పోలీసులు తిరుపతిని అదుపులోకి తీసుకొని విచారించగా విషయం వెలుగులోకి వచ్చినట్లు సమాచారం. అతనొక్కడే బాలికను హతమార్చాడా? ఇంకా ఎవరైనా ఉన్నారా? బాలిక తల్లి.. ప్రియుడికి సహకరించిందా..? వివాహేతర సంబంధమే కారణమా..? అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

దామగుండం నేవీ రేడార్ కేంద్రం పనులను

దగ్గరుండి చేయిస్తాం

(మొదటిపేజీ తరువాయి)

వీఎల్ఎఫ్ నేవీ రేడార్ స్టేషన్‌ను దామగుండంలో ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. ఈ అంశాన్ని వివాదం చేసేందుకు కొందరు ప్రయత్నిస్తున్నారని, ఇక్కడ రేడార్ స్టేషన్ నిర్మిస్తే జిల్లాకు అన్యాయం జరుగుతుందంటూ అపోహలు సృష్టిస్తున్నారని తప్పుబట్టారు. వారు దేశ రక్షణ గురించి ఆలోచించాలన్నారు. తమిళనాడులో 1990లోనే నేవీ రేడార్ స్టేషన్‌ను ఏర్పాటు చేశారని, అక్కడ ప్రకృతికి, మనుషులకు ఎలాంటి హాని జరగలేదని పేర్కొన్నారు. దేశానికి ఉపయోగపడే రెండో రేడార్ కేంద్రం మన ప్రాంతానికి రావడం సంతోషకరమన్నారు. దీని ప్రాధాన్యాన్ని తెలంగాణ సమాజం గుర్తించాల్సిన అవసరం ఉందన్నారు.

దేశం ఉంటేనే మనం ఉంటాం..

"దేశం ఉంటేనే మనం ఉంటాం. మనం ఉంటేనే ప్రాంతం అభివృద్ధి చెందుతుంది. పర్యావరణ ప్రేమికులకు ఒక్కటే చెబుతున్నా. దేశ ప్రజలు సురక్షితంగా ఉంటేనే పర్యావరణ రక్షణ గురించి ఆలోచించగలం. దేశ భద్రతకు ముప్పు నుంచి కాపాడేందుకు ఏర్పాటు చేస్తున్న ఈప్రాజెక్టును వివాదం చేయడం సరికాదు. రేడార్ స్టేషన్ ఏర్పాటుకు తెలంగాణ ప్రభుత్వం పూర్తి మద్దతు ఉంటుంది. మేం దగ్గరుండి పని చేయిస్తాం" అని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ఈ స్టేషన్ కోసం 2017లోనే భూ బదలాయింపు జరిగిందని, నిధుల కేటాయింపు వంటి నిర్ణయాలన్నీ గత ప్రభుత్వ హయాంలోనే జరిగాయని తెలిపారు. ప్రాజెక్టును ప్రారంభించాలని కేంద్ర మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ అడగగానే తాము కూడా ముందుకు సాగామని, దేశ రక్షణ విషయంలో రాజీ పడొద్దని, పనులు ప్రారంభించాలని అధికారులను ఆదేశించానని చెప్పారు. అడ్డుకోవాలనుకునే వారికి దామగుండం శివుడే తెలివి ప్రసాదిస్తాడన్నారు. ఇది సురక్షితమైన ప్రాజెక్ట్ అని, లక్షల చెట్లు తీసేదేమీ లేదని స్పష్టం చేశారు. అబద్ధాలు చెప్పేవారి మాటలు నమ్మవద్దన్నారు. దామగుండంలో ప్రజలు వి


దామగుండంలో మాట్లాడుతున్న సీఎం రేవంత్

శ్వసించే పవిత్ర దేవాలయం ఉందని, అక్కడికి ప్రజలు వెళ్లేందుకు దారి ఏర్పాటు చేసి.. వచ్చి పోయేందుకు సౌకర్యం కల్పించాలని నావికా దళం అధికారులను కోరారు. నేవీ పాఠశాలలో 1/3 వంతు స్థానిక పిల్లలు చదువునేందుకు అవకాశం కల్పించాలన్నారు.

సముద్రాల్లో భద్రతనే కాపాడేందుకే..

దేశ భద్రతలో భాగంగా సముద్రాల్లో జలంతర్గాముల కదలికలను పసిగట్టి, అవసరమైన చర్యలు తీసుకేందుకునే వీఎల్ఎఫ్ రేడార్ ప్రాజెక్ట్ ఏర్పాటవుతోందని భారత నావికాదళం ప్రధానాధికారి దినేశ్ త్రిపాఠి అన్నారు. దామగుండం రిజర్వ్ ఫారెస్టులో భాగమైన 2,900 ఎకరాల అటవీ భూమిని సైంటిఫిక్ సర్వే తర్వాత ఎంపిక చేసినట్లు తెలిపారు. వికారాబాద్‌లో ఈ ప్రాజెక్టు పూర్తయ్యాక.. తమిళనాడులోని తిరునల్వేలిలో లోయలో ఉన్న వీఎల్ఎఫ్ స్టేషన్‌కు ఇది సహకరించడంతోపాటు నావికా దళానికి మరింత బలం చేకూరుతుందన్నారు. సముద్రాలపై నియంతరణ మెరుగుపరచడం, వ్యూహాత్మక శక్తిని పెంచడమనేది ఈ ప్రాజెక్టు ప్రధాన లక్ష్యమన్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా స్థానికంగా ఉపాధి అవకాశాలతో పాటు ఈ ప్రాంతం అభివృద్ధి కూడా జరుగుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. అతి తక్కువ ఫ్రీక్వెన్సీతో దీనిని ఏర్పాటు చేయబోతున్నట్లు, ఈ తరంగాలతో మానవులకు, జంతుజాలానికి ఎలాంటి హానీ ఉండదని చెప్పారు. ఈ కార్యక్రమంలో అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, కేంద్ర మంత్రి బండి సంజయ్, భారత నావికాదళం ప్రధానాధికారి దినేశ్, ఎంపీలు కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, డీకే అరుణ, శాసనమండలి చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.

సీఎం ప్రొటోకాల్‌లో ఇబ్బందులు

బేగంపేట ఎయిర్‌పోర్టు నుంచి హెలికాప్టర్ ద్వారా వికారాబాద్‌కు చేరుకోవాల్సిన కేంద్ర రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్, సీఎం రేవంత్‌రెడ్డి రోడ్డు మార్గాన దామగుండంకు వేర్వేరు వాహనాల్లో చేరుకున్నారు. తిరుగు ప్రయాణంలో సీఎం రేవంత్‌రెడ్డికి ప్రొటోకాల్ విషయంలో అధికారులు నిర్లక్ష్యంతో ఇబ్బందులు పడాల్సి వచ్చింది. సభా వేదిక నుంచి కూడా హెలిప్యాడ్ వరకు వేర్వేరు వాహనాలు ఏర్పాటు చేయాల్సి ఉండగా.. సీఎం రేవంత్‌రెడ్డి వాహనం రాలేదు. దాంతో ఆయన రాజ్‌నాథ్‌సింగ్ వాహనంలో ఎక్కి హెలిప్యాడ్ వద్దకు చేరుకున్నారు. కాగా, వీఎల్ఎఫ్ రాడార్ ప్రాజెక్టు శంకుస్థాపన కార్యక్రమానికి నేవీ, ఆర్మీ, పోలీస్ శాఖల ఆధ్వర్యంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. కేంద్ర మంత్రి, సీఎం కలెక్టరేట్ ఆవరణలోని హెలిప్యాడ్ వద్దకు చాపర్ ద్వారా చేరుకుంటారని పోలీసులు ఎన్నేపల్లి నుంచి కలెక్టరేట్ వరకు అడుగడుగునా పోలీస్ భద్రతను ఏర్పాటు చేసి గట్టి నిఘా పెట్టారు. వాతావరణంలో మార్పుల వల్ల హెలికాప్టర్‌లో కాకుండా రోడ్డు మార్గాన వాహనాల్లో రావడంతో భద్రతా సిబ్బంది పరుగులు పెట్టారు.

నేడు ఢిల్లీకి సీఎం?

హైదరాబాద్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డి బుధవారం ఢిల్లీ వెళ్లనున్నట్లు తెలుస్తోంది. రాష్ట్రానికి రావాల్సిన నిధులపై కేంద్ర మంత్రులను గురువారం ఆయన కలవనున్నట్లు చెబుతున్నారు. అయితే దీనికి సంబంధించిన షెడ్యూల్ మాత్రం ఇంకా ఖరారు కాలేదు. మహారాష్ట్ర ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో ఏఐసీసీ పెద్దలనూ సీఎం కలుస్తారని సమాచారం.

కేసీఆర్ ఫాంహౌస్ ముందు

ధర్నా చెయ్

- నాడు రేడార్ వ్యవస్థకు ఎందుకు అనుమతిచ్చారో అడుగు
- కేటీఆర్‌పై ధ్వజమెత్తిన కేంద్ర మంత్రి బండి సంజయ్

హైదరాబాద్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): వికారాబాద్ జిల్లా దామగుండం అడవుల్లో రాడార్ స్టేషన్ ఏర్పాటును వ్యతిరేకిస్తున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు సిగ్గుండాలని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ అన్నారు. నాడు సీఎంగా ఉన్న కేసీఆర్ సోయిలో ఉండే అనుమతులు ఇచ్చారా? లేదా? తెలుసుకోవాలని సూచించారు. అనుమతులు ఎందుకు ఇచ్చారో నిలదీస్తూ కేసీఆర్ ఫాంహౌస్ ముందు ధర్నా చేయాలని కేటీఆర్‌కు సూచించారు. కేసీఆర్ ప్రభుత్వం ఆమోదించిన వ్యవస్థను ఆయన కొడుకు ఆధ్వర్యంలో పార్టీ నేతలు వ్యతిరేకించడం విడ్డూరంగా ఉందని విమర్శించారు. 1174 హెక్టార్ల భూమిని రాడార్ స్టేషన్ ఏర్పాటుకు బదిలీ చేస్తూ 2017న డిసెంబరు 19న అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం జీవో 44 జారీ చేసిందని గుర్తు చేశారు. రాడార్ స్టేషన్ ఏర్పాటు అంశం ఇప్పటిది కాదని.. పద్నాలుగేళ్లుగా పెండింగ్‌లో ఉందని చెప్పారు. ఎట్టకేలకు భూమి పూజ చేసుకోవడం సంతోషంగా ఉందన్నారు. రాజ్‌నాథ్ సింగ్ చొరవతోనే ఇది సాధ్యమైందని సంజయ్ ఓ ప్రకటనలో తెలిపారు.

రేడార్ కేంద్రంపై బీఆర్ఎస్

ద్వంద్వ వైఖరి

- కేసీఆర్ కుటుంబానిది 2 నాల్కల ధోరణి
- దేశ భద్రతపై వారిది బాధ్యతా రాహిత్యం
- కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ధ్వజం



హైదరాబాద్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): వికారాబాద్ జిల్లా దామగుండంలో వీఎల్ఎఫ్ నేవీ రేడార్ కేంద్రం ఏర్పాటుపై బీఆర్ఎస్ ద్వంద్వ వైఖరి అవలంబిస్తోందని కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి అన్నారు. అధికారంలో ఉన్నప్పుడు ఒక మాట, ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మరోమాట మాట్లాడుతోందని దుయ్యబట్టారు. తెలంగాణకు గర్వకారణమైన ఈ ప్రాజెక్టు విషయంలో కేసీఆర్ కుటుంబం రెండు నాల్కల ధోరణితో, బాధ్యతరహితంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. ఈ మేరకు మంగళవారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో కిషన్‌రెడ్డి మీడియా సమావేశంలో మాట్లాడారు. అధికారంలో ఉన్నప్పుడు రేడార్ కేంద్రం ఏర్పాటుకు అవసరమైన అనుమతులను బీఆర్ఎస్ ఇచ్చిందని తెలిపారు. తీరా పనులు ప్రారంభించే సమయానికి కొత్త సెక్రటేరియట్ కోసం బైసన్ పోలో గ్రౌండ్స్‌ను ఇవ్వాలని, అప్పుడే పంచనామా చేసి భూమి కేటాయిస్తామంటూ తిరకాసు పెట్టిందని విమర్శించారు. దేశ భద్రత, రక్షణ విషయంలో బీఆర్ఎస్ పార్టీ మొదటి నుంచీ బాధ్యతారహితంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. భారత రక్షణశాఖకు సహకరించాల్సింది పోయి, తమకు ఇష్టం లేదంటూ దేశ భద్రత, సమగ్రతకు వ్యతిరేకంగా పోరాటం చేస్తామంటూ కేసీఆర్, కేటీఆర్ మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. ఈ వ్యాఖ్యలను సభ్యసమాజం ఖండించాలని పిలుపునిచ్చారు. దామగుండంలో కొంత ప్రాంతంలో మాత్రమే రేడార్ వ్యవస్థలో పనిచేసే నేవీ సిబ్బందికి వసతి సౌకర్యం ఏర్పాటు చేస్తారని తెలిపారు. అయితే, చెట్లు నరికివేస్తున్నారని కొంతమంది అసత్య ప్రచారం చేస్తున్నారని చెప్పారు. అక్కడి రామలింగేశ్వర స్వామి ఆలయానికి మరిన్ని సౌకర్యాలు కల్పించేలా రక్షణశాఖతో సంప్రదిస్తామన్నారు.

బీజేపీ సంస్థాగత ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా లక్ష్మణ్

న్యూఢిల్లీ, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): బీజేపీ సంస్థాగత ఎన్నికల నిర్వహణ కోసం ఆ పార్టీ అధినాయకత్వం కమిటీని నియమించింది. జాతీయ రిటర్నింగ్ అధికారిగా తెలంగాణకు చెందిన సీనియర్ నేత, రాజ్యసభ సభ్యుడు డా. కె లక్ష్మణ్‌కు అవకాశం కల్పించింది. ఈ మేరకు మంగళవారం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి అరుణ్‌సింగ్ ఉత్తర్వులు జారీ చేశారు. జాతీయ రిటర్నింగ్ అధికారిగా లక్ష్మణ్‌తో పాటు కో రిటర్నింగ్ అధికారులుగా ఎంపీలు నరేశ్ బన్సల్, సంబిత్ పాత్రా, జాతీయ ఉపాధ్యక్షురాలు రేఖావర్మలకు అవకాశం దక్కింది. ఈ ఉత్తర్వులు తక్షణమే అమలులోకి వస్తాయని అరుణ్ సింగ్ తన ప్రకటనలో పేర్కొన్నారు.

మంత్రి సురేఖ ఫొటో మార్ఫింగ్ కేసులో ఇద్దరి అరెస్టు

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): మంత్రి కొండా సురేఖ ఫొటోను మార్ఫింగ్ కేసులో ఇద్దరు నిందితులను సైబరాబాద్ సైబర్ క్రైం పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. మంత్రికి మెదక్ ఎంపీ రఘునందన్‌రావు ఓ కార్యక్రమంలో నూలు దండ వేస్తున్న ఫొటోను ఇద్దరు వ్యక్తులు అసభ్యకరంగా చిత్రీకరించి సోషల్ మీడియాలో పోస్టు చేసి తప్పుడు ప్రచారం చేయడం ఇటీవల చర్చనీయాంశంగా మారింది. దీనిపై ఎంపీ సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు సాంకేతిక ఆధారాలతో నిజామాబాద్‌కు చెందిన దేవన్న, జగిత్యాలకు చెందిన మహేష్‌ను నిందితులుగా గుర్తించి అరెస్ట్ చేశారు.

నౌకా దళానికి రామబాణం

దేశ రక్షణలో కీలక ముందడుగు వీఎల్ఎఫ్ స్టేషన్: రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్

హైదరాబాద్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): దేశ రక్షణ దళాలకు అత్యంత అధునాతన ఆయుధాలు సమకూర్చడం ఎంత కీలకమో.. అధునాతన కమ్యూనికేషన్ వ్యవస్థ కూడా అంతే కీలకమని కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ అన్నారు. యుద్ధ సమయంలో గెలుపోటములను రియల్ టైం కమ్యూనికేషన్ నిర్ణయిస్తుందని, ప్రస్తుతం ప్రపంచ యుద్ధ పరిణామాలను గమనిస్తే ఈ విషయం స్పష్టమవుతుందని పేర్కొన్నారు. ఈ దిశగా తెలంగాణలో ఏర్పాటు కాబోతున్న వీఎల్ఎఫ్ నేవీ రేడార్ కేంద్రం దేశ రక్షణలో అత్యంత కీలకంగా మారనుందన్నారు. ముఖ్యంగా నౌకాదళాలకు ఈ స్టేషన్ రామబాణం కానుందన్నారు. మంగళవారం వికారాబాద్ జిల్లా దామగుండంలో కేంద్ర నౌకాదళం ఏర్పాటుచేయనున్న 'వెరీ లో ఫ్రీక్వెన్సీ స్టేషన్'కు రాజ్‌నాథ్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రేడార్ స్టేషన్ నిర్మాణ ప్రణాళిక కాగితాల నుంచి కార్యాచరణకు చేరుకునేందుకు సీఎం రేవంత్‌రెడ్డి ఎంతో సహకరించారంటూ అభినందించారు. "దేశ ప్రయోజనాలకు సంబంధించి ఎంతో ప్రాముఖ్యం కలిగిన వీఎల్ఎఫ్ స్టేషన్‌కు మాజీ రాష్ట్రపతి, ప్రముఖ మిసైల్ శాస్త్రవేత్త అబ్దుల్ కలాం జయంతి రోజు శంకుస్థాపన చేయడం ఎంతో సంతోషంగా ఉంది. దేశ ప్రయోజనాలకు విరుద్ధంగా ప్రవర్తించడం రాజకీయం కాదని తన ప్రసంగంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చెప్పడం అద్భుతమైన విషయం. రాజకీయమంటే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడం కాదు.. దేశాన్ని ఏర్పాటు చేయడమన్న ఉద్దేశంతో ఆయన ఈ ప్రాజెక్టుకు పూర్తి సహాయ సహకారాలు అందించారు. ఇందుకు రేవంత్‌రెడ్డికి ప్రత్యేక అభినందనలు" అని రాజ్‌నాథ్ అన్నారు.

నౌకాదళాలకు అత్యంత కీలకం..

"నౌకాదళాలకు రియల్ టైం కమ్యూనికేషన్‌లో ఈ స్టేషన్ అత్యంత కీలకం కానుంది. సముద్రంలో ఉండే భారతీయ నౌకాదళం నౌకల మధ్య మరింత మెరుగైన కమ్యూనికేషన్ వ్యవస్థ దీంతో సమకూరనుంది. దేశ రక్షణకు సంబంధించి ఇది ఎంతో కీలకం కానుంది. మనిషి, యంత్రం మధ్యలో సమన్వయం ప్రస్తుత తరంలో ఎంతో కీలకంగా కానుందని రక్షణ శాస్త్రవేత్తలు పేర్కొంటున్నారు. మెరుగైన కమ్యూనికేషన్ వ్యవస్థ రక్షణ రంగంలో ఎంతో కీలకం. ఉన్నత స్థాయి ఆదేశాలను క్షేత్రస్థాయిలో పంపించడం, సత్వర నిర్ణయాలు అమలు చేయడం, క్షేత్రస్థాయి నుంచి ఫీడ్ బ్యాక్ సేకరణలో ఈ కేంద్రం ఎంతో ప్రాముఖ్యం కలిగి ఉండనుంది. గత వైఫల్యాలతో



నేవీ రేడార్ కేంద్రం శంకుస్థాపన కార్యక్రమంలో కేంద్ర మంత్రులు రాజ్‌నాథ్, సంజయ్, సీఎం రేవంత్

పాఠాలు నేర్చుకుని సురక్షిత భవిష్యత్తు కోసం దీనిని అభివృద్ధి చేస్తున్నాం. మన నౌకాదళం వద్ద పెద్దఎత్తున నౌకలున్నాయి. ఇండో పసిఫిక్ సముద్రం, బంగాళాఖాతంలో మన నౌకాదళం నౌకలు విస్తరించి ఉన్నాయి. దశాబ్దాలుగా ఫ్రాన్స్, ఆంగ్లేయులు సముద్రంపై ఆధిపత్యం చలాయిస్తూ వస్తున్నారు. నేడు మనం ఆ రంగంలో ఆధిపత్యం చలాయించాలంటే ఇలాంటి లో ఫ్రీక్వెన్సీ స్టేషన్ ఎంతో కీలకం. ఇది పూర్తిగా అత్యాధునిక టెక్నాలజీపై ఆధారపడి ఉంటుంది. భవిష్యత్తు అవసరాలకూ ఇది ఎంతో కీలకం కానుంది. వచ్చే ఎన్నో దశాబ్దాల వరకు మన నౌకాదళానికి ఈ కేంద్రం సురక్షితమైన కమ్యూనికేషన్ల వ్యవస్థను అందిస్తుంది. భారతీయ నౌకాదళాన్ని మరింత పటిష్ఠం చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది. ఇలాంటి స్టేషన్ల నిర్మాణంతో మన దళాలను అత్యాధునిక, ఆత్మనిర్భర్‌గా చేస్తున్నాం" అని రాజ్‌నాథ్ వివరించారు.

పర్యావరణ సమస్యలుండవు..

"పర్యావరణ సమస్యలంటూ ఈ కేంద్రం గురించి స్థానికుల్లో అనేక అపోహలు వ్యాప్తి చేశారు. మీ అందరికీ నేను మాటిస్తున్నా.. పర్యావరణ సమస్యలపై ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉంది. ఎలాంటి పర్యావరణ సమస్యలు రాకుండా నిర్మాణం ఉంటుందని ఇప్పటికే నేవీ చీఫ్ అడ్మిరల్ పేర్కొన్నారు. నేను కూడా స్పష్టం చేస్తున్నా.. పర్యావరణానికి విఘాతం కలగకుండా స్టేషన్ నిర్మాణం ఉంటుంది. ఈ కేంద్రం నిర్మాణంలో అవసరమైతే స్థానికుల పునరావాసం గురించి కూడా ఏర్పాట్లు చేస్తాం. తమిళనాడు తిరునల్వేలిలోని ఐఎన్ఎస్ కట్టబొమ్మన్ వీఎల్ఎస్ ట్రాన్స్‌మిషన్ కేంద్రం గత 35 ఏళ్లుగా నౌకాదళాలకు సేవలందిస్తోంది. అక్కడ స్థానికంగా ఎలాంటి పర్యావరణ సమస్యలు రాలేదు. ఎవరైనా వెళ్లి చూడవచ్చు. ఈ కేంద్రం నిర్మాణంలో, పూర్తయ్యాక స్థానికులకు ఉద్యోగ అవకాశాలూ ఇస్తామని హామీ ఇస్తున్నా. ఇది కేవలం ఉపాధి అవకాశాల కోసమే కాదు.. పరిసర ప్రాంతాల అభివృద్ధికీ గ్రోత్ పోల్‌గా మారనుంది. శాంతికి సంబంధించిన అతిపెద్ద గ్యారంటీ మన నౌకాదళం. బంగాళాఖాతం, భారత సముద్ర జలాల్లో శాంతిని కొనసాగించడం మన ప్రాధాన్యం కావాలి. భారత్ చేస్తున్న ఈ ప్రయత్నంలో స్నేహపూర్వక దేశాలన్నీ కలిసి నడుస్తున్నాయి. మన పొరుగు దేశాలతోనూ స్నేహపూర్వకంగా ముందుకు వెళ్తున్నాం. దేశ రక్షణ విషయం వస్తే కులమతాలకు అతీతంగా అందరూ ఏకమవుతారని ఇక్కడి స్థానికులు చాటిచెప్పారు. ఇతర రాజకీయ పక్షాలు కూడా దేశ సురక్ష విషయంలో అంతా ఏకమై వచ్చారు" అని రాజ్‌నాథ్‌సింగ్ చెప్పారు.

రాజ్‌నాథ్‌కు ఘనస్వాగతం

బేగంపేట: దామగుండం ప్రాజెక్టు శంకుస్థాపనకు వచ్చిన కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాత్‌సింగ్‌కు మంగళవారం బేగంపేట విమానాశ్రయంలో ఘన స్వాగతం లభించింది. ఉదయం 11.35 గంటలకు బేగంపేటకు చేరుకున్న రాజ్‌నాథ్‌కు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్, రాష్ట్ర మంత్రి కొండా సురేఖ స్వాగతం పలికారు. శంకుస్థాపన పూర్తయిన అనంతరం 4.18 గంటలకు తిరిగి బేగంపేటకు చేరుకొని ఢిల్లీకి బయలుదేరి వెళ్లారు.

నీటిపారుదల ప్రాజెక్టులకు ఏఐఐబీ రుణం

- మంత్రి ఉత్తమ్‌తో భేటీలో ఆ బ్యాంకు ప్రతినిధుల సుముఖత
- 6%లోపు వడ్డీ.. అధిక గడువుతో రుణాలకు ప్రభుత్వ యత్నం
- అధిక వడ్డీకి స్వల్పకాలిక రుణాలు తెచ్చిన గత ప్రభుత్వం
- వాటి వడ్డీ/అసలు చెల్లింపునకే ఏటా రూ.15 వేల కోట్లు
- ఆ భారం నుంచి ఉపశమనంపైనా రేవంత్ సర్కారు దృష్టి

హైదరాబాద్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): కేంద్ర జల వనరుల సంఘం (సీడబ్ల్యూసీ) ఆమోదం పొంది, నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టులకు తక్కువ వడ్డీతో (6 శాతం దాకా) రుణాలు అందించడానికి ఏషియన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకు (ఏఐఐబీ) సుముఖత వ్యక్తం చేసింది. గత ప్రభుత్వం కాళేశ్వరంతో పాటు సీతారామ, పాలమూరు-రంగారెడ్డి, చనకా కొరాటా, సమ్మక్కసాగర్ వంటి ప్రాజెక్టు



లకు స్వల్ప కాలానికి దాదాపు 11 శాతం దాకా అధిక వడ్డీలకు రుణాలు తీసుకోవడంతో ఏటా వడ్డీలు/అసలు కింద రూ.15 వేల కోట్ల దాకా చెల్లించాల్సిన పరిస్థితి. దాంతో ఈ రుణాలను దీర్ఘకాలిక రుణాలుగా మార్చుకొని, వడ్డీ/అసలు చెల్లింపుల భారం నుంచి ఉపశమనం పొందాలని ప్రభుత్వం యోచిస్తోంది. ఈ నేపథ్యంలో మంగళవారం జలసౌధలో ఏఐఐబీ ప్రతినిధులు నీటిపారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్ రెడ్డితో సమావేశమై చర్చించారు. కాళేశ్వరం కార్పొరేషన్ ద్వారా 11 శాతం వడ్డీకి తీసుకున్న రుణాల తిరిగి చెల్లింపులకు ఏటా రూ.11 వేల కోట్లు అవుతోంది. దీంతో ఈ రుణాలను పునర్వ్యవస్థీకరించాలని, తక్కువ వడ్డీ, అధిక గడువుతో కొత్త రుణాలు తీసుకోవాలని ప్రయత్నిస్తోంది. దీనికి సహకరించాలని మంత్రి ఉత్తమ్ కోరగా బ్యాంకు ప్రతినిధులు సానుకూలంగా స్పందించారు. రుణాల పునర్వ్యవస్థీకరణకు విధివిధానాలు ఖరారు చేయాలని రాష్ట్ర ఆర్థిక శాఖ ప్రత్యేక కార్యదర్శి, నీటిపారుదల శాఖ కార్యదర్శిని మంత్రి ఆదేశించారు. ఉమ్మడి నల్లగొండ, మహబూబ్‌నగర్, ఆదిలాబాద్, వరంగల్ జిల్లాల్లో నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టులకు రుణ సహాయం అందించాలని కూడా మంత్రి ఉత్తమ్ బ్యాంకు ప్రతినిధులను కోరారు. సాధ్యాసాధ్యాలను పరిశీలించడానికి వీలుగా బ్యాంకు ప్రతినిధులు మరోమారు అధికారులతో సమావేశం కానున్నారు. భారీ వడ్డీతో వివిధ బ్యాంకుల కన్సార్షియంతో పాటు రూరల్ ఎలక్ట్రిఫికేషన్ కార్పొరేషన్ (ఆర్ఈసీ), పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ (పీఎఫ్‌సీ) నుంచి తీసుకున్న రుణాలను ఏఐఐబీకి బదలాయించి, స్వల్పకాలిక రుణాలను దీర్ఘకాలిక రుణాలుగా మార్చే విషయంపై తుది నిర్ణయం తీసుకోనున్నారు. నాగార్జునసాగర్ కాలువల ఆధునీకరణకు కూడా ఏఐఐబీ నుంచి రుణం తీసుకోవాలని ప్రభుత్వం యోచిస్తోంది. కాగా, బుధవారం మిర్యాలగూడ, దేవరకొండ నియోజకవర్గాల్లోని ప్రాజెక్టులపై మంత్రి ఉత్తమ్ సమీక్ష చేయనున్నారు.

కోర్టు ఉత్తర్వులతో సీట్లు పొందిన విద్యార్థులకు ఇబ్బంది కలిగించం

- సుప్రీంకోర్టుకు తెలిపిన తెలంగాణ ప్రభుత్వం
- వైద్య విద్య కోర్సుల్లో 'స్థానికత'పై కొనసాగిన విచారణ

న్యూఢిల్లీ, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): న్యాయస్థానం ఆదేశాలతో వైద్య విద్య కోర్సుల్లో ప్రవేశాలు పొందిన విద్యార్థులకు ఊరట కలిగింది. అలాంటి వారికి ఇబ్బందులు కలిగించబోమని తెలంగాణ ప్రభుత్వం మంగళవారం సుప్రీంకోర్టుకు తెలిపింది. కౌన్సెలింగ్ ప్రక్రియ ముగిసినందున వారి స్థానికత అంశాన్ని లేవనెత్తబోమని పేర్కొంది. వైద్య విద్య కోర్సుల ప్రవేశాల్లో 'స్థానికత'కు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో నెంబరు 33 విషయమై జరిగిన విచారణ సందర్భంగా ఈ విషయాన్ని స్పష్టం చేసింది. 'నీట్' రాయడానికి ముందు నాలుగు సంవత్సరాల పాటు తెలంగాణలో చదివిన వారే 'స్థానికులు'గా గుర్తింపు పొందుతారని రాష్ట్ర ప్రభుత్వం జీవో నెంబరు 33లోని నిబంధన 3(ఏ)లో పేర్కొంది. ఈ కారణంగా ఇతర ప్రాంతాల్లో చదివిన తెలంగాణ వాసులు 'స్థానికులు' కాకుండా పోతారని పేర్కొంటూ కొందరు హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. స్థానికతను నిర్ధారణకు ప్రభుత్వం మార్గదర్శకాలేవీ ఇవ్వనందున ఆ జీవో చెల్లదంటూ సెప్టెంబరు 5న హైకోర్టు తీర్పు చెప్పింది. తొలుత మార్గదర్శకాలు, నిబంధనలను రూపొందించాలని సూచించింది. తీర్పును సవాలు చేస్తూ సెప్టెంబరు 11న రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో అప్పీల్ చేసింది. దానిపై అదే నెల 20న ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం విచారణ జరిపింది. ఒకసారి మినహాయింపు కింద హైకోర్టును ఆశ్రయించిన విద్యార్థులు కౌన్సెలింగ్‌కు హాజరయ్యేందుకు రాష్ట్ర ప్రభుత్వం అంగీకారం తెలిపింది. అందుకు అనుగుణంగా ధర్మాసనం ఉత్తర్వులు ఇచ్చింది. దాంతో ఆ అవకాశాన్ని తమకు కూడా వర్తింపజేయాలని కోరుతూ మరికొంతమంది విద్యార్థులు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. వాటిపై తాజాగా సీజేఐ నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం విచారణ జరిపింది. ఇప్పటికే అడ్మిషన్ల ప్రక్రియ ముగిసిందని, అడ్మిషన్లు పొందిన విద్యార్థులను ఇబ్బంది పెట్టబోమని తెలంగాణ ప్రభుత్వం తరఫు న్యాయవాది స్పష్టతనిచ్చారు. దాంతో ధర్మాసనం తదుపరి విచారణను నవంబరు 11 తర్వాత చేపడుతామని తెలిపింది.

అంబేడ్కర్ వర్సిటీ డిగ్రీ, పీజీ ప్రవేశాల గడువు పెంపు

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): డిగ్రీ, పీజీ ప్రవేశాల గడువును డా. బీఆర్ అంబేడ్కర్ వర్సిటీ అధికారులు ఈ నెల 30 వరకు పొడిగించారు. విద్యార్థులు ఆ తేదీలోపు రిజిస్ట్రేషన్, ట్యూషన్ ఫీజును చెల్లించాలని విశ్వవిద్యాలయ ఇంచార్జ్ రిజిస్ట్రార్ ప్రొ. సుధారాణి తెలిపారు. విశ్వవిద్యాలయంలో డిగ్రీ ద్వితీయ, తృతీయ సంవత్సరం అభ్యసిస్తున్న విద్యార్థులు కూడా అక్టోబరు 30వ తేది లోపు ట్యూషన్ ఫీజును ఆన్‌లైన్‌లో చెల్లించాలని పేర్కొన్నారు. ఆన్‌లైన్‌లో నమోదు తదితర అంశాలపై సందేహాలుంటే సమీపంలోని అధ్యయన కేంద్రంలో సంప్రదించాలని చెప్పారు. మరింత సమాచారం కోసం విశ్వవిద్యాలయ హెల్ప్ డెస్క్ నంబర్లు 7382929570/580, 040-23680222/333/444/555, టోల్ ఫ్రీ నెంబరు 18005990101లో సంప్రదించవచ్చని అలాగే www.braouonline.in వెబ్‌సైట్‌లోనూ సందేహాలను నివృత్తి చేసుకోవచ్చని రిజిస్ట్రార్ సూచించారు.

విద్యా విషయాల్లో నిపుణుల అభిప్రాయాలే కీలకం

(మొదటిపేజీ తరువాయి)

ఆదేశించాలని, గ్రూప్-1 ప్రిలిమ్స్‌ను రద్దు చేయాలని హైకోర్టులో పిటిషన్లు దాఖలయ్యాయి. వీటిపై జస్టిస్ పుల్ల కార్తీక్ ధర్మాసనం విచారణ చేపట్టింది. 1,721 మంది అభ్యర్థుల నుంచి ఆన్‌లైన్ ద్వారా 6,147 అభ్యంతరాలు వచ్చాయని, వీటిపై టీజీపీఎస్సీ సబ్జెక్టుల వారీగా ప్రఖ్యాత విద్యా సంస్థలకు చెందిన ప్రొఫెసర్లతో నిపుణుల కమిటీ వేసిందని హైకోర్టు తెలిపింది. "విషయ నిపుణుల అభిప్రాయాల ఆధారంగా 56, 59 సంఖ్య కలిగిన ప్రశ్నలను తొలగించి.. 115వ ప్రశ్నకు ఆప్షన్‌ను సవరించి ఫైనల్ కీని విడుదల చేసింది. పిటిషనర్లు సమర్పించిన అభ్యంతరాలను నిపుణుల కమిటీ ఒకటికి రెండుసార్లు పరిశీలించాకే ఫైనల్ కీ ఇచ్చారు. అభ్యర్థులు వారు నేరుగా సమాధానం ఇచ్చేలా ప్రశ్నలు రావాలని కోరుకోకూడదు. అర్హత కలిగిన, సమర్థులైన వ్యక్తులను ఎంపిక చేయడానికి పరీక్షలు నిర్వహిస్తారు. ప్రిలిమినరీ కేవలం అర్హత పరీక్ష మాత్రమే. అది అంతిమ ఎంపిక కాదు" అని హైకోర్టు వ్యాఖ్యానించింది. 'పూర్తిగా సాంకేతిక అంశాలను నిపుణులైన వ్యక్తులు, సంస్థలకు వదిలేయడమే ఉత్తమం. వచ్చిన అభ్యంతరాలన్నింటినీ నిపుణులు పరిశీలించిన తర్వాతే జూలై 7న ఫైనల్ కీ ఇచ్చారు. ప్రతివాదులు సమర్పించిన వివరాలు, సంబంధిత మెటీరియల్, సమాధానాలతో సంతృప్తి చెందాం. ఈ మేరకు పిటిషన్లను డిస్మిస్ చేస్తున్నాం' అని ధర్మాసనం పేర్కొంది. పలు సుప్రీంకోర్టు, హైకోర్టు తీర్పుల ద్వారా.. విద్యా సంబంధ విషయాల్లో నిపుణులు ఇచ్చే అభిప్రాయాల్లో కోర్టులు జోక్యం చేసుకోలేవని అర్థమవుతోందని పేర్కొంది. 'ప్రశ్నలను కోర్టులో విశ్లేషించడానికి అనుమతి అసలే ఉండదు. కేసులు పెండింగ్‌లో ఉండడం వల్లే చాలాకాలంగా నియామకాలు నిలిచిపోతున్నాయి. తాత్కాలికంగా నియమితులైన వారు తమను రెగ్యులరైజ్ చేయాలని కోరుతున్నారు. మరోవైపు తగినంతమంది అధికారులు, సిబ్బంది లేక పాలనకు తీవ్ర విఘాతం కలుగుతున్నది' అని హైకోర్టు వ్యాఖ్యానించింది.

హైడ్రా జీవోతో మీకేంటి ఇబ్బంది? పిటిషనర్లకు ప్రశ్న

హైడ్రాను ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం జారీ చేసిన జీవో 99తో మీకు వచ్చిన ఇబ్బంది ఏంటి? అంటూ పలువురు పిటిషనర్లను జస్టిస్ సీవీ భాస్కర్‌రెడ్డి ధర్మాసనం మంగళవారం ప్రశ్నించింది. ఏ అధికారంతో ఈ జీవోను సవాల్ చేస్తున్నారు? అని నిలదీసింది. హైడ్రా జీవోను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లపై విచారణ చేపట్టింది. హైడ్రా చట్టప్రకారం వ్యవహరించాలని, అన్ని పత్రాలు, టైటిల్స్ పరిశీలించాకే చర్యలు చేపట్టాలని హైకోర్టు సింగిల్ జడ్జి తీర్పు ఇచ్చారని, ఇంకా అభ్యంతరం ఏంటని అడిగింది. మీ భవనాలను కూల్చివేస్తే ప్రభుత్వం నుంచి పరిహారం కోరాలని, తమ ఉత్తర్వులు పాటించకపోతే కోర్టు ధిక్కరణ పిటిషన్లు వేసుకోవాలని సూచించింది. ఇన్ని మార్గాలు ఉండగా హైడ్రా జీవోను సవాల్ చేయాల్సిన అవసరం ఏంటి? అని ప్రశ్నించింది. ఈ పిటిషన్‌లో కౌంటర్ దాఖలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి ఆదేశాలిచ్చింది. ఈ మేరకు విచారణను రెండు వారాలకు వాయిదా వేసింది.

సీఎం సంతకం చేసినా.. బదిలీల్లేవ్!

- ఇద్దరు ఉన్నతాధికారుల మధ్య విభేదాలతో ఆగిన సచివాలయ ఉద్యోగుల ట్రాన్స్‌ఫర్లు

హైదరాబాద్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): సచివాలయంలో సెక్షన్ అధికారుల (ఎస్‌వో)ను వెంటనే బదిలీ చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. సెప్టెంబరు 30నే సంబంధిత ఫైలుపై సంతకం కూడా చేశారు. రెండు వారాలు దాటినా.. ఇప్పటికీ బదిలీలు జరగలేదు. ఈ జాప్యానికి ఇద్దరు ఉన్నతాధికారుల మధ్య భేదాభిప్రాయాలే కారణమని తెలుస్తోంది. అన్ని శాఖల్లోనూ ఏళ్లతరబడి ఒకే చోట కొనసాగుతున్న ఉద్యోగులందరినీ బదిలీ చేయాలని ఒక ఉన్నతాధికారి ఫైల్ సిద్ధం చేశారు. అయితే కొన్ని శాఖల్లో దీర్ఘకాలంగా ఉన్న వారిని కూడా బదిలీ చేయొద్దని మరో ఉన్నతాధికారి మౌఖిక ఆదేశాలు ఇచ్చినట్లు సమాచారం. ఇద్దరి మధ్య పంచాయితీ తేలకపోవడంతో బదిలీల ఫైల్‌కు మోక్షం లభించడం లేదు. దసరాలోపే బదిలీలు పూర్తవుతాయని సచివాలయ ఉద్యోగులు భావించినా ఇప్పటికీ ఆ వ్యవహారం కొలిక్కి రాలేదు. తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించాక పదేళ్లలో ఒక్కసారి కూడా సచివాలయ ఉద్యోగుల బదిలీలు జరగలేదు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఏళ్ల తరబడి ప్రాధాన్య శాఖల్లో కొనసాగుతున్న ఉద్యోగులను ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటయ్యాక కూడా మార్చకపోవడంపై ఉద్యోగుల్లో అసంతృప్తి పెరిగింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటయ్యాక బదిలీలు జరుగుతాయని ఆశించారు. పది నెలలైనా కదలిక లేకపోవడంతో ఉద్యోగులు అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో తొలుత ఎస్‌వో క్యాడర్‌లో బదిలీలు చేయాలని రేవంత్ సర్కారు నిర్ణయించింది.

180 మంది ఎస్‌వోల బదిలీకి ఆమోదం

సచివాలయ నిబంధనల ప్రకారం మూడు రోజుల్లో బదిలీల ప్రక్రియ పూర్తి చేయాలి. సెప్టెంబరు 30న సీఎం రేవంత్‌రెడ్డి ఫైల్ మీద సంతకం చేశారు. సుమారు 180 మంది ఎస్‌వోలను ఫోకల్, నాన్‌ఫోకల్, సెమీ ఫోకల్‌గా విభజించి బదిలీ చేయాలని సూచించారు. దీనిపై వారం రోజుల పాటు జీఏడీ అధికారులు కసరత్తు చేశారు. 180 మంది ఉద్యోగుల వివరాలతో బదిలీల ప్రతిపాదనలు ప్రభుత్వ పెద్దల వద్దకు వెళ్లాయి. కానీ, ఫైల్ ముందుకు కదల్లేదు. ఇందుకు అధికారుల మధ్య విభేదాలే కారణమని ఉద్యోగుల్లో చర్చ జరుగుతోంది. సీఎం స్పష్టమైన ఆదేశాలిచ్చినా సకాలంలో బదిలీలపై నిర్ణయం తీసుకోవడంలో అధికారులు విఫలమవుతున్నారని ఉద్యోగులు విమర్శిస్తున్నారు. గత ప్రభుత్వంలో కీలకంగా వ్యవహరించిన కొందరు సీనియర్ ఐఏఎస్ అధికారులు తమకు అనుకూలమైన వ్యక్తుల బదిలీలు జరగకుండా అడ్డుపడుతున్నారని ఆరోపిస్తున్నారు. ఎస్‌వోల బదిలీల ప్రక్రియ జాప్యం కావడంతో సహాయ కార్యదర్శి నుంచి ఆ పై స్థాయిలో ఉండే కార్యదర్శుల బదిలీలు నిలిచిపోయాయి. వీటిపైనా ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సి ఉంది.

రెరా అప్పిలేట్ ట్రైబ్యునల్‌కు 40 మంది సిబ్బంది

- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం
- 'ఆంధ్రజ్యోతి' కథనానికి తక్షణ స్పందన

హైదరాబాద్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రియల్ ఎస్టేట్ నియంత్రణ సంస్థ (రెరా) వివిధ ప్రాజెక్టుల విషయంలో తీసుకునే నిర్ణయాలను సవాలు చేసేందుకు ఏర్పాటు చేసిన రెరా అప్పిలేట్ ట్రైబ్యునల్‌కు ప్రభుత్వం ఎట్టకేలకు సిబ్బందిని కేటాయించింది. 'రెరా అప్పిలేట్ ట్రైబ్యునల్ ఉన్నట్టేనా?' శీర్షికనా 'ఆంధ్రజ్యోతి'లో సోమవారం ప్రచురితమైన కథనానికి స్పందించింది. ట్రైబ్యునల్ పని చేసేందుకు అవసరమైన 40 మంది సిబ్బందిని కేటాయించింది. రిటైర్డ్ జస్టిస్ ఎ.రాజశేఖర్ రెడ్డి చైర్‌పర్సన్‌గా, పల్లె ప్రదీప్‌కుమార్ రెడ్డి, మాజీ ఐఏఎస్ చిత్రారామచంద్రన్ సభ్యులుగా తెలంగాణ రెరా అప్పిలేట్ ట్రైబ్యునల్ ఏర్పాటైంది. ఈ ట్రైబ్యునల్ ఏర్పడి నాలుగు నెలలైనా తగిన సిబ్బంది లేక విచారణలు ప్రారంభం కానీ వైనాన్ని 'ఆంధ్రజ్యోతి' బయటపెట్టింది. దీంతో స్పందించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సిబ్బంది కేటాయింపుపై తక్షణమే చర్యలు తీసుకోవాలని పురపాలక శాఖ ఉన్నతాధికారులను సోమవారమే ఆదేశించారు. సిబ్బంది కేటాయింపుపై సోమవారమే ఉత్తర్వులు వెలువడాల్సి ఉన్నా సాంకేతిక కారణాలతో మంగళవారం వెలువడ్డాయి. ట్రైబ్యునల్‌కు అవసరమైన 33 మంది సిబ్బందిని పురపాలక శాఖకు కేటాయిస్తూ ఆర్థిక, ప్రణాళిక శాఖ ముఖ్యకార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా ఆదేశాలిచ్చారు. వీరితో పాటు రెరా నుంచి మరో ఏడుగురిని కేటాయించారు. మొత్తం 40 మందిని ట్రైబ్యునల్ కోసం అందుబాటులోకి తెచ్చారు. ట్రైబ్యునల్ చైర్‌పర్సన్‌కు ఒక పీఎస్, సీనియర్ స్టెనో, లీగల్ ఎగ్జిక్యూటివ్, లా క్లర్క్, మిగిలిన ఇద్దరు సభ్యులకు ఒక్కో పీఎస్, జూనియర్ స్టెనో, లీగల్ ఎగ్జిక్యూటివ్, జూనియర్ అసిస్టెంట్ పోస్టులను మంజూరు చేశారు. న్యాయవిభాగానికి సంబంధించి ఒక రిజిస్ట్రార్, ఒక డిప్యూటీ రిజిస్ట్రార్, పీఏ, సీనియర్ అసిస్టెంట్, జూనియర్ అసిస్టెంట్ పోస్టులు, పరిపాలనా అధికారిగా డిప్యూటీ కలెక్టర్ క్యాడర్ అధికారి, ఆర్థిక శాఖ నుంచి ఫైనాన్స్ అధికారి, అసిస్టెంట్ అకౌంట్ అధికారి, డిప్యూటీ డైరెక్టర్, ఐటీ మేనేజర్, సూపరింటెండెంట్, సీనియర్ అసిస్టెంట్, జూనియర్ అసిస్టెంట్, రికార్డ్ కీపర్, లైబ్రేరియన్ పోస్టులను మంజూరు చేశారు. వివిధ ప్రాజెక్టులకు సంబంధించి 40కి పైగా కేసులను ట్రైబ్యునల్ విచారణ చేయాల్సి ఉంది. అవసరమైన సిబ్బంది అందుబాటులోకి రావడంతో విచారణలు బుధవారం ప్రారంభమయ్యే అవకాశముంది.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., printed at Aamoda Press, H.No.5-9-287/10 & 11, Plot No. 53 & 54, Prasanth Towers, Rajeev Gandhi Nagar, Moosapet, Kukatpally (Mandal), Kukatpally Municipality, Ranga Reddy District and Published at Plot No.76, Ashwini Layout, Huda Heights, Road No.70, Jubilee Hills, Hyderabad-500033. Editor: K. Srinivas. Fax No. 23558288, Phone No: 23558233 / 44 / 55, Regd. No.H/HD 674, RNI No.44903 / 86. Managing Director: Vemuri Radha Krishna, Founder: K.L.N.Prasad.